పోతనామాత్య భాగవత పరిచయము

3 తృతీయ స్కంధము



భాగవత గణనాధ్యాయి
ఊలపల్లి సాంబశివరావు

http.telugubhagavatam.org

ముందుమాట

: : చదువుకుందాం భాగవతం; బాగుపడదాం మనం అందరం : :

రచన

సురుచిరము, సువిశాలము, సుజ్ఞేయము నైన భాగవత భక్తి సామ్రాజ్ఞానికి మకుటంలేని మహారాజు మన బమ్మెర పోతరాజు. అందుకే కోడూరి వేంకటాచలపతి "భూరి సత్కళా ద్విజరాజుఁ బోతరాజు" అని; కరుణశ్రీ

ఖ్యాతి గడించుకొన్న కవులందరు లేరె! అదేమి చిత్రమో
పోతన యన్నచో కరిగిపోవు నెడంద, జొహారు సేతకై
చేతులు లేచు; ఈ జనవశీకరణాద్భుత శక్తి చూడగా
నాతని పేరులో గలదొ! ఆయన గంటములోన నున్నదో!

అని ఉంటారు. మరి కల్లూరి వెంకటనారాయణ రావు "పోతన కవీంద్రా! రససుధాపూర్ణ చంద్రా!" అని సంభోదించారు.

పోతనామాత్యులు

వ్యాసభట్టారకుల సంస్కృత మూలరచనను బమ్మెరవారు తెనిగించిన తీరు, తెన్ను, తెగువ అంత ఎన్నదగినవి. సత్యమా కాదా అన్నది పక్కనపెట్టి వారి జీవితంలో జరిగినది అని జనబాహుళ్యంలో ప్రచారం పొందిన ఘట్టం స్మరిద్దాం. ఒక తొలకరివేళ మన పోతరాజు గారు పొలంలో ఉన్నారు. కొడుకు జోడెద్దుల నాగలి కట్టి దున్నుతున్నాడు. ఇంతలో కవిసార్వభౌముడు శ్రీనాథుడు పల్లకీ యెక్కి దర్పంగా వస్తున్నాడు. దూరంనుంచి తండ్రీకొడుకులను చూసాడు. ఎంత చెప్పినా భాగవతాన్ని రాజుకి అంకిత మివ్వటం లేదనే గుర్రుతో, ఒక పక్క పల్లకీబొంగు మోస్తున్న బోయీలను తప్పుకోమన్నాడు. అయినా పల్లకీ చక్కగానే వెళ్తోంది. అది చూసిన కొడుకు తండ్రి వంక చూసాడు. తండ్రి కన్నెత్తి వెలపలెద్దు వదిలెయ్యి అన్నాడు. నాగలి నడకకేం నట్లు పడలేదు. పౌరుషంతో శ్రీనాథుడు ఈ పక్క బోయిలను కూడ తప్పుకోమన్నాడు. పల్లకీ గాల్లో వెళ్తోంది. కొడుకు మళ్ళా తండ్రిని చూసాడు. తండ్రి తలాడించాడు. కొడుకు లోపలెద్దు కూడ వదిలేసాడు. అయినా నాగలి నవకంగా నమ్మకంగా దుక్కి దున్నేస్తోంది. అంతే కవిసార్వభౌములు పల్లకీ దిగివచ్చి పోతరాజు పాదాలమీద పడ్డాడు. కౌగలించుకొని కుశల మడిగాడు కర్షకకవి. అమ్మో మా కరుణశ్రీ "కర్షకకవి అనేస్తున్నావు నాకే కవికర్షకుడా? కర్షకకవా? అని అనుమానం తీరలే" దని కోప్పడతారేమో.

తృతీయ స్కంధము
కలం హలం రెంటి వాడి గల ఈ కవికర్షకునికి భక్తైనా రక్తైనా నల్లేరుపైబండి నడకే.

ఈ సౌకుమార్య మీ వయ
సీ సౌందర్యక్రమంబు నీ ధైర్యంబు
న్నీ సౌభాగ్య విశేషము
నే సతులకుఁ గలదు? చూడ నిదిచిత్రమగున్

.అని వెంపర్లాడారట సంధ్యాసుందరిని చూసిన అసురులు. ఎంత చక్కటి శృంగారం.

హరియుం దన మాయాగతిఁ
బరికించియుఁ గాన దయ్యె; బరిమితి లేమిన్
మఱి మాయా వినిమోహిత
చరితముఁ గనుఁ గొందు; రెట్లు చతురాస్యాదుల్.
విష్ణుమాయ అంత చిక్కటిదట. మరి యుద్దవుని భక్తి పారవశ్యం వర్ణన

కంటిఁ గంటి భవాబ్ధి దాటఁగ గంటి నాశ్రితరక్షకుం
గంటి యోగిజనంబు డెందము గంటిఁ జుట్టముఁ గంటి ము
క్కంటికిం గనరాని యొక్కటిఁ గంటిఁ దామరకంటిఁ జే
కొంటి ముక్తివిధానముం దలకొంటి సౌఖ్యము లందగన్.
ఇలా చెప్పుకుంటే పోతే పోతన పద్యాలకు అంతే ఉండదు. అందులోనూ 1055 పద్యగద్యలతో తెలుగు భాగవతములోనే మూడవ పెద్దది ఈ తృతీయ స్కంధము. ప్రసిద్ధమైన "శ్రీనాథనాథా. . ." దండకమూ ఈ స్కంధములోనిదే. తెలుగుభాగవతం గల రెంటిలోనూ రెండవ దయిన శ్రీమానినీమానచోరా. . . దండకం (10.1-1236-దం.) దశమ స్కంధములో ఉంది.

వృత్తాల వారీ పద్యాల లెక్క
పద్యగద్యలు = 288 +తేసీతో 138; మొత్తం = 1193

పద్యం ఛందోప్రక్రియ	=	తృతీయ స్కంధం
మొత్తం	=	1193
వచనం.	=	246

కంద పద్యం.	=	339
సీస పద్యం.	=	138
తేటగీతి సీసంతో.	=	138
మత్తేభం. =	69	
చంపకమాల.	=	116
ఉత్పలమాల.	=	53
ఆటవెలది. =	4	
తేటగీతి. =	82	
శార్దూలం. =	1	
మత్తకోకిల.	=	1
తరలం. =	3	
గద్యం. =	1	
మాలిని. =	1	
దండకం. =	1	

ఇలాంటి అమృత గుళికలెన్నో ఉన్న తృతీయస్కంధంలో యాదవాదుల నిర్యాణం, మహదాదుల సంభావాది, సూక్ష్మ మహా కాలాలు. చతుర్యుగ పరిమాణాదులు, వరాహావతారం, కపిలావతారం, భక్తియోగం, సాంఖ్యయోగం లాంటి అద్భుతాలు వివరించబడ్డాయి. సృష్టి, స్థితి, లయలలో స్థితికిదర్పణం అంటారు ఈ స్కంధాన్ని.

కృతజ్ఞతలు

ఈ కృషికి ఉపయోగపడిన వివిధ పుస్తకముల రచయితలకు, ప్రచురణకర్తలకు, సహకరించిన ప్రోత్సాహించిన మిత్రులు, ఇతర వ్యక్తులు, అంతర్జాల సంస్థలకు. మా తెలుగుభాగవతం అంతర్జాల జాలగూడు ఆదులను నిర్మించుట నిర్వహించుట, ప్రతి పద్యగద్యకు గాత్ర ప్రదానం మున్నగు పనులకు తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించిన వారికి, అంతులేని సహకారం అందించిన కుటుంబ సభ్యులు అందరికి పేరుపేరునా కృతజ్ఞతలు.

ఊలపల్లి సాంబశివ రావు, భాగవత గణనాధ్యాయి.
తెలుగుభాగవతం.ఆర్గ్

: : చదువుకుందాం భాగవతం; బాగుపడదాం మనం అందరం : :

ఓం నమో భగవతే వాసుదేవాయ

తృతీయ స్కంధము

ఉపోద్ఘాతము

1 శ్రీమహిత వినుత దివిజ
స్తోమ! యశస్సీమ! రాజసోమ! సుమేరు
స్థేమ! వినిర్జితభార్గవ
రామ! దశాననవిరామ! రఘుకులరామా!

శ్రీరామా! శ్రీకరమైన మహిమ కలవాడా! దేవతలుచే సంస్తుతింపబడు వాడా! దిగ్దిగంతాల వరకు వ్యాపించే యశస్సు కలవాడా! చంద్రుని వలె చల్లని పరిపాలన చేయువాడా! మేరునగ ధీరుడా! పరశురాము డంతటి వాని భంగపరచిన శూరుడా! పది తలల రావణాసురుని తుదముట్టించిన వీరాధివీరుడా! రఘువంశోద్ధారక రామా! . . . అవధరించు. 2. పురాణాలు సమస్తము చక్కగా వివరించడంలో విశిష్ఠమైన నేర్పు గల సూతమహర్షి ఉత్తమ గుణసమేతులైన శౌనకాది మునీశ్వరులకు "శుకముని పరీక్షిన్నరేంద్రునికి ఇలా చెప్పసాగాడు" అంటూ ఇలా చెప్పసాగాడు.

విదురుని తీర్థాగమనంబు

3 పాండురాజు కుమారులైన ధర్మరాజు మున్నగు వారు బాహువిక్రమంతో ధృతరాష్ట్రుని కొడుకులైన దుర్యోధనుడు మున్నగు కౌరవులను రణరంగంలో జయించారు. స్వచ్ఛమైన శరత్కాలపు పండు వెన్నెలలాంటి అఖండకీర్తిని ఆర్జించారు. అలా యశస్సు అనే పూలమొగ్గలతో కౌరవరాజ్యలక్ష్మిని అలంకరించారు. ఈవిధంగా వారు విజయోల్లాసంతో రాజ్యపాలన సాగించారు.

4 ఓ పరీక్షిన్మహారాజా! అంతకు ముందే; అంటే మహాభారత యుద్ధం జరగటానికంటే ముందే విదురుడు అడవులకు వెళ్ళాడు. అక్కడ మునులచే కీర్తింపబడేవాడూ, ప్రశస్తమైన తపస్సులో పేరెన్నికగన్నవాడూ, సాటిలేని మేటి గుణాలు కలిగి పొగడ తగినవాడు అయిన మైత్రేయుణ్ణి సందర్శించాడు.

5 అలా మైత్రేయుణ్ణి దర్శించి ఆ మహాముని పాదాలపై తన నుదురు సోకేలా నమస్కారం చేసి విదురుడు ఇలా అన్నాడు, "మునిశేఖరా! మైత్రేయా! సర్వలోకాలను పవిత్రము చేయు చరిత్ర కలవాడు, అందరిచేత పూజింపబడేవాడు ఐన శ్రీకృష్ణుడు....
6 తేజస్సు అనే నిధిని భూషణంగా కలిగినవాడై, ఆ గోవిందుడు పాండవుల మేలు కోరి, రాయబారి బాధ్యత స్వీకరించి హస్తినాపురానికి వెళ్ళాడు. కౌరవ వంశాన్ని అలంకరించి ఉన్న ధృతరాష్ట్రుని కుమారుడైన దుర్యోధనుని సౌధానికి .....
7 భక్తుల ఎడ వాత్సల్య పూరితుడు కృష్ణుడు దుర్యోధనుని ధామమునకు పోవుటకు ఇష్టపడక, ప్రత్యేకంగా నా ఇంటికి దయచేసాడు. ఇట్లా రావడానికి కారణం ఏమిటి దయచేసి ఇందులో ఉన్న రహస్యం నాకు విప్పి చెప్పు" అని విదురుడు మైత్రేయుణ్ణి అడిగాడు.
8 ఇలా చెప్పుతున్న మహర్షి మాటలు విని పరీక్షిన్మహారాజు ఆశ్చర్యపోయి; పరిశుద్ధమైన మనస్సు గలవాడూ, స్థిర సంకల్పుడూ, ముని జనము అనే సముద్రానికి చంద్రుని వంటి వాడూ, తిరుగులేని దట్టమైన హరిభక్తి గల వాడూ అయిన శుకమహర్షి వైపు చూసాడు.
9 అప్పుడు పరీక్షిత్తు శుకునితో ఇలా అన్నాడు "పుణ్యుడైన విదురుడు మాన్యుడైన మైత్రేయుని ఏ యే రహస్యాలు అడిగాడు; అందుకు ఆ మహాముని యేమేమి సమాధానాలు చెప్పాడు; విదురుడు ఏ యే తీర్థాలలో ఏ విధంగా స్నానం చేసాడు; ఎక్క డెక్కడ ఏ విధంగా సంచరించాడు.

ఇన్నిదెలియంగ నానతి యిచ్చి నన్ను
నర్థి రక్షింపవే విమలాంతరంగ!
ఘనదయాపాంగ! హరిపాదకమలభృంగ!
మహితగుణసంగ! పాపతమఃపతంగ!

10 ఓ మహర్షీ! నీవు స్వచ్ఛమైన హృదయం గలవాడవు; కరుణతో నిండిన కడగంటి చూపులు గలవాడవు; విష్ణుమూర్తి పాదాలనే పద్మాలను ఆశ్రయించే తుమ్మెద లాంటి వాడవు; నీవు ఉత్తమ గుణ సంపన్నుడవు; పాపాలు అనే చీకటిని పటాపంచలుచేసే సూర్యభగవానుడవు; దయచేసి ఇవన్నీ వివరించి అపన్నుడనైన నన్ను రక్షించు."
11 అలా అడిగిన పరీక్షిత్తుతో శుకుడు ఇలా అన్నాడు "పురు వంశం ప్రతిష్ఠను వృద్ధిచేసిన వాడా! విను. దుర్యోధనుడు మొదలైన తన కుమారులను దుష్టుడైన ధృతరాష్ట్రుడు ఎక్కువ గారాబంగా పెంచాడు. పాండురాజు కుమారులు పాండవులు తండ్రి పరమపదించగానే భయంతో కంపించి అతని అండ చేరారు.

12 ఇట్లు వచ్చిన పాండవుల యందు సుయోధనుడు మున్నగు కౌరవులు అసూయా నిమగ్నులు అయ్యారు;
13 ధర్మదూరులు కుటిల బుద్ధులు అయి విషం కలిపిన అన్నం పెట్టారు. పెద్ద పెద్ద తాళ్ళతో కట్టారు, గంగానదిలోకి నెట్టారు. రాజ్యంనుండి వెళ్ళ గొట్టారు., శుకుడు పరీక్షిత్తునకు అసూయా మగ్ను లైన కౌరవులు పాండవుల యెడ చూపిన దుష్టత్వం సూచిస్తున్నాడు
14 పాండవులు లక్క ఇంట్లో మైమరిచి నిద్రపోతూ ఉండగా క్రూరహృదయులైన కౌరవులు ఇంటికి నిప్పంటించారు. వారిని రూపు మాపటానికి ఎన్నో పన్నాగాలు ఏమరుపాటు లేకుండా పన్నారు.
15 పండితవరేణ్యుల ప్రశంసలు అందుకొనెడి రాజసూయ యాగంతో విశిష్ఠమైన అవభృథస్నానంతో పరమ పవిత్రమై ఒప్పారుతున్న ద్రుపదమహారాజు పుత్రిక పాంచాలి కొప్పు పట్టుకొని పరమ నీచంగా నిండు సభలోకి ఈడ్చుకొచ్చారు.
16 కౌరవులు పాండవులకు ఇలా ఆజన్మాంతం అపకారం చెయ్యని రోజే లేదు. ఆ గుడ్డి రాజు ఏమో కొడుకులకు అడ్డు చెప్పలేకపోయాడు.
17 కౌరవులు మాయా జూదంలో అన్యాయంగా పాండవుల రాజ్యాన్ని లాక్కొన్నారు. వారిని అడవులకు వెళ్ళగొట్టారు. పాండవులు ఒడంబడిక ప్రకారం గడువు ముగిశాక తిరిగివచ్చి తమకు రావలసిన రాజ్యభాగాన్ని అడిగితే ఇవ్వలేదు.
18 ఇలా ఉండగా;
19 నిఖిల సృష్టికీ నియంత యైన హరి, అఖిల లోక శరణ్యుడైన మాధవుడు, ఆశ్రితజన పారిజాతమైన భగవంతుడు, అంతం లేనివాడూ, ఎంతో శక్తి సంపన్నుడూ, నందకం అనే ఖడ్గాన్ని ధరించినవాడూ, పద్మాక్షుడూ అయిన శ్రీకృష్ణుడు నిష్కళంకమైన భక్తియోగానికి అంకితమైన మనస్సు కలవాడైన ధర్మరాజు నియమించిన ప్రకారం రాయబారం నడపటానికి ధృతరాష్ట్రుడి దగ్గరకు వెళ్లాడు.
20 పరీక్షిత్తు భూపతీ! అలా వెళ్ళిన శ్రీకృష్ణుడు అక్కడ భీష్ముడూ, ద్రోణుడూ, అశ్వత్థామా, కృపుడూ, సకల దేశాల రాజులూ, అందరూ విని సంతోషించే విధంగా ధృతరాష్ట్రుడితో ఇలా అన్నాడు.

కౌరవ పాండవు లిరువురు
నారయ నీ కొక్క సమమ యవనీవర! నీ
వే రీతి నైన బాండుకు
మారుల పాలొసఁగి తేని మను నుభయంబున్.

21 "మహారాజ నువ్వు కన్న కౌరవులు, నీ తమ్ముడు కన్న పాండవులు ఇద్దరూ నీకు సమానమే. నీవు ఎలాగైనా సరే పాండవుల వాటాకు రావలసిన రాజ్యభాగం ఇచ్చినట్లైతే ఉభయులు క్షేమంగా ఉంటారు."
22 ఆవిధంగా శ్రీకృష్ణుడు ధర్మప్రబోధం చేసాడు. ఆ మాటలు వారు వినిపించుకోలేదు. అప్పుడు ఆయన నీతిశాస్త్రం బాగా తెలిసిన విదురుణ్ణి పిలిపించాడు. విదురుడు కౌరవుల కొలువుకూటానికి వచ్చాడు.
23 .విదురుడు అక్కడ ఉన్న వాళ్ళ నుండి జరుగుతున్న సభా వ్యవహారమంతా తెలుసుకొని, ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.
24 ఓ ధృతరాష్ట్ర మహారాజా! పాండురాజు నీ తమ్ముడు. కనుక ఆయన కుమారుల్ని సంరక్షించడం ధర్మమూ, న్యాయమూ. కురుకులచూడామణీ! మీరు ఇలా చేస్తే మీ వంశం శాశ్వత సుఖసంపదలతో వర్ధిల్లుతుంది. మీకు శత్రు విజయం లభ్యం అవుతుంది. గోపాలశిరోమణి అయిన కృష్ణుని మనస్సుకు ప్రియం కలిగించినట్లు కూడా అవుతుంది.
25 . వారి తండ్రి భాగం వారికి ఇవ్వు. నీ భాగం కొడుకులకు పంచి ఇవ్వు. ఈర్ష్య వదలిపెట్టు. ధర్మమార్గంలో మనస్సు ప్రవేశపెట్టు. వంశాన్ని నిలబెట్టు.
26 రాజా! ధృతరాష్ట్రా! నా మాట పాటించు. నీకొడుకు దుడుకుతనం విన్నప్పుడల్లా ఆ భీమసేనుడు కాలుతో తొక్కిన కాలసర్పం లాగా మండిపడతాడు. ఇదంతా నీకు ముందే చెప్పాను గదా; ఎలాగైనా సరే ఆ వాయుదేవుని కుమారుడు భీముడి చేతిలో నీ కుమారులకు చావు తప్పదు.
27 అంతే కాదు,
28 మహారాజా! నీ కన్న కొడుకుల ప్రతాపాలూ, ద్రోణాచార్య, భీష్మాచార్య, కృపాచార్యుల పటాటోపాలూ అంగరాజు కర్ణుడి అసందర్భ ప్రలాపాలూ ఇవన్నీ నిజమే అని నీ మనస్సులో కాని నమ్ముతున్నావా.
29 అలా అయితే విను.

ఏ పరమేశుచే జగము లీ సచరాచరకోటితో సము
ద్దీపితమయ్యె; నే విభుని దివ్యకళాంశజు లబ్జగర్భ గౌ
రీపతి ముఖ్య దేవ ముని బృందము; లెవ్వఁ డనంతుఁ డచ్యుతుం
డా పురుషోత్తముండు గరుణాంబుధి గృష్ణుఁడు పో నరేశ్వరా!

30 అయితే, విను. ఓ భూపాలా! దయాసముద్రుడు అయిన ఈ శ్రీకృష్ణుడే, పురుషోత్తముడు, ఈ పరమేశ్వరుని అనుగ్రహం వల్లే ఈ ప్రపంచం చరాచర జంతుజాలంతో సహా ప్రకాశిస్తూ ఉంది; బ్రహ్మదేవుడు, పరమశివుడు మొదలైన

దేవతలూ, మునిగణమూ అందరూ ఈ దేవుని దివ్యమైన అంశాల నుండి జన్మించిన వారే; అనంతుడూ, అచ్యుతుడూ ఇతడే సుమా;

అట్టి జగన్నివాసుఁడు మురాసురభేది పరాపరుండు చే
పట్టి సఖుండు, వియ్యమును, బాంధవుఁడున్, గురుఁడున్, విభుండునై
యిట్టలమైన ప్రేమమున నెప్పుడుఁ దోడ్పడుచుండు వారలం
జుట్టన వ్రేల నెవ్వరికిఁ జూపఁగ వచ్చునె? పార్థివోత్తమా!

31. ఓ ధృతరాష్ట్ర రాజోత్తమా! ఆ శ్రీకృష్ణుడు సామాన్యుడా, లోకాలు అన్ని తన లోనే ఉంచుకున్న వాడూ, మురుడు అనే రాక్షసుణ్ణి మట్టుపెట్టినవాడూ, సర్వశ్రేష్ఠుడూనూ. ఆయనే చెలికాడుగా, వియ్యంకుడిగా, చుట్టంగా, ప్రబోధకుడిగా, ప్రభువుగా అతిశయించిన అనురాగంతో ఎల్లప్పుడూ పాండవులకు అండగా తోడ్పడుతూ ఉంటాడు. అలాంటి పాండవులను వేలెత్తి చూపడానికి ఎవరికైనా సాధ్యం అవుతుందా?

32 అందుకని, నా మాట విని పాండవుల్ని బాధపెట్టకుండా వారి రాజ్యభాగాన్ని వారికి ఇచ్చేసి దేశాన్నీ, వంశాన్నీ, పుత్రుల్నీ, బంధువుల్నీ కాపాడు; అలాకాక పరమ లోభీ, దుష్టుడూ అయిన దుర్యోధనుని మాటలు విన్నావా; నీ నిర్లక్ష్యం కారణంగా కులనాశం, బంధునాశం జరిగితీరుతుంది.

33 ఇదెక్కడి రాజనీతి మహారాజా! ఒక్కడి కోసం వంశమంతా ధ్వంసం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నావు; నా మాట విను; ఈ దుర్యోధనుడి మాట విడిచిపెట్టు. వంశమర్యాదనూ, దేశాన్నీ, తేజస్సునీ కాపాడు."

34 అని ఈ విధంగా విదురుడు నొక్కి చెప్పాడు. ఆ మాటలు విన్న దుర్యోధనుడు రోషావేశంతో వశం తప్పిపోయాడు. తన మిత్రుడూ సూర్యుని కుమారుడూ అయిన కర్ణుణ్ణీ, మేనమామ శకునినీ, తమ్ముడైన దుశ్శాసనుణ్ణీ చూచి అహంకారంతో ఇలా అన్నాడు.

35 "దాసీపుత్రుణ్ణి తీసుకొని వచ్చి ఆసనం ఇచ్చి కూర్చోపెట్టారు. ఇటువంటి వాళ్లను ఈ సభకు ఎందుకు పిలిపించారు. కుదురుగా కూర్చొని పనిరాకుండా పోయే అధిక ప్రసంగాలు చేస్తూ ఉన్నాడు. వెంటనే గెంటివెయ్యండి."

యుద్ధవ దర్శనంబు

36 ఇలా పలికిన దుర్యోధనుడి దుడుకు మాటలకు విదురుని మనస్సు కుతకుత ఉడికిపోయింది. అయినా విదురుడు కర్తవ్యం గుర్తుకు తెచ్చుకొని, గుండె నిబ్బరించుకొని, ఇంకేం మాట్లాడకుండా, ధనుర్బాణాలు విడిచిపెట్టి, ఆగ్రహాన్ని అణచిపెట్టి అరణ్యానికి వెళ్ళిపోయాడు.

37 అలా వెళ్ళిన విదురుడు విష్ణుదేవుడు స్వయంగా వెలసిన పావనప్రదేశాలనూ, పరమపవిత్రాలైన వైష్ణవ క్షేత్రాలనూ, దేవతలు నిర్మించిన దివ్యస్థలాలనూ, గంగ

మొదలైన పుణ్యనదులనూ, పురాణాలలో ప్రసిద్ధాలైన సిద్ధాశ్రమాలనూ, తపోవనాలనూ దర్శించాడు. గంధమాదనం మొదలైన కొండచరియలనూ, అక్కడి చక్కని చిక్కని పొదరిండ్లవనూ, వికసించిన రకరకాల కలువలలో, కమలాలలో మకరందం త్రాగి మైమరచిన తుమ్మెదల కమ్మని గానానికి మేలుకొన్న రాజహంసల విలాస విహారాలతో విరాజిల్లుతున్న సరస్సులను చూశాడు.

38 మునుల ఆశ్రమాలలో, వనాలలో, నదీనదాలలో, ఉపవనాలలో, బోయపల్లెలలో, కొండగుహలలో, గోశాలల్లో, యాగశాలల్లో, పట్టాణాలలో, దేవాలయాలలో, తీర్థస్థలాలలో తిరిగాడు.

39 ఆ యా స్థలాలలో ఆకులు, కాయలు, నీళ్లు మాత్రమే ఆహారంగా తీసుకొంటూ నియమ సహితుడై, శరీరసంస్కార రహితుడై, ఔదార్యమహితుడైన విదురుడు పరివ్రాజక వేషం ధరించినవాడు అయి సంచారం చేసాడు.

40 మానవోత్తమా! పరీక్షిత్తూ! ఈ విధంగా భారత దేశంలో గల ఉత్తమ పుణ్యతీర్థా లన్నింటినీ సంతోషాతిశయంతో సందర్శిస్తూ, రాగద్వేషాలు విడిచిన విదురుడు తీర్థ యాత్రలు చేస్తూ క్రమంగా ప్రభాసతీర్థం చేరాడు.

41 ఇలా తిరుగుతు ప్రభాస తీర్థమునకు వచ్చేటప్పుడు . .

42 "రాజా! అలా వస్తున్న విదురుడు ఆ పరిసర ప్రాంతంలోని మద్దిచెట్లూ, మామిడిచెట్లు గురివెంద, ఎఱ్ఱగోరింట, మాలతి, పొగడ మొదలైన తరులతాదులతో కూడి ఉన్న నదీ తీరంలో విదురుడు ఆగి ఉన్నాడు. ఆ సమయంలో రాక్షససంహారుడు శ్రీకృష్ణభగవానుని అనుగ్రహం వల్ల లభించిన సామ్రాజ్యాన్ని ధర్మరాజు పరిపాలిస్తున్నాడు, సమస్త మహిమండలభారాన్ని చక్కగా వహిస్తున్నాడు.

43 రాజా! పరీక్షిత్తూ! అప్పుడు ఆ విదురునికి కురుక్షేత్రసంగ్రామం సంగతి తెలిసింది. కౌరవులూ, పాండవులూ వారింపరాని వైరాలతో మహా ఘోరమైన యుద్ధం చేసారనీ, పరస్పర విజయోత్కంఠతో జరిగిన ఆ కురుక్షేత్ర మహాసంగ్రామంలో, వెదురుపొదలలో పుట్టే దావాగ్నిలో దగ్ధమయ్యే అడవిలాగా దుర్యోధనాది కురుకుమార సమూహమంతా నశించారనీ విని విదురుడు పట్టరాని శోకంలో మునిగాడు.

44 విదురుడికి ఇక అక్కడ ఉండడానికి కాలు నిలబడలేదు. మునిసమానుడైన ఆ విదురుడు వెంటనే యాత్రలకు మరల బయలుదేరాడు. సరస్వతీ నదిలో స్నానంచేసాడు. అనంతరం అగ్ని, సూర్య, శుక్ర, పృథు, త్రిత, సోమ, సుదాస, కుమార, వాయు, యమ ఇత్యాది దేవతానామాలతో ప్రసిద్ధమైన నదులలో ఆసక్తితో స్నానాలు చేసాడు.

45 ఇంకా విదురుడు పుణ్యస్థలాలనూ, పవిత్రనదీ తీర్థాలనూ సేవిస్తూ వెళ్ళి అలా లక్ష్మీ పతియైన శ్రీకృష్ణుని దివ్య మందిరాలు, మహోజ్వలమైన మణులు పొదిగిన తలుపులతో,

గడపలతో విరాజిల్లుతున్న సౌధాలూ, విమానాలూ, గోపురాలూ, ఆలయాలూ మిక్కిలి భక్తితో చూస్తూ నగరంలోకి వెళ్ళాడు. శ్రీకృష్ణుని పాదపద్మాలను స్మరిస్తూ ఎంతో సంతోషంతో ముందుకు సాగాడు.

46 అలాగ వెళ్ళివెళ్ళి మత్స్య, కురు, జాంగల భూములను అతిక్రమించి అనంతరం యమునా నదిని సమీపించాడు. ఆ నదీతీరంలో పరమభాగవతుడు, శ్రీకృష్ణుని మీద అఖండమైన భక్తిగలవాడు. ఉత్తమగుణ సంపన్నుడు, శాంతుడు, రాజనీతిలో బృహస్పతి శిష్యుడు, మిక్కిలి యశస్సు కలవాడూ, దోషశూన్యుడు, మహాజ్ఞాని అయిన ఉద్ధవుణ్ణి దర్శించాడు.

47 ఉద్ధవుణ్ణి చూడగానే విదురుని హృదయంలో అనురాగం పొంగిపొరలింది. రెండుచేతులు చాపి గట్టిగా కౌగిలించుకున్నాడు. స్నేహం పాటిస్తూ కుశలప్రశ్నలు కురిపించిన అనంతరం సంతోషంతో విదురుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు.

48 "ఓ ఉద్ధవా! కృష్ణభక్తులూ, పవిత్రచరిత్రులూ, విరోధులకు నిరోధింపరాని వీరాధివీరులూ, కురుకులానికి అలంకార మయిన వారూ అయిన కుంతీదేవి కుమారులు కుశలంగా వున్నారా.

49 తన నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మదేవుడు పరమభక్తితో ప్రార్థింపగా శ్రీహరి బలరాముడుగా, కృష్ణుడుగా యదువంశంలో ఉదయించాడు. అట్లా పుట్టి భూభారాన్ని పోగొట్టిన మహోదయులు, రేవతీరుక్మిణీ హృదయప్రియులు రామకృష్ణులు తమ తాత గారి ఇంటిలో సుఖంగా ఉన్నారా.

50 వృష్ణివంశాన్ని ప్రకాశవంతం చేయువాడ! ఉద్ధవా! కురువంశీయులైన కౌరవులూ, పాండవులూ తనను ఎంతో గౌరవంగా చూస్తుండగా, నెయ్యమై, అప్తుడై తన చెల్లెళ్ళనూ, వారి భర్తలనూ ఎంతో ఆదరంగా ఆప్యాయంగా కన్నబిడ్డలకంటె మిన్నగా లాలించి పాలించే వసుదేవుడు ఆరోగ్యంగా ఉన్నాడా?

51 మన్మథుని అంశగల కుమారుణ్ణి పొందదలచి రుక్మిణీదేవి బ్రాహ్మణుల్ని పూజించింది, వారి అనుగ్రహం వల్ల అత్యంత మహిమోపేత అయిన రుక్మిణీమాత కన్న సంతానం ప్రద్యుమ్నుడు సమస్త సేనాసమూహం తనను సంసేవిస్తూ ఉండగా ఉత్సాహంతో ఉన్నాడుగదా!

52 పద్మాలలాంటి కన్నులున్న కృష్ణుని కరుణాకటాక్షం వల్ల లభించిన రాజ్యాన్ని అంతటినీ పాలిస్తున్న ఉగ్రసేనుడు సంప్రీతుడై, శాశ్వత వైభవం పొంది సుఖంగా జీవిస్తూ ఉన్నాడా?

53 వృష్ణివంశపు ఉత్తముడా! ఉద్ధవా! పతివ్రతా శిరోమణీ, ఉత్తమ రమణీమణీ, సద్గుణవతీ అయిన జాంబవతి, పార్వతీదేవి కుమారస్వామిని కన్నట్లు సాంబుని కన్నది.

సుకుమారమైన దేహంగల అందగాడూ, విరోధులను చీల్చి చెండాడే వీరాధివీరుడు, సుగుణాలవాలుడు. ఆ సాంబుడు క్షేమమేనా?

54 కృష్ణ చరణ కింకరుడూ, శత్రువుల పాలిటి భయంకరుడూ, అర్జునుని దగ్గర చక్కటి విలువిద్య నేర్చుకొన్నవాడూ అయిన సాత్యకి అత్యంత సుఖవైభవాలతో అలరారుతున్నాడా?

55 గోవులకు ఒడయుడు అయిన శ్రీకృష్ణుని పాదాలు పద్మం, అంకుశం, చక్రం, ధనుస్సు, వజ్రం, ఛత్రం మొదలైన శుభరేఖలతో ఒప్పి ఉంటాయి. అటువంటి శ్రీపాదముద్రలు ప్రకాశించే త్రోవలలోని దుమ్ముతో ధూసరితం అయిన నిందుదేహంతో, పాపరహితుడు అయిన అక్రూరుడు ఆనందంగా ఉన్నాడా? నిష్కాముడూ, ధర్మపరుడూ, సద్వంశ సంజాతుడూ అయిన ఆ మహానుభావునికి క్షేమమే కదా.

56 వేదాలనూ యజ్ఞాలనూ సాదరంగా తనలో దాచుకొన్న వేదమాతలా శ్రీమన్నారాయణుణ్ణి తన గర్భంలో ఆప్యాయంగా ధరించి కాపాడిన దొడ్డ ఇల్లాలు దేవకీదేవి సుఖంగా ఉందా?

57 మహాత్మా! ఉద్ధవా! అనిరుద్ధుడు నిత్యం తన్ను భక్తితో సేవించేవారి కోరికలన్నీ నెరవేర్చగల భగవానుడు. శబ్దశాస్త్రానికి కారణమని సమస్త దేవతలచేత కొనియాడబడ దగిన వాడు. మనోమయుడైనవాడు. అఖిల ప్రాణులకూ అంతఃకరణాలైన చిత్తం, అహంకారం, బుద్ధి, మనస్సు అనే నాలుగింటికీ క్రమంగా వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అధిష్ఠాన దైవాలు. ఇలా మనస్సుకు అధిపతియైన ఆ అనిరుద్ధుడు ఆనందంగా ఉన్నాడా?" అని అడగి మరల.

58 ఓ ఉద్ధవా! ఇతర దేవతా పూజలన్నీ విడిచిపెట్టి, బ్రహ్మదేవునికికూడ పూజనీయుడూ, లక్ష్మీపతీ అయిన శ్రీకృష్ణుణ్ణి తమకు రక్షకుడుగా భావించి భక్తితో నిత్యం సేవించే ధన్యులూ, పుణ్యాత్ములు, లోకంచే గౌరవింపబడువారూ, ఆధ్యాత్మిక విద్యావేత్తలూ, శక్తిసంపన్నులూ, మన్నింపదగినవారూ, ధర్మమార్గంలో నడిచేవారూ అయిన సత్యభామానందనులు, చారుధేష్ణ, గదులు సంతోషంగా ఉన్నారా.

59 ఓ పుణ్యాత్ముడా! ఉద్ధవా! దేదీప్యమానమైన ఏ మయసభను చూసి, మితిమీరిన క్రోధం మాత్సర్యం గల ఆ దుర్యోధనుడు కల్మషం పుట్టి,, మనసులో అసూయతో నిండిపోయాడో, ఆ ధర్మరాజు సుఖంగా ఉన్నాడా?

60 గొప్పగా అభ్యాసం చేసిన గదాయుద్ధ విచిత్ర విన్యాసాల కౌశలంతో అతిశయించి, కౌరవులను రణరంగంలో మట్టుపెట్టిన జగజెట్టి వాయుదేవుని పుత్రుడు భీముడు క్షేమంగా ఉన్నాడా?

61 కరుణాతరంగాలు పొంగిపొరలే కమలాక్షుని కటాక్షవీక్షణాలవల్ల లభించిన పరాక్రమాతిశయం కలవాడూ, మాయా కిరాతరూపంతో వచ్చిన మహేశ్వరుడు అంతవాడితో యుద్ధానికి సిద్ధమై తొడగొట్టి నిలిచి గెలిచి మెప్పించి పాశుపతాస్త్రం ఇప్పించుకొన్న మొనగాడూ, అరివీరభయంకరుడూ అయిన అర్జునుడు సుఖంగా సంతోషంగా ఉన్నాడా?

62 ఓ ఉద్ధవా! తమ కన్నతల్లి కాలంచేయగా, చక్కగా కుంతీదేవి చనుబాలు త్రాగిన వారూ, అన్నలచే రక్షింపబడినవారూ, ఇంద్రుడి అధీనంలో ఉన్న అమృతాన్ని సంపాదించిన గరుత్మంతునిలా, కౌరవుల నందరినీ నిర్జించి వారి రాజ్యాన్ని ఆర్జించినవారూ అయిన మాద్రి కొడుకులు నకులసహదేవులు కుశలంగా ఉన్నారా?

63 ఉదాత్తమైన వర్తన గలవాడా! ఉద్ధవా! అనాడు పాండురాజు మరణింపగా భర్తతో పాటు తాను కూడా సహగమనం చేయకుండా బిడ్డల మంచి చెడ్డలు చూడటంకోసం ఉండిపోయింది కుంతీదేవి. ఇప్పుడు ఆమె క్షేమంగా జీవించి ఉన్నది కదా."

64 అని మరల.

65 అలా పలికిన విదురుడు మరల ఇలా అన్నాడు "ఇంకా ఉద్ధవా! తమ్ముడు పాండురాజు మరణించడంతో, అతని కొడుకులు తన దగ్గరకు వచ్చినపుడు న్యాయం చేసేవానిలా వెన్నుదట్టి ఆశ్రయ మిచ్చి ఆపై కీడే చేసాడు ధృతరాష్ట్రుడు. వాస్తవానికి ఆ మహారాజు చెడ్డవాడేకానీ ఆయన సుఖంగా ఉన్నాడా?

66 ఉద్ధవా! పాపరహితుడవైన మహానుభావా! తన తుంటరి కొడుకులు నన్ను బయటికి గెంటేసినప్పుడు, తమ్ముడు అని కూడా చూడకుండా నోరుమూసుకొని ఊరకున్న ధృతరాష్ట్రుడు నాకు కలిగించిన దుఃఖానికి తప్పక నరకయాతన అనుభవిస్తాడు.

అనుజుఁడు వీఁడనకయ తన
తనయులు నను వెడలనడువఁ దానూరకయుం
డిన ధృతరాష్ట్రుఁడు నరకం
బునఁబడు నాదైన దుఃఖమున ననఘాత్మా!

67 నీవేమో పరమశాంతుడవు. నీవు ఇలా దుఃఖపడటం సమంజసం కా దని అంటావేమో.

68 పరాత్పరుడైన హరి లీలామానవుడై ఈ లోకంలో పుట్టి తన మాయాప్రభావంతో మానవుల నందరినీ వ్యామోహంలో ముంచుతున్నాడు.

69 కాబట్టి, ఎలాంటి వికారాలూ లేనివాడూ, మహాత్ముడూ అయిన ఆ శ్రీమన్నారాయణుని మాయావ్యామోహాలకు నా మనస్సు లోనైనపుడు సంసార సంబంధమైన ఈ దుఃఖాలు అనుభవిస్తాను. అలాకాక ఆ దేవదేవుని అపారకృపారసం

ప్రసరించిననాడు సుఖంగా ఉంటాను. నేనే కాదు, ఆ బ్రహ్మరుద్రాదులు కూడా ఆ పరాత్పరుని మాయాజాలం నుంచి తప్పించుకొని బయటపడలేరు.

70 ఏమైతేనేం, ఆ మహానుభావుడు శ్రీకృష్ణుని కడగంటి చూపుల కరుణారసం ద్వారా లభించిన జ్ఞానదీపకళికలవల్ల నా దోషాలనే చీకట్లన్నీ తొలగిపోయాయి. నా చిత్తం భగవంతుని పాదాలను హత్తుకున్నది. అందువల్ల ఆ పరతత్త్వం కోసమే నిరంతరం నిరీక్షిస్తూ ఉన్నాను.

71 ఆ పద్మాక్షుడు తన యొక్క భక్తులు అడవుల్లో అష్టకష్టాలు పడడం చూడలేక వారికోసం రాయబారం నడిపాడు. శత్రువులు కొందరు అతణ్ణి పట్టి కట్టివేయాలని గట్టి ప్రయత్నాలు చేశారు. అప్పుడు అచ్యుతుడు అశక్తునిలాగా వారిని ఆపడానికి ప్రయత్నించలేదు. అంతమాత్రం చేత అది ఆయన అసమర్థత అనుకోడానికి లేదు. ఆయన వారిని జయించలేక కాదు. విద్య, వంశం, ధనం అనే వీనివల్ల అహంకరించి లోకుల్ని పలుబాధలకు లోనుచేస్తున్న దుష్ట రాజుల్ని ససైన్యంగా సంగ్రామభూమిలో సంహరించాలనే సదుద్దేశంతోనే ఆనాటి సభలో కౌరవుల సూటిపోటి మాటలకు నొచ్చుకోలేదు. ఆగ్రహం తెచ్చుకోలేదు.

జననంబందుటలేని యీశ్వరుఁడు దా జన్మించుటెల్లన్ విరో
ధినిరాసార్థము వీతకర్ముఁడగు నద్దేవుండు గర్మప్రవ
ర్తనుఁ డౌటెల్లఁ జరాచరప్రకటభూతశ్రేణులం గర్మవ
ర్తనులం జేయఁదలంచి కాక కలవే దైత్యారికింగర్మముల్.

72 పుట్టుక అన్నదే లేని ఆ భగవంతుడు పుడుతున్నాడంటే కేవలం మచ్చరించువారిని ఖండించుటకే; కర్మలు లేని దేవుడు కర్మలు చేస్తున్నాడంటే చరాచర జీవకోటిని కర్మబద్ధుల్ని చేయటడానికే; అంతేకాని, రాక్షసాంతకుడైన విష్ణుమూర్తికి కర్మలంటూ ఉంటాయా? ఉండవు.

73 హరి మానవులందరికీ పూజనీయుడు. ఆయన లీలామానుషవిగ్రహుడు. గుణాలకు అతీతమైన వాడు. జన్మ సంబంధమైన బంధాలు ఆయనకు లేవు. అవి కేవలం ఆ వాసుదేవునికి లీలావిలాసాలు మాత్రమే.

74 తన ఆజ్ఞలు తలదాల్చి, తన పాదాల్ని సేవించే లోకపాలకులకు హెచ్చరిల్లుట కలిగించేందుకు భూలోకంలో యాదవ వంశంలో బలరామునికి తమ్ముడై శ్రీమహావిష్ణువు అవతరించాడు.

75 సంసారసాగరాన్ని తరింపచేస్తూ చెక్కుచెదరని యశోవైభవాన్ని దిక్కులంతటా నిండింపజేసి ప్రకాశించే ఆ నందనందనుడు ప్రశాంతచిత్తుడై క్షేమంగా ఉన్నాడా?" ఇలా ఉత్కంఠతో విదురుడు ఉద్ధవుణ్ణి అడిగాడు.

76 అలా విదురుడు అడిగినప్పుడు ఉద్ధవుడు.

కృష్ణాది నిర్యాణంబు

77 అప్పుడు యాదవకులానికి పెన్నిధి అయిన కృష్ణుని పాదపద్మాలకు, దూరమైన కారణంగా ఉద్ధవునికి దుఃఖం పొంగి వచ్చింది. నోటమాట రాలేదు. గుండె పగిలినట్లయింది. పెదవులు తడుపుకున్నాడు. శోకం వల్ల కాంతివిహీనుడైనాడు."

78 అని చెప్పి, శుకుడు పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు "పరీక్షిత్తు మహారాజా! విను. అప్పుడు తన చిన్నతనంలో ఈ ఉద్ధవుడు ఐదేండ్ల బాలుడుగా ఉన్న సమయంలో....

79 అలా ఉద్ధవుడు ఐదేండ్ల పిల్లాడుగా ఉండగా, ఒకనాడు కృష్ణునితో కలిసి ఆడుకుంటున్న ఆ పిల్లలు అందరిలో ఒక బాలుణ్ణి కృష్ణునిగానే భావిస్తూ సేవలు చేయసాగాడు. సుగుణాలవల్లి అయిన అతని తల్లి అక్కడికి వచ్చి "నీకు ఆకలేస్తోంది కదా, ఇక అన్నానికి రా" అని పిలిచింది. ఉద్ధవుడు తల్లి మాటలు వినిపించుకోలేదు. అనంత తేజస్సంపన్నుడగు పద్మాక్షుని పాదారవింద మకరంద మాధుర్యంలో మైమరచి అలాగే ఉన్నాడు. అటువంటి ఉద్ధవుడు నేడు కృష్ణుని ఎడబాటు వల్ల ప్రాప్తించిన పరితాప భారంతో ఆ విషయాన్ని విదురునకు చెప్పలేక కుప్పగూలి పోవడంలో ఆశ్చర్యం ఏముంది." అని మళ్లీ శుకుడు ఇలా అన్నాడు "అప్పుడు ఉద్ధవుని హృదయం శ్రీకృష్ణచరణారవింద మకరందాల పాలమున్నీటిలో మునిగి తేలింది. మిక్కిలి ఆనందంతో ఒక్క క్షణంపాటు తన కన్నులు బాష్పాలతో నిండిపోయాయి, కంఠం గద్గదమయింది.

80 శ్రీకృష్ణ వియోగంవల్ల కలిగిన శోకాగ్నికి చీకాకైన మనస్సుతో ఉద్ధవుడు ముంజేతులతో కన్నులు తుడుచుకుంటూ పాపాలు అనే పర్వతాలకు వజ్రాయుధం వంటివాడైన విదురుణ్ణి చూశాడు.

81 అప్పుడు విదురుణ్ణి చూసి ఇలా అన్నాడు.

82 "నల్లని కాలసర్పం లాంటి యమధర్మరాజు యదువంశాన్ని ఒడిసిపట్టి కాటువేశాడు. ఇప్పుడు యాదవ వంశీయుల వృత్తాంతమూ, వారి క్షేమమూ ఏమని చెప్పమంటావు. నా మనస్సు కలవరపడుతోంది.

83 ఓ పుణ్యమూర్తీ! విదురుడా! నోట్లోంచి మాటలు పెగలటం లేదయ్యా! లోకబాంధవుడూ, ఉత్తమశ్లోకుడూ, మహాతేజస్వీ అయిన శ్రీకృష్ణుడనే సూర్యుడు అస్తమించాడయ్యా; ఇంకే చెప్పమన్నావు. మునీంద్రుల ముఖాలు అనే కమలాలు ముకుళితా లయ్యాయి; జారచోరుల కోరికలు ఫలించాయి; రాక్షసుల గర్వాంధకారాలు నలుదిశలా వ్యాపించాయి; పరమ యోగులనే చక్రవాకాలు శోకించాయి; కలుషాత్ముల

కనుగలువలు విప్పారాయి; మహా పాపాగ్నులు పేట్రేగి పోయాయి; ధర్మకృత్యాలకు విఘాతాలు ఏర్పడ్డాయి; మానవుల తేజస్సులు మందగించాయి.

84 అంతే కాకుండా

85 హలమూ వజ్రమూ, పద్మమూ మొదలైన రేఖలతో అందమైన కృష్ణుని పాదాలు వేసిన అడగుల ముద్రలతో స్వచ్ఛంగా సలక్షణంగా ప్రకాశించే భూదేవి ఈనాడు దౌర్భాగ్యలక్షణాలు కలది అయింది.

86 దానవాంతకుడైన శ్రీకృష్ణుడు అస్తమించిన పిమ్మట, యాదవల రాజ్య వైభవం మాయం అయిపోయింది. ధర్మమార్గం నశించింది. అధర్మం అతిశయించింది. లోకంలో మర్యాదలు లేకుండా పోయాయి.

87 అంతేకాకుండా, చక్కగా సానపట్టుటచే బాగా ప్రకాశించే మణుల మనోజ్ఞమైన కాంతువలె తళతళ మెరిసే స్వచ్ఛమైన జలాల్లో ప్రతిబింబించిన పరిపూర్ణ చంద్రమండల కాంతిని చూసి ఏదో జలచరమని భ్రాంతిపడి, ఆ నీటిలో తిరిగే చేపలు దాని చుట్టూ తిరుగుతూ సాటిలేని చనువు, స్నేహాన్నీ చూపుతున్నాయి. అదేవిధంగా కృష్ణుని వెంట తిరిగే యదు, వృష్ణి కుమారులు ఆ మహానుభావుని తమకు అగ్రనాయకుడని మాత్రమే భావించేవారుకానీ, లీలావిలాసార్థం మానవరూపం ధరించిన పరాత్పరుడని తెలుసుకోలేక, శ్రీహరిమాయామోహితులై ఆయనతోపాటు భుజిస్తూ, శయనిస్తూ, కలిసి కూర్చొంటూ, వెంట తిరుగుతూ తమ తోబుట్టువు, చుట్టం ఇత్యాది భావాలతో ప్రవర్తించేవారు. ఆ దేవాదిదేవుని మాయాసముద్రంలో మునిగి పోకుండా ఉండేందుకు బ్రహ్మాదులకు కూడా సాధ్యం కాదు. అన్ని గుణాల్లోనూ మిన్నయైన వారూ, ఉత్తమ పురుషుల్లో అగ్రేసరులూ అయిన భాగవతోత్తముల మాట అటుంచితే, ఇక మిగిలిన వారి విషయం చెప్పడం ఎందుకు. కులం, విద్య, ధనం, బలం వీటివల్ల విఱ్ఱవీగుతూ గర్వాంధకారంతో మసక బారిన మనస్సులతో శిశుపాలుడు మొదలైన రాజులు ఆ మహానుభావుణ్ణి దేవదేవుడిగా తెలుసుకోలేక పలికిన దుర్భాషలు, నిందావాక్యాలు తలుచుకుంటే నా మనస్సు క్షోభించిపోతూ ఉంటుంది." అని పలికిన ఉద్ధవుడు విదురునితో ఇంకా ఇలా అన్నాడు..

88 తనివి తీరక తన్ను చూచేవారికీ; బుద్ధియోగంతో తన్ను తెలుసుకోగోరినట్టి వారికీ; తన్ను గూర్చి తపస్సుచేసి భాగవతధర్మం అవలంబించినవారికీ; సమస్త సృష్టిలో తన్నే దర్శించే భక్తులకూ; తన అఖండ జ్యోతిస్వరూపం చూపించి వారి దుఃఖాలూ జంజాటాలూ పోగొట్టి, ప్రశాంత సాక్షాత్కారం ప్రసాదించి. లక్ష్మీవల్లభుడైన శ్రీకృష్ణుడు తన అవతారం చాలించి అంతర్హితుడు అయ్యాడు.

89 మానవులకు మహాభ్యుదయానికి అవధి అయి, తనకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించే తన యోగం యొక్క మాయాబలాన్ని స్వీకరించి ప్రకటీకరిస్తూ, మిక్కిలి సుందరమై, అలంకారాలకే అలంకారమై, జ్ఞానానికి పరాకాష్ఠ అయి, సకల శుభాలకూ సుస్థానం అయి, నిత్యమై దీపించే ఆ దివ్యమంగళమూర్తి తన ఆకారాన్ని తన శక్తివల్ల తానే ధరించాడు. ధర్మరాజు యొక్క రాజసూయ యాగంలో మూర్తీభవించిన ఆ శ్రీకృష్ణుని సౌందర్యాన్ని ఎంతో ఆనందంతో అందరూ సందర్శించారు. ఎంతో సంతోషంతో అభివర్ణించారు.

90 "బ్రహ్మసృష్టికి కూడా మూలకారణం ఈ మహానుభావుడే" అని ఆనాడు ఆ సభలోని వారంతా ఉత్సాహంతో ఆయన దివ్య మంగళ స్వరూపాన్ని తదేకధ్యానంతో రెప్పవాల్చకుండా చూసారు కదా.

91 శ్రీకృష్ణుడు వారి వారి స్వభావాలను అనుసరించి కొందరికి శాంత స్వరూపుడు గానూ, మరికొందరికి భయంకర స్వరూపుడు గాను కనిపిస్తాడు. ఆ సర్వేశ్వరుడు సహజంగా శాంత స్వభావుడు. అందువలన ఇతరులు తనకు చేసిన అపరాధాలకు ఆయన మనస్సు ఎంతో బాధపడుతున్నా వారి యందు వాత్సల్య పరిపూర్ణమైన బుద్ధితోనే మెలగుతూ ఉంటాడు. ఆ పరాత్పరుడు ప్రకృతి కార్యమైన మహత్తత్త్వమే స్వరూపంగా కలవాడు. పుట్టుక లేనివాడైనా కట్టెలలోనుండి అగ్ని పుట్టునట్టు ఆవిర్భవిస్తూ ఉంటాడు. అటువంటి శ్రీకృష్ణుని చిరునవ్వులకూ, రాసక్రీడలకూ, ప్రేమావలోకనాలకూ తహతహలాడుతున్న వ్రేపల్లెలోనే గొల్లభామలంతా ఆయన దివ్య సౌందర్య సందర్శనంలో పరవశమైన భావాలతో ప్రవర్తించారు. సరే ఈ సంగతి ఇలా ఉంచు.

92 అంతటి మహానుభావుడు దేవతల కోరిక తీర్చడానికి వసుదేవుని ఇంట్లో జన్మించి రాక్షసత్వం పెరిగిపోయిన కంసుడు హింసిస్తాడేమో అనే భయంతో, వెళ్ళి నందుని ఇంట్లో చాటుమాటుగా పెరగటమూ; కాలయవనుడూ, జరాసంధుడూ మొదలైన వారిని కదనరంగంలో ఎదిరించకుండా తప్పుకొని మంచివారి చేత పొగడబడే మథురా నగరాన్ని కూడా వదలిపెట్టి ఎక్కడో దాక్కోవటమూ; ఈ రెండు సన్నివేశాలను తలచినప్పుడు నా మనస్సు దుఃఖంతో కుమిలి పోతుంది.

93 అంతేకాకుండా.

94 వజ్రాయుధం కొండలను ఛేదించినట్లు ప్రచండమైన పాపాలను పటాపంచలు చేసే ఓ విదురుడా! గుండెనిబ్బరంతో ఎన్నో కష్టాలు అనుభవిస్తూ మనస్సు అంతా అల్లకల్లోలం అవుతుండగా చిరకాలం చెరసాలలో బాధపడ్డారు దేవకీ వసుదేవులు. వారి దగ్గరకు వెళ్ళి కృష్ణుడు భక్తితో నమస్కారం చేసి "జననీజనకులారా! నేనుండగా మీరిద్దరూ కంసుని క్రూరకృత్యాలకు గురికావలసి వచ్చింది. ఆ దుర్మార్గుణ్ణి తుదముట్టించకుండా చూస్తూ

ఉపేక్షించిన నా అపరాధాన్ని దయచేసి క్షమించండి"అని విన్నవించుకొన్నాడు. ఆ దేవదేవుని అద్భుతమైన ఆ మృదుమధుర వచనాలను పదేపదే స్మరించి నా హృదయం ఎంతో వ్యథపడుతూ ఉంటుందయ్యా.

95 వాస్తవానికి ఆయన కనుబొమలు ఒక్కమాటు ముడిపడితే చాలు దుష్టశిక్షణ జరిగి భూభారమంతా తొలగి పోతుంది. అటువంటి ఆ దేవదేవుని పాదపద్మ మకరందాన్ని ఆస్వాదించే అదృష్టం పట్టిన మహాత్ముడే గదా ధన్యాత్ముడు.

96 ఆ గోవిందుణ్ణి, ఆ మురాంతకుణ్ణి, ఆ విష్ణుస్వరూపుణ్ణి, ఆ ఆనందమయుణ్ణి, ఆ నందనందనుణ్ణి, ఆ మందరగిరి ధరుణ్ణి ఎక్కడైనా ఎప్పుడైనా మరిచిపోయేటంత మందబుద్ధినా నేను.

97 మరొక్కమాట. తను పుట్టినప్పటినుండి పనిగట్టుకొని ఎన్నో ఎగ్గులు చేసినవాడే కదా శిశుపాలుడు. ఆటువంటి శిశుపాలుడు మీరందరూ చుస్తూ ఉండగా, సమస్తరాజులూ చూస్తూ ఉండగా ధర్మరాజు సర్వోత్తమంగా నిర్వహించిన రాజసూయ మహోత్సవంలో మహాయోగీంద్రుల మనస్సులకు కూడా అగమ్యగోచరమైన పరమపదాన్ని అందుకున్నాడు గదా.

98 కౌరవులూ, పాండవులూ మొక్కపోని మగటిమితో, లెక్కలేని సైన్యాలతో యుద్ధభూమికి వెళ్ళారు. అక్కడ ఆ వీరులు శ్రీకృష్ణుని ముఖారవిందాన్ని సందర్శిస్తూ, ఆ సౌందర్య మధు రసాన్ని త్రాగుతూ అర్జునుని బాణాలకు క్షతగాత్రులై పరమ పవిత్రులై మహోన్నతమైన మోక్షాన్ని పొంది ఆనందించారు గదా.

99 అటువంటి పద్మాక్షుడు, ఆద్యంత రహితుడు, అత్యంత సుందరుడు, త్రిజగన్మోహనుడు, సముద్రుని కూతురు, అందాలు చిందే ఇందిరాదేవి చనుదోయి కుంకుమ గుర్తులు హత్తుకున్న విశాల వక్షఃస్థలం కలవాడు, సకల దిక్పాలకుల ధగధగ మెరిసే బంగారు కిరీటాలలోని పద్మరాగాల కాంతులతో ఎఱ్ఱనైన పాదపీఠం కలవాడు. పుట్టడం గిట్టడం లేనివాడు, సాటిలేని వాడు, తన కంటె మేటి లేనివాడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు అధీశ్వరుడు అయిన శ్రీకృష్ణుడు; కంసుని తండ్రి అయిన ఉగ్రసేనుడికి రాజ్యం అంతా పట్టంగట్టి, సింహాసనం మీద కూర్చోబెట్టి, తాను భృత్యుడై అతని ఆజ్ఞల్ని ఆనందంతో తలదాల్చటం తలచుకుంటే నా మనస్సు ఎప్పుడూ ఎంతో సంతాపపడుతూ ఉంటుంది."

100 అని మళ్ళీ ఇలా అన్నాడు ఉద్ధవుడు "ఓ పుణ్యాత్ముడా! పరాత్పరుడూ, పరమ యోగీశ్వరుడూ, అయిన శ్రీకృష్ణుడు; దైవభక్తుడు, ఉత్తమ భాగవతుడు అయిన ఉగ్రసేనుణ్ణి సేవించడం ఏమంత ఆశ్చర్యంగా లేదు కాని తనను చంపాలని, చన్నులకు విషం పూసుకొని పాలిచ్చిన పరమ పాతకురాలు పూతనకు మోక్షం ఇచ్చాడంటే; చన్నిచ్చి

పెంచిన యశోదమ్మకు సైతం లభించని పరమపదాన్ని, కరుణార్ద్రహృదయంతో ఆ ఘాతుకురాలికి ప్రసాదించాడంటే; ఇక నిజ పాదాల్ని నిరంతరం భావించే వారిని అంటిపెట్టుకుని ఉండి సేవించడంలో పెద్ద విశేషం ఏముంది." ఈ విధంగా పలికిన ఉద్ధవుడితో విదురుడు ఇలా అన్నాడు "భక్తులపై వాత్సల్యం కలవాడు, కరుణాసాగరుడు, భాగవతులను పరిరక్షించే పద్మాక్షుడు శ్రీకృష్ణుడు. తన అనుచరులకు ప్రసాదించే పరమపదాన్ని ఘోర కృత్యాలు చేసే క్రూర రాక్షసులకు ఎలా ఇచ్చాడు. అలా ఎలాగో సవిస్తరంగా నాకు తెలిసేలా చెప్పు.

101 "గరుడుని భుజం ఎక్కువాడూ, సుదర్శన చక్రం ధరించువాడూ అయిన శ్రీమహావిష్ణువును ఎందరో రాక్షసులు ఎన్నో పర్యాయాలు అవక్ర భుజపరాక్రమంతో యుద్ధాలలో ఎదుర్కొన్నారు. "ఓరీ! హరీ! అసురవైరీ! ఆగు పారిపోకు నిలు" అని ఆయన నామాన్నే పలుకుతూ, ఆయన ముఖాన్నే చూస్తూ రణరంగంలో నేలగూలిన ఆ రాక్షసులు మోక్ష సామ్రాజ్యాన్ని అందుకొని అత్యున్నతమైన స్థానాన్ని పొందారు.

102 విదురుడా! ధీరులలో ఉత్తముడా! ఏకాగ్ర చిత్తంతో విను. నిగనిగలాడే తెల్లని క్రొందామరరేకుల వంటి కన్నులు కల ఆ శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్నీ, ఆయన లీలా విశేషాలనూ నీకు తేటతెల్లంగా తెలియజేస్తాను.

103 పుట్టుక ఎరుగని ఆ లక్ష్మీదేవి భర్త అయిన విష్ణువు భూభారాన్ని పోగొట్టడానికి, తన నాభి కమలంలో పుట్టిన బ్రహ్మదేవుని ప్రార్థన మన్నించాడు. అలా కంసుని కారాగారంలో దేవకీ వసుదేవులకు పుత్రుడై పుట్టాడు. వసుదేవుడికి తన ముద్దుల కుమారుణ్ణి అతి బలవంతుడైన కంసుడు హింసిస్తాడేమో అనే భయం కలిగింది, వెంటనే వసుదేవుడు ఆ అర్ధరాత్రి పసివాణ్ణి తీసుకుని బయలుదేరాడు.

104 అలా వసుదేవుడు నందుడు ఉన్న వ్రేపల్లెకు వెళ్ళాడు. ఎవ్వరూ చూడకుండా నందుని భార్య యశోద పక్కలో బాలుణ్ణి పడుకోబెట్టాడు. తిరిగి మధురా నగరం లోని తన కారాగారానికి వచ్చాడు.

105 నందుని గోకులంలో కృష్ణ బాలుడు, తనను శ్రీహరి అవతారమని ఎవరికీ తెలియకుండా, నందనందనుడిగా అన్న బలరామునితో కలిసి ఆనందంగా ఆడుకుంటున్నాడు. ఇలా పదకొండు సంవత్సరాలు గడిచాయి, ఆయన్ని శ్రీహరి అవతారమని ఎవరూ గుర్తించలేదు.

హరి యేకాదశ సంవ
త్సరములు నందవ్రజమునఁ దను హరి యని యె
వ్వరు నెఱుఁగకుండ నా హల
ధరుతోఁ గ్రీడించుచుండె దద్దయు బ్రీతిన్.

106 దేవతా శ్రేష్ఠులకు సైతం కన్నుల విందుగా తన దివ్య స్వరూపాన్ని చూపించని ఇందిరాదేవి భర్త తోటి గొల్లపిల్లలతో కలిసి ఆడుతూ ఎంతో వేడుకగా ఆవుల్నీ దూడల్ని కాచాడు.

107 ఆ సమయంలో శ్రీకృష్ణుడు తనతో ఉండే గోపాలబాలురకు తన లీలలూ వినోదాలూ చూపించాలనుకున్నాడు.

108 ఆ గోపాల బాలుడు నిర్మలమైన యమునా నదీ జలాలతో పెద్దగా పెరిగి ఘుమఘుమలాడే సువాసనలు గల పూలనుండి చిందుతున్న మకరందాన్ని కడుపు నిండా త్రాగి మైమరచిన తుమ్మెదల గుంపులతో కూడిన మాధవీ మంటపాలలో, గోరింట గుబురులలో, మొల్ల పొదలలో, మంచి గంధపు నికుంజాలలో దూరి నెమలిలాగా కేకలు వేస్తూ, గోరువంకలాగా కూతలు కూస్తూ కోకిలలాగా రాగాలు తీస్తూ రామచిలకలలాగా రమణీయ పలుకులు పలుకుతూ ఉండేవాడు.

109 లక్ష్మీవల్లభుడైన ఆ నందనందనుడు కృష్ణుడు తన కౌమార దశలో సింహకిశోరంలాగా ప్రకాశించాడు. లీలగా పిల్లనగ్రోవిని మ్రోగిసూ ఆ మధరగాన సుధా సరస్సులో గో గోప బృందాన్ని ముంచి తేల్చి పరవశింపజేస్తూ లక్ష్మీనివాసాలైన గోవుల్ని మేపుతూ ఉండేవాడు.

110 అంతేకాకుండా.

111 ఆడుకోటానికి చిన్న పిల్లలు గడ్డితో సింహం మొదలైన బొమ్మల్ని తయారు చేస్తారు. ఆట పూర్తి కాగానే వాటిని మళ్లీ చించి, తుంచి పారేస్తారు. అలానే దయమాలిన వారూ, కామరూపధారులూ, కంసుని చారులూ అయిన రాక్షస వీరుల్ని ఎందరినో గోవిందుడు కదన రంగంలో అవలీలగా చించి చెండాడాడు.

112 యమునా నదిలో భయంకరమైన మహా సర్పం ఒకటి నివాసం ఉండేది. విశాలంగా తెరచిన దాని నోటిలో నుంచి వెలువడే విషాగ్ని జ్వాలల తాపానికి గోపాలకులు తాళలేక పొయ్యే వారు. గో సంపద కూడా బాధపడుతూ ఉండేది. నందనందనుడు ఆ నాగరాజును నదిలో నుండి తరిమేశాడు. (గోపకులు గోవులుతో కూడిన) ఆలమందల్ని కాపాడి వాటికి మళ్లీ ఆ నదిలోని నిర్మలమైన నీటిని త్రాగే అవకాశాన్ని అనుగ్రహించాడు. అందరికీ ఆనందం కలిగించాడు.

113 నందుడు మొదలైన యాదవులు వర్షం బాగా కురియటంకోసం ఇంద్రుణ్ణి గూర్చి ఒక ఉత్సవం ఎంతో వైభవంతో, ఎంతో ఉత్సాహంతో ఏటేటా గొప్పగా చేసేవారు. కృష్ణుడు, ఆ ఇంద్రోత్సవాన్ని మాన్పించి ఇంద్రుని అహంకారం అడుగంటేలాగా, గోపాలురు అందరూ సంతోషించేలాగా గోపూజ ప్రధానమైన గోయాగాన్ని తక్కువ వ్యయంతో, ఎక్కువ వైభవంతో జరిపించాడు.

114 ఈ విషయం తెలుసుకొన్న ఇంద్రుడికి ఎంతో ఆగ్రహం వచ్చింది. మనస్సు ద్వేషంతో, రోషంతో నిండిపోయింది. పద్మనాభుడైన శ్రీకృష్ణుని మహిమ తెలుసుకోలేక అహంకారంతో వలాహకం మొదలైన భయంకర కాలమేఘాల్ని పంపించాడు. ఆ కారుమబ్బులు గోకులమంతా శోకంతో వ్యాకులమై పోయేలా పెద్దగా ఉరుముతూ ఎడతెగకుండా రాళ్లవర్షం కురిశాయి.

115 అప్పుడు వ్రేపల్లెలోని గోపాలురూ, గోవులూ అందరూ ఆ వర్షానికి అల్లకల్లోలమయ్యారు. గొల్లలంతా తల్లడిల్లి ఒక చోట చేరారు. "కృష్ణా! రక్షించు! రక్షించు! ఈ జడివాన ధాటికి గోకులంలోని సకల జీవులూ చీకాకుపడి చిందరవందరలు అవుతున్నారు. దిక్కులేని వారికి నీవే దిక్కు. సజ్జనులను పోషించేవాడవూ దుర్జనులను శిక్షించేవాడవూ నిష్కళంకుడవూ అయిన కృష్ణా! దయతో కాపాడవయ్యా."

అని యిబ్భంగి విపన్నులై పలుకఁ గుయ్యాలించి కృష్ణుండు స
జ్జనవర్ధిష్ణుఁడు గోపగోనివహరక్షాదక్షుడై దేవతా
జను లగ్గింపఁ గరాంబుజాతమున సచ్ఛత్రంబుగాఁ దాల్చె బో
రన గోవర్ధన శైలముం దటచరద్రమ్యామరీజాలమున్.

116 అంటూ ఆపన్నులైన వ్రేపల్లెలోని గోపాలకులు అందరూ ప్రార్థించారు. సజ్జనుల పెంపు కోరి కృష్ణుడు, వారి మొర ఆలకించి గోవులనూ, గోపాలకులనూ కాపాడటానికి నడుం కట్టాడు. దేవ కన్యలు విహరించే చరియలు గల గోవర్ధన పర్వతాన్ని ఒక్క చేత్తో గొడుగులా ఎత్తి పట్టాడు. ఆ దృశ్యం ఆలోకించి ఆకాశంలోని అమరులంతా "బళీ! బళీ!" అని ప్రశంసించారు.

117 ఇంకో విషయం విను.

118 శరత్కాలం ప్రారంభమైంది. పూర్ణిమ నాటి నిండు చందమామ పండువెన్నెలలో బృందావనం కన్నుల విందు చేస్తూన్నది. ఒకరోజు కృష్ణునికి రాసకేళిపై ఉల్లాసం కలిగింది. మనోహరమైన యౌవన సౌభాగ్య శోభలతో అందాలు చిందే రూపంతో అతిశయించి ఉన్నాడు, తన ముఖం నుండి వెలువడే చంద్రకాంతులతో, గోపికల కనులు అనే కలువలకు ఆనందాన్ని అందిస్తూ నందనందనుడు త్రిభంగి గా నిలబడి వేణుగానం చేయసాగాడు. ఆ మువ్వంకల ముద్దుకృష్ణుని మురళీనినాదం వీనులవిందుగా విని వ్రేపల్లెలోని గోపికలు మైమరిచిపోయారు. (త్రిభంగి, మువ్వొంకల భంగిమ అంటే – ఒక కాలుమీద నిలబడి రెండవ కాలు వేళ్ళు నేలను ఆనే లాగ కొంచం మడిచి నిలబడు భంగిమ, కృష్ణుడు వేణువు వాయిస్తూ నిలబడు విధము)

119 వెళ్ళ వద్దు అని తమ భర్తలూ, మరుదులూ, కొడుకులూ, అత్తలూ, మామలూ ఎంతగానో చెప్పినా ఏమాత్రం వినకుండా మనసుల లోపల శ్రీకృష్ణుని పాదపద్మాలను

ఆరాధించాలనే ఆరాటం అధికం కావటంతో గోపికలు పరుగు పరుగున వచ్చారు. కరుణాసముద్రుడైన శ్రీకృష్ణుడు, ఆ జవరాండ్ర పాలిట నవ మన్మథుడై రమ్యమైన రాసకేళీనాట్యంతో వారందరినీ ఆనందింపజేశాడు.

120 అనంతరం అన్నగారైన బలరామునితో కలిసి శ్రీకృష్ణుధు మధురకు వెళ్ళాడు. అక్కడ మహా వైభవంగా మణిమయ సింహాసనాన్ని అధిష్ఠించి ఉన్న మదోన్మత్తుడు, దుర్మార్గుడు, దుష్ట రాక్షసుడు అయిన కంసుణ్ణి సంహరించాడు. తల్లిదండ్రులైన దేవకీ వసుదేవుల్ని బంధవిముక్తుల్ని గావించి, భోగభాగ్యాలతో సమున్నతంగా సంతుష్టి పరిచాడు

121 శ్రీకృష్ణుడు సమస్త జగత్తు అంతటికి గురువు. సామర్థ్యము గలవాడు అయి షడంగాలతో కూడిన వేదాల్నీ, అరవైనాల్గు కళల్నీ సాందీపని అనే గురువు వద్ద అభ్యసించాడు. నిజానికి ఆ జగద్గురువునకు ఇతరులు గురువుల అవుతారా? ఇవన్నీ ఆ పరాత్పరుడు లోకాచారం కోసం చేసే లీలలు అంతే.

122 చావు ముంచుకొనివచ్చిన గురుపుత్రుడు అతిశయంతో ప్రభాసతీర్థంలోకి పోయి పంచజనుని కడుపులోకి చేరాడు. అధికమైన భక్తిగలవాడై గురువు మిక్కిలి ఆనందించునట్లు ప్రకాశమానమైన తన లీలతో, మురారి ఆ పిల్లవానిని తీసుకువచ్చి, గురుదక్షిణగా సమర్పించెను.

123 విదర్భ దేశానికి అధిపతి భీష్మకుడు; ఆయన ముద్దుల కూతురు రుక్మిణి; అందమైన ఆమె కన్నులు క్రొందామర రేకులు; లక్ష్మీసమానురాలైన లావణ్యరాశి ఆమె; శుభంకరాలైన అలంకారాలతో శంఖంవంటి కంఠంతో సాటిలేని మేటి బంగారు చాయతో సంస్తవనీయమైన సత్ప్రవర్తనంతో విరాజిల్లే రుక్మిణికి స్వయంవరం ప్రకటించారు; ఆ స్వయంవర మహోత్సవానికి శిశుపాలుడు, సాల్వుడు, జరాసంధుడు మొదలైన రాజాధిరాజులంతా వచ్చారు. పూర్వం దేవతలు రక్షిస్తున్న అమృత కలశాన్ని పక్షిరాజైన గరుత్మంతుడు తీసుకొనిపోయాడు కదా, అలాగే భగవంతుడైన శ్రీకృష్ణుడు తన బాహుబాలాన్ని ప్రదర్శించి ఆ రాజు లందరినీ పరాజితులను చేసి రుక్మిణిని తీసుకొనివెళ్ళి పరిణయమాడారు. అటువంటి ఆ జగదేక వీరుణ్ణి పొగడడం ఎవరికి మాత్రం సాధ్యమౌతుంది.

124 ఏడు మదించిన ఆబోతులను శ్రీకృష్ణుడు ఎదురొడ్డి తన అపారమైన శక్తితో ఆ ఆబోతులకు ముక్కుతాళ్ళు బిగించి వాటిని లొంగదీసుకొన్నాడు. శ్రీకృష్ణుని పరాక్రమమును సహింపజాలని రాజులు తనతో తలపడగా వారిని జయించి, వికసించిన తామరరేకులవంటి కన్నులు గల రాజపుత్రి నాగ్నజిత్తిని గుణవంతుడూ, అనంతుడూ, అనంత శక్తిమంతుడూ అయిన గోపాలకృష్ణుడు సంతోషంతో స్వయంవరంలో పెండ్లాడాడు.

125 శత్రువీరులకు సింహస్వప్నంగా పేరుగాంచిన యదుసింహుడు శ్రీకృష్ణుడు. ఆయన సత్యభామ మనస్సులోని కోరికను తీర్చడంకోసం స్వర్గానికి జైత్రయాత్ర సాగించి ప్రశంసనీయమైన పరాక్రమాతిశయంతో ఇంద్రుణ్ణి జయించి పారిజాతాన్ని అవలీలగా స్వర్గలోకంనుండి భూలోకానికి తీసుకొచ్చాడు. అటువంటి జగన్మాన్యుడు కృష్ణుడు సామాన్యుడు కాదు.

126 సమస్త జీవులకు అంతర్లీనమైన రూపం ధరించి గౌరవాన్ని అందుకొనే భూదేవికి ప్రియమైన కుమారుడు నరకుడు. అయినా వాడు రాక్షస లక్షణాలు కలవాడు కావడంతో శ్రీకృష్ణుడు "సునాభము" అనే పేరుగల చక్రము అంచుతో అతని శిరస్సును ఖండించాడు. అనంతరం ధరణీమాత ప్రార్థించగా అతని కుమారుణ్ణి ఆ విశాల సామ్రాజ్యానికి అధిపతిగా చేసాడు. ఆ నరకాసురుని అంతఃపురంలోని చెరసాలలో చిరకాలంగా మ్రగ్గుతున్న పదహారువేల నూరుగురు కన్యలూ ఆర్తజన రక్షకుడైన కృష్ణుని వీక్షించి, అనురాగయుక్తులౌతూ ప్రమోదబాష్పాలు వర్షించారు.

127 తన సౌందర్యవిలాసాలకు వ్యామోహం చెందిన ఆ పదహారువేల నూరుగురు సుందరీమణుల కోర్కె తీర్చుటకోసం, అందాలరాశి నందనందనుడు అయిన కృష్ణుడు ఒక్క సుముహూర్తలోనే వారందరినీ పెండ్లాడాడు. అత్యంత మనోహరాలైన అంతఃపురాలలో అందరికీ అన్ని రూపులు ధరించిన వాడై, అంతులేని అనురాగంతో నిండిన మనసులు గల ఆ కాంతామణులను సంతోషపరచాడు.

128 చతురకళానిధి అయిన శ్రీకృష్ణుడు ఒక్కొక్క భార్యకు తనకు సాటి అయిన మేటి పరాక్రమం గల కుమారులను పదిమంది చొప్పున ప్రసాదించాడు. నలుదిశలా విశాలమైన యశోదీప్తులు నిండించాడు.

129 కాలయవనుడు, సాల్వుడు, జరాసంధుడు మొదలైన రాజులు అందరూ, చతురంగ బలాలతో కూడి మథురాపురాన్ని చుట్టుముట్టారు. ఆ రాజలోకాన్ని సేనానీకంతో సహా శ్రీకృష్ణుడు సంహరించాడు. మనస్ఫూర్తిగా తన అండదండలను అర్థించిన భీమార్జునులకు సాటిలేని విజయశ్రీని సమకూర్చాడు. మదోన్మత్తులైన వారి శత్రువులను తుదముట్టించాడు. బలరాముణ్ణి వెంటబెట్టుకొని బాణుడు, శంబరుడు, మురుడు, పల్వలుడు అనే రాక్షస నాయకుల్ని, సేనలతో సహా నేలకూల్చాడు. కదనరంగంలో ఎదిరించిన దంతవక్త్రుడు మొదలైన దానవుల్ని అవక్రవిక్రమంతో సంహరించాడు.

130 దుర్యోధనుడు సమస్త మహీరాజ్య మహా సంపత్తి వలన మదోన్మత్తుడు అయ్యాడు. కర్ణ, శకుని, దుశ్శాసనుల దురాలోచనలూ, దుర్యోధలూ తలకెక్కి, తెగనిక్కి పాండవులకు తగని, ఎడతెగని ఎన్నెన్నో ఎగ్గులు చేసాడు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తంగా సంగ్రామంలో భీముని ప్రచండ గదా ఘాతంతో తొడలు విరిగి, ప్రాణాలు సురిగి, రాజ్యం పోయి, ప్రతిష్ఠ

గోల్పోయి, భూమిమీద పొరలాడుతున్న రారాజును చూడాలని వేడుక కలిగింది శ్రీకృష్ణునికి కౌరవపాండవుల పోరాటం నిశ్చయ మయింది. ఉభయ పక్షాల రాజులూ పెచ్చుపెరిగిన మత్సరంతో ఉరకలు వేసే ఉత్సాహంతో కురుక్షేత్రంలో యుద్ధానికి సన్నద్ధులై నిలిచారు. సైనికుల పాద ఘట్టనలకు భూమి కంపించింది. శంఖధ్వానాలకూ భేరీపటహాది వాద్యధ్వనులకూ ఆకాశం దద్దరిల్లింది. గుఱ్ఱాల డెక్కల తొక్కిడికి రేగిన పరాగపటలాలు సూర్యమండలాన్ని కప్పివేశాయి. ఒకరి చేతిలో మరొకరు చొప్పున చచ్చి తనలో చేరితే తప్ప భూభారం తగ్గదు అనుకొన్నాడు శ్రీకృష్ణుడు.
అపారపరాక్రమోపేతులూ, అపరిమితోత్సాహ సమేతులూ అయిన భీష్మ ద్రోణులను ఒక పక్షంలోనూ, భీమార్జునులను ఒక పక్షంలోనూ నిలిపి మదోన్మతులైన మహీపతులతోపాటు పదునెనిమిది అక్షౌహిణుల సైన్యాన్ని సైతం చంపించాడు. తనతో సమానమైన బలం గల యాదవ యోధుల్ని నిర్జించటం ఎంత బలవంతులకైనా సాధ్యం కాదు. అందువల్ల మద్యపానంవల్ల మత్తెక్కి గిరగిర తిరుగుతూ ఎఱ్ఱబడిన కన్నులతో కన్నుమిన్ను గానని యదువీరులకు వారిలో వారికే వైరాలు పెట్టించి, పోరాటాలు పుట్టించి తుదకు అందరినీ తుదముట్టించాడు. అలా అన్యోన్యం కొట్టుకొని మరిణించి తనలో చేరితేనే కాని భూభారం తగ్గదని భావించిన వాసుదేవుడు ధర్మరాజుచే నిష్కంటకమైన రాజ్యాన్ని ప్రశంసనీయంగా పాలింపజేశాడు. మానవులకు అవశ్యకాలైన ధర్మమార్గాలను ప్రతిష్ఠించాడు. బంధువులకూ, మిత్రులకూ పరమానందాన్ని కలిగించాడు. పాండవ వంశాన్ని నిలుపదలచి అభిమన్యుడి అర్ధాంగీ అయిన ఉత్తర గర్భాన్ని రక్షించాడు. అశ్వత్థామ ప్రయోగించిన అమోఘమైన బ్రహ్మాస్త్రం వల్ల ఆమె గర్భంలోని అర్భకుడికి హాని కలుగకుండా కాపాడాడు. తన చరణ కమలసేవా పరాయణుడైన ధర్మతనయుడు ధర్మరాజు పేరు ప్రతిష్ఠలు, శౌర్యసాహసాలు ప్రకటితం అయ్యేలా ఆయన చేత మూడు అశ్వమేధ యాగాలు చేయించాడు.

131 భక్త రక్షణ దీక్షా పరాయణుడైన శ్రీమన్నారాయణుడు ద్వారకా పట్టణంలో నివసిస్తూ వైదికములూ, లౌకికములూ అయిన సదాచారాలను సక్రమంగా చక్కగా నిర్వహిస్తూ తన మాయామహత్త్వం అభివ్యక్తం కాకుండా ప్రవర్తించాడు. ఏమీ అంటనివాడై కూడా సంసారిలాగా, కోరికలకు ఆకర్షితుడైన వాని లాగా, భోగభాగ్యాలతో నిత్య సంతోషి అయి ఉన్నాడు. సౌందర్యలక్ష్మికి మందిరమైన దేహంతో, అతిశయించిన స్నేహంతో, చిరునవ్వుల విరిసే కడగంటి చూపులతో, అమృతం కురిసే సరససల్లాపాలతో ఇటు పాండవులనూ, అటు యాదవులనూ ఆనందింపజేస్తూ కరుణతో లాలించి పాలించాడు.

132 పౌర్ణమిరోజు పండు వెన్నెల వెలుగులతో విరాజిల్లే శరత్కాల రాత్రులలోనూ, అందమైన మేలిమి బంగారు స్తంభాలు గల సౌధాల పైఅంతస్తుల్లోని చలువరాతి

తిన్నెలమీదా, తరుగని తారుణ్యం, చెరగని సౌందర్యం గల అంగనలతో కూడి క్రీడించాడు. అందమైన ఆడు ఏనుగుల సమూహం మధ్య దిగ్గజాలు తిరిగినట్లు, మెరుపుతీగల నడుమ నీలిమేఘాలు విహరించినట్లు, ముత్యాల సందున ఇంద్రకాంత మణులు ప్రకాశించినట్లు అందగత్తెలు అందరికీ అన్ని రూపాలు ధరించిన నందుని కుమారుడైన శ్రీకృష్ణుడు సరికొత్త ఆనందాలతో ఎన్నో సంవత్సరాలు విహరించాడు.

133 అలా ఉండగా ఒకరోజు.

134 ఇలా ఉండగా కొంతమంది మునీశ్వరులు ద్వారకా నగరానికి వచ్చారు. అప్పుడు కొందరు యాదవ కుమారులు వారిని చుట్టుముట్టి ఎత్తిపొడుపు మాటలతో వారి మనస్సు నొప్పించారు. అందుకు వారు ఆగ్రహించి ఘోరంగా శపించారు. కొన్ని మాసాలు గడిచిన పిమ్మట, దైవయోగం వల్ల యాదవు లంతా ఒక పెద్ద ఉత్సవం చేయాలని తలపెట్టారు. మిక్కిలి కుతూహలంతో కూడిన అంతరంగాలతో పొంగిపోతూ, తమతమ వాహనా లెక్కి జాతరకోసం ప్రయాణమయ్యారు.

135 అలా వెళ్ళిన యాదవులు అందరూ ప్రభాస తీర్థానికి చేరారు. ఆ నదీజలాల్లో స్నానాలు చేశారు. అరమరికలు లేని ఉదారబుద్ధితో దేవతలకూ, మహర్షులకూ, పితృదేవతలకూ తర్పణాలు విడిచారు. అపారమైన భక్తితో లేగదూడలతో కూడి ఉన్న చూడముచ్చటైన గోవులను భూరి దక్షిణలతో సహా బ్రాహ్మణులకు దాన మిచ్చారు.

136 అనంతరం జింకచర్మాలూ, మంచి మంచి వస్త్రాలూ, రత్నకంబళ్లూ, వెండీ, బంగారమూ, నువ్వులూ, భూములూ, చక్కని కన్యలూ, ఏనుగులూ, గుఱ్ఱాలూ, రథాలు బ్రాహ్మణోత్తములకు బహూకరించారు.

137 ఇలా పంటలతో కూడిన భూములు మున్నగునవి భగవంతునికే ఇస్తున్నామన్న భావంతో ఏమాత్రం వెలితి లేకుండా దానం చేశారు.

138 ఇలా దానధర్మాలు చేసిన తర్వాత యాదవు లందరూ సంతుష్టిగా నచ్చిన మృష్టాన్నాలను కడవునిండా తిని, మధుర మోహనమైన మద్యాలు తాగి, మత్తెక్కి మైమరిచి, పరస్పరం పరిహాసపు మాటలుతో మొదలు పెట్టి కలతలు, కలహాలు మొదలు పెట్టారు.

139 మధుపానం వలన మత్తెక్కిన వారి కళ్లు బాగా ఎరుపెక్కాయి. కళ్ళు తిరగసాగాయి. మత్సరాలు పెచ్చు పెరిగి, ఒకరి నొకరు పొడుచుకొని చచ్చారు. ఎలా అయితే వెదుళ్ళ రాపిళ్లు వల్ల ఆవిర్భవించిన అగ్నిజ్వాలల్లో వెదురు పొదలన్నీ దగ్ధమైపోతాయో, అలానే యాదవులు అందరూ నాశనమయ్యారు. ఈ యాదవకుల విధ్వంసం అంతా శ్రీకృష్ణుడు తిలకించాడు.

140 తన ఆ మాయా విలాసాన్ని చాతుర్యంతో గమనించిన తరువాత పొంగిపొరలే తరంగాలతో, వికసించిన కమలాలతో, జలజల ప్రవహించే సరస్వతీ నదిలోని జలాలలో చనిపోయిన వారందరికీ ఉత్తరక్రియలు యథావిధిగా జరిపాడు.

141 మచ్చ లేని మంచి గుణాలతో విరాజిల్లే శ్రీకృష్ణుడు ఒక చెట్టు మొదట్లో కొంచెము సేపు కూర్చున్నాడు. తరువాత నన్ను పిలిచి "ఉద్ధవా! ఇక నీవు బదరికాశ్రమానికి వెళ్లు" అని నాకు చెప్పి, మాయ పుచ్చి, లేచి, ఎక్కడికో వెళ్ళిపోయాడు.

142 ఆయన తన వంశాన్ని పూర్తిగా సమాప్తం చేసుకోవాలని సంకల్పించాడన్న సంగతి నేను గ్రహించాను. ఆ లక్ష్మీపతి యైన కృష్ణుని సుందర పాదారవిందాల ఎడబాటును సహించలేకపోయాను. ఆయన వద్దన్నా వినకుండా ఆయన అడుగు జాడలను అనుసరించాను.

143 అలా కృష్ణుని జాడ వెతుక్కుంటూ వెళ్ళగా, ఒక చెట్టు మొదలుకి అనుకొని నేలమీద కూర్చుని ఉన్న ఆ మహానుభావుడు నాకు కన్పించాడు. ఆయన దేహం దేదీప్యమానంగా కాంతులు వెదజల్లుతోంది. ఆ సమయంలో ఆ వాసుదేవుడు ఆర్తుల కష్టాలను పోగొట్టి భక్తజనులను పరిపాలించే పరమాత్మగా నాకు కన్పించాడు.

144 ఇంకా.

145 నా ప్రేమమూర్తీ, నా స్వామీ, అచ్యుతుడూ, పరాత్పరుడూ, సత్త్వగుణసంపన్నుడూ, రజోగుణ రహితుడూ, సుందర ద్వారకానగర నివాసీ, అన్యులను ఆశ్రయించనివాడూ, నీలమేఘ శ్యామల శరీరం కలవాడూ, అప్పుడే వికసిస్తున్న అందమైన అరవిందాలవంటి కన్నులు కలవాడూ, శ్రీనివాసుడూ అయిన శ్రీకృష్ణుడు పట్టుపీతాంబరం కట్టుకుని తన ఎడమ తొడపై కుడి పాదాన్ని ఉంచి కూర్చుని ఉన్నాడు. అక్షర తేజస్సుతో, చతుర్బాహువులతో ప్రకాశిస్తున్నాడు. అటువంటి ధీరుణ్ణి, సుందరాకారుణ్ణి, రాక్షససంహారుణ్ణి, లేత రావిమ్రాకును ఆనుకొని వీరాసనాసీనుడై విరాజిల్లుతున్న ఆనందమయుణ్ణి నను గన్న నా తండ్రిని కన్నులారా వీక్షించాను.

కంటిఁగంటి భవాబ్ధి దాటఁగఁ గంటి నాశ్రితరక్షకుం
గంటి యోగిజనంబుడెందముఁ గంటిఁ జుట్టముఁ గంటి ము
క్కంటికింగనరాని యొక్కటిఁ గంటిఁ దామరకంటిఁ జే
కొంటి ముక్తివిధానముం దలకొంటి సౌఖ్యము లందగన్.

146 ఆహా! దర్శించాను; సందర్శించాను; సంసారసాగరాన్ని తరించాను; ఆశ్రితులను రక్షించే ఆ సర్వరక్షకుని దర్శించాను; మహాయోగుల ఆత్మబంధువును సందర్శించాను; మూడు కన్నులున్న మహేశ్వరునికి కూడ అంతుపట్టని అద్వితీయుని కనుగొన్నాను;

పద్మాక్షుడు గోవిందుని చేరాను; ముక్తిమార్గాన్ని చేరుకున్నాను; పరమానందాన్ని అందుకున్నాను.

147. విదురా! అదే సమయంలో భగవద్భక్తులలో ఎన్నదగినవాడూ, మునులలో అగ్రగణ్యుడూ, వేదవ్యాసుని సహాధ్యాయుడూ, యోగులచే స్మరింపబడువాడూ, సద్గుణాలప్రోగూ, జనులందరికీ పూజనీయుడూ, విజ్ఞులకు విధేయుడూ అయిన మైత్రేయుడు తీర్థయాత్రలు చేస్తూ అక్కడికి వచ్చాడు.

148 అలా వచ్చిన మునిశ్రేష్ఠుడు మైత్రేయుడు విశ్వమంతా విస్తరిల్లిన శాశ్వతకీర్తితో, సౌభాగ్యశోభల వైభవంతో కూడినవాడు, సంపూర్ణ యౌవన స్ఫూర్తితో విరాజిల్లేవాడు, మహా యోగీంద్రుల హృదయపద్మాలలో సంచరించేవాడు, కౌస్తుభం మొదలైన తళతళలాడే ఆభరణాలు అలంకరించుకొనువాడు, సర్వవ్యాపకుడు, సర్వ సమర్థుడు, తేజోమయుడు, రాక్షసులను జయించు శీలము కలవాడు అయిన శ్రీకృష్ణుని దర్శించాడు.

149. ఓ పుణ్యాత్ముడా! విదురుడా! విను, అలా చూసి కన్నులు మూసుకున్నవాడైన మైత్రేయ మహర్షి తన హృదయకమలంలో పదిలపరచుకున్న ఆ భగవంతుణ్ణి సంతోషంతో సందర్శించుకుంటూ తలవంచుకొని నిలబడ్డాడు.

150 అలా తన దగ్గరకు వచ్చిన మైత్రేయుడు వింటూ ఉండగా, చిరునవ్వు వెన్నెలలు చిందించే అందమైన పద్మలాంటి ముఖం కలవాడూ, ఆనందామృతంతో వికసించిన హృదయం కలవాడూ, భక్తులను ఆదరించే దయతో కూడిన చూపులు కలవాడూ అయినట్టి శ్రీకృష్ణుడు నా ముఖం వైపు చూసి ఇలా భాషించాడు "ఉద్ధవా! నీవు పూర్వజన్మలో వసుబ్రహ్మలు చేస్తున్న సత్త్రయాగంలో వసువు గా ఉన్నావు. అప్పుడు నీ మనస్సులో మరే వస్తువునూ కోరకుండా నా పాదపద్మాలసేవనే కోరుకున్నావు. అందుకని నేను ఇక మీదట నీ హృదయంలో నివాసం చేస్తూ సర్వం వీక్షిస్తూ ఉంటాను. ఆత్మారాముడ నైన నన్ను ఇది "సత్తు", ఇది "అసత్తు" అని విమర్శించేవారు ఎవరూ తెలుసుకోలేరు. నేను వారికి కనిపించకుండా ఉంటాను. నా అనుగ్రహంవలన ఇదే నీకు చివరి జన్మ. మరొక జన్మ ఉండదు. అందుకనే నీ పూర్వజన్మ లోని పుణ్యవిశేషం కారణంగా నా పాదపద్మాలను ఈరోజు, ఈ ఆశ్రమంలో సందర్శించగలిగావు. అంతేకాక పద్మకల్పంలో నా నాభికమలంలో ఆసీనుడై వున్న బ్రహ్మదేవునికి తెలియజేసిన దివ్యజ్ఞానాన్ని నీకు ఉపదేశిస్తాను. ఆ దివ్యజ్ఞానం వల్ల జనన మరణాది సంసారబంధాన్ని నివర్తింపజేసి అఖండమూ, అనంతమూ అయిన ఆనందాన్ని ప్రవర్తింపజేసే నా మహత్త్వం నీకు తెలుస్తుంది." ఇలా మహాతేజస్సంపన్నుడైన కృష్ణుడు పలికిన అమృత సమానములు అయిన సరస సంభాషణలు నాకు శ్రవణ భూషణాలు అయ్యాయి. నా మనస్తాపాన్ని తొలిగించాయి. నా శరీరం సంతోషంతో గగుర్పొడిచింది. నా చెక్కిళ్లు

ఆనందభాష్పాలతో తడిసి పోయాయి. నా అంతరంగం సంతోష సముద్ర తరంగాలలో ఓలలాడింది. నేను దోసిలి నుదుటిపై చేర్చి ఇలా విన్నవించుకొన్నాను.

151 "ఓ పరమపురుషా! శ్రీకృష్ణా! నీ చరణకమలాల స్మరించటం అనే అమృతాభిషేకంతో పొంగి పరవశించిన నా మనస్సు ఇతర వస్తువులను ఎందుకు కాంక్షిస్తుంది.

152 ఓ పద్మాక్షా! కృష్ణమూర్తీ! పుట్టుకే లేని నీవు ఈ భూలోకంలో అవతరించటానికి కారణం ఏమిటో బోధపడటం లేదు; కాల స్వరూపుడవై లోకాలను లయం చేసుకునే నీవు శత్రుభయంతో సముద్రంలో చుట్టూ నీరు ఆవరించి ఉండేలా కోటలు కట్టుకోవటం ఏమిటో నా మనస్సుకు అర్థం కావటం లేదు.

153. అంతేకాకుండా.

154. ఓ లక్ష్మీరమణా! భక్తవత్సలా! శ్రీకృష్ణా! నీవు ఆత్మలలో విహరించే వాసుదేవుడవు. అయినప్పటికి స్త్రీల సమూహాల నడుమ లీలావిలాసాలతో విహరించడ మేమిటో ఊహించలేకుండా ఉన్నానయ్యా!.

155 ఓ ఇందిరాపతీ! నీవు కరుణామయుడవు. పెద్దలు చాలా మంది వేదాంతులు గూడ నిన్ను సంసారివి అనుకుంటున్నారు. నీవు నాపై చూపే దయ, రక్షించే విధానం గమనిస్తే నాకే మిక్కిలి ఆశ్చర్యంగా ఉంటుంది. ఇది ఎంతటి అరుదైన సంగతి.

156. ఓ దేవా! కమలాక్షా! దేవతలచే కీర్తింపబడేవాడా! మోక్షమును ఇచ్చే ముకుందా! శ్రీమహాలక్ష్మీవరుడా! నీవు అఖండమైన విజ్ఞానమే రూపుకట్టినవాడవు. అయినా కూడా అమాయకునిలా, అవివేకిలా, వ్యామోహానికి లొంగిన వానిలా ప్రవర్తిస్తావు. ఒక్కొక్కప్పుడు ఎక్కడో దాక్కొని ఉంటావు. ఈ సంగతులు గుర్తుకు వచ్చినప్పుడు నా స్వాంతం ఎంతో చింతాక్రాంత మవుతుంది. సరస్వతీదేవి భర్త అయిన చతుర్ముఖబ్రహ్మకు ప్రసాదించిన సుజ్ఞానాన్ని, దాన్ని పరిగ్రహించి భరించగల శక్తిసామర్థ్యాలు నాకు ఉన్నాయంటే, ఆ జ్ఞానాన్ని నాకు కూడా అనుగ్రహించు. దానిని గ్రహించి, మీ ఆజ్ఞ శిరసావహించి అపార సంసార సముద్రాన్ని తరిస్తాను" అని విన్నవించుకొని ఎన్నో విధాల సన్నుతించగా. భగవంతుడూ, భక్తజన కల్పవృక్షమూ అయిన శ్రీకృష్ణుడు నాకు పరతత్త్వ సంబంధమైన పరిపూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించాడు.

157. కమలదళాల వంటి కన్నులున్న కృష్ణుని కరుణాకటాక్షం వల్ల సంప్రాప్తమైన జ్ఞానంతో మనస్సు నింపుకొన్నవాడనై, పరతత్త్వాన్ని తెలుసు కొన్నాను. ఎంతో ఇష్టంగా ఆయన పాదపద్మాలకు ప్రణామం చేశాను.

158 కృష్ణుని పాదపద్మాలతో కలిగిన ఎడబాటు నాకు తడబాటు కలిగించింది. భరింపరాని ఆ దుఃఖ సముద్రాన్ని తరించటానికి మరో ఉపాయం లేదు. కల్పాంత పర్యంతం నేను ఇలాగే తిరుగుతూ ఉండవలసిందే.

159 ఇలా తిరుగుతూ.

160 నేను ఇలా తిరిగితిరిగి, ఆ పుణ్యభూమి పరమ తపోధనులైన నరనారాయణులు తపస్సు చేసిన పవిత్రాశ్రమంగా ప్రఖ్యాతిగన్నది. ఆ బదరీవనం అందమైన మందారాలు, తీయ మామిడిచెట్లు, పొగడలు, అశోకాలు, చింతలు, సురపొన్నలు, పొన్నలు, నిమ్మలు, కదంబాలు, వేములు, కొండమల్లెలు, రావిచెట్లు, మల్లెలు, గన్నేరులు మొదలైన సుందరమైన వృక్షాలతో, పొదలతో నిండి మనోహరంగా ఉంటుంది. ఆ బదరికాశ్రమాన్ని దర్శించాలనే కుతూహలంతో బయలుదేరి...

161 నేను ఆ బదరికాశ్రమానికి వెళుతున్నాను" అని ఉద్ధవుడు చెప్పగానే ఆ పలుకులు విని అదిరిపడి కలతచెంది విదురుడు అపారమైన దుఃఖసాగరంలో మునిగిపోయాడు. మళ్ళీ తన యోగసాధనాబలంవల్ల సంప్రాప్తమైన సత్త్వబలంతో గుండె నిబ్బరించుకొని మామూలు స్థితికి వచ్చాడు.

162 విదురుడు దుఃఖాగ్నిని తన వివేకం అనే జలాలతో ఆర్పి ఉద్ధవుడితో ఇలా అన్నాడు.

163 "పరమ పావనుడవైన ఉద్ధవా! రాక్షసాంతకుడు అయిన కృష్ణుడు అత్యాదరంతో నీకు అనుగ్రహించిన ఆ అధ్యాత్మ తత్త్వ రహస్యాన్ని, అతి పవిత్రమైన అభిజ్ఞాన సారాన్ని అపార కృపాతిశయంతో ఇపుడే నాకు ఉపదేశించు. నా జన్మ సార్థకమౌతుంది. పుణ్యాత్ములైన గురువులు తమ శిష్యులను ధన్యాత్ములను చేస్తారు కదా.

164 వృష్ణివంశపావనా! ఉద్ధవా! ఈ భూమండలంలో పుణ్యమూర్తులైన భగవద్భక్తులు ధర్మానురక్తులై, పరోపకార పరాయణులై ప్రవర్తిస్తారు. అటువంటి వారిని ప్రజలు ప్రస్తుతిస్తారు కదా."

మైత్రేయునిఁ గనుగొనుట

165 ఆ మాటలు విని ఉద్ధవుడు విదరునితో ఇలా అన్నాడు. "వినవయ్యా! విదురా! సంయమివరేణ్యుడూ, సాక్షాత్తూ విష్ణువుతో సమానుడూ అయిన మైత్రేయుడు తన మనుష్యదేహాన్ని వదిలిపెట్టడానికి మనస్సులో నిశ్చయించుకున్నాడు.

166 ఆ మహానుభావుడు మైత్రేయుడు ఆ మురహరుని, ఆ పరాత్పరుని, ఆ కరుణాకరుని స్మరిస్తూ ఉన్నాడు. ఇప్పుడు నీవు ఆయన సన్నిధికి వెళ్తే తప్పకుండా ఆ మహాముని నీకు అత్యంత ప్రీతితో ఆధ్యాత్మిక తత్త్వజ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు."

167 ఈ విధంగా చెప్పి ఉద్ధవుడు విదురుడు ఇద్దరూ కలిసి వెళ్ళసాగారు.

168 అలా వెళుతున్న విదుర ఉద్ధవులకు ఎదురుగుండా యమునానది కన్పించింది. ఆ నదిలో కలువపూలు, తామరపూలూ వికసించి ఉన్నాయి. ఆ పూలలో చిందే మకరంద బిందువులను కమ్మగా కడుపునిండా త్రాగిన తుమ్మెదలు మైమరచి విహరిస్తున్నాయి. నదిలో తరంగాలు కదలాడుతున్నాయి. ఆ నది ఒడ్డున మామిడిచెట్లూ, లవంగ లతలూ, మాదీఫల వృక్షాలూ చిక్కగా క్రిక్కిరిసి ఉన్నాయి. ఆ పొదరిండ్లలో సురసుందరులు చరిస్తున్నారు. సంసార బంధాలను పోకార్చి పుణ్యాన్ని చేకూర్చే సుగుణాల దొంతి అయిన ఆ యమునా స్రవంతి కన్నుల విందుగా కానవచ్చింది.

169 అలా దర్శనమిచ్చిన యమునా నదిని విదురుడు ఉద్ధవుడు సమీపించారు. విదురుడు ఆ నదిలోని అందమైన తెల్లని ఇసుక తిన్నెల మీద ఆనందంగా ఆసీనుడైనాడు. పద్మోదరుడైన ఆ శ్రీకృష్ణుని పాదపద్మాల స్మరణ యందు లగ్నమైన మనస్సు కలవాడై ఆ దినమంతా గడిపాడు.

170 మర్నాడు ఉదయాన్నే విదురునితో కలిసి మధుసూదనుని పదచింతన సంతోష తరంగాలలో ఓలలాడే అంతరంగం గల పుణ్యమూర్తి ఉద్ధవుడు పాపాలను రూపుమాపే యమునాతరంగిణిని దాటాడు.

171 ఉద్ధవుడు యమునానది దాటి బదరికాశ్రమానికి వెళ్ళాడు" అని చెప్పగా విని రాజశ్రేష్ఠుడైన పరీక్షితుడు యోగిశ్రేష్ఠుడైన శ్రీశుకునితో ఇలా అన్నాడు.

172 శ్రీకృష్ణుడు అవతారం చాలించగా, అతిరథ మహారథ సమరథులు అయిన యాదవ వీరు లందరూ తమలో తాము పోరాడుకొని ప్రాణాలు గోల్పోగా, అందరూ చనిపోగా, ఉద్ధవుడు మాత్రం ఎలా బ్రతుక గలిగాడు ఈ విషయం నాకు వివరించండి."

173 ఇలా అడిగిన పరీక్షిత్తుతో శుకుడు ఇలా అన్నాడు. పూర్వం బ్రహ్మదేవుడు ప్రార్థించగా పుండరీకాక్షుడు భూలోకంలో యదువంశంలో అవతరించాడు. తనంత తానే మనస్సులో చేసుకున్న సంకల్పానుసారం తన కులాన్నంతా అంతం చేసాడు. ఐదు ఉపనిషత్తులతో కూడిన పరబ్రహ్మ స్వరూపమైన దివ్యదేహాన్ని పొందదలచి, తన తర్వాత విజ్ఞాన తత్త్వాన్ని అందుకొని లోకంలో జిజ్ఞాసువులైన ప్రజలకు తెలియజేయగల ప్రజ్ఞాశాలి, జితేంద్రియుడు, తనంతటి వాడు ఒక్క ఉద్ధవుడు తప్ప ఇంకొకడు లేడని భావించాడు.

174 పరీక్షిన్మహారాజా! అందుకే భూలోకంలో అతణ్ణి స్థిరంగా నిలబెట్టాడు. ఈ కారణాల వల్ల అతనికి మృతి లేకుండా పోయింది. శ్రీకృష్ణుని మీద ఆదరాభిమానాలు గల ఆ పరమ పుణ్యుడు ఉద్ధవుడు బదరికాశ్రమానికి వెళ్ళాడు.

175 అప్పుడు.

176 ఇలా ఉద్ధవుడు వెళ్ళిపోయిన తర్వాత, విదురుడు దేదీప్యమానమైన జ్ఞానం కలవాడూ, సజ్జనులకు మిత్రుడైనవాడూ, మహనీయులకు సైతం సేవనీయుడూ, తాపసేంద్రుడూ అయిన మైత్రేయ మహామునీంద్రుణ్ణి సందర్శించటానికి ప్రయాణం అయ్యాడు.

177 యమునానదిని దాటిన అనంతరం కొన్ని రోజులు ప్రయాణం సాగించి పుణ్యనదులనూ, విష్ణు క్షేత్రాలను దర్శించుకుంటూ బిరబిరా ముందుకు వెళ్ళసాగాడు.

చనిచని ముందటఁ గనుగొనె
ఘనపాపతమఃపతంగఁ గరుణాపాంగం
గనదుత్తుంగతరంగన్
జనవరనుతబహుళపుణ్యసంగన్ గంగన్.

178 అలా వెళ్ళి వెళ్ళి విదురుడు ఉత్తుంగ తరంగాలతో పొంగి ప్రవహించే గంగానదిని కన్నుల విందుగా కనుగొన్నాడు. ఆ గంగానది పాపాలనే చీకట్లను సూర్యునివలె పారదోలునది. కరుణారసం ప్రసరించే కడగంటి చూపులు కలది. పెద్దలైనవారు ప్రశంసించే అగణ్య పుణ్యాలకు ఆలవాలమైనది.

179 ఆ గంగానదిలో పద్మాల సువాసనలతో నిండిన గాలులు వీస్తున్నాయి. ఆ పద్మ సుగంధాలు వహించిన వాయువుల వల్ల కదలి నదీ తరంగాలు నాట్యం చేస్తున్నాయి. అలా ఎగిరిపడుతున్న కెరటాలు నీటి తుంపరలను విరజిమ్ముతున్నాయి. అటువంటి పరమ పవిత్ర గంగా ప్రవాహంలో విదురుడు స్నానం చేసాడు.

180 స్నానానంతరం విదురుడు ఎదురుగుండా యోగిజన స్తవనీయుడూ, సాధుజన భాగధేయుడూ, శ్రితజన విధేయుడూ అయిన మైత్రేయుణ్ణి చూచాడు. ఆ మహనీయుడు కప్పురము కుప్పపోసినట్లున్న, ఒనానొక ఇసుక తిప్పమీద పద్మాసనాసీనుడై ఉన్నాడు. ఆయన యమ నియమాదులతో కూడిన అష్టాంగ యోగాన్ని నిష్ఠాగరిష్ఠుడై ఆచరిస్తున్నవాడు. శ్రీకృష్ణుని చరణ సరోజాలపై చిత్తం లగ్నం చేసి ఉన్నవాడు. ఇంద్రియాలను వశం చేసుకొనిన వాడు. సమస్త విద్వాంసులకు సంస్తవనీయమైన సదాచారాలతో, వ్రతాలతో, ఉపవాసాలతో, ఆ మహాముని శరీరం సన్నబడిన దేహం కలవాడు. ఆయనలో వార్ధక్యలక్షణాలు ఏమీ కన్పించటం లేదు. ఆటువంటి పుణ్యజీవనుడూ, భువనపావనుడూ అయిన మైత్రేయుడు విదురుని ముందు సాక్షాత్కరించాడు.

విదుర మైత్రేయ సంవాదంబు

181 విదురుడు మైత్రేయుని పాదాలకు నమస్కారం చేసి, చేతులు జోడించి ఇలా అన్నాడు. "మునీంద్రా! లోకు లంతా తమతమ

మనస్సులలో ఎల్లప్పుడూ సుఖాన్నే కోరుకుంటారు. దానిని పొందడానికై ఎన్నో కర్మలు చేస్తారు. దైవం అనుకూలించక పోవడంతో తమ ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయి వాటి ఫలాన్ని అందుకోలేక పోతున్నారు. ఈ కర్మలన్నీ ప్రతిబంధకాలు, అంతేగాక దుఃఖాలకు కారణమైన సంసారం అనే చక్రంలో తగులుకొని గిరగిర తిరుగుతూ ఉంటారు. కోరికల వ్యామోహంలో చిక్కి పూర్వం తాము చేసిన కర్మఫలాలకు తగినట్టి శరీరాలను పొందుతూ ఉంటారు. ఇలా చస్తూ, పుడుతూ ఎంతో కాలానికి గాని పాపాన్ని పోగొట్టుకునే మార్గం తెలుసుకోలేరు. తల్లి యౌవనానికి గొడ్డలిపెట్టు లాంటివారై పుట్టిన ఇట్టి పశుప్రాయులైన బుద్ధిహీనులను ఉద్ధరించడానికి గదా తమ వంటి పుణ్యాత్ములు శ్రీమన్నారాయణ సేవాపరాయణులై లోకంలో తిరిగుతూ ఉంటారు.

182 ఓ కరుణామయా! భగవత్కార్య నిర్వాహకులై సదా భగవంతుని యందే ఆసక్తులైన దైవభక్తుల అనుగ్రహం అనే నావ లేకుండా ఈ సంసార సముద్రాన్ని దాటటానికి ప్రయత్నించడం పరమ మూర్ఖత్వం. భయంకరమైన ఈ సంసార సాగరానికి అవివేకమే జలం. స్వార్థ పరతత్వమే గట్టు (చెలియలి కట్ట). మిత్రులూ, బంధువులూ, భార్యాపుత్రులే జలచరాలు. ఇది దురంతమైనది.

183 సౌజన్యసాంద్రుడవైన ఓ మునిచంద్రా! నన్ను మన్నించి రక్షించే ఉద్దేశం నీకు ఉన్నట్లయితే, నా విన్నపం ఆలకించు. నా మనస్సులోని కోరిక తీర్చు."

184 అని మళ్లీ విదురుడు మైత్రేయుణ్ణి చూచి అన్నాడు "ఋషీశ్వరా! సత్త్వము, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలతో కూడిన మాకు నియామకుడైన భగవంతుడు సర్వస్వతంత్రుడు. అటువంటివాడు ఎందుకు అవతారా లెత్తాడు? ఏ యే సత్కార్యాలు సాధించాడు? మళ్లీ ఈ విశ్వాన్ని తన హృదయాకాశంలో ఎలా విలీనం చేసుకున్నాడు? ఏ వ్యాపారాలూ లేనివాడు ఏ విధంగా యోగమాయలో ఉన్నాడు? తను సృష్టించిన బ్రహ్మాండంలో ఎట్లా సంచరించాడు? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది రూపాలు పొంది, ఎట్లా అనేక విధాలుగా విహరించాడు? బ్రహ్మణులనూ, గోవులనూ, దేవతలనూ రక్షించడానికై మత్స్యావతారం మొదలైన అవతారా లెత్తి ఏ యో ప్రయోజనాలు నెరవేర్చాడు? బ్రహ్మాండభాండం లోపల ఉన్న దిక్పాలకులతో కూడిన లోకాలనూ, లోకాలోక పర్వతం బయటి భాగాలను ఏయే తత్త్వ భేదాలతో ఏ విధంగా పుట్టించాడు? ఆ సృష్టిలో నివసించే జీవకోటి ఎవ్వని సేవించి జీవిస్తూ ఉంటుంది? జీవులకు కర్మ, నామ, రూప భేదాలు ఎట్లా నిర్ణయింపబడినాయి? ఇదంతా నాకు చక్కగా వివరంగా చెప్పు. పుణ్యమూర్తులకు శిరోభూషణమై యోగేశ్వరులకు అధీశ్వరుడైన శ్రీమన్నారాయణుని పవిత్ర చరిత్ర వింటేనే కాని జననమరణాది సకల దుఃఖాలకూ, సమస్త దుష్కార్యాలకూ అనుబంధాలైన ఈ సంసార బంధాలు తెగవు" అని మళ్లీ ఇట్లా అన్నాడు.

185 "ఓ మునీంద్రా! శ్రీమన్నారాయణుని సత్కథలనే అమృతాన్ని చెవులనే దోసిళ్ళతో ఎంతగా జుఱ్ఱుకొన్నా తనివి తీరదు. భరతవంశీయుల చరిత్ర ఐన భారతంలో కూడా సందర్భానుసారంగా వ్యాసులవారు ఎక్కడైతే శ్రీమహావిష్ణువును నుతించారో అక్కడ నామనస్సు ఎంతో ఉబ్బి తబ్బిబ్బైపోతుంది.

186 ఓ పుణ్యాత్ముడా! ఇతర కథలు విని విని నా మనస్సుకు చాల వెగటు కలిగింది, ఓ మునినాథా! రమానాథుడైన శ్రీమన్నారాయుణుని కథాసుధాపూరాన్ని తనివితీరా సేవించడం వల్లనే సంసార బాధలు దూరంగా తొలగిపోతాయి.

187 ఓ పుణ్య పురుషా! విశేషమైన విజ్ఞానానికి నిధి వంటి వారు నారదాది మహానీయులు. అటువంటి నిర్మల హృదయులకు కూడా వర్ణింప శక్యము కానివి విష్ణుకథలు. అటువంటి హరికథాసుధారసాన్ని త్రాగి విసుగుచెంది ఇక వద్దు అనేవాడే పనికిమాలిన మొద్దు.

188 అంతేకాకుండా.

189 అంతేకాకుండా శ్రీమన్నారాయణుని అవతారమైన వ్యాసుడు నాలుగు వర్ణాల, నాలుగు ఆశ్రమాల ఆచార ధర్మాలను, లోకానికి చాటి చెప్పదలచినవాడై పురాణాలలో పామర కథలు ఎన్నెన్నో కల్పించవలసి వచ్చింది. అందువల్ల ఆ గ్రంథాలలో హరికథలను అక్కడక్కడా కొంచెం కొంచెంగా మాత్రమే అభివర్ణించాడు. భగవద్విజ్ఞానాన్ని ఆత్మగతం చేసుకోలేనందుకు ఎంతో చింతించాడు. చివరకు నారదమహర్షి ఉపదేశంతో నారాయణ కథాసుధాపూరాన్ని తనివితీరా త్రాగి ధన్యుడై, సుధీజనులచే స్తుతింపబడిన వాడై, సకలలోక సమ్మాన్యుడైనాడు.

190 కనుక

191 కాబట్టి ఓ పుణ్యాత్ముడా! విశ్వకల్యాణకరమైన విష్ణుదేవుని చరితామృతాన్ని స్వేచ్ఛగా సేవించే మానవునికి మరో కథలు విషంతో సమానం. శ్రీమన్నారాయణ ధ్యానం సకల జీవులకూ సమస్త సౌఖ్యనిధానం.

192 ఓ మునీంద్రుడా! శ్రీమన్నారాయణుని నామస్మరణానికీ, కథాశ్రవణానికి విముఖులైన వారు ఈ లోకానికీ, పరలోకానికీ–రెంటికి కాకుండా చెడతారు. నరకంలో పడతారు. అట్లాంటి వాళ్ళను చూచి నేను ఎంతగానో బాధపడతాను.

193 ఓ మునిశ్రేష్ఠా! పనికిమాలిన వాదాలలో పడి కనీసం ఒక్క నిముషమైన హరిపాదపద్మాలను స్మరించి ఆనందించకుండా ఉండేవాడు ఎవడైనా సరే వాడి ఆయుస్సు అల్పమైపోతుంది.

194 ఆపన్నులకు ఆప్తబాంధవుడూ, విశ్వానికి సంబంధించిన సృష్టికి స్థితి లయాలకు కారణభూతుడూ, అవతారపురుషుడూ, అయిన శ్రీమన్నారాయణుని కల్యాణగుణ

సంకీర్తనం అనే అమృతాన్ని, మృదుమధురంగా పువ్వులలోని తేనెను గ్రోలే తుమ్మెదవలె నేను తనివి తీరా త్రాగుతాను. దయచేసి చెప్పుస్వామి."

195 ఈ విధంగా విదురుడు మునిశ్రేష్ఠుడైన మైత్రేయుణ్ణి అడిగాడు" అని శుకుడు పరీక్షిత్తునకు చెప్పి మళ్ళీ ఇలా అన్నాడు.

196 "ఇలా విదురుడు మైత్రేయుణ్ణి అడిగాడు. అప్పుడు ఆ మహర్షి విదురుణ్ణి చూచి మిక్కిలి మృదుమధుర వాక్యాలతో ఇలా అన్నాడు. "ఓ పుణ్యాత్ముడా వీనులవిందుగా విష్ణుకథలు వినాలన్న ఆసక్తితో నన్ను అడిగావు. మంచిది. నీవు భగవంతుని యందు భక్తి గలవాడవు. కాబట్టి హరి కథలపై నీకు ఆసక్తి ఉండడంలో ఆశ్చర్యం లేదు. అంతేకాక నీవు సాక్షాత్తూ సమవర్తియై ప్రజలను శాసించే యముడవు. మాండవ్యమహాముని శాపంవల్ల వ్యాసభగవానునకు శూద్ర స్త్రీ కడుపున జన్మించావు. శ్రీమన్నారాయణుని ప్రేమకు పాత్రుడైనవాడివి. అందుకనే కృష్ణుడు తన అవసాన సమయంలో సమీపానికి వెళ్ళిన నన్ను చేరపిలిచి విజ్ఞానాన్నంతా బోధించాడు. దానిని నీకు చెప్పవలసిందిగా నన్ను ఆదేశించాడు. ఆయన ఆనతి ప్రకారం అదంతా నీకు తప్పకుండా చెబుతాను. ఏకాగ్రమైన మనస్సుతో ఆకర్ణించు.

జగదుత్పత్తి లక్షణంబు

197 ఓ పుణ్యాత్ముడా! విష్ణుదేవుని యోగమాయాప్రభావం వల్ల ప్రాదుర్భవించిన ఈ ప్రపంచం పుట్టుకనూ, అభివృద్ధినీ, వినాశాన్నీ తెల్పుతూ మహావిష్ణువు మహిమలను అభివర్ణిస్తాను. ఆలకించు.

198 ఈ విశ్వంలోగల సమస్త జీవుల దేహాలూ భగవంతుని స్వరూపాలు. సమస్తమైన ఆత్మలూ ఆయనే. ఆయనే సర్వానికీ ప్రభువు. పరాత్పరుడు. అనేక విధాలయిన బుద్ధులకు ఉపలక్షణమైన మహానుభావుడు. అటువంటి భగవంతుడు తన మాయవల్ల తన లోనే లీనమైన ప్రపంచాన్ని. తన గర్భంలో ధరించి ఒక్కడుగా అద్వైతుడై వెలుగుతూ ఉంటాడు. ఆ పరమాత్మ పుట్టుక లేనివాడు. సమస్తమూ పై నుండి చూచేవాడు అయినప్పటికీ, వేరే మరే వస్తువూ లేకుండా తానే సర్వమూ అయినప్పుడు ఇక ద్రష్ట కాడు. కాని– మాయాప్రధాన శక్తి కలవాడై ప్రపంచాన్ని నిర్మించే కోరికతో గొప్ప చిచ్ఛక్తి గల్గి తనను తాను లేనివాడుగా మనస్సులో భావించు కొంటాడు. సృష్టికి ఉపక్రమించిన పిమ్మట ద్రష్ట అవుతాడు.

199 ఇలా భగవంతునికి సృష్టి చేయాలనే సంకల్పం కలగగానే కార్యకారణాల రూపమై ఘనత వహించినదై మహత్తరమైన మాయశక్తిగా ప్రకాశించే అవిద్య రూపొందుతుంది. అందు....

200 తన అంశనుండి ఆవిర్భవించిన మాయను తన శక్తిగా ప్రతిష్ఠించి, పుట్టుక లేనివాడూ పురుషోత్తముడూ ఐన ఈశ్వరుడు తన కడుపులో ఉన్న విశ్వాన్ని ఉద్భవింపజేశాడు.

మహదాదుల సంభవంబు 201 కాలచోదితమూ, అవ్యక్తమూ, ప్రకృతి అనే పేర్లతో వ్యవహృతమైన తన మాయవల్ల మహత్తత్త్వాన్ని పుట్టించాడు. మాయకు సంబంధించినదీ, కాలము మొదలైన గుణాలు కలదీ అయిన ఈ మహత్తత్త్వం భగవంతుని కంటికి మాత్రమే కనిపిస్తూ ప్రపంచాన్ని నిర్మించాలనే కోరిక కల్గడంతో ఇంకొక రూపాన్ని పొందింది. రూపాంతరం పొందిన అటువంటి మహత్తత్త్వంలో నుంచి క్రమంగా కారణం, కార్యం, కర్త అనే భేదాలు ఏర్పడి అవి వరుసగా పంచభూతాలు–ఇంద్రియాలు–మనస్సు అను రూపములుగా గోచరించాయి. ఈముడింటితో సత్త్వరజస్తమోగుణాలతో కూడిన అహంకారం ఏర్పడింది.

202 మార్పు చెందుతున్న సాత్త్వికాహంకారం వల్ల మనస్సూ, వికారము చెందు కార్యరూపులైన ఇంద్రియాల అధిదేవతలైన దేవతా గణాలూ ఉదయించాయి. రాజసాహంకారం వల్ల జ్ఞానేంద్రియాలైన చర్మం, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు, కర్మేంద్రియాలైన వాక్కు, హస్తాలు, పాదాలు, పాయువు, ఉపస్థ, జన్మించాయి. తామసాహంకారం వల్ల శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే పంచ తన్మాత్రలు ఆవిర్భవించాయి. వీనిలో శబ్దం వల్ల ఆకాశం పుట్టింది. ఆకాశం కాలమాయాంశ యోగంతో పుదరీకాక్షుని నిరీక్షణంతో స్పర్శతన్మాత్రవల్ల వాయువును పుట్టింది. వాయువు ఆకాశంతో కలసి కాలమాయాంశ యోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో రూపతన్మాత్రవల్ల లోకలోచనమైన తేజస్సును పుట్టించింది. తేజస్సు వాయువుతో కలసి కాలమాయాంశ యోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో రసతన్మాత్రవల్ల జలాన్ని కలిగించింది. జలం తేజస్సుతో కలిసి కాల మాయంశయోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో గంధతన్మాత్రవల్ల పృథ్విని పుట్టించింది. ఈ విధంగా ఏర్పడ్డ పంచభూతాలలో ఆకాశానికి గుణం శబ్దం, వాయువునకు శబ్ద స్పర్శాలు గుణాలు, తేజస్సుకు శబ్దస్పర్శ రూపాలు గుణాలు, జలానికి శబ్దస్పర్శరూపరసాలు గుణాలు, పృథ్వికి శబ్ద స్పర్శరూపరస గంధాలు గుణాలై ఉంటాయి. కాల మయాంశ లింగ స్వరూపులై మహదాదులందు అభిమానం గల దేవతలు విష్ణుదేవి కళలే. ఐనా మహదాది తత్త్వాలూ, పంచభూతాలూ, పంచేంద్రియాలూ, పంచతన్మాత్రలూ వేరువేరుగా ఉండి అన్నీ సమైక్యం కాకపోవడంతో ప్రపంచాన్ని సృష్టించడానికి సామర్థ్యం వానికి చాలలేదు. అందువల్ల అందరూ చేతులు జోడించి యోగేశ్వరులకు ఈశ్వరుడైన శ్రీమన్నారాయణుని ఇట్లా దండక రూపంలో స్తోత్రం చేశారు–

 ఓ లక్ష్మీవల్లభా! అనాథనాథా! అఖిలజగన్నాథా! నీవు శిరస్సు వంచిన వారిని చేర దీసే కరుణా సాంద్రుడవు పగవారనే పర్వతాలను బద్దలు కొట్టే దేవేంద్రుడవు, కమలదళాల వంటి కన్నులు గలవాడవు. దేవతలకు దేవుడవైనవాడవు నీ దాసుల తాపాన్ని పోగొట్టే చల్లని వెల్లగొడుగులు నీ అడుగులు. అఖిల సౌభాగ్యాలకూ అలవాలాలైన నీ అంఘ్రికమలాలను ఆశ్రయించిన మహాయోగులు దుర్వార సంసార బాధలన్నింటినీ దూరంగా పారదోలి సుఖంగా ఉంటారు. సకల పాతక సమూహాలనూ సంహరించే ఓ తండ్రీ! నీవు జగదీశ్వరుడవు ఈ ప్రపంచంలోని ప్రాణులందరూ భయంకరమైన భవబంధాలలో చిక్కుకొని ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధి దైవికం అనే తాపత్రయ రూపమైన దావానలంలో కాలుతూ దుఃఖసముద్రంలో మునిగి తేలుతున్నారు. ఒక సత్కర్మం గానీ, ధర్మం గాని లేకుండా సంసార చక్రంలో పడి క్రిందు మీదులూగా తిరుగుతున్నారు. అటువంటి పరమ మూర్ఖుల మాట చెప్పేదేముంది. ఓ దేవాదిదేవా! విజ్ఞానదీపాన్ని వెలిగించి అజ్ఞాన తమస్సును తొలగించే మీ పాద పద్మాలను ఆశ్రయిస్తాము. కమలలోచనా! ఘనులైన మునులు మనస్సును ఏకాగ్రం చేసుకొని గూటిలోనుండి పక్షులవలె నీ నోటిలో నుండి వెలువడిన వేదవాక్కుల ద్వారా వెదకి వెదకి నీ పదారవిందాలను అందుకుంటారు. నీ చరణ కమల ద్వయం దుర్దాంతమూ, దురంతమూ అయిన దురిత సంచయాన్ని తుడిచివేసే గగన గంగా తరంగిణికి ఆశ్రయం. ఓ ప్రభూ! నీవే అందరికీ పైవాడవు. నీపైని ఎవ్వరు లేరు. వైరాగ్యబలంచేత ప్రాప్తించిన నిశ్చలమైన జ్ఞానోదయంతో మేల్కాంచిన ధీరశ్రేష్ఠులు నిత్యములూ, నిర్మలములూ అత్యంత పవిత్రములూ అయిన తమ హృదయంలో ఏ పరంజ్యోతి పాదపీఠాన్ని నెలకొల్పి మోక్షాన్ని పొందారో, ఆ మోక్ష స్వరూపుడవైన నిన్ను సన్నుతిస్తున్నాము. ఇంద్రాది బృందారక బృందాల అభివందనాలు అందుకొనే ఓ ముకుందా! ఈ సృష్టి నంతటినీ పుట్టించి, రక్షించి నశింప జేయడానికై అనేకాలైన దివ్యావతారాలు ధరించావు. నీ పదకమలాలను హృదంతరాలలో నిరంతరం స్మరించే భక్త సమూహానికి ముక్తిని ప్రసాదించే ప్రభూ! మేము నీ చరణ సరోజాలను సంసేవిస్తాము. ఈశా! ఓ రమాధీశా! పిల్లలూ, ఇల్లాలు, మిత్రులూ, అనే సంబంధ బంధాల్లో బంధితులై ఎల్లప్పుడూ దుష్టకార్యాలు చేయుట యందే ఇష్టం కలిగి నా యిల్లూ, నా ఒళ్లూ అనే మమకారంతో ప్రవర్తించే మూఢమానవుల అంతరంగాలలో కూడా సర్వాంతర్యామివైన స్వామీ! నీవు నిండి ఉంటావు. కాని నీ పాదాలు వారికి దూరంగానే ఉంటాయి. అటువంటి నీ చరణ సరోజాలను పూజిస్తాము. ఓ దేవా! ఇంద్రియోన్మాదానికి లోబడి చెడుపనులనే చేస్తూ మిడిసిపడే పరమ శుంఠల, అధ్యాత్మ తేజోవిరాజితులై అఖిల సంపదలకు ఆలవాలమైన నీ పాద మూలమందే మనస్సు నిల్పిన మహానుభావులను

దర్శించాలని వాంఛింపరు. ఈ మహాపురుషులు కూడా ఆ కాపురుషుల ముఖం చూడటానికి సుముఖులు కారు. లక్ష్మీమనోవల్లభా! ఉపనిషత్కాంతలకు అంతఃపురమైన నీ కథాసారమనే సుధాపూరాన్ని గ్రోలుతూ సంతోషాతిశయంతో సోలుతూ, జ్ఞానవంతులై సంసార తాపాన్ని పారదోలుతూ, ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతూ, సత్త్వసంపన్నులై నిత్యప్రసన్నులైనవారు పరమోత్కంఠతో నీ వైకుంఠ ధామాన్ని చేరుతారు. మేము కూడా అటువంటి దివ్యస్థానాన్ని కోరుతున్నాము. ఓ దేవదేవా! వైరాగ్యం చేతనూ, విజ్ఞానం చేతనూ ప్రబుద్ధమైన ఆత్మయోగంలో సిద్ధిపొంది, లోపలా బయటా వ్యాపించి చలిస్తూ ఉండే మనోవృత్తిని నిరోధించి, పరిశుద్ధమైన అంతరంగంతో ఒప్పే యోగీశ్వరులు, తమ హృదయపద్మాల్లో వర్తిస్తూ చిన్మయాకారంతో ప్రపర్తిస్తూ ఉన్న నీ అనంతతేజో విరాజితమైన దివ్యమూర్తిని తమ మనస్సులో నిలుపుకొని ఎల్లప్పుడు ఆనందిస్తూ ఉంటారు. నీ అనుగ్రహంవల్ల ప్రాప్తించిన పరమ జ్ఞానం పొందినందువల్ల వారికి ఆయాస మనేది ఉండదు. ఓ సకల దేవతా చక్రవర్తీ! ఓ సచ్చిదానందమూర్తీ! నీ కీర్తి విశ్వమంతా కీర్తిస్తున్నది. నీ మూర్తి సమస్త జీవరాసులో వర్తిస్తున్నది. లోకాలను సృష్టించాలనే సంకల్పంతో సత్త్వరస్తమో గుణాలను ప్రస్ఫురింపజేసి, నీ దాసులైన మమ్ములను పుట్టించావు. పుట్టిస్తే పుట్టామే తప్ప గొప్పదైన నీసృష్టిని అనుసరించి లోకాలను సృష్టించటానికి మే మెంత వాళ్లం స్వామీ! నీ ప్రసాదంవల్ల కల్గిన శక్తియుక్తులతో నిన్ను పూజిస్తాము. అంతే. నీ అంశవల్ల పుట్టిన మమ్మల్ని ప్రత్యేకంగా గణించడం ఎందుకు? త్రిగుణాలకు అతీతుడవైన ఓ పరమాత్మా! అధ్యాత్మతత్త్వాని వన్ననూ, పరంజ్యోతి వన్ననూ, ప్రపంచాని వన్ననూ, అధిష్ఠాత వన్ననూ, సదాసాక్షి వన్ననూ, అన్నీ నీవే కదా తామర రేకులవటి కన్నులు కలదేవా! సత్త్వరజస్తమో గుణాలకు మూలమైన మాయాగుణంలో మహత్తత్త్వమైన నీ తేజస్సును ప్రవేశపెట్టిన నీవు నీ సృష్టికంతటికీ కారణమైనావు. నీ అంశలమైన మేము కాలానుసారంగా నీ కే విధంగా సంతోషాన్ని సమకూర్చుతాము? మా ఆహారం ఏమి? మేము ఏ విధంగా ప్రవర్తించాలి? మా స్థితి ఏమి? ఈ ప్రాణి లోకమే మాకు ఆధారం కాగా అనుభవాల్ని పొందుతూ నీ కార్యం నెరవేర్చాలని కుతూహలపడుతున్న మాకు మార్గాన్ని చూపించు. కరుణతో నీ శక్తిని ప్రసాదించి జగత్తును సృష్టించే శక్తిని కల్గించి రక్షించు. లక్ష్మీహృదయమనే నీటి పడియలో విహరించే మహా వరాహస్వామీ! మహాయోగుల మానస సరోవరాలలో సంచరించే మరాళరాజా! దేవాదిదేవా! నీకు నమస్కారం! నీకు నమస్కారం!!, నమస్కారం!!!"

విరాడ్విగ్రహ ప్రకారంబు 204 ఇలా స్తోత్రం చేయగా విని శ్రీహరి సంతోషించాడు. మహత్తు మొదలగు తత్త్వాలకు పరస్పరం పొత్తు కుదరక పోవడం వల్ల

సమస్తజగత్తును సృష్టించే శక్తి లభ్యం కాకపోవటాన్ని తెలుసుకున్నాడు. అప్పుడు కాలవేగంతో ఉద్రేకం పొందిన ప్రకృతితోకూడి నిజశక్తిని నిక్షేపించి ఉరుక్రముడై ఇరవైయేడు తత్త్వాలలో ఏకకాలంలో తాను ప్రవేశించి ఘన పరిణామరూపుడై విడివిడీగా ఉన్న వానికి ఏకత్వం కలిగించాడు. పంచభూతాలు–పంచతన్మాత్రలు–పది ఇంద్రియాలు–కాలం, ప్రకృతి, మహత్తు, మనస్సు, బుద్ధి, చిత్తం అహంకారం అనే అంతఃకరణ చతుష్టయం. ఇవి ఇరువదియేడు తత్త్వాలు.

205 అలా ప్రపంచాన్ని నిర్మించడంలో వాటికి నేర్పు కలగజేస్తూ శ్రీహరి క్రమానుసారంగా అన్నింటికీ పరస్పరమైత్రి కల్పించాడు. ఇలా శ్రీహరి అనుగ్రహంచేత ప్రేరేపింపడి సృష్టిక్రియకు సమర్థమైన తత్త్వసమూహం, తమ తమ అంశలతో విరాడ్విగ్రహంగా రూపొందింది. విష్ణుదేవుని కళాంశలతో ఒకటి మరొక్కదానితో ఏకీభావం పొంది, పరిపక్వమై ఇంకొక రూపం ధరించింది. ఏ తత్త్వం ఈ జగత్తంతా నిండి ఉందో హిరణ్మయమైన ఆ విరాట్ స్వరూపం ధరించిన పరమాత్మ సమస్త జీవులలో నిండి యున్న వాడయ్యాడు.

206 ఈ విరాట్ పురుషుడు మొదటి జలాలలో ఏర్పడ్డ బ్రహ్మాండం అనే గర్భరూపంతో వేయి సంవత్సరాలు ఉన్నాడు. దాని నుండే సమస్త సృష్టి కార్యరూపంగా వెలువడింది.

207 దైవం, కర్మ, ఆత్మ అనువాటి శక్తి వ్యాపించి భగవంతుడు తానే బహుళ రూపాలతో వెలుగొందుతాడు. అపుడు సంకల్పమయమైన సృష్టి చైతన్యంతో విస్తరిస్తుంది గాని దేహం ఏర్పడదు.

208 ఆ చైతన్య శక్తికి రూపాలుగా ఏర్పడే లక్షణం ఏర్పడుతుంది. అదే కర్మశక్తి. దీనివల్ల అనేక ప్రవృత్తి భేదాలు ఉద్భవిస్తాయి. దాని యందు పది విధాలైన ప్రాణాలు స్పందిస్తాయి. ఇన్ని శక్తులతో గూడిన ప్రజ్ఞవల్ల తాను అనగా ఏమో తనకు తెలిసే శక్తి ఏర్పడుతుంది.

209 అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం అనబడే మూడు భేదాలు కలిగి ఈ విరాటం స్వరూపం జీవులకు తాను ఆత్మగా మెలగుతుంది.

210 సమస్తానికి జీవమై పరమాత్మకు స్థానమై తొలి అవతారమైన ఆ విరాట్ పురుషుని గర్భం నుండి భూతమయ మైన ఈ సమస్త ప్రపంచం పుట్టింది.

211 ఈ విధంగా విరాజిల్లిన విరాట్ పురుషుడు, ఆధ్యాత్మికము, ఆధిదైవికము, ఆధిభౌతికము అనే భేదాలతో మొదట చెప్పిన విధంగా ప్రకాశిస్తూ ఉంటాడు" అని మైత్రేయుడు విదురునికి తెలియజెప్పినాడని మళ్లీ శ్రీశుకుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

212 ఆ శ్రీహరి, పరమాత్ముడు, ఈశ్వరుడు, అజుడు, ఆద్యుడు, అనంతుడు, అనంతమూర్తి, లక్ష్మీరమణుడు, నిర్వికారుడు, నిత్యమంగళస్వరూపుడు,

కరుణాసముద్రుడు, నిర్మలహృదయుడు, సమస్త శక్తిమంతుడు, కమదళ నేత్రుడు, సకల బుధ సంస్తవనీయ చరిత్రుడు, పరమ పవిత్రుడు.

213 సర్వేశ్వరుడైన పరాత్పరుడు అలా మహదాది తత్త్వాల మనస్సులలోని గొప్ప ఆలోచనలన్నీ తెలుసుకున్న వాడై. ఆ తత్త్వాల ప్రవర్తనలన్నీ సఫలం కావటానికి తన చైతన్యం శక్తిని ఉపయోగించాలని నిశ్చయించాడు. తన కళలతో కూడిన విరాట్టు స్వరూపంలో అగ్ని మొదలైన దేవత లందరికీ నివాసాలు కల్పించాడు. విరాట్ పురుషుని ముఖం మొదలైన అవయవాల స్వరూపాలను వినిపిస్తాను. ఏకాగ్రమైన భావంతో ఆకర్ణించు.

214 ఓ భవ్యచరిత్రుడవైన విదురా! ఆ దివ్యమూర్తియైన విరాట్పురుషుని నుండి కొంతభాగం వేరయింది. అది ముఖంగా రూపొందింది. ఆ పరమేశ్వరుని అంశ గలవాడై వాయుదైవుని మిత్రుడైన అగ్నిదేవుడు ముఖాన్ని నిజస్థానంగా చేసుకొన్నాడు. అందువల్ల జీవుడు శబ్దాన్ని పలుక గలుగుతున్నాడు. విరాట్ పురుషునినుండి మరికొంత భాగము వేరై కన్నులుగా రూపొందాయి. సూర్యుడు చక్షురింద్రియానికి అధికారియై రూప విజ్ఞానాన్ని జీవునకు కలుగజేస్తున్నాడు. అట్లే విరాట్పురుషునిలో కొంతభాగం వేరై చర్మంగా ఏర్పడింది. ఈశ్వరాంశ అయిన వాయువు త్వగింద్రియంలో నిల్చాడు.

215 జీవునకు స్పర్శజ్ఞానాన్ని కలగించు విరాట్పురుషు నుండి వేరైన చెవులయందు ఈశ్వరాంశలైన దిక్కులు జీవుని శ్రవణేంద్రియాన్ని కూడి జీవునకు శబ్ద జ్ఞానాన్ని కలిగిస్తున్నవి. అట్లే వేరైన తాలువులందు లోకపాలకుడైన వరుణుడు ఈశ్వరాంశతో ప్రవేశించి జీవుని రసనేంద్రియంగా ప్రకాశిస్తున్నాడు. అందువల్ల ప్రాణి రుచులను తెలుసుకొంటాడు. పరమేశ్వరుని నాసికేంద్రియం వేరై ఆయన అంశగల అశ్వినీ దేవతలకు అధిష్ఠాన మయింది. అందువల్ల జీవునకు వాసన చూచే శక్తి కలిగింది. పరమపురుషునుండి వేరైన చర్మం ఓషధులు ఆయన అంశలైన కేశాలను కూడడంచేత జీవునకు కండూయమానస్థితి (గోకుకొనుట) ఏర్పడింది. అట్లే పరమేశ్వరుని నుండి వేరైన పురుషాంగంలో ఈశ్వరునినుండి వేరైన గుదస్థానంలో అచ్యుతాంశమైన మిత్రుడు, వాయువుతో కూడి ప్రవేశించటంవల్ల జీవునకు మలవిసర్జన శక్తి కలుగుతున్నది. విరాట్పురుషుని నుండి వేరైన చేతులందు ఈశ్వరాంశమైన ఇంద్రుడు ప్రవేశించటం వల్ల ఇచ్చిపుచ్చుకొను శక్తి కలవాడై. నిజస్థానాన్ని పొందిన జీవుడు జీవనోపాధిని పొందుతున్నాడు. విరాటం పురుషుని నుండి వేరైన పాదాలను విష్ణువు అధిష్ఠించి గమన శక్తి కలిగించటం వల్ల జీవుడు నడచుటకు శక్తి మంతు డగుతున్నాడు. పరమేశ్వరుని నుండి బయటికి వచ్చిన హృదయం పొందుతున్నాడు. వేర్పాటు చెందిన అహంకారంలో అహంకృతియుక్తుడైన రుద్రుడు నిజస్థానంగా ప్రవేశించి నప్పుడు జీవుడు కర్తవ్యాలను

నిర్వర్తిస్తాడు. విడివడిన బుద్ధి వాగీశ్వరుని ఆవాసమై హృదయంతో కలిసి జ్ఞానాంశతో వెలిగినప్పుడు జీవునకు గ్రహణశక్తి కలుగుతుంది. వేరుపడిన చిత్తం బ్రహ్మకు ఆవాసమై చేతనాంశం పొందినప్పుడు జీవుడు విజ్ఞానాన్ని పొందుతాడు. అటువంటి విరాట్పురుషుని శిరస్సునుండి స్వర్గమూ, పాదాల నుండి భూమీ, నాభి నుండి ఆకాశమూ కలిగాయి. సత్త్వరజస్తమోగుణాల మార్పుచేత జీవులు అమరు లయ్యారు. సత్త్వగుణం అధికంగా ఉండడంచేత ఆ దేవతలు స్వర్గాన్ని పొందారు. రజోగుణంవల్ల మనుష్యులూ, గోవులూ మొదలైన జీవులు భూమిని పొందారు. విరాట్పురుషుని ముఖం నుండి వేదాలు పుట్టాయి.

216 ఓ ప్రశస్త గుణసంపన్నుడవైన పరీక్షిన్మహారాజా! బ్రాహ్మణులూ, వేదాలూ ఆ విరాట్ పురుషుని ముఖం నుండి పుట్టడం వల్ల బ్రాహ్మణుడు సమస్త వర్ణాలకు జ్యేష్ఠుడూ, శ్రేష్ఠుడు అయ్యాడు.

217 ఓ నీతి విద్యావిశారదుడవైన విదురా! బ్రాహ్మణాది వర్ణాల వారు దొంగలూ దుండగులూ మొదలైన వారి వల్ల బాధలు పొందకుండా వారిని రక్షించడానికే ఆ పురుషోత్తముని భుజాల నుండి క్షత్రియజాతి జన్మించింది.

218 వ్యవసాయం, గోసంరక్షణం, వ్యాపారం మొదలైన కార్యాలను నిర్వహించటం కోసం ఆ సర్వేశ్వరుని తొడల నుండి వైశ్యజాతి ఆవిర్భవించింది.

219 ఆ దేవదేవుని పాదాలనుండి సేవావృత్తియే ధర్మంగా గల శూద్రజాతి పుట్టింది. వీరంతా తమకై విధింపబడిన పనులు చేస్తూ, జగజ్జనకుడు మహితాత్ముడు అయిన విష్ణుమూర్తిని పూజిస్తుంటారు.

220 ఆ శూద్రజాతి వారంతా తమకై విధింపబడిన పనులు చేస్తూ, జగజ్జనకుడూ, విశ్వగురుడూ, సర్వేశ్వరుడూ, పరాత్పరుడూ, ఆలోకైకనాథుడు అయిన హరి పాదపద్మాలకు వేదాల్లో చెప్పిన విధంగా భక్తియోగ పరాయణులై అనుదినమూ సేవిస్తుంటారు.

221 మహనీయమైన చరిత్ర కలవాడా! విదుర! కాల, కర్మ, స్వభావ శక్తులతో ప్రకాశించే పరమేశ్వరుని యోగమాయ అమేయమైనది. ఆ యోగమాయ విశేష విజృంభణాన్ని తెలుసుకొని సంస్తుతించడానికి ఎవరికి మాత్రం సాధ్యమౌతుంది.

222 ఈ నా నాలుక ఇతర కథాకలాపాలను రాత్రింబవళ్లు చదివి చదివి, చాలా మలినమై, ఆత్మ సౌందర్యాన్ని పోగొట్టుకొన్నది. నేడు నా గురుదేవునిచే నిర్దేశింపబడిన మార్గాన్ని అవలంబించి విష్ణుదేవుని సద్గుణవంతమైన సత్కథా గానం అనే అమృతాన్ని పానం చేసి సౌజన్యాన్నీ, సౌభాగ్యాన్నీ సంతరించుకున్నది.

అన్యకథానులాపము లహర్నిశముం బఠియించి చాల మా
లిన్యము నాత్మశోభన విలీనత నొందు మదీయ జిహ్వ సౌ
జన్యముతోడఁ గ్రోలు హరి సద్గుణ దివ్యకథామృతంబు స
న్మాన్యచరిత్రమై నెగడు మద్గురువాక్యపదంబుఁ జెందఁగన్.

223 శ్రీహరి నామస్మరణ పరాయణమైన సరస కథలనే అమృతాన్ని ఆసక్తితో ఆస్వాదించి ఆనందించే సత్పురుషవరేణ్యుడు రసహీనమైన అసత్కథలనే ఉప్పునీటిని త్రాగాలని ఉబలాటపడతాడా? మధురమైన మందార మకరందాన్ని త్రాగి మైమరచే తుమ్మెద చేదువాసనలు వెదజల్లే వేపచెట్ల వైపు వెళ్ళాలని వేగిరపడుతుందా?

224 ఓ విదురా! తత్త్వవేత్తా! నారాయణుని మహిమను ఆయన నాభికమలం నుండి పుట్టిన నాలుగు ముఖాల బ్రహ్మకూడా తెలుసుకోలేడు అంటే, ఇక ఇతరుల విషయం చెప్పట మెందుకు.

225 ఉత్తమశ్లోకుడూ ఉదారచరితుడూ, ముక్కోటి దేవతలు మ్రొక్కే చక్కని పాదపద్మాలు గలవాడూ అయిన ఆ దేవాది దేవుడిని వేదాలు కూడా తమలో తాము వితర్కించి, విచారించి వెదకి పూర్తిగా తెలుసుకోలేవని విజ్ఞులంటారు.

226 ఓ మహానుభావా! విదురా! ఆ హరికూడా అనంతమైన తన మాయావ్యవహారాన్ని అవగాహనం చేసుకోలేక పోయాడంటే మాయావిని అయిన ఆ మహామోహుని ప్రభావం బ్రహ్మాదులకు మాత్రం ఎలా అంతుపట్టుతుంది.

227 మహేంద్రుడూ, మహదాది తత్త్వాలూ, దిక్పాలకులూ, పద్మసంభవుడూ, పరమశివుడూ కూడా చూడలేని ఆ దేవదేవుని పాద పద్మాలను నా మనస్సులో ధ్యానిస్తాను."

228 అలా మైత్రేయ మహర్షి విదురునకు వెల్లడించిన విశేషాలను పార్థుని పౌత్రుడైన పరీక్షిత్తునకు పరాశరుని పౌత్రుడైన శుకమహర్షి హర్షపూర్వకంగా విశదీకరించి మళ్ళీ ఇలా అన్నాడు.

229 ఇంకా ఇలా అన్నాడు.

230 పరీక్షిత్తూ! అలా మైత్రేయ మహాముని అత్యంత మంగళప్రదాలైన హరిలీలా మహత్త్వాలను విదురునికి విశదీకరించగా విని మైత్రేయునితో విదురుడు మళ్ళీ ఇలా అన్నాడు.

231 ఓ సౌజన్యమూర్తీ! మైత్రేయా! భగవంతుడు నిర్గుణ పరబ్రహ్మ కదా; మరి ఈ లోకాలన్నీ పుట్టించటం రక్షించటం లయం చెయ్యటం ఆయన క్రీడావిశేషాలు కదా; నిర్గుణుడైన వానికి ఈ క్రీడలూ, ఈ లీలలూ ఎలా పొసగుతాయి? నిర్గుణుడైన ఈశ్వరుడు సగుణుడుగా ఎలా ఉంటాడు? ఇది పరస్పర విరుద్ధంగా లేదా?"

232 అని అడిగి విదురుడు, ఒక వేళ భగవంతుడు బాలునిలాగ క్రీడిస్తాడేమో అనుకొని, మైత్రేయుణ్ణి చూచి మళ్ళీ ఇలా అన్నాడు "బాలుడు ఆడుకోవాలి అనుకున్నప్పుడు అతడి మనస్సు క్రీడలలో లగ్నమౌతుంది. అందుకు తగినట్లుగా ఆడుకుంటాడు. బాలుడు ఆడుకోటానికి ఆటవస్తువులు కావాలి. లేదా మరికొందరు బాలకులు కావాలి. అప్పుడు ఆనందంగా ఆట సాగుతుంది. కాని భగవంతుడు ఎటువంటి కోరికలు లేని వాడూ, నిత్య సంతృప్తుడూ గదా? అటువంటి వానికి ఆట లందు ఆసక్తి కలగటం ఆశ్చర్యంగా ఉంది. త్రిగుణాత్మకమైన మాయను సృష్టించి ఆ మాయవల్ల సమస్తలోకాలనూ కల్పించే కుతూహలం ఆయనకు ఎలా కలిగిందో చిత్రంగా ఉంది.

233 ఓ పుణ్య మైత్రేయుడా! తన మాయచేత ఈ లోకాలన్నింటినీ సృష్టించి, పాలించి, లయంచేసే ఆ పరమాత్ముడు దేశం కాలం మొదలైన అవస్థలను కల్పించుతున్నాడు. ఇతరులను సృష్టించి వారియందు అఖండమైన జ్ఞానంతో వర్తిస్తున్నాడు. కేవలం జ్ఞాన స్వరూపుడైన భగవంతుడు ఆ ప్రకృతితో తాను ఏ విధంగా కలసి ఉంటాడు? దేవుడు ఒక్కడై ఉండి అన్ని శరీరాల్లోనూ జీవుడూగా వసించి ఉంటున్నాడు గదా; దేవుడైన జీవునకు భరింపరాని గర్భనరకం వంటి కష్టాలు ఏ కర్మ వల్ల సంభవిస్తున్నాయి? ఈ సందేహాలతో నామనస్సు చాల వ్యాకుల పడుతున్నది. ఈ అజ్ఞానావస్థ నుండి బయట పడలేక తల్లడిల్లి పోతున్నాను.

234 ఈ నా మనస్సులోని సందేహాలను తొలగించడానికి విద్వాంసులలో అగ్రగణ్యుడవైన నీవే సమర్థుడవు" అని విదురుడు మైత్రేయుణ్ణి వేడుకున్నాడు" అని చెప్పి శుకమహర్షి పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

235 నృపకుల తిలకా! పరీక్షిత్తూ! కల్యాణదాయకమైన కమలనాభుని మధుర కథా సుధారసాన్ని ఆస్వాదించాలనే కుతూహలంతో ఉవ్విళ్ళూరుతున్న విదురునితో మహనీయుడైన మైత్రేయుడు ఇట్లా అన్నాడు.

236 "ఓ విదురా! వినవయ్యా! వికసించిన కమలాలవంటి కన్నులు గల విష్ణుదేవుని మాయ అజేయమైనది. కేవలం పిడివాదాలైన ఈ తర్కవితర్కాలు ఆ మాయను స్పృశింపలేవు. ఆయన ఆద్యుడు, అనంతుడు, నిత్యుడు అయిన కారణంగా నిత్య మంగళ స్వరూపుడైన ఆ పరమేశ్వరుణ్ణి ఈ బంధాలు, ప్రతి బంధాలూ, విపత్తులూ, విషాదాలూ అంటవు. ఆయన వీటి కన్నింటికీ అతీతుడు.

237 అంతేకాకుండా.

పురుషుఁడు నిద్రవోఁ గలల బొందు సమస్త సుఖంబు లాత్మసం
హరణ శిరోవిఖండనము లాదిగ జీవునికిం బ్రబోధమం
దరయఁగఁ దోఁచుచున్నగతి నాదిఁ బరేశుఁడు బంధనాదులం
బొరయక తక్కు టెట్లనుచు? బుద్ధిని సంశయ మందెదేనియున్.

238 ఇంకా విను. పురుషుడు నిద్రపోయే సమయంలో ఏవేవో కలలు వస్తాయి. ఎన్నో సుఖాలు పొందుతున్నట్లూ, తనను ఎవరో చంపేసినట్లూ, తన శిరస్సు ఖండించి వేసినట్లూ కలలు కంటాడు. మెలకువ వచ్చిన పిమ్మట అవన్నీ అసత్యాలని తెలుసుకుంటాడు. ఆ విధంగానే దేవుడు జీవుడుగా నటించునప్పుడు ఈ కష్టసుఖాలు ఏవీ ఆయనకు అంటవు. అయితే స్వప్నంలో ఉన్నంత కాలమూ జీవుడు పడే చిక్కులూ బాధలూ జీవుడుగా ఉన్న భగవంతునకు మాత్రం ఎందుకు కలుగవు అనే సందేహం కలిగినట్లైతే విను.

239 భగవంతుడికి ఆ విధమైన బాధలూ బంధనాలూ ఏవీ అంటవు. అది ఎలాగంటే

240 అందంగా అటూ ఇటూ కదలుతూ ఉన్న స్వచ్ఛమైన కోనేటి నీటిలో ప్రతిబింబించే నిండు పున్నమి నాటి చంద్రబింబం ఆ నీటి కదలిక వల్ల కదులు తున్నట్లు కన్పిస్తుంది. జలం కదలిక వల్ల ప్రతిబింబం కదలినా ఆకాశంలో ఉన్న చంద్రబింబం ఏ మాత్రం చలించదు. అదే విధంగా, సర్వజీవుల శరీర ధర్మాలను కలిగి క్రీడించే ఈశ్వరునకు కర్మబంధాలు ఏ మాత్రమూ అంటవు.

241 కనుకనే, జీవునకు మాత్రమే అజ్ఞాన ప్రభావంవల్ల కర్మబంధాలు కలుగుతున్నాయి. కాని సర్వభూతాల్లో అంతర్యామిగా ఉండే పరాత్పరునకు బంధనాలు ప్రాప్తించవు.

242 మానవునకు తన శరీరం నుండి పుట్టిన గుణాలను పోగొట్టడానికి నారాయణుని పాదసరోజాలమీద విశేషించి విస్పష్టమైన భక్తి ఒకటే చాలు. అలాగే ఆపదలను బాపుకొనడానికి పంచేంద్రియాలను భగవంతుని అధీనంచేసి మనస్సును, చలించని ఉన్నతమైన ఏకాగ్రభావంతో నింపి ఆ సరోజాక్షుని సంకీర్తనం చేస్తే చాలు.

243 ఓ విదురా! నీవు విద్వజ్జనులుచే వినుతింపదగిన వర్తన గల వాడవు. ఎవరైతే శ్రీహరి పాదపద్మాలను పూజించుతూ సన్నుతించుతూ నిరంతరమూ భక్తియోగంలో సమాసక్తులై ఉంటూ ఉంటారో వారు, శివుడికీ బ్రహ్మదేవుడికీ సైతం అందకోరాని దివ్యమైన స్థానాన్ని చేరుకుంటారు. అటువంటి పుణ్యపురుషుల పూర్వజన్మ సుకృత విశేషాన్ని పొగడడానికి ఎటువంటి వారికైనా సరే చేతకాదు."

244 అని మైత్రేయ మహాముని చెప్పగా వింటున్న విదురుడు ఒక్కమాటు తలయెత్తి మైత్రేయుణ్ణి చూసాడు. చేతులు జోడించి, శిరస్సు వంచి నమస్కరించాడు. తన మనస్సుతో శ్రీహరిని స్మరిస్తూ వినయమొలుకు పలుకులతో ఇలా అన్నాడు.

"మునిముఖ్యా! నారాయణుడు లోకానికి ఏకైక ప్రభువు ఎలా అయ్యాడు? శరీరాన్ని ధరించిన జీవునకు కర్మబంధాలు ఏ విధంగా కలిగాయి? అనే అనుమానాలు ఇప్పుడు మీ మాటలవల్ల తొలగిపోయాయి. సమస్త లోకాలకు ఈశ్వరుడైన శ్రీహరి సర్వస్వతంత్రుడనీ, జీవుడు అస్వతంత్రుడనీ తెలుసుకొన్నాను. నారాయణుని మీద భక్తి గల్గి ఉండటం ఒక్కటే జీవులోని అవిద్యను తొలగించడానికి మూలం అవుతుంది. అని భావిస్తున్నాను. నారాయణుడు తనకు తాను ఏ ఆధారం లేకుండానే సమస్త లోకాలకి తానే ఆధారమైన ఈ విశ్వాన్నంతా పొదివి పట్టుకొని ఆ విశ్వంలోనే తానుండటం ఎలా కుదురుతుంది? ఎవడు కేవలం శరీరంపై అభిమానం పెంచుకొని పరమ మూర్ఖుడై సంసారాన్ని సాగిస్తూ ఉంటాడో, ఎవడు భక్తిమార్గంలో ప్రవర్తించి పరబ్రహ్మమైన శ్రీహరిని చేరుకుంటాడో వీళ్లిద్దరూ సంశయమూ క్లేశమూ లేనివారవటం వల్ల సుఖమూ ఆనందమూ అతిశయించినవారై అభివృద్ధి పొందుతారు. ఎవరు గొప్పవాడు ఎవడు సుఖిస్తాడు అనే సంశయ తర్కాలు దుఃఖాలు లేకుండడంవల్ల సుఖానందాల్ని సమృద్ధిగా పొందిన వారవుతారు. ఎవడు సుఖ దుఃఖాలలో మనస్సు నిలిపి లోకాన్ని అనుసరిస్తాడో వాడు సుఖదుఃఖాలు అనుభవిస్తూ చివరకు చిక్కులపాలవుతాడు. నారాయణ సంసేవనంవల్ల సకలదుఃఖాలూ పటాపంచ లౌతాయని మీ పాదసేవవల్ల తెలుసుకొన్నాను. ఈ ప్రపంచం సమస్తం ఉన్నట్లుగా మనకు గోచరిస్తున్నది. అటువంటి ప్రతీతి కల్గి ఉండటానికి కారణం మాత్రం తెలియడం లేదు.

245 విజ్ఞులచే స్తుతింపబడువాడైన మధుసూదనుడు అంతంత మాత్రం తపస్సు చేసేవారి అలోచనలకు అందరానివాడు అని నా మనస్సులో అనుకుంటూ ఉంటాను.

246 భగవంతుడు ఇంద్రియాలతో కూడిన మహదాదులకు పరస్పర సంబంధం కల్పించి విరాట్ దేహాన్ని పుట్టించి అందు నివాసం చేస్తూ ఉంటాడు గదా బ్రహ్మవేత్తలైనవారు ఆ పరాత్పరుణ్ణి సహస్రశీర్షునిగా సహస్రపాదునిగా సహస్రబాహునిగా పేర్కొంటున్నారు. ఆ విరాట్పురుషునిలో అఖిల లోకాలూ అలజడి పొందకుండా ఉంటున్నాయి. అటువంటి విరాటం స్వరూపం నుండే పది ప్రాణాలూ, ఇంద్రియగోచరా లయిన విషయాలూ, ఇంద్రియాల కధిపతులైన దేవతలూ, మూడువిధాలైన బ్రాహ్మణాది వర్ణాలూ ఏర్పడ్డాయి.

247 వీటిలోనుండి ఈ భూమిపై మహాశ్చర్యం కలిగేలా కొడుకులూ మనుమలూ అనే వంశపరంపరలతో పలురూపాల ప్రజలు ఏ విధంగా ఆవిర్భవించారు. ఆ ప్రజలతో నిండిన ఈ ప్రపంచం ఏ విధంగా ప్రవర్తిల్లుతున్నది?

248 ప్రజాపతులకు అధిపతియైన లక్ష్మీపతి చతురమతియై తాను సృష్టించిన ప్రజాపతులచే నవనవోన్మేషమైన ఈ ప్రపంచాన్ని ఏ విధంగా సృష్టింపజేశాడు?

249 ఆ సృష్టిభేదాలనూ, మనువంశాలనూ, మనువంశాల అధిపతులనూ, వంశానుచరితాలనూ భగవంతుడు ఎటువంటి మహామహిమతో ఎలా పుట్టించాడో నాకు తెలిసేలా చెప్పు.

250 ప్రసిద్ధమైన వర్తన గల ఓ మైత్రేయా! ఈ భూమికి దిగువనున్న లోకాలనూ, ఎగువనున్న లోకాలనూ వానివాని పరిస్థితులనూ వా పరిమాణములనూ నాకు వివరించు.

251 మునికుల తిలకా! దేవతలు, జంతువులు, మనుష్యులు, రాక్షసులు, గరుడులు, నాగులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, ఖేచరులు మొదలైన వారంతా ఎలా పుట్టారు? ఇంకా గర్భజములూ, స్వేదజములూ, అండజములూ అయిన జీవులు జన్మించిన విధానం కూడా నాకు విశదీకరించు.

252 సత్త్వరజస్తమోగుణాలు ప్రధానంగా గల అవతారాలనూ, సమగ్రమైన ఈ జగత్తు జన్మస్థితి లయాలనూ, అవి ప్రవర్తించు విధాలనూ వాని శాశ్వతమైన ఉనికినీ నాకు తెలియజెప్పు.

253 జగన్నాథుడూ, చక్రధరుడూ అయిన విష్ణుని సౌందర్యం, పరాక్రమం మొదలైన సుగుణాలను వెల్లడించు, బ్రాహ్మణులు మొదలైన నాలుగు వర్ణాలనూ, బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలనూ, వారివారి ఆయా ధర్మాలనూ, కర్తవ్యాలనూ, స్వభావాలనూ, నడవడులనూ నాకు తెలుపు.

254 యోగ విద్యలు వాని విశేష మహిమలూ, యాగాలూ, వాని విధానాలూ, జ్ఞానమార్గాలూ, విజ్ఞానసాధనాలైన సాంఖ్య యోగాలూ, శ్రీమన్నారాయణుని స్మరణమాత్రంచే సంజాతాలైన శాస్త్రాలూ నాకు చెప్పు.

255 నాస్తికు లయినవారి ప్రవర్తనలు యెటువంటివి? అశాస్త్రీయమైన వివాహాలవల్ల ప్రభవించినవారిని విభజించు విధానం యేది? జీవుల గుణకర్మలు, మాటల తీరుతెన్నులు ఎటువంటివి? ధర్మమోక్షాల్లో అన్యోన్యం విరుద్ధం కాని సాధనలు ఎలాంటివి? రాజనీతి, దండనీతి, పంపకాల విధానాలు, పితృయజ్ఞాలు, పితృతర్పణాలు, తారలు, గ్రహాలు, ఈ కాల చక్రంలో వాటి నిలుకడలు, తపస్సులు, దానాలు, వాటి ఫలితాలు, విశేషధర్మాలు, ప్రజలు చేసే కర్మలు, వాటి ఫలితాలు నాకు తెలియజెప్పు.

256 భూలోకపు ప్రజలకు సంబంధించిన ఆపద్ధర్మాలు ఎలాంటివి? అరవిందాక్షుడైన శ్రీహరి ఏవిధంగా సంతోషిస్తాడు ఎటువంటివారు చేసిన మేలు ఎల్లప్పుడు కనిపిస్తూ ఉంటుంది. శిష్యులు గురువులను సేవించగా వారు సంతోషంగా కోరే పరమార్థాలూ, వాటిని చక్కగా తీర్చగల మార్గాలూ నాకు బోధించు.

257 ప్రళయం ఎన్ని విధాలు సర్వేశ్వరుడైన పరాత్పరుణ్ణి ఎవరు అచంచల భక్తితో సేవిస్తారు. జీవతత్త్వం ఎవరిలో వికాసాతిశయంతో ప్రకాశిస్తుంది?

258 మహాత్ములచే కీర్తింపడేవాడా! మైత్రేయా! గోవిందుని స్వరూప నిరూపణం ఎలాగు? జీవబ్రహ్మలకు ఏకత్వం ఎలా కలుగుతుంది. ఎటువంటి జ్ఞానం గలిగితే ఉపనిషత్తుల అర్థం ఊహకు అందుతుంది?

259 ఉత్తములైన శిష్యులు కలిగినందువల్ల కలిగే ప్రయోజనాలూ, సజ్జనులు బోధించే విజ్ఞాన సాధనాలూ, వైరాగ్యం వల్ల ప్రకాశించే భగవద్భక్తి ఎటువంటివో వివరించు.

260 వీటి నన్నింటినీ వివరంగా చెప్పి విపన్నుడైన నన్ను రక్షించు. యజ్ఞాలు చేసిన ఫలం; దానాలు ఇచ్చిన ఫలం; వేదాలు చదివిన ఫలం; ఇవన్నీ కలసి ఆర్తులైనఅర్థించిన వారిని ఆదరించిన ఫలంతో సమానం కావు."

261 అని వినయంగా విదురుడు మైత్రేయుణ్ణి అడిగినట్లు శుకమహర్షి పరీక్షిత్తునకు చెప్పి మళ్లీ ఇట్లా అన్నాడు.

262 "ఓ రాజా పరీక్షిత్తూ! భూలోకంలో గల ప్రజలందరికీ ప్రశంసనీయమూ, పూజనీయమూ అయింది పూరువంశం. అటువంటి పూరువంశాన్ని మరింత పవిత్రం చెయ్యటానికి జన్నించినవాడవు నీవు. మంచి గుణాలనే పుష్పాలతో నిండి నీ కీర్తి లతావితానానికి ప్రతిదినం కమలాక్ష కథాసుధారసం నింపి పెంపు కలిగిస్తూ ఉంటావు కదా.

263 బహు అల్పములైన సుఖముల అందుచున్న, జనుల దుఃఖములను మాన్ప జాలువట్టి పుండరీకాక్ష గుణకథా పూరితమూ, వితత నిగమార్థ కలితము అయిన భాగవతము నీకు చెప్తాను.

264 భాగవతం నీకు వివరిస్తాను, విను" అని శ్రీశుకుడూ పరీక్షిత్తుకు ఇలా చెప్పసాగాడు.

265 వాసుదేవుడు అనే పేరుతో ప్రకాశించేవాడూ, కేవల జ్ఞానస్వరూపుడూ, దివ్యపురుషుడు అయిన సంకర్షణుడు ఒకనాడు వేదసారమైన భాగవతాన్ని పాతాళలోకంలోనికి తీసుకొనిపోయాడు. తన మనస్సులో తన్ను తానే చూచుకొంటూ తదేక ధ్యానంలో కొద్దిసేపు కన్నులు మూసుకున్నాడు సంకర్షణుడు. సనక సనందనాదుల అభ్యుదయం కోరిన వాడై కన్నులు విప్పి చూచాడు. సనక సనందనాదులు సంస్తుతులు చేశారు. అంతలో ఆకాశగంగలో స్నానం చేసిన నాగకన్యకలు తడిసిన జడలతో జుట్టుముడులతో అచ్చటికి వచ్చారు. ఆ నాగకన్యలు ఆ దివ్యపురుషుడే తమకు భర్త కావాలని భావించారు. ఆ పరమపురుషుని సమీపించి ఆయన పాదపద్మాలను సేవించారు..

266 అలా సేవించి భక్తితో అనేక విధాలైన పూజలు చేశారు. కానుకలు సమర్పించారు. నమస్కరించారు. స్తోత్రాలతో ఆ దేవుని హృదయాన్ని వశపరచుకొన్నారు. ఆ సమయంలో సనక సనందనాదులు పరమ పురుషుణ్ణి ప్రస్తుతింపసాగారు.

267 ఆ దేవదేవుడు వేలకొలది శిరస్సులు కలిగి ఉన్నాడు. ఆ శిరస్సులపై కిరీటాలు అలంకరింపబడి ఉన్నాయి. ఆ కిరీటాలలోని రత్నాలు రమణీయమైన కాంతులు వెదజల్లుతున్నాయి. ఆ కాంతి పుంజాల వెనుక ఆదిశేషుని వేయిపడగలు సుందరంగా వెలుగొందుతున్నాయి. అటువంటి స్వామిని, దేవతలను రక్షించు ప్రభువును సంనందనాదులు మిక్కిలి వేడుకతో సంస్తుతించారు. ఆయన అవతారాలను, ఆయన చేసిన ఘనకార్యాలను ప్రశంసించారు. అలా స్తుతించేటప్పుడు వారి మాటలు దేవునిపై గల అనురాగం వల్ల తడబడ్డాయి. వారి సంస్తుతులకు ఆ దేవుడు సంతోషించాడు.

268 సనక సనందనాదుల ప్రార్థనలకు ప్రసన్నుడైన భగవంతుడు సమస్త వేదసారమై పరిఢవిల్లే ఈ భాగవతాన్ని బ్రహ్మదేవుని కుమారుడైన సనత్కుమారునికి సాదరంగా ఉపదేశించాడు. ఆయన సాంఖ్యాయనునకు వెల్లడించాడు.

269 ఆ సాంఖ్యాయనుడు మంచిమనస్సుతో పరాశరునకు ఉపదేశించాడు. పరాశరుడు సురగురువైన బృహస్పతికి తెలిపాడు. ఆయన ఏకాంతంగా నాకు (మైత్రేయునకు) చెప్పాడు.

270 ఓ విదురా! నేను ఆ భాగవతాన్ని ఇప్పుడు నీకు వివరంగా చెబుతున్నాను. ఉత్తమశ్లోకుడైన పురుషోత్తముని చరిత్ర అనే అమృత వర్షంలో తడిసినవాడవై హర్షోత్కర్షంతో ఆకర్ణించు.

బ్రహ్మ జన్మ ప్రకారము

271 ఇలా భగవంతునిచే చెప్పబడినదీ, ఋషుల సంప్రదాయానుసారంగా అందుబాటులోకి వచ్చినదీ, పురుషోత్తముడైన పుండరీకాక్షుని స్తోత్రం కలదీ, పరమపావన మైనదీ, భవబంధాలను తెగటార్చేదీ ఐన భాగవత కథావిధానాన్ని భక్తుడవూ ఆసక్తుడవూ అయిన నీకు విశదీకరించుతాను. విను.

272 ఓ విదురా! పూర్వం ప్రళయనమయంలో విశ్వమంతా జలమయంగా ఉన్నప్పుడు శ్రీమన్నారాయణుడు ఆదిశేషుణ్ణి పాన్పుగా చేసుకొని సముద్రమధ్యంలో పవ్వళించాడు. ఆ ఆదిశేషుడు స్వచ్ఛమైన అమృతపు నురుగులవంటి తెల్లనైన శరీరం కలవాడు. అతని తెల్లని శరీర కాంతులు అతని వేయి తలలపై తళతళలాడే రత్నాల కాంతులతో చెలిమి చేస్తున్నట్లుగా వెలుగొందాయి. నారాయణుడు తన కడుపులో అగ్నిని దాచుకొన్న కట్టెలా లోపల చైతన్యశక్తి కలవాడై ఉన్నాడు. అనంతమైన తత్త్వదీప్తితో అద్వితీయుడై ఆనందమయుడై కపటనిద్ర నభినయిస్తూ కన్నులు మూసుకొని ఉన్నాడు. కుతూహలం కలిగి కూడా కోర్కెలు లేనివానిలా నిష్కళంకమైన స్వరూపంతో విరాజిల్లాడు.

273 అలా యోగమాయకు కూడా దూరంగా వెయ్యి యుగాల పర్యంతం సమస్త లోకాలను తన కడుపులో దాచుకొని వెలుగొందుతూ ఆ పైన కాలమూ శక్తీ చక్కగా అభివ్యక్తం కాగా సమత్వం వహించి సృష్టికార్యం నిర్వహించటానికి ఆసక్తు డైనాడు.
274 అలా తన కడుపులో దాచుకున్న లోకాలన్నింటిని తిరిగి సృష్టించడానికి ఉపకరణాలైన సూక్ష్మ పదార్థాలను మనస్సులో భావించి, కాలానుగుణంగా రజోగుణాన్ని సృష్టించాడు.
275 ఆ విధంగా పుట్టించిన రజోగుణంవల్ల నారాయణుని నాభిలో నుండి మొగ్గతో కూడీన ఒక తామరతూడు జన్మించింది. సృష్టికార్యప్రభావితమైన కాలాన్ని అనుసరించి భగవంతుడు తన తేజస్సుచేత వృద్ధిపొందిన నీటినడుమ ఆ తామరమొగ్గను సూర్యునిలాగా వికసింపజేశాడు. లోకాలకు ఆశ్రయం ఇచ్చే స్థితినీ, సకలగూణాలతో ప్రకాశించే ప్రకృతినీ కలిగిఉన్న ఆ కమలంలో పరాత్పరుడు తన కళతోకూడిన అంశాన్ని ప్రసరింప జేశాడు. అప్పుడు ఆ పద్మంలో నుంచి సంపన్నుడూ, స్వయంభువుడూ, చతుర్ముఖుడూ అయిన బ్రహ్మదేవుడు ఉద్భవించాడు.
276 పద్మంలోనుంచి ప్రభవించిన ఆ బ్రహ్మ పద్మం పైభాగన నిలబడి, కన్నులు బాగా తెరచి లోకాలనూ, దిక్కులనూ, ఆకాశాన్ని తన నాల్గుమోములతో పరికించి చూడసాగాడు.
277 అంతులేని ప్రళయకాలం. చుట్టూ మహాజలం. ప్రచండమైన గాలులు వీస్తున్నాయి. అలలు లేచిపడుతున్నాయి ఆ జలమధ్యంలో ఒక పద్మం ఆ పద్మంమధ్య దుద్దుపై తాను స్పష్టమవుతూ ఉన్న లోకాల స్వరూపం ఇదంతా ఏమిటో అర్థంకాక. తెలుసుకోలేక చతుర్ముఖుడు తన మనస్సులో చాలా విచారాన్ని పొంది ఇలా వితర్కించాడు.
278 ఇలా తర్కించుకుని.

ఈ జలమందు నీ కమల మేగతి నుద్భవ మయ్యె నొంటి యే
నీ జలజాతపీఠమున నేగతి నుంటి మదాఖ్య మెద్ది నా
కీ జననంబు నొందుటకు నెయ్యది హేతువు బుద్ధిఁ జూడ నే
యోజ నెఱుంగలే"నని పయోరుహగర్భుఁడు విస్మితాత్ముడై.

279 "ఈ నీటపై ఈ పద్మం ఏ విధంగా పుట్టింది? ఒంటరిగా నేను ఈ తామర గద్దెపై ఎలా ఉంటున్నాను? నా పేరు ఏమిటి? నాకు ఈ పుట్టుక రావడానికి కారణం ఏమిటి? ఎంత ఆలోచించినా ఈ క్రమం ఏమిటో తెలుసుకోలేక పోతున్నాను" అని బ్రహ్మదేవుడు ఆశ్చర్యచకితు డైనాడు.
280 ఆ తామరతూడు ఎక్కడ నుంచి పుట్టిందో, దాని మొదలు ఎక్కడో తెలుసుకోవాలని ఆ నీటిలో వెదకడంకోసం బ్రహ్మదేవుడు పద్మనాళం వెంట లోపలికి ప్రవేశించాడు.

281 మిక్కిలి లోతూ, మిక్కిలి విరివీ కలిగిన ఆ సముద్రపు నీటిలో మునిగినవాడై ఆ బ్రహ్మ వేయి దేవతావత్సరాలు ఎంతో జాగ్రత్తగా వెదికాడు. అయిన ఆ తామరతూడు మూలాన్ని తెలుసుకోలేక పోయాడు. భగవంతుని మాయాప్రభావం మూలాన ఆయనకు ఆ మూల రహస్యం అంతు చిక్కలేదు. మతి కోల్పోయి బెదరిపోయి మళ్లీ ఆ తామర పూవు పైకే చేరాడు.

బ్రహ్మకు హరి ప్రత్యక్ష మగుట

282 అలా చతుర్ముఖుడు ఆ పద్మపీఠంపై కూర్చుండి అష్టాంగయోగంపై ఆసక్తి గలవాడైనాడు. గాలిని బంధించి, ఏకాగ్రభావంతో తపస్సు చేసాడు. ఈ విధంగా నూరేళ్ళు గడిచాయి.

283 బ్రహ్మదేవుడు ఇలా చేసిన యోగాభ్యాసం వల్ల విజ్ఞానాన్ని పొందాడు. ఆ విజ్ఞానం వల్లకూడా అతడు విష్ణువును చూడలేకపోయాడు. అప్పుడు తన ధ్యానాన్ని తన హృదయంలో నిలిపాడు. అక్కడ పరాత్పరుని దర్శించి తన హృదయంలో ఉన్నవాడే తనను కన్నవా డని తెలుసుకొన్నాడు.

284 ఈ విధంగా అచంచలమైన భక్తితో కూడిన యోగమాహాత్మ్యం వల్ల బ్రహ్మదేవుడు శుభచరిత్రుడూ, పరమపవిత్రుడూ, లక్ష్మీకళత్రుడూ, అయిన శ్రీమన్నారాయణుని దర్శించాడు. ఆయన వేలుపు పెద్దల వినతులు అందుకొనే వాడు. దానవసైన్యాలను తరిమికొట్టేవాడు. వికసించిన కమలాలవంటి కన్నులు కలవాడు. క్రొత్తదై వెలిగిపోతూ ఉన్న నీలమేఘంతో సమానమైన దేహం కలవాడు గరుడవాహనుడు.

285 ఇంకా

286 అంతేకాదు. ఆ మహానుభావుడు గొప్పవైన పడగలనే గొడుగుల చివర గల స్వచ్ఛమైన రత్నాల కాంతులతో ప్రళయకాలంలోని చీకట్లను పోకార్చుతూ కొంగ్రొత్త తామరతూడులాంటి తెల్లని దేహసంపద కలిగన ఆదిశేషుణ్ణి పాన్పుగా చేసికొని మిక్కిలి నిర్మలంగా ఉన్న నీళ్ళమధ్యలో శయనించి ఉన్నాడు.

287 కట్టుకొన్న మేలైన పట్టుస్త్రాల కాంతులు సాయంకాలపు మేఘాల కాంతులు కాగా, పెట్టుకొన్న సుందర సువర్ణ కిరీటం బంగారు శిఖరం కాగా, రొమ్ముపై వ్రేలాడే ముత్యాలహారాలు చరియలపై నుండి జాలువారే సెలయేళ్ళు కాగా, అందాలు చిందే తులసీమాలలు దరుల్లో ప్రకాశించే ఓషధీలతలు కాగా, ఉన్నతభుజాల చెంగట ఉన్న మొదళ్ళు కాగా, పాదాలు ముంగిట ఉన్న తరుగుల్మాలు కాగా, పచ్చని దేహంతో పచ్చల పర్వతంలాగా ప్రకాశిస్తున్నాడు ఆ పరాత్పరుడు.

288 అంతేకాక ఆ మహాత్ముని దివ్యదేహం వేరుపరుపరానిది. సాటిలేనిది. సమస్త లోకాలను తనలో ఇముడ్చుకొన్నది. చాలా విశాలమై గుండ్రనై నిడివి కలిగి ఉన్నది. విచిత్రమైన మనోజ్ఞమైన అనేక దివ్యభూషణాలను ధరించి వాటిని స్వచ్ఛమైన తన

కాంతులచే అలంకరిస్తున్నది. పలువిధాలైన కోర్కెలు కోరుతూ యాథావిధిగా పూజించే పుణ్యపురుషులకు కామధేనువు అనదగిన చరణ కమలద్వయం కలిగి ఉన్నది. ఫాలఫలక కాంతులకు ఓడిపోయిన చంద్రుడు అనుగ్రహింప బడినవాడై ఆయన పాదపద్మాలను అనేక రూపాల్లో ఆశ్రయించాడా అన్నట్లు ఉన్నాయి ఆయన కాలిగోళ్లు. శ్రీదేవికీ, భూదేవికీ తలగడలా అన్నట్లు, నున్నని అరటిస్తంభాల నీలద్యుతిని అతిశయిస్తున్నాయి అతని తొడలు ఉన్నాయి. ఆయన కటిప్రదేశం మణులు చెక్కిన బంగారు ఒడ్డాణంతో మనోహరమై ఉన్నది. ఆయన నడుము కడిమిపువ్వుల కేసరాల కాంతులొలికే పట్టుపీతాంబరంతో ప్రకాశిస్తున్నది. ఆయన నాభి శృంగారతరంగిణి సుడివలె ఉన్నది. ఆయన మధ్యప్రదేశం (నడుము) కడుపులో సమస్త జగత్తులూ మాటిమాటికీ పుట్టుతున్నందువల్ల కృశించిందా అన్నట్లు ఉన్నది. ఆయన వక్షఃస్థలం మంచి ముత్యాలు కూర్చిన ముగ్గులతో ముచ్చటగా ప్రకాశిస్తూ, క్రొంగ్రొత్త తులసీమాలలనే చిగురుల పాన్పుతో ఒప్పుతూ పూలదండలతో అలంకృతమై, పచ్చకర్పూరం కస్తూరి మంచి గందం పూతలతో పరిమళిస్తూ, కౌస్తుభరత్న కాంతులతో వెలిగిపోతూ, శ్రీవత్సశోభితమై లక్ష్మీదేవు విహరించే విలాసమందిరమా అన్నట్లు ఉన్నది. శృంగార క్రీడకు ముందు గట్టిగా కౌగిలించుకొన్న లక్ష్మీదేవి చేతులందలి మణులు చెక్కిన బంగారుగాజులు ఒత్తుకున్న గుర్తులా ఉన్నట్లు ఆయన కంఠాన మూడురేఖలు కన్పిస్తున్నాయి. ఆయన చేతులు వెలకట్టరాని రమణీయ రత్నకాంతులతో విరాజిల్లే భుజకీర్తులతో, కంకణాలతో, ఉంగరాలతో అలంకృతములై ఉన్నాయి. ఆయన చెక్కుటద్దాలు సమస్తలోకుల బాధలను పోగొట్టగల చిరునవ్వు వెన్నెలలతో తెల్లనై కర్ణకుండలాల మణిప్రభల నాట్యాలతో తళతళలాడుతూ ఉన్నాయి. ఆయన క్రిందిపెదవి పండిన దొండపండులాగా, పగడంలా, చిగురుటాకులాగా అరుణారుణమై అలరారుతున్నది. ఆయన ముక్కు చక్కని సంపెంగ పువ్వులా, సమస్తలోకాలను పాలించడానికి చాలిన దానిని నేనంటే నే నని వాదులాడే కన్నులకు సరిహద్దుస్తంభం అన్నట్లు ఉన్నది. ఆయన కన్నులు కమలాలకూ, కలువలకూ శోభ చేకూర్చుతూ, కరుణామృతం పొంగిపొరలే కటాక్ష వీక్షణాలతో చెవులవరకు విస్తరిల్లి ఉన్నాయి. ఆయన చెవులు శ్రీకారానికి అక్షరానికి అక్షరమైన ఆకారం చేకూరుస్తున్నాయి. ఆయన కనుబొమలు మన్మథుని ధనుస్సులా అన్నట్లు ఉన్నాయి. ఆయన నెన్నుదురు బహుళపక్షం అష్టమినాటి చంద్రుడా అన్నట్లు కన్నుల విందు చేస్తున్నది. ఆయన శిరస్సుమీద పద్మరాగమణులు పొదిగిన బంగారు కిరీటం నీలపర్వత శిఖరంమీద ఉండే భాలసూర్యుణ్ణి తిరస్కరిస్తున్నది. సూర్యుడు, చంద్రుడు, వాయువు. అగ్ని వీని ప్రకాశానికి కూడా అవకాశం ఇవ్వకుండా, మూడులోకాల్లోనూ వ్యాపించడానికి సమర్థమైన తేజోవిశేషంతో విరాజిల్లుతూ ఉన్న ఆ దేవదేవుడు రణరంగాలలో రాక్షసుల సమూహాన్ని

చించి చెండాడ గల్గిన సుదర్శనం మొదలైన దివ్యాయుధాలు ధరించి ఉన్నాడు. అనన్యసామాన్యమైన దివ్యరూపంతో దేదిప్యమానంగా ప్రకాశిస్తూ ఉన్నాడు.

289 ఆ మహాత్ముడు హారాది అలంకారాలు పుష్పసమూహాలుగా, వెలకట్టరాని రత్నాలు చెక్కిన భుజకీర్తులతో ఉంగరాలతో, విరాజిల్లే వేలకొలది బాహువులు శాఖోపశాఖలుగా ప్రకాశిస్తూ, భువనానికి ఆత్మయై మూలం తెలియరానిదై పడగవిప్పిన మహాసర్పం చుట్టుకున్న చందన వృక్షంలా ఉన్నాడు.

290 పడగవిప్పిన సర్పరాజుతో కలిసి మెలసి ఉన్నందువల్లా, భూమిని మోస్తూ ఉండటంవల్లా, శిరోవిభూషణాలుగా ప్రకాశించే వేలకొలది కిరీటాలవంటి బంగారు శిఖరాలవల్లా, సముద్రజలమధ్యంలో నివసించడం వల్లా, మనోహరమైన కౌస్తుభాది రత్నాలు కలిగివుండటం వల్లా మహావిష్ణువు మైనాక పర్వతంలా చూడదగినవాడు అయ్యాడు.

291 విష్ణువు వైభవోపేతంగా ప్రకాశించే కీర్తి అనే పూలదండలు ధరించాడు; వాటికి ఆకర్షించబడి వేద సమూహాలు అనే విశేషమైన తుమ్మెదలు మూగాయి; అవి సామాన్యమైన తుమ్మెదలా? విస్తారమైన భావంతో జ్ఞానం, జపం, స్తోత్రం అనే తేనెలు త్రాగటంచే సంతోషించే విశేషమైన తుమ్మెదలు. అట్టి విష్ణుమూర్తిని చతుర్ముఖబ్రహ్మ చూసాడు.

బ్రహ్మదేవుని విష్ణుస్తోత్రంబు

292 అలా నాలుగు ముఖములు గల బ్రహ్మదేవుడు విష్ణుమూర్తిని చూసాడు.

293 పుణ్యాత్ముడా! విదురా! అలా బ్రహ్మదేవుడు సృష్టి అంతటికి ప్రభువూ, ఆది అంతమూ లేనివాడూ ధన్యుడూ, సకల భువనాలకూ మాన్యుడూ అయిన ఆ మహానుభావుని దర్శించాడు; అంతేకాదు ఆయన బొడ్డునుంచి పుట్టిన కమలాన్ని, జలాన్ని, అగ్నిని ఆకాశాన్ని మహాజగత్తు సృష్టించాలనే దృష్టినీ దర్శించాడు; ఆయనకు ఇంక ఇతరమైనవి ఏవి కనపడ లేదు; తనదైన సృష్టికార్యానికి బీజాంకురం అయిన రజోగుణం అతనిలో జనించింది; అమోఘమైన ప్రజా సృష్టికి సుముఖుడు అయినాడు; అంతుపట్టని వాడూ, అర్థం చేసికొనుటకు వీలు కాని వాడూ అయిన ఆ హరి యందు తన హృదయాన్ని కేంద్రీకరించాడు; అంతట మహాత్ముడూ, పురుషోత్తముడూ, అనంతుడూ, అభవుడూ, అమేయుడూ అయిన, పరాత్పరుణ్ణి బ్రహ్మదేవుడు ఈవిధంగా స్తుతించాడు.

294 "తామర పూలవంటి కన్నులు గల స్వామీ! నారాయణా! ఈ సృష్టి మాయాగుణంతో సంపర్కంవల్ల ఏర్పడింది. మా వంటి దేహధారులకు ఈ సృష్టి రూపంలో ప్రకాశించే నీ యొక్క ఘనమైన స్వరూపాన్ని నిరూపించటం సాధ్యం కాదు. కమలాక్షా! నీ స్వరూపం కంటె మరొకటి సత్యమైనది, తెలియదగినది లేదు. ఓ వరదా! సాటిలేని నీ మనోహర

రూపం నాకు సాక్షాత్కరించింది. నాలో వివేకం వికసించింది. జ్యోతిర్మయా! అటువంటి జ్ఞానం కలగడంచేత నీ రూపం నా అజ్ఞానం అనే పెనుచీకటిని పోగొట్టింది. అందువల్ల నీ రూపమే నా పాలిటికి శాశ్వతమైన జ్ఞానం అనే వెలుగును ప్రసాదించేది.

295 నీ రూపం గొప్పవారు ఉత్తములు అయిన వారిని అనుగ్రహించటానికై ధరించిన ఎన్నో అవతారాలకు మూలమై వెలుగొందునది, శుభప్రదం అయినది. నీ యొక్క నాభికమలం నుంచి పుట్టిన నేను. . .

296 లోకముల కన్నింటికి పావనుడవైన దేవా! నీ నాభికమలం నుంచి పుట్టిన నేను నీ రూపాన్ని చక్కగా తెలుసుకున్నాను. నీ స్వరూపం ఎంతో సుందరమైనది. స్వయం ప్రకాశమైనది.

297 జ్ఞానం చేతా ఆనందం చేతా పరిపూర్ణమైనదీ; ఆవరణలు లేని కాంతి కలదీ; తనకు వేరైనది ఏదీ లేనిదీ; ప్రపంచాన్ని సృష్టించేది; ప్రపంచం కంటె భిన్నమైనది; పంచభూతాలకూ; ఇంద్రియాలకూ ఆత్మవంటిది; అనన్యమైనదీ అయిన రూపాన్ని ధరించి కూడా ఎక్కడా ఆనమాలు కూడా దొరకకుండా ఉండే నిన్ను ఆశ్రయిస్తాను. నీవు లోకాలకంతకు శుభాన్ని చేకూర్చే రూపం ధరించిన వాడవు; నిరంతరం నిన్ను ధ్యానించే మాకు శుభాలను కల్గించడానికై ఈ దివ్యమైన రూపంతో కనపడ్డావు; నరకం అనుభవించేవారు అయి ఈశ్వరుడు లేడని వాదిస్తూ కుతర్కాలతో కాలం గడిపే దురదృష్టవంతులు నిన్ను గుర్తించ లేరు; ధన్యజీవులు అయిన కొందరు మహాత్ములు వేదాలనే మలయమారుతాలు తీసుకొని వచ్చిన మీ పాదపద్మాల సుగంధాన్ని వీనులవిందుగా ఆఘ్రాణిస్తారు. వారు భక్తితో పరవశించిన తమ హృదయకమలాలతో నీ పాదపద్మాలను అందుకుంటారు. నీవు ఆ భక్తుల మనస్సులలో ప్రకాశిస్తావు. అంతేకాక ప్రాణులకు ధనం, ఇల్లు అందలి ఆపేక్షవల్ల కలిగే భయం, అవి నాశనం కావడంచేత కలిగే దుఃఖం, దానిమీద ఆశ, దాని సంపాదనలో ఎదురయ్యే అవమానం ఇన్ని శ్రమలు పడి పొందే శోకానికి మూలమైన తృష్ణ. అవన్నీ నీ మంగళకరమైన చరణాబ్జాలను తలంచకుండా ఎంతకాలం ఉంటామో అంతకాలమూ ఉంటాయి. కాని మానవుల ఆత్మలకు అధినాయకుడైన నిన్ను ఆశ్రయిస్తే భయాన్ని పోగొట్టుకోవడానికి కారణమైన మోక్షం కలుగుతుంది. కొందరు అన్ని పాపాలూ పోగట్టగలిగే నీ నామ ధ్యాన సంకీర్తనలకు విముఖులై, మోహ సంబంధ మైన పనుల్లో మతి కోల్పోయి, ఇంద్రియాలకు దాసులై, అశుభాలైన కార్యాలు చేస్తూ ఉంటారు. ఇందువల్ల వాత పిత్త శ్లేష్మాలు అనే త్రిధాతువులకు మూలమైన ఆకలిదప్పుల బాధల చేతా శీతల ఉష్ణ వర్షం వాతం మొదలైన వానివల్ల ప్రాప్తించే దుఃఖం చేతా, అవధిలేని కామాగ్ని చేతా, ఎడతెగని కోపం చేతా తపించి పరితపిస్తారు. అటువంటి వారిని చూచి నా మనస్సు చాలా కలతపడుతుంది.

జీవుడు నీ మాయ కల్పించే భ్రమలలో కీలుబొమ్మ అయి దేహం కంటె ఆత్మ వేరని ఎప్పటి వరకు తెలుసుకోలేడో, అంతవరకు సారం లేని సంసారసాగరాన్ని దాటలేడు. శ్రేష్ఠులైన మునీంద్రులు కూడా, నీ నామ స్మరణాన్ని మరచి అన్య విషయాలపై ఆసక్తి కలవారయితే వారు పగలంతా పనికిమాలిన పనులలో పడి తిరుగుతూ, రాత్రిళ్లు నిద్రలో పడి, స్వప్నంలో కనిపించే అనేకమైన సంపదలకు సంతోషపడుతూ శరీరం అందలి రోగాది వికారాలకు విచారపడుతూ, ప్రయత్నాలన్నీ భగ్నంకాగా భూలోకంలో సంసారభంధాలలో చిక్కుకుని తిరుగుతారు. కోరికలు లేకుండా ధర్మమార్గంలొ నిన్ను సేవించే పుణ్యపురుషుల చెవులగుండా నీవు వారిలో ప్రవేశిస్తావు. నీపై భక్తి ప్రపత్తుల వల్ల పరిశుద్ధమైన వారి హృదయ కమల పీఠం మీద స్థిరంగా ఉంటావు.

298 ఓ మాధవా! విష్ణుమూర్తీ! ఉత్తములైన యోగీంద్రులు తమ యోగ సంప్రదాయాలతో తమ భావనలతో ఏ నీ మనోహర రూపాన్ని భావిస్తారో ఆ రూపం ధరించీ, ఏ నీ గుణగుణాల్ని సంభావిస్తారో అటువంటి గుణగుణాల తోనూ వారిని అనుగ్రహించే నిమిత్తం వారి ధ్యానాలలో ఎంతో సంతోషంతో సాక్షాత్కరిస్తావు.

అరయ నిష్కామధర్ము లైనట్టి భక్తు
లందు నీవు ప్రసన్నుండ వైనరీతి
హృదయముల బద్ధకాములై యెనయు దేవ
గణము లందుఁ బ్రసన్నతఁ గలుగ వీవు.

299 పరిశీలించి చూస్తే కోరికలు లేకుండా నిన్ను ఆరాధించే భక్తులను నీవు అనుగ్రహించినట్లు అంతులేని కోరికలతో నిండిన హృదయాలు గల దేవతలను కూడా అనుగ్రహించవు.

300 ఓ విష్ణుమూర్తీ! అచ్యుతా! నీవు సకల జీవుల హృదయాలలో అంతర్యామిగా ఉంటావు. అందరిలో అనితరుడవు అయి వెలుగొందుతావు. ఆప్యాయతకు అనుగుణంగా ప్రకాశించే ధర్మస్వరూపుడవు. ఇహపరాలకు నీవే అధీశ్వరుడవు. సజ్జనులకు సులభమూ, అసజ్జనులకు దుర్లభమూ అయిన సర్వ జీవ కారుణ్యం వల్ల మాత్రమే జనులకు దర్శనం ఇస్తావు.

301 ఓ రాక్షస సంహారా! దేవతా సార్వభౌమా! శ్రీమహావిష్ణూ! చేసే పనులు అన్నీ నీకే సమర్పించి, నీ యందే మనస్సు లగ్నంచేసి నీ పాదపద్మ ద్వయాన్నే నిరంతరం ఆరాధించే భక్తులను నీవు ఎంతో ఆప్యాయంగా ఆదరించి ఆదుకుంటావు. యజ్ఞాలు, దానాలు, కఠోర తపస్సులూ, జపాలూ, అగ్నిహోత్రాలూ, వ్రతాలూ, మొదలైన సత్కర్మలు ఆచరించేవారిని కూడా ఇంత ప్రేమగా ఆదరించవు.

302 ఓ లక్ష్మీపతీ! నీ స్వరూపం శాశ్వతమైనది. నీ అందలి చైతన్య మహా ప్రభావంవల్ల సమస్తమైన భేద భావాలనూ వ్యామోహాలనూ రూపుమాపుతావు. అఖండమైన విజ్ఞానానికి ఆశ్రయమైన నీకు నమస్కరిస్తున్నాను.

303 పుట్టుట, వృద్ధిపొందుట, చనిపోవుట, అనే మూడింటికి మూలకారణమైనది నీ మాయ. అటువంటి మాయా నటనలతో, లీలావిలాసంతో, నిరంతరము క్రీడించే ఓ పవిత్ర స్వరూపా! హరీ! నీకివే నా కైమోడ్పులు.

304 శ్రీమన్నారాయణా! నీవు పరమ పవిత్రుడవు. సచ్చరిత్రుడవు. శాశ్వతమైన దివ్య మంగళ స్వరూపం కల వాడవు. ఎల్లప్పుడూ లక్ష్మీదేవితో కూడి సంచరించే వాడవు, భక్తులకు కల్పవృక్షం వంటి వాడవు. దుర్భరమైన సంసార భయాన్ని దూరం చేసే వాడవు. నీ అవతారాలకు, సద్గుణాలకూ, సత్కార్యాలకూ, మహదాశయాలకూ కారణమైనవి, మనోహరమైనవీ అయిన , దాశరధీ, వాసుదేవ మున్నగు దివ్య నామాలను, మనుష్యులు తమ తుది గడియల్లో స్మరించి, అనేక జన్మములలో కూడబెట్టుకున్న పాపాలను పోగొట్టుకొని మోక్షం పొందుతారు. జన్మ లేని వాడవు అయి కూడా అటువంటి దివ్య అవతారాలతో జన్మించే నీకు మొక్కుతున్నాను.

305 ఈ విశ్వం ఒక మహావృక్షం; సృష్టి స్థితి లయ కారకుల మైన నేనూ నీవు శివుడు, ముగ్గురం ఈ వృక్షానికి మూడు శాఖలము; మనువులు, మరీచి మొదలైన ప్రజాపతులూ, దేవతలూ దాని ఉపశాఖలు; ఆ విశ్వవృక్షానికి ఆధారమైన కూకటివేరు నీవే. విశాలమైన దాని ఆకారం కూడా నీవే. అట్టి నీకిదే చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

306 పురుషోత్తమా! విష్ణుమూర్తీ! నీ పాదపద్మాలను పూజ చేయటం అనే మంచి పనిలో తన్మయత్వం చెందనివాడు పరమ మూఢుడు; పశువులాంటి వాడు; అధముడు. అలాంటి మానవులకు సర్వ సమర్థమైన కాలం త్వరగా ముసలితనాన్ని కలిగించి, వాడి వినాశనానికి దారితీస్తుంది. అలాంటి అనంతకాలానికి ఆత్మస్వరూపుడవు అయిన నీకు ఆనందంగా నమస్కరిస్తున్నాను.

307 ఓ దేవతలు అందరికి ప్రభువైన విష్ణుమూర్తీ! భక్తుల వేదనలను పోగొట్టే పరమేశా! ఈ విశాల విశ్వాన్ని భరించే విశ్వేశ్వరా! నీకు నమస్కారం. కల్పాంత సమయంలో చక్కగా ఉన్న తామరపువ్వు నందు నేను పుట్టాను. నీ సుందరమైన ఆకారాన్ని చూడగోరి చాలా సంవత్సరాలు తపస్సు చేశాను. యజ్ఞాలు కూడా ఎన్నో చేసాను. కానీ నీ జాడ అంతుచిక్కలేదు. మనసు బెదిరిపోయింది. ఇప్పుడు నీవు నాపై అకారణ అపార కరుణ కల వాడవు అయి సాక్షాత్కరించావు. అఖిల లోకాలకూ ఆరాధనీయమై, ఎల్లప్పుడూ ప్రసన్న కోమలమైన, ముఖపద్మంతో, విరాజిల్లే నీ దివ్యమంగళ విగ్రహాన్ని ఇప్పుడు కనులారా, కరువుతీరా దర్శించగలిగాను.

308 పురుషోత్తమా! శ్రీహరీ! నిర్మలమైన స్వరూపం కల వాడా! సంసారభయాన్ని దూరంచేసే పురుషోత్తముడా! నీవు భక్తజనులను సంతోషంగా పోషించే వాడివి. నీవు దేవతలు, జంతువులు, మనుష్యులు మున్నగు సచేతన రూపాలు ధరించి నీ సంకల్పానుసారంగా అవతరిస్తావు. మనోహరమైన మంగళ స్వరూపంతో ధర్మానికి సేతువుగా నిలుస్తావు. పేరు ప్రఖ్యాతులు గడిస్తావు. లౌకిక సుఖాలను విడిచిపెట్టి ఎల్లప్పుడూ అపారమైన ఆత్మానందాన్ని అనుభవిస్తావు. అందుకనే నీవు పురుషోత్తము డని ప్రశస్తి కాంచావు. అటువంటి నిన్ను నిత్యమూ స్తుతిస్తాను. ప్రీతితో నీ పాదాలను ఆశ్రయిస్తాను. మిక్కిలి భక్తితో నీకు నమస్కరిస్తాను.

309 తెల్లతామర రేకులవంటి కన్నులుగలవాడా! పద్మాక్షా! ఎల్లవేళలా ముల్లోకాలను చల్లగా రక్షించే శ్రీమన్నారాయణ! పంచభూతాలను ప్రవర్తింప చేసి. వాటి మహామాయాబంధాలలో చిక్కుపడకుండా లోకాలను నీ కడుపులో నిలుపుకుంటావు. ఉవ్వెత్తుగా లేచిపడుతున్న ఉత్తుంగ తరంగాలతో పొంగిపొరలే భయంకరమైన సముద్రం నడుమ శేషతల్పంమీద యోగనిద్రలో శయనించి ఉంటావు. కొంతకాలం గడిచాక మేల్కొంటావు. అప్పుడు నీసాటిలేని మేటి వైభవాన్ని వ్యక్తం చేస్తూ, నీ నాభికమలం నుంచి మూడు లోకాలను పుట్టింపచేస్తావు.

310 వేదాలచే వినుతించబడువాడా! శ్రీవల్లభ! విష్ణుమూర్తీ! నీవు లోకాలు అన్నిటికి అంతర్యామివి అయి ఉంటూ, ఈ సృష్టి యావత్తుకి భవ్యమైన నీ దివ్యవిభూతిచే లెక్కలేనన్ని ఆనందానుభూతులను అందిస్తావు కదా.

311 శ్రీమహావిష్ణువూ! పద్మాలవంటి కన్నులు కలవాడా! కోరిన వరాలను వర్షించేవాడా! పరమ కరుణార్ద్రమూర్తీ! వేదాలచే పొగడబడేవాడా! దేవతా చక్రవర్తీ! నీవు ఎలాంటి విజ్ఞానబలంతో ఈ సమస్త లోకాలను, సృష్టిస్తున్నావో నాకు అటువంటి ఉత్తమ జ్ఞానాన్ని ప్రసాదించు. నీకు నమస్కరించే జనులకు, నీవు ప్రియుడవు కదా, నా మనస్సులో, సృష్టించాలనే కోరిక మిక్కుటంగా ఉన్నది. అది చేయటానికి తగిన నైపుణ్యం కూడా నాకు అనుగ్రహించి కర్మలందలి ఒడిదుడుకులు వల్ల పాపం పొందకుండా ఉండే ఉపాయం ఏమిటో నాకు తెలుపు. కర్మజీవి నైన నన్ను కనికరించి కృతార్థుణ్ణి కావించు.

312 హరీ! భక్తుల భక్తికి చక్కటి ఫలాలను ప్రసాదించేవాడా! నీ కడుపున పుట్టిన కమలంలోనుంచి జన్మించిన నేను అపారమైన నీ అంశతో ప్రకాశించే ఈ విశ్వాన్ని సృష్టించడానికి పూనుకున్నాను. ఈ సందర్భంలో నేను పలురీతులుగా పలికే పలుకులు వేదరాశి అయి మంగళప్రదాలై ఫలించేటట్లు అనుగ్రహించు."

313 ఇలా పలికిన కమలసంభవుడు, బ్రహ్మదేవుడు కనికరం ఉట్టిపడేలా విష్ణుదేవునకు విన్నవించుకొని వినయంతో దండప్రణామాలు చేసాడు. "సర్వప్రపంచాన్ని,

సృష్టించడానికి పూనుకున్న నన్ను అందాలు చిందే కమలాలవంటి కన్నులతో వీక్షించి రక్షించడానికై, ఈ విధంగా సాక్షాత్కరించిన పరాత్పరుడు నా దుఃఖాన్ని దూరంచేయు గాక" అని తలవంచి నమస్కరించాడు.

314 ఇలా మ్రొక్కిన బ్రహ్మదేవుని నిండుమనసు ఆనందంతో పొంగిపోయింది." అని మైత్రేయ మహర్షి విజ్ఞానధనుడైన విదురునకు వివరంగా తెలియ చెప్పి, మళ్ళీ ఇలా అన్నాడు.

315 "పద్మంలో పుట్టినవాడు అయిన బ్రహ్మదేవుడు కేవలం తపస్సు పై ఆసక్తి కలవాడై పద్మాక్షుడూ, గోవిందుడూ, అనంతుడూ, పురుషోత్తముడూ అయిన పరమేశ్వరుణ్ణి ఎంతో ప్రస్తుతించాడు. అమృతం తాగే దేవతలకే దేవదేవుడైన హరి అనుగ్రహించాడు. సమస్త విశ్వాన్ని సంస్థాపించాలనే దృష్టితో ప్రళయాన్ని సృష్టించిన ఆ మహా జలప్రవాహం వైపు అలా అలవోకగా ఒక మాటు అవలోకించాడు.

316 అలా చూసి ఆర్తితో అడుగుతున్న బ్రహ్మదేవుని కోర్కె తీర్చాలని మదిలో భావించాడు. అతనిలోని వ్యామోహాన్ని తొలగించగలిగిన అమృతముతో సమానమైన తీయని మాటలతో ఇలా అన్నాడు.

317 "నీవు పూనుకొని చేస్తున్న పని వదలవద్దు. అనవసరంగా మనస్సుకు తెచ్చి పెట్టుకున్న దుఃఖాన్నిమాను. సృష్టి నిర్మాణం నా లీలలలో, ప్రధానమైనది. ఈ సృష్టి నిర్మాణ కార్యం చేయాలనే బుద్ధి హృదయంలో ప్రతిష్ఠించుకొని, సమాధినిష్ఠుడవై భక్తితో తపస్సు చేసి నన్ను ప్రసన్నుని చేసుకో. నీ కోరికలు నెరవేరుతాయి.

318 నీ తపస్సంపద వైభవం వెల్లడయ్యే ఈ సృష్టి నిర్మాణ కార్యాన్ని మొదలెట్టు. అప్పుడు, లోకం అంతా స్తుతించే బ్రహ్మా! సమస్తమైన లోకాలు అన్నిటిలోనూ ప్రకాశించే నన్ను కనుగొనగలవు.

319 ఓ విశ్వం అంతా వినుతించే బ్రహ్మా! కళ్ళల లోపల దాగి ఉన్న నిప్పులా, నాలో దాగి ఉన్న ప్రాణి సమూహాలన్నీ నీకు తప్పకుండా కనిపిస్తాయి. ఏదీ నువ్వు ఇప్పుడు చూడు.

320 సరోజసంభవా! బ్రహ్మా! సకల జీవులలోనూ అంతర్యామినై ఉండే నన్ను చక్కగా తెలుసుకొని సేవించు; నీదోషాలన్నీ తొలగిపోతాయి. (1. పృథివి, 2. జలము, 3. తేజస్సు, 4. వాయువు, 5. ఆకాశము ఇవి పంచ భూతాలు; 1. కళ్ళు, 2. ముక్కు, 3. చెవులు, 4. నోరు, 5. చర్మము, 6. నాలుక, 7. చేతులు, 8. కాళ్ళు, 9. మలద్వారము, 10. జననేంద్రియం ఇవి దశేంద్రియాలు). పంచభూతాలకూ, దశేంద్రియాలకూ అతీతుడైన జీవుడే ఆత్మ. పరిశుద్ధుడైన ఆత్మనూ, పరమాత్ముడనైన నన్నూ అభేదంగా దర్శించే మానవుడు మోక్షమార్గంలో పయనించేవాడు అయి ప్రకాశిస్తాడు. బ్రహ్మాండం అనే ఈ గోళంలో అనేక రకాల కర్మలకూ సానుకూలమై ప్రవర్తించే ఆయా అనేక రూపాలు గల

జీవులను నీవు సృష్టించుకున్నప్పటికీ నీమనస్సు నిత్యం నాపాదపద్మాల మీదనే లగ్నమై ఉన్నందువలన నీలోని రాజసగుణం నీకు పాపాన్ని కలిగించదు.

321 ఓ పితామహా! బ్రహ్మా! అంతేకాదు, నేను ఏ జీవులు ఏనాడూ తెలియలేని పుణ్యమూర్తిని, తేజోనిధిని, పరమేశ్వరుడను, అటువంటి నేనే ఇప్పుడు నీముందు సాక్షాత్కరించాను. చూసావు కదా.

322 1. పృథివి, 2. జలము, 3. తేజస్సు, 4. వాయువు, 5. ఆకాశము ఇవి పంచ భూతాలు; 1. కళ్ళు, 2. ముక్కు, 3. చెవులు, 4. నోరు, 5. చర్మము, 6. నాలుక, 7. చేతులు, 8. కాళ్ళు, 9. మలద్వారము, 10. జననేంద్రియం ఇవి దశేంద్రియాలు; 1, సత్వగుణము, 2. రజోగుణము, 3. తమోగుణము ఇవి త్రిగుణాలు. నేనే ఈ పంచభూతాలకూ, పది ఇంద్రియాలకూ, త్రిగుణాలకూ, అంతరాత్మను అనీ, జగత్తు అంతటా వ్యాపించినవాడననీ, నన్ను నీ మనస్సులో భావించు. అప్పుడు పద్మంకింద కాడ లో ఉన్న కన్నం వెంట వెళ్లి నీటిలో ఉన్న నన్ను చూడాలనుకున్న నా స్వరూపం ఇప్పుడు నీకు దర్శనం అయింది.

323 ఇప్పుడు నీకు దర్శనం అయిన నా స్వరూపంలోని సౌందర్య విశేషాలన్నీ దేవతలూ, ఆదిశేషుడూ, చివరకు ఆ పరమశివుడు కూడా మాటలలో వర్ణించలేరు. మనస్సులో ఊహించను కూడా ఊహించలేరు.

324 పద్మసంభవా! బ్రహ్మా! నా చరిత్ర, లీలా విలాసాలు కలిగిన కథలతో ప్రకాశించే ఈ పరమ పవిత్ర స్తోత్రం లోకాన్ని పవిత్రం చేస్తుంది. అందుచేత ఏమాత్రం సంశయం లేకుండా దీనిని నీ మనసులో స్థిరంగా నిలిపి ఉంచుకో.

325 కమలభవా! బ్రహ్మా! నిర్గుణుడనై, వినోదంకోసం జగత్తులను సృష్టించాలనుకున్న నన్ను సగుణ పరబ్రహ్మగా ప్రస్తుతించావు. నాకు ఎంతో సంతోషమైంది.

326 మహా బుద్ధిమంతుడా! బ్రహ్మా! నిశ్చింతగా నిశ్చలభక్తితో ఈ మనోహరమైన మహా స్తోత్రాన్ని నీ మనస్సు లో నిలుపుకో. నీ కోరికలన్నీ నిశ్చయంగా నెరవేరుతాయి.

327 ప్రతిరోజూ, ముల్లోకాలను పవిత్రంచేసే శుభప్రదమైన ఈ స్తోత్రాన్ని ఎవరైతే పఠిస్తారో వింటారో, వారికి కోరికలన్నింటినీ తీర్చు వాడనై నేను దర్శనమిస్తాను.

328 ఉద్యానవనాలు నెలకొల్పడం, చెరువులు తవ్వించడం, వివాహాలు ఉపనయనాలు చేయడం, దేవాలయాలు నిర్మించడం, భూదానాలు, మొదలైనవి చేయడం, జపతపాలు, వ్రతాలు, యాగాలు, యజ్ఞాలు, చేయడంవల్ల, ప్రాప్తించే ఫలాలు ఈ నా స్తోత్ర ఫలానికి ఏమాత్రం సమానం కాలేవు.

329 ఓ బ్రహ్మదేవా! సకల ప్రాణులను సృష్టిస్తూ, ఆ జీవాలు అన్నిటి అందు అంతర్యామినై వర్తిస్తూ, ప్రియ వస్తువులలో, అత్యధికమైన ప్రియ వస్తువునై ఉండే నన్ను నిత్యమూ ప్రీతితో స్మరింపుము.

330 బ్రహ్మా! నా సంతోషం కోసమే నిన్ను సృష్టికర్తగా సృష్టించాను. నాలో లీనమై దాగి చలనం లేకుండా ఉండే లోకాలను అన్నింటి నీవు చక్కగా సృజించు.

331 ఓ పుణ్యచరితుడా! బ్రహ్మా! అహంకారమే, మూలతత్వంగా గ్రహించి నువ్వు సృష్టి చెయ్యి" అని బ్రహ్మను ఆజ్ఞాపించి, అనంతరం భగవంతుడైన విష్ణువు అంతర్హితుడైనాడు."

బ్రహ్మ మానస సర్గంబు

332 ఇలా చెప్పిన మైత్రేయుడితో విదురుడు ఎంతో సంతోషంగా ఇలా చెప్పసాగాడు. "మైత్రేయా! నీవు సర్వ మానవజాతికి వందనీయుడవు. విష్ణువు అంతర్ధానమైన అనంతరం బ్రహ్మదేవుడు దేహ సంబంధంతో ఎలా సృష్టి నడిపాడు.

333 మరియు అమోఘమైన చింతనలు గలవాడా! దయాసముద్రుడా! మైత్రేయా! ఇంకా బ్రహ్మదేవుడు మానస సంబంధంతో ఈ సృష్టిని ఏవిధంగా చేసాడు. ఇదంతా నాకు చక్కగా వివరించి చెప్పు."

334 బ్రహ్మదేవుని మానస, దైహిక సృష్టుల గురించి అడిగిన విదురునితో మునిశ్రేష్ఠుడైన మైత్రేయుడు ఇలా అన్నాడు "పద్మాక్షుడు విష్ణువు ప్రసాదించిన వరాల ప్రభావము వల్ల, బ్రహ్మ వంద దివ్య సంవత్సరములు భగవంతుణ్ణి గూర్చి తపస్సు చేసాడు. అప్పుడు మహావాయువు వీచింది. ఆ గాలికి తన నివాసమైన పద్మం చలించింది. నీరు చలించింది. అది చూసి బ్రహ్మదేవుడు తన తపశ్శక్తిచేత వృద్ధిపొందిన విద్యాబలంతో వాయువును నిరోధించాడు. ఆ మహా జలాన్ని అంతా ఒక్క పర్యాయంగా త్రాగాడు. అనంతరం పైకి చూడగా ఆకాశమంతా నిండిన జలం కనిపించింది.

335 పద్మసంభవుడు, జ్ఞానులకు వందనీయుడు అయిన బ్రహ్మ, అప్పుడు తన హృదయంలో రాక్షసులకు శత్రువైన వాడూ, జలాలలో విహరించువాడూ, అందమైన హారాలు ధరించువాడూ, సమస్త దేవతల చేత నమస్కరించబడేవాడూ, లక్ష్మీదేవి హృదయాన్ని పొందినవాడూ, బహు ఉదారుడూ, సంసారదుఃఖాలను దూరం చేసేవాడూ, భవబంధాలను త్రెంచువాడూ, విద్వాంసులు వినుతించేవాడు, పాపాలను పటాపంచలు గావించేవాడూ అయిన భగవంతుణ్ణి తన మనస్సులో ధ్యానించాడు.

336 ఇలా ధ్యానించిన పద్మభవుడైన బ్రహ్మదేవుడికి ఆకాశంలో ఒక పద్మం కనిపించింది. ఆ తామర రేకులలో దాగి ఉన్న లోకాలన్నీ కనిపించాయి. అప్పుడు బ్రహ్మ తాను శ్రీహరిచే నియమింపబడినవాడ నని భావించాడు.

337 శ్రీ మహావిష్ణువు అనుజ్ఞ లభించినట్లు గ్రహించిన బ్రహ్మదేవుడు, మెల్లగా ఆ తామరపువ్వు లోనికి ప్రవేశించాడు. మొట్టమొదట అందులో ఉన్న మూడులోకాలనూ అవలోకించాడు. తర్వాత మహత్తరమైన తన శక్తి వినియోగించి, సులువుగా పద్నాలుగు భువనాలను చక్కగా సృష్టించాడు.

338 ప్రతిఫలం, ఆశించని తన పరమధర్మానికి, ఫల స్వరూపముగా, దేవతలు, పశు పక్ష్యాదులు, మానవులు ఇంకా అనేక రకాలైన స్థావరాలు మొదలైన వాటితో కూడిన నానావిధాలైన సృష్టిని క్రమంగా బ్రహ్మదేవుడు కొనసాగించాడు.

339 ఇలా కమలసంభవుడైన బ్రహ్మదేవుడు లోకాలను సృష్టించా" దని మైత్రేయుడు విదురునకు చెప్పాడు.

340 విదురుడు కొండలంతగా పేరుకుపోయిన పాపాలను అయినా వజ్రాయుధంలా ఖండించగల వాడు. అప్పుడు, ఆ విదురుడు హృదయంలో పొంగిపొరలే సంతోషంతో మైత్రేయుణ్ణి చూసి మెల్లగా ఇలా అన్నాడు "అంతుచిక్కనిది కదా మహావిష్ణువు మహిమ.

341 వివేకవంతుడవు అయిన మైత్రేయా! ఆ మహావిష్ణువు మహిమ వలననే కదా ఈ లోకాలన్నీ విలసిల్లాయి. అట్టి పరమాత్మ యొక్క కాలస్వరూపాన్నీ, దానిని గణించే విధానాన్ని, దాని లక్షణాలను నాకు విశదీకరించు" అని అడిగాడు. అప్పుడు విదురునితో మైత్రేయుడు ఇలా అన్నాడు.

342 "సదాచారసంపన్నుడవు అయిన విదురా! మొదలు తుది లేనిదీ, తరిగిపోనిదీ అయిన తత్వమే ఈ సృష్టికంతటికి ప్రధాన కారణం. అందువల్ల గుణాలూ, ఇంద్రియార్థాలూ మహత్తూ, పంచభూతాలూ, తన్ను ఆశ్రయించగా, ఈశ్వరుడు కాలానికి అనురూపమైన రూపం ధరించిన వాడై వినోదానికై తనను తాను సృష్టించుకున్నాడు. ఈవిధంగా సృష్టించిన సమస్త లోకాలందూ ఈశ్వరుడు ఉంటాడు. ఆ ఈశ్వరుని యందు సమస్త లోకాలూ ప్రకాశిస్తూ ఉంటాయి. కాబట్టి విశ్వానికి కార్యము కారణమూ రెండూ తానే. ఆ పరమపురుషుని శరీరంనుండి విడివడి ఈ విశ్వం విరాజిల్లుచున్నది. ఈవిధంగా వర్తమానసృష్టి ఏర్పడింది.

343 పురుషోత్తముని మాయ వలన, ఈ జగత్తు అంతా ఒక క్రమంలో పుట్టి, పెరిగి నశిస్తూ ఉంటుంది. ఇలాగే పూర్వకాలంలో జరిగింది. భవిష్యత్కాలంలో కూడ ఇదే విధంగా జరుగుతుంది.

344 {[సంక్షిప్తంగా సృష్టి రకాలు :– బ్రహ్మదేవుడు చేసిన నవ విధసర్గలుతోపాటు దేవసర్గ కలిసి దశవిధసర్గలు / సృష్టులు. అందులో నవవిధసర్గ (1) ప్రాకృతసృష్టులు ఆరు (అవి 1.మహత్తత్వం మొదటి సృష్టి. 2.అహంకారం తత్త్వం రెండవ సృష్టి. 3.పంచభూతాల సృష్టి మూడవది. 4.ఇంద్రియాల పుట్టుక నాలుగవ సృష్టి.

5.ఇంద్రియాధిదేవతల సృష్టి అయిదవది. 6.తామస సృష్టి ఆరవది.) మఱియు (2)వైకృతసృష్టులు మూడు (అవి 7.స్థావరములసృష్టి ఏడవది. 8.తిర్యక్కుల సృష్టి ఎనిమిదవది. 9– ఆర్వాక్ స్రోతము (మానవ) సృష్టి తొమ్మిదవది). ఇవి కాక 10.దేవ సర్గ పదవది)}}అటువంటి సృష్టి తొమ్మిది విధాలు. వాటిలో ప్రాకృతాలు, వైకృతాలు అనేవి రెండు రకాలు. కాలం, ద్రవ్యం, గుణం అనే రకాలు మూడు భేదాలతో ఉంటాయి. అవి పరస్పరం సంకరం అవుతూ ఉంటాయి. వాటిలో మహత్తత్వం మొదటి సృష్టి. ఆది నారాయణుని సమీపంలో గుణభేదాన్ని పొందుతుంది. ద్రవ్య జ్ఞాన క్రియాత్మకమైన అహంకారం తత్త్వం రెండవ సృష్టి. శబ్ద స్పర్శ రూప రస గంధాలు అనే పంచ తన్మాత్రల ద్రవ్యశక్తితో కూడిన పృథివి మున్నగు పంచభూతాల సృష్టి మూడవది. జ్ఞానేంద్రియాలైన చర్మం, కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు మరియు కర్మేంద్రియాలైన నోరు, చేతులు, కాళ్ళు, పాయువు, జననేంద్రియం కలిసి ఈ పది ఇంద్రియాల పుట్టుక నాలుగవ సృష్టి. సాత్వికాహంకారం వలన పుట్టిన దేవతాగణాల సృష్టి అయిదవది. అది కేవలం మనోమయమై ఉంటుంది. సకల ప్రాణులకు అజ్ఞాన కృత్యాలైన ఆవరణ విక్షేపాలు కలిగించే తామస సృష్టి ఆరవది. ఈ ఆరూ భగవంతుని లీలా విలాసాలయిన ప్రాకృత సృష్టులు. ఇక ఏడవదాని నుండి వైకృత సృష్టులను వినిపిస్తాను. విను, పూలు పూయకుండానే ఫలించే రావి, మేడి, పనస, మఱ్ఱి మొదలైన వనస్పతులు, పూచి ఫలించిన వెంటనే నశించే వడ్లు(బియ్యం), యవలు (గోధుమలు), పెసలు మున్నగు ఓషధులు, పైకి ఎగపాకడానికి అవకాశం లేని మాలతి, మల్లె, మొదలైన తీగలు, గట్టి బెరడు కలిగిన వెదుళ్ళు మొదలైనవి, నేలలో దృఢమైన వేళ్ళు కలిగి నేలపై బాగా విస్తరించే లతా విశేషాలైన దుబ్బులు, పొదలూ, పుష్పించి ఫలాలను ఇచ్చే మామిడి మొదలైన వృక్షాలు, అవ్యక్తమైన చైతన్యంతో పైకి పెల్లుబుకుతూ తమోమయాలై లోపల మాత్రమే స్పర్శ జ్ఞానం కలిగినవై కదలి పోలేని ఈ ఆరూ ఏడవ సృష్టి. ఇక ఎమిమిదవ సృష్టితో ఇరవై ఎనిమిది రకాల భేదాలు ఉన్నాయి. రేపు అనే జ్ఞానం లేనివై, ఆహారం మొదలైన వాటి యందు మాత్రమే ఆసక్తి కలవై, వాసన చూసి తెలుసుకోదగిన వాటిని తెలుసుకుంటూ, మనస్సులో పెద్దగా ఆలోచన చేయలేనివై, చీలిన గిట్టలు కలవైన ఎద్దు, ఎనుము, మేక, జింక, పంది, ఒంటె, గురుపోతు, నల్లచారల దుప్పి, పొట్టేలు ఈ తొమ్మిది; చీలని గిట్టలు గలవైన గాడిద, గుఱ్ఱం, కంచరగాడిద, గౌరమృగం, శరభమృగం, చమరీమృగం ఈ ఆరూ; అయిదు గోళ్ళు గలవైన కుక్క, నక్క, తోడేలు, పులి, పిల్లి, కుందేలు, ఏదు పంది, సింహం, కోతి, ఏనుగు, తాబేలు, ఉడుము ఈ పన్నెండు (ఇవన్నీ భూచరాలు) మొసలి మొదలైన జలచరాలూ, రాబందు, గ్రద్ద, కొంగ, డేగ, తెల్లపిట్ట, గబ్బిలం, నెమలి, హంస, బెగ్గురు పక్షి, జక్కవ పిట్ట, కాకి, గుడ్లగూబ, మొదలైన ఆకాశాన సంచరించేవి తిర్యక్కుల సృష్టి

ఎనిమిదవది. ఇక తొమ్మిదవది మానవ సృష్టి. ఇది రజోగుణంతో పురికొల్పబడి కర్మలు చేయటంలో నేర్పు కలిగి ఉంటుంది. దుఃఖంలో కూడా సుఖాన్నే కోరుతుంది. ఈ మూడు విధాలైన సృష్టులు వైకృత సృష్టులు. ఇక దేవ సర్గాన్ని గురించి చెప్తాను విను. అది కూడా ఎనిమిది విధాలు. అందులో విబుధులు, పితృదేవతలు,సురాదులు మూడు భేదాలు; గంధర్వులు, అప్సరసలూ, ఒకటీ; యక్షులు, రాక్షసులు, ఒకటీ; భూత, ప్రేత, పిశాచాల ఒకటీ, సిద్ధ చారణ విద్యాధరులు ఒకటీ, కిన్నర కింపురుషులు ఒకటీ; ఈ ఎనిమిది కలిసి దేవ సర్గం అయింది. ఇక మనువులనూ, మన్వంతరాలనూ తెలియజెప్తాను. కల్పారంభంలలో ఇదే విధంగా తన్ను తాను సృజించుకునే వాడూ, మొక్కవోని తలంపు కలవాడూ అయిన మహావిష్ణువు రజోగుణంతో కూడిన వాడై సృష్టికర్త అయి తన స్వరూపమే అయిన విశ్వాన్ని తన సామర్థ్యం వలన కల్పించాడు. ఆ ఈశ్వరుని మాయా విశేషం వలన ఈ సృష్టిలో నదులలోని నీటి సుడులలో పడి తిరిగే చెట్లలాగే ముందు వెనుకలు తెలియకుండా ఉంటాయి. ఈ కల్పంలో ఉన్న దేవతలూ, రాక్షసులూ మొదలైనవారు ఇలాగే ప్రతి మన్వంతరంలోనూ ఆయా నామ రూపాలతో వ్యవహరించబడతారు. ఇందులో మరో విశేషం ఉంది. అదేమిటంటే, కౌమారసర్గం అనేది దేవ సర్గంలో ఒక భాగమే అయినా ప్రాకృత వైకృతాలు రెంటి స్వభావమూ కలది. అందులో దైవత్వం మానుషత్వం కలిసి ఉంటాయి. ఇదే సనత్కుమారాది సర్గం. సఫల సంకల్పుడైన పురుషోత్తముడు తనకు తానే ఈ విధంగా వివిధ భేదాలతో కూడిన విశ్వాన్ని కల్పించాడు." అని మైత్రేయుడు విదురునికి చెప్పి కాల స్వభావం వివరించాలి అనుకున్నవాడై ఇలా అన్నాడు.

కాల నిర్ణయంబు 345 భగవంతుని సృష్టి కార్యానికి అంతు అనేది లేదు. దానికి వేరే వస్తువులతో, సంయోగంకూడా అవసరం లేదు. జగత్తులో కుండలు, బట్టలు, తయారయ్యే తీరు వేరు; సృష్టి నిర్మాణ తీరు వేరు. కుండ ఈ లోకంలో తయారు కావాలంటే, 1. మట్టి (ఉపాదానకారణం), 2. మట్టిని కుండగా రూపొందించటం (సమవాయ కారణం), 3. కుండను చేసేవాడు (నిమిత్త కారణం) అవసరం. అలానే బట్ట నిర్మాణం కూడా 1. ప్రత్తి (ఉపాదానం), దారాలు నేత (సమవాయి), బట్ట నేసే వాడు (నిమిత్తం). లోకంలో, ఏ కార్యానికైనా పై మూడూ అవసరం. భగవంతుని సృష్టిలో భగవంతుడు సమవాయ కారణం అవుతాడు. సూర్యుని కాంతి కిటికీలో నుండి ప్రసరించేటప్పుడు మన కంటికి కనిపించే, చిన్నచిన్న రేణువులలో, ఆరవ భాగానికి పరమాణువు అని పేరు. ఆ పరమాణువుపై ఒక ప్రక్క నుండి మరియొక ప్రక్కకు సూర్యకిరణం పయనించే కాలానికి, సూక్ష్మకాలం అని పేరు. సూక్ష్మకాలాన్ని కేవలం ఊహించుకోవలసిందే. అది మిక్కిలి అత్యల్పమైన కాల పరిమాణం. సూర్యుడు మేషం

మొదలైన పన్నెండు రాసులలో పయనించే కాల పరిమాణం పేరు మహత్కాలం. దీనికే, సంవత్సరం అని పేరు. (మహత్కాలానికి సూక్ష్మకాలానికి మధ్య నున్న వివిధ కాల పరిమాణాలు ఇకపై వివరించబడతాయి.)

346 రెండు పరమాణువులు ఒక అణువు. మూడు అణువులు ఒక త్రసరేణువు. మూడు త్రసరేణువులు ఒక త్రుటి. నూరు త్రుటులు వేధ, మూడు వేధలు ఒక లవం, మూడు లవాలు ఒక నిమేషం. మూడు నిమేషాలు ఒక్క క్షణం. ఐదు క్షణాలు ఒక్క కాష్ఠ. పది కాష్ఠలు ఒక లఘువు. పదిహేను లఘువులు ఒక నాడి. రెండు నాడులు ఒక ముహూర్తం. అట్టి నాడులు ఆరు కాని, ఏడు కాని అయినచో మనుష్యునకు ఒక ప్రహరం అవుతుంది. దానినే యామ మనీ లేదా జాము అని అంటారు. దిన పరిమాణాన్ని కొలిచే విధానం చెప్తాను విను, ఆరు ఫలాల రాగితో పాత్ర సిద్ధం చేసి, తులంలో మూడవవంతు బరువు గల బంగారంతో నాలుగు అంగుళాల పొడవైన కమ్మీ తయారుచేసి, దానితో ఆ పాత్ర క్రింద రంధ్రం, చేస్తే, ఆ రంధ్రంగుండా తూమెడు నీరు పూర్తిగా క్రిందకు కారడానికి ఎంత కాలం పడుతుందో అంతకాలాన్ని ఒక నాడి అంటారు. నాలుగు జాములు ఒక పగలు అవుతుంది. అదే విధంగా నాలుగు, జాములు ఒక రాత్రి అవుతుంది. పగలు రాత్రి కలిస్తే మానవులకు ఒక దినం. పదిహేను దినాలు ఒక పక్షం , శుక్లపక్షం కృష్ణ పక్షం అని రెండు పక్షాలు. ఈ రెండు పక్షాలూ కలిపి ఒక నెల. అది పితృ దేవతలకు ఒక దినం. రెండు నెలలు ఒక ఋతువు. ఆరు నెలలు ఒక ఆయనం, దక్షిణాయనం, ఉత్తరాయణం అని ఆయనాలు రెండు. ఈ రెండు కలిసిన పన్నెండు నెలలు ఒక సంవత్సరం. ఈ సంవత్సరం దేవతలకు ఒక్క దినం అవుతుంది. నూరు సంవత్సరాలు మానవులకు పరమాయువు. కాలమే ఆత్మగా గల సూర్యభగవానుడు గ్రహాలతో నక్షత్రాలతో కూడిన తారాచక్రంలో ఉన్న వాడై పరమాణువు మొదలుకొని సంవత్సర పర్యంతమైన కాలంలో పన్నెండు రాసులను చుట్టి వస్తాడు. ఈ విధమైన సూర్యగమనం వలన సౌరమానం చంద్రమానం నక్షత్రమానం, అనే భేదాలతో సంవత్సర కాలము ఏర్పడుచున్నది. ఇది సంవత్సరము, పరీవత్సరం, ఇడావత్సరం, అనువత్సరం, వత్సరం అనే భేదాలు కలిగి ఉంటుంది. ఈ ఐదు విధాలైన వత్సరాలను ప్రవర్తింపచేసే సూర్యుడు విత్తనాలనుండి అంకురాలు మొలకెత్తించినట్లు కాలరూపమైన తన శక్తితో జీవ సృష్టిని అనుకూలం చేసుకుంటూ, ఆయుష్షు హరిస్తూ, మానవుల విషయాసక్తిని విస్తరింపచేస్తూ, కోరికలు కలవారికి యజ్ఞాల ద్వారా స్వర్గ ఫలాన్ని సమకూరుస్తూనే, ఆకాశంలో పరుగులు తీస్తుంటాడు. పైన చెప్పిన ఐదు విధాలైన వత్సరాలనూ ప్రవర్తింపచేసే సూర్యభగవానుణ్ణి పూజించు" అని మైత్రేయుడు పలకగా విదురుడు ఈ విధంగా అన్నాడు.

347 "మహర్షీ! మైత్రేయా! మానవులు, పితృదేవతలు, దేవతలు, వీరి పరమాయువుల పరిమాణాలను తెలిపావు. ముల్లోకాలూ, పై లోకాలు దర్శించే వారి విశేషాలు వివరించు.
348 ఋషీశ్వరా! మైత్రేయా! ధృఢమైన యోగసిద్ధి వల్ల ప్రాప్తించిన నేత్రాలతో బాహ్య జ్ఞానం కలిగి, లోకాలను ఆలోకించే వారికి కలిగే, కాలపరిమాణం ఎటువంటిదో నాకు తెలుపుము." అనగా మహనీయుడైన మైత్రేయుడు విదురుని ఆదరపూర్వకంగా వీక్షించి ఈ విధంగా అన్నాడు.

చతుర్యుగ పరిమాణంబు

349 జనుల అభిమానం అందుకున్నవాడా! పవిత్ర చరితా! విదురా! విను, కృతయుగం నాలుగువేల దివ్యసంవత్సరాలు ప్రమాణం కలది. దాని సంధ్యాకాలం ఎనిమిదివందల ఏళ్ళు. ఒక యుగానికి మరొక యుగానికి మధ్య కాలాన్ని, సంధ్య అంటారు. త్రేతాయుగ ప్రమాణం మూడువేలదివ్య సంవత్సరాలు. సంధ్యాకాలం ఆరువందల ఏళ్ళు. ద్వాపరయుగ ప్రమాణం రెండువేల దివ్యసంవత్సరాలు. సంధ్యాకాలం నాలుగువందల సంవత్సరాలు. కలియుగ ప్రమాణం వెయ్యి దివ్యసంవత్సరాలు. సంధ్యాకాలం రెండువందల సంవత్సరాలు. ఈ సంధ్యాకాలం మధ్య కాలంలో ధర్మం అధికంగా ఉంటుంది. సంధ్యాంకంలో ధర్మం అల్పమై ఉంటుంది.
350 ఇంకా; ధర్మదేవత కృతయుగంలో నాలుగు పాదాలతోనూ, త్రేతాయుగంలో మూడు పాదాలతోనూ, ద్వాపరయుగంలో రెండు పాదాలతోనూ, కలియుగంలో ఒక్క పాదంతోనూ నడుస్తూ ఉంటుంది.
351 ఈ పాదాల వ్యత్యాసాల వలన ప్రజలు పరిధులు తప్పి నడుస్తారు. మర్యాదలు తగ్గిపోతూ ఉంటాయి. దానితో సమంగా అధర్మం ఆవిర్భవించి అభివృద్ధి పొందుతుంది. లోకంలో బ్రాహ్మణులు విపరీత బుద్ధులు యందు ఆసక్తిగలవారు అయి మెలగుతారు.
352 భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం కంటె పైన సత్యలోకం అని ఒకటుంది. ఆ సత్యలోకంలో ఉండే బ్రహ్మదేవునికి, కృత, త్రేత, ద్వాపర, కలి యుగాలు నాలుగు కలిపిన మహాయుగాలు వేయి గడిస్తే, ఒక్క దినం అవుతుంది. రాత్రి కూడా అంతే పరిమాణం కలిగి ఉంటుంది. బ్రహ్మ నిద్రపోతే, లోకాలకు ప్రళయం వస్తుంది. నిద్ర మేల్కొని చూస్తే మళ్లి లోకాలు పుడతాయి. బ్రహ్మదేవుని ఆ ఒక్క దినంలో పద్నాలుగు మంది మనువులు ఉద్భవిస్తారు. అంటే పద్నాలుగు మన్వంతరాలు గడుస్తాయి అన్నమాట. వారిలో ఒక్కొక్క మనువు కాలం (మన్వంతరం) డెబ్బది ఒక్క దివ్యయుగాలు. అట్టి మనువు కాలాన్నే మన్వంతరం అంటారు. మనువులు, దేవతలు, మునులు, సప్తర్షులు, భగవంతుని అంశతో ఆయా మన్వంతరాలలో పుట్టి లోకాలను పాలిస్తారు.
353 ఈ మన్వంతరాలలో శ్రీహరి పితృ, దేవ, పశు, పక్షి, మానవ రూపాల్లో ఉద్భవించినవాడు అయి ఆత్మ శక్తితో పౌరుష ప్రతాపాలతో విశ్వాన్ని పరిపాలిస్తాడు.

354 వరసగా మూడు వర్గాల సృష్టి విశేషాలనూ చెప్పాను కదా. అలా బ్రహ్మకు పగలు పూర్తి అయి రాత్రి కాగానే నిద్రపోతాడు. ఆయన శక్తి సామర్థ్యాలు అంధకారంతో ఆచరింపబడతాయి.

355 ఆ బ్రహ్మదేవుని రాత్రి సమయంలో మూడు లోకాలూ సూర్యచంద్రులతోపాటు కటిక చీకటితో కప్పబడి ఉంటాయి. సర్వాత్ముడైన విష్ణుదేవుని శక్తిరూపమైన సంకర్షణాగ్ని విజృంభిస్తుంది. ఆ అగ్ని జ్వాలలు ముల్లోకాలను దహించివేస్తాయి. తీక్షణమైన ఆ మంటల వేడికి తట్టుకోలేక తపించి మహర్లోక వాసులు జన లోకానికి వెళతారు. అప్పుడు ఆ ప్రళయకాలంలో భయంకరంగా ప్రచండ వాయువులు వీస్తాయి. ఆ వాయువుల వేగానికి ఉత్తుంగతరంగాలతో ఉప్పొంగిన మహాసముద్ర జలాలు మూడు జగాలనూ ముంచి వేస్తాయి. ఆ మహాసముద్ర మధ్యంలో రమాపతి, శ్రీమన్నారాయణుడు శయనించి ఉంటాడు.

356 అందమైన మంచిగంధలాగా, వజ్రంలాగ, కర్పూరంలాగ, మంచు బిందువులు లాగా, హంసలాగా, నిండు వెన్నెలలాగా, తామరతూడులాగా, ముత్యాలహారంలాగ, పున్నమ నాటి చందమామలాగా, రెల్లుపూవులాగా, మల్లెమొగ్గలాగ, తెల్లని కాంతులు విరిసే శేషశయ్య మీద, యోగనిద్రా ముద్రితుడై, చల్లగా శయనించి ఉన్న ఆ నల్లనయ్య ఉదరంలో భూ భువర్ సువర్ మున్నగు సహా ఎల్ల లోకాలూ విలసిల్లుతుంటాయి.

357 జనలోక నివాసులైన పుణ్యాత్ములు ఎన్నో విధాల స్తుతిస్తుండగా, సాటిలేని దివ్యమైన వెలుగులు వెదజల్లుతూ, శేషతల్పంమీద కన్నులు మోడ్చి స్వామి చక్కగా శయనించి ఉంటాడు.

358 ఈవిధంగా

359 ఈవిధంగా అనేక విధాలైన కాలగమనాలతో కూడిన, పగళ్ళు రాత్రులు గడిచిపోతుంటాయి. మానవుల ఆయుఃప్రమాణం వంద సంవత్సరాలు. అలాగే బ్రహ్మదేవుని ఆయుఃప్రమాణం కూడా నూరు బ్రహ్మ సంవత్సరాలే. ఆ నూరు సంవత్సరాల మొదటి సగాన్ని పూర్వపరార్ధం అని; రెండవ సగాన్ని ద్వితీయపరార్ధ మని అంటారు. ఇలాంటి పూర్వపరార్ధం కాలం బ్రహ్మకల్పం అన్నారు. దీనినే శబ్దబ్రహ్మం అని కూడా అంటారు.

360 విదురుడా! వినవయ్యా! లోకాలు అన్నింటికీ ఆశ్రయమై ఉండే పద్మం, పద్మనాభుడు నారాయణుని నాభి అనే సరస్సునుంచి, ఉద్భవించిన ఆ సమయం పద్మకల్పంగా ప్రసిద్ధికెక్కింది.

361 పూర్వపరార్ధం ఆది లోని బ్రహ్మ కల్పాన్ని గూర్చి చెప్పాను విన్నావు కదా; ఇక ద్వితీయపరార్ధం సంగతి విను. ఈ ద్వితీయపరార్ధం మొదట్లో హరి వరాహ రూపాన్ని

ఎప్పుడు ధరిస్తాడో అది వరాహకల్పం అంటారు. అటువంటి వరాహకల్పం ఇప్పుడు జరుగుతూ ఉంది.

362 కాలస్వరూపుడు అయి ప్రకాశించేవాడూ, కమలాల వంటి కన్నులు గలవాడు, ఆద్యంతాలు లేని మహాపురుషుడు, పురాణపురుషుడు, అఖిల లోకాలకూ ఆత్మ అయినవాడు అయిన పరమేశ్వరునకు, పరమాణువు మొదలుకుని పరార్ధం పర్యంతం గల కాలం ఒక్క నిమేషంతో సమానం అవుతుంది. కనుకనే భగవంతుడే కాలానికి కర్త; కాని కాలం భగవంతునికి కర్త కాదు. అంతేకాక దేహాలూ, గృహాలూ, సంపదలూ, మొదలైన వాటియందు అభిమానం కలవారికి ఆశ్రయమైనది కాలం. భగవంతుడు ఆ గుణాలకు అతీతుడు. అందుకే ఆయన కర్త యై కాలాన్ని నడిపించుతాడు. కానీ ఆయన్ని కాలం నడిపించదు.

363 ఏకాదశేంద్రియములు 11 [పంచ జ్ఞానేంద్రియములు (కన్ను, ముక్కు, నాలుక, చెవి, చర్మము), పంచ కర్మేంద్రియములు (కాళ్ళు, చేతులు, వాక్కు, గుదము, గుహ్యేంద్రియము), బుద్ధి] మరియు పంచ భూతములు 5 (భూమి, జలము, వాయువు, అగ్ని, ఆకాశము) అనే పదహారు వికారములతో కూడి; పృథ్వి జలం వాయువు తేజస్సు ఆకాశం అనే పంచభూతాలతో అవరించబడి; 1 పృథివి 2 వాయువు 3 అప్పు 4 తేజస్సు 5 ఆకాశము 6 అహంకారము 7 మనోమయము 8 జ్ఞానమయము 9 మహత్త్వము 10 ప్రకృతి అనే పది విధాలైన ఆవరణలు కలిగి; అయిదు వందల కోట్ల యోజనాల విస్తీర్ణం కలది అయి బ్రహ్మాండకోశం విరాజిల్లుతుంది.

364 లెక్కలేనన్ని మహా బ్రహ్మాండకోశాలు తన ఉదరంలో పదిలపరచుకొని ఉండే పరమేశ్వరుడైన విష్ణువు, పరమాణు రూపంతో ఆ బ్రహ్మాండకోశంలో ప్రకాశిస్తూ ఉంటాడు. తాజాగా వికసించిన కమలాలవంటి కన్నులు గల వాడు, అంతం లేనివాడూ, ఆదిదేవుడూ, అక్షర పరబ్రహ్మమూ అయిన ఆ పరమాత్మ సమస్త కారణాలకూ కారణమైనవాడే అయినప్పటికీ వాటితో ఎటువంటి సంబంధం లేనివాడై ఉంటాడు.

365 సరిపోల్చరానిది అయిన అఖండ అద్భుత తేజస్సుతో విరాజిల్లే ఆ పరమపురుషుణ్ణి, ఆ పరాత్పరుణ్ణి, ఆ మహావిష్ణువును అభివర్ణించడానికి బ్రహ్మదేవునికీ, పరమశివునికీ కూడా సాధ్యం కాదు."

366 ఇలా చెప్పిన మైత్రేయుడు, విదురుణ్ణి చూసి మళ్ళీ ఇలా అన్నాడు "కాలస్వరూపుడు అయిన, శ్రీమహావిష్ణువు మహిమలను నీకు వినిపించాను. ఇంక సృష్టి విశేషాలను చెప్తా విను.

సృష్టి భేదనంబు 367 బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభంలో అహంకార పూరితమైన దేహాభిమానం గల "మోహం" పుట్టింది; దేహాభిమానం వల్ల స్త్రీ సంభోగం, చందనం, పూలదండలు, మొదలైన గ్రామ్య భోగాలపై ఆసక్తి గల "మహామోహం" పుట్టింది; ఈ కోరికలకు విఘ్నం వలన కలుగు క్రోధంలో కనులు మూసుకుపోయే స్థితి (మహా అజ్ఞానం /గుడ్డి చీకటి) ఏర్పడింది. అదే "అంధతామిస్రం"; శరీరమోహం వలన శరీరనాశన భయం మృత్యుభీతి నేను చచ్చిపోతాను అనే భయం ఏర్పడింది. ఇది "తామిస్రం" అజ్ఞానం / చీకటి; పై అన్నిటితో మనస్సుకు సంచలనం ఏర్పడింది. ఇది "చిత్త విభ్రమం"; 1) మోహం, 2) మహామోహం, 3) అంధతామిస్రం, 4) తామిస్రం, 5) చిత్త విభ్రమం అనే ఈ అయిదింటికి అవిద్యాపంచకం, అని పేరు; అవిద్యాపంచకంతో కూడిన భూతకోటిని పుట్టించుట తాను చేసిన "పాపకార్యం" అని బ్రహ్మదేవుడు గుర్తించాడు. మనసులో పశ్చాత్తాపం చెందాడు. బ్రహ్మదేవుడు భగవంతుణ్ణి భగవంతుని ధ్యానం అనే అమృతం వలన ఆయన మనసు పావనం అయింది. అలా పవిత్రుడైన చతుర్ముఖుడు తన దివ్యదృష్టితో అస్ఖలిత బ్రహ్మచారులు, పరమ పావనులు, సత్వగుణ సంపన్నులు, ధీరవరేణ్యులు, మాన్యులు అయిన సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు అను నలుగురు మునులను సృష్టించాడు. భగవదనురక్తులైన వారితో "మీమీ అంశలతో ప్రజల్ని సృష్టించి ప్రపంచాన్ని వృద్ధి చేయండి" అన్నాడు. బ్రహ్మదేవుని మాటలు విన్న సనకాదులకు నవ్వు వచ్చింది. మోక్షాసక్తులు, శ్రీమహావిష్ణువు పరమ భక్తులు అయిన వారు పద్మసంభవుని అపహాస్యం చేస్తూ ప్రపంచ నిర్మాణానికి ప్రతికూలంగా మాట్లాడారు. వారు తన ఆజ్ఞను తిరస్కరించినందుకు చతుర్ముఖునికి కోపం వచ్చింది. బుద్ధిబలంతో ఆ ఆగ్రహాన్ని ఎంత నిగ్రహించుకున్నా ఆయన కనుబొమల నడుమ నుండి నీలం, ఎరుపు రంగుతో "నీలలోహితుడు" పుట్టాడు. అతడు పుడుతూనే పెద్దగా రోదనం చేసాడు.

368 ఆవిధంగా జన్మించిన నీలలోహితుడు బ్రహ్మదేవుని "ఓ దేవా! నేను ఎవరిని? నా పేరు ఏమిటి? నా నివాస స్థలం ఏమిటి?" అంటూ ప్రశ్నించాడు. అప్పుడు పద్మం లో పుట్టిన ఆ చతుర్ముఖుడు అతనిని లాలిస్తూ ఇలా అన్నాడు "పుత్రా! నువ్వు పుట్టగానే గట్టిగా ఏడ్చావు కదా!

369 అలా పుట్టగానే రోదన చేయటం వలన నీకు "రుద్రుడు" అనే పేరు స్థిరపడింది. 1) చంద్రుడు, 2) సూర్యుడు, 3) అగ్ని, 4) వాయువు, 5) జలం, 6) ఆకాశం, 7) భూమి, 8) ప్రాణం, 9) తపస్సు, 10) హృదయం మరియు 11) ఇంద్రియాలు అనే పదకొండు నీకు నివాస స్థానాలు." అని బ్రహ్మదేవుడు చెప్పాడు. వాటిని ఏకాదశ రుద్ర నివాస స్థానాలు అంటారు.

370 అలా చెప్పిన బ్రహ్మదేవుడు రుద్రునితో ఇంకా ఇలా అన్నాడు "అంతేకాదు కుమారా! మన్యువు, మనువు, మహాకాలుడు, మహత్తు, శివుడు, ఋతధ్వజుడు, ఉరురేతసుడు, భవుడు, కాలుడు, వామదేవుడు, ధృతవ్రతుడు అనే ఏకాదశనామాలు కలిగి ఉండు. ధీ, వృత్తి, అశన, ఉమ, నియుతి, సర్పి, ఇల, అంబిక, ఇరావతి, సుధ, దీక్ష అనే పేర్లు కలిగిన ఏకాదశ పత్నులుతో కూడి, ఇంతకు ముందు నిర్దేశించిన ఏకాదశ నామాలతో, ఏకాదశ భార్యలతో ఆయా ఏకాదశ స్థానాలు (చంద్రుడు, సూర్యుడు, అగ్ని, వాయువు, జలం, ఆకాశం, భూమి, ప్రాణం, తపస్సు, హృదయం, ఇంద్రియాలు) యందు ఉంటూ ప్రజల్ని సృష్టించు" అని విశ్వానికి గురువు అయిన బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించాడు. ఆ ప్రకారంగా తనతో సమానమైన సత్తువ (బలం), ఆకారం, స్వభావం కలిగిన ప్రజలను సృష్టించాడు.

371 రుద్రుడు ఈ విధంగా రుద్రుడు సృష్టించిన రుద్రగణాలు ఈ విశ్వాన్నంతా అనాయాసంగా, అమాంతం మ్రింగేశాయి. ఆ మహా ప్రమాదాన్ని శాంతింపచేయటానికై బ్రహ్మదేవుడు వారిని చేరపిలిచి "కుమారులారా! చూసారా! మీ చూపుల అగ్నిజ్వాలలలో సమస్తలోకాలూ మండిపోయాయి.

372 నాయనలారా! మీరు బుద్ధిమంతులు, ధైర్యవంతులు, నా మాట వినండి. ఇంక చాలు; మీరు సృష్టించటం చాలించండి. చక్కగా అరణ్యాలకు వెళ్ళి ఏకాగ్రచిత్తులై, తపస్సు చేసుకోండి. మీకు తప్పక శుభం కలుగుతుంది.

373 శ్రీమన్నారాయణుడు భగవంతుడు, పురుషోత్తముడు కరుణాసముద్రుడు, లక్ష్మీవల్లభుడు, సద్గుణసంపన్నుడు, అచ్యుతుడు, పరమాత్ముడు, పరంజ్యోతి, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి, అధోక్షజుడు, జగన్నాథుడు, ఆర్త జన రక్షా పరాయణుడు; అయనను సుజ్ఞానులు తమ తపశ్శక్తివల్ల దర్శించగలుగుతారు. మీరు కూడా తపస్సు చేసి ఆయనను దర్శించండి" అన్నాడు బ్రహ్మదేవుడు.

374 రుద్రులు ఇలా చెప్పిన బ్రహ్మదేవుని మాట విన్నారు.

375 ఆ సచ్చరిత్రులైన రుద్రులు చతుర్ముఖుని ఆజ్ఞానుసారం తమ రౌద్రావేశాన్ని అణుచుకున్నారు. ఉద్రేకాన్ని తగ్గించుకున్నారు. అరణ్యాలకు వెళ్ళి తపోనిమగ్నులైయ్యారు. అనంతరం బ్రహ్మ ప్రపంచాన్ని సృష్టించాలనే దృష్టి కలవాడై ఈసారి మానవ లోకానికి శరణ్యులూ మతిమంతులలో, అగ్రగణ్యులూ అయిన వారిని సృజించాడు.

376 భగవంతుని అనుగ్రహ బలంతో కూడిన సద్గుణాలు కలవారు, జీవుల అభివృద్ధికి కారణభూతులు, బ్రహ్మతో సమానమైన ప్రభావం కలవారు, విశాలమైన యశస్సు కలవారు, అయిన పదిమంది కొడుకులు బ్రహ్మదేవుడుకు జనించారు.

377 బ్రహ్మ బొటనవ్రేలు నుండి "దక్షుడు", తొడనుండి "నారదుడు", నాభి నుండి "పులహుడు", చెవులనుండి "పులస్త్యుడు", చర్మంనుండి "భృగువు", చేతి నుండి "క్రతువు", ముఖంనుండి "అంగిరసుడు", ప్రాణంనుండి వశిష్టుడు, మనస్సునుండి మరీచి, కన్నులనుండి "అత్రి" ఆవిర్భవించారు. ఈవిధంగా పదిమంది కుమారులు పుట్టారు. ఇంకా బ్రహ్మ దేవుని కుడి వైపు స్తనంనుండి "ధర్మం" జనించింది. వెన్నునుండి లోకభయంకరమైన "మృత్యువూ", జనించాయి. ఆత్మనుండి "మన్మథుడు" పుట్టాడు.

378 బ్రహ్మదేవుని కనుబొమ్మలనుండి "క్రోధం" , పెదవులనుండి, "లోభం" పుట్టింది; ముఖమునుండి "సరస్వతి"; పురుషాంగం నుండి "సముద్రాలు"; మలద్వారం నుండి పాపాశ్రయుడైన "నిరృతి", నీడనుండి దేవహుతి భర్త యగు "కర్దముడు" జన్మించారు. అంత బ్రహ్మదేవుడు తన దేహం నుండి పుట్టిన సరస్వతిని చూసి ఆమె సౌందర్యానికి మోహపరవశుడు అయ్యాడు. మన్మథుని పుష్పబాణాలు ఆయన హృదయాన్ని భేదించాయి. కన్నకూతురు అనే సంకోచం లేకుండా పాపానికి వెనుకాడక వ్యామోహంతో ఆమె వెంటపడ్డాడు. తమ తండ్రి దుశ్చర్యను మరీచి మొదలుగాగల మునివర్యులకు తెలిసింది.

379 బ్రహ్మదేవుని దుశ్చర్యను మరీచి మొదలుగాగల మునివర్యులు తెలుసుకొని ఇలా అన్నారు.

380 "ఓ పద్మంలో పుట్టిన బ్రహ్మదేవుడా! చాలు చాలయ్యా. సన్మార్గాన్ని కాలదన్ని కన్నకూతురుపై కన్నేసి కలవాలని చూస్తున్నావు. ఇదెక్కడి ధర్మమయ్యా! ఎంతటి మోసగాడిని అయ్యావు. ఇంతటి పాపానికి ఒడిగట్టి, నీ న్యాయం, పెద్దరికం మట్టిపాలుచేసావు. నీ శీలం అంతా పోయింది. ఇలా చేసిన ఘనులు ఇంతకుముందు ఎప్పుడైనా ఉన్నారా.

381 నీవు మహానుభావుడవు. నిర్మల చరిత్ర కలవాడవు. కదా లోకులు వింటే ఏమనుకుంటారు? విధాత విధినిషేధాలు తెలియకుండా ప్రవర్తించాడనుకోరా? బ్రహ్మదేవుడు వావి వరుసలు వదలిపెట్టి మన్మథబాణాలకు లొంగిపోయి, కన్నబిడ్డనే కామించాడని చెడతిట్టరా?

382 పాపకృత్యం అని అనుకోకుండా క్షణికమైన సౌఖ్యానికి ఈ నీచానికి పాల్పడ్డావు. కామాంధుడికి కళ్ళు కన్పించవు. అని లోకోక్తి ఉండనే ఉన్నది కదా."

383 అని ఇలా మునీంద్రులు మందలించి పలికిన ములుగుల వంటి పలుకులు విని బ్రహ్మదేవుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. వెంటనే తన శరీరాన్ని విడిచిపెట్టాడు. దిక్కులు వచ్చి ఆ శరీరాన్ని ఆక్రమించాయి. వెంటనే ఆ దిక్కులలో నుంచి చీకటి, మంచూ ఉద్భవించాయి.

384 అంతట

385 అటుమీద బ్రహ్మదేవుడు ధైర్యం వదలక, మరొక దేహాన్ని ధరించాడు. సృష్టికి పూర్వం సంప్రాప్తమైన సృజన శక్తి తనకు అప్పుడు లేకపోవడంతో అంతరంగంలో ఎంతగానో చింతిస్తూ ఉండిపోయాడు. అంతలో అతని ముఖంనుండి పరమధర్మ ప్రబోధాలైన వేదాలు పరిపూర్ణ స్వరూపాలతో ఆవిర్భవించాయి.

386 అంతేకాదు, యజ్ఞాలు, పుణ్య కృత్యాలు, తంత్రాలు సదాచారాలు, బ్రహ్మచర్యం మున్నగు చతురాశ్రమాలు, ఆయన నాలుగు మోములనుండి జన్మించాయి." అని చెప్పగా విని విదురుడు మైత్రేయుణ్ణి చూసి ఇలా అన్నాడు.

స్వాయంభువు జన్మంబు

387 "మహా జ్ఞాని అయిన బ్రహ్మదేవుని ఏయే ముఖంనుండి ఏయే సృష్టి చేసాడో అదంతా నాకు తెలిసేలా చెప్పు."

388 ఇలా అడిగిన విదురునితో మైత్రేయుడు ఇలా అన్నాడు "బ్రహ్మదేవుని తూర్పు వైపు ముఖమునుండి "ఋగ్వేదము", దక్షిణ ముఖంనుండి "యజుర్వేదము", పశ్చిమ ముఖంనుండి "సామవేదము", ఉత్తర ముఖంనుండి "అధర్వణవేదము" ఉద్భవించాయి. యజ్ఞ నిర్వహణకు "హోత", "అధ్వర్యుడు", "ఉద్గాత", "బ్రహ్మ" అని నలుగురు ఋత్విక్కులు ఉంటారు. హోత అనే ఋత్విక్కులు ఆచరించు గానం చేయబడనివి అయిన "శస్త్రములు" అను మంత్ర స్తోత్రాలు తూర్పు ముఖం నుండి వెలువడ్డాయి; అధ్వర్యుడు ఆచరించు విధి రూపమైన "ఇజ్య", గాన యోగ్యాలైన "స్తుతులు" అనే మంత్ర స్తోత్రాలూ దక్షిణ ముఖం నుంచి ఉదయించాయి. ఉద్గాత ప్రయోగించే "స్తోమాలు" అనే ఋగ్వేద మంత్రాలు పశ్చిమ ముఖంనుంచి ఉద్భవించాయి. బ్రహ్మ అనే నాల్గవ ఋత్విక్కు ఆచరించే ప్రాయశ్చిత్త కాండ ఉత్తర ముఖంనుంచి ఉద్భవించింది. ఉపవేదాలలో, ఆయుర్వేదం తూర్పుముఖం నుంచి, ధనుర్వేదం, దక్షిణ ముఖంనుంచి, గాంధర్వవేదం పశ్చిమ ముఖంనుంచి, విశ్వకర్మకు సంబంధించిన స్థాపత్యమనే శిల్పవేదం ఉత్తర ముఖంనుంచి ఉత్పన్నమయినాయి. పంచమవేదమైన ఇతిహాస పురాణాల సముదాయం బ్రహ్మదేవుని అన్ని ముఖాలనుంచి ఆవిర్భవించింది. ఇవి కాక కర్మ తంత్రము లయిన షోడశి, ఉక్థ్యము; చయనము, అగ్నిస్తోమము; అప్తోర్యామము, అతిరాత్రము; వాజపేయము, గోసవము; అనే నాలుగు జంటలూ, ధర్మపాదాలు అయిన విద్య, ధనం, దానం, తపస్సు, అనేవి క్రమంగా బ్రహ్మ నాలుగు ముఖాల నుంచి వెలువడినాయి. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అనే ఆశ్రయ చతుష్టయంకూడా, చతుర్ముఖుని చతుర్ముఖాల నుండి క్రమంగా జనించాయి. పై నాలుగు ఆశ్రమాలలో, ఒక్కొక్కటీ నాలుగు విధాలైన వృత్తులు ఉంటాయి. బ్రహ్మచర్యంలో వృత్తులు నాలుగు. అవి 1. సావిత్రం (సవిత అంటే సూర్యుడు. ఆయన్ని ఆరాధించే గాయత్రి ఇందులో

ప్రధానం కనుక దీనికి ఈ పేరు వచ్చింది.) అనగా ఉపనయనం మొదలుకొని మూడు దినాల పర్యంతం గాయత్రీ మంత్రం జపించటం; 2. ప్రజాపత్యం అనగా వేదాలు నాలుగు చదువుకొనుట; 3. బ్రాహ్మం అనగా వేదవ్రతాలు నాల్గింటిలో ఒక్కొక్కొటి ఒక్కొక్క సంవత్సర పర్యంతం ఆచరించేది; 4. బృహత్తన నైష్ఠికం అనగా వేదం పూర్తిగా నేర్చుకున్న అనంతరం ఆచరించేది; గృహస్థ వృత్తులు నాలుగు. అవి 1. నిషిద్ధం కాని వ్యవసాయం జీవనోపాధిగా గలవారు వార్త అంటారు; 2. యజ్ఞయాగాది కర్మలకు ఉపయోగించే పనులు చేసి జీవించుట సంచయం అంటారు; 3. పరులను యాచించకుండా ఉండటం శాలీనం; 4. పొలాలలో రాలిన ధాన్యం కంకులు ఏరుకొని, వానిని శిలలపై నూర్చుకొని జీవించటం శిలోంఛం; వానప్రస్థ వృత్తులు నాలుగు. అవి 1. పండించకుండా లభించిన ఆహారాలు తీసుకొనేవారు వైఖానసులు. 2. క్రొత్త పంట లభించగానే పూర్వం దాచిపెట్టిన పదార్థాలను మిగలకుండా ఇతరులకు పంచిపెట్టేవారు వాలఖిల్యులు, 3. ప్రొద్దున లేవగానే ఏ దిక్కు కనిపిస్తుందో ఆ దిక్కుకు పోయి అక్కడ ఆయాచితంగా లభించిన పదార్థాలను భుజించేవారు ఔదుంబరులు. 4. చెట్టునపండి రాలిన ఫలాలను తిని జీవించేవారు ఫేనపులు. సన్యాసంలో కూడా నాలుగు వృత్తులు ఉన్నాయి. 1. సొంత కుటీరం ఉండి చేయదగిన కర్మలు చేసేవాడు కుటీచకుడు. 2. కుటీరం లేకుండా కర్మలు అప్రధానంగా జ్ఞానియై సంచరిస్తుండేవాడు బహూదుడు. 3. కేవలం జ్ఞానాభ్యాసం చేసేవాడు హంసుడు. 4. జ్ఞానాభ్యాసం కూడా లేకుండా పరబ్రహ్మతత్వం అలవడినవాడు నిష్క్రియుడు. అన్వీక్షకి, త్రయి, వార్తా, దండనీతి అనే నాలుగు న్యాయవిద్యా చతుష్కం; వీనిలో 1. అన్వీక్షకి అంటే ఆత్మానాత్మ వివేకంకలిగి మోక్షాన్ని ప్రసాదించేవిద్య; 2. త్రయి అంటే స్వర్గాధిఫలాలను అందించే వేదకర్మానుష్ఠానం; 3. వార్త అంటే జీవనోపాధికోసం చేసే కృషి మొదలైన విద్యలు; 4. దండనీతి అంటే అర్థ సంపాదనమే ప్రయోజనంగా గల విద్య; ఈ నాలుగు విద్యలలో అన్వీక్షకి మోక్షానికి, త్రయి కామానికి, వార్త ధర్మానికి, దండనీతి అర్థానికి సాధనాలు. ఈ అన్వీక్షకి, త్రయి, వార్తా, దండనీతి న్యాయవిద్యా చతుష్కం నాలుగు బ్రహ్మదేవుని తూర్పు ముఖంనుండి పుట్టాయి; భూః భువః సువః అనే వ్యాహృతులు బ్రహ్మదేవుని దక్షిణ, పశ్చిమ, ఉత్తర ముఖాలనుండి క్రమంగా ఉదయించాయి. అతని హృదయంలోని ఆకాశంనుండి ఓంకారం పుట్టింది; రోమాలనుండి ఉష్ణిక్ ఛందస్సు, చర్మం నుండి గాయత్రీ ఛందస్సు, మాంసం వలన త్రిష్టుప్ ఛందస్సు, కీళ్ళువల్ల అనుష్టుప్ ఛందస్సు, ఎముకలనుండి జగతీ ఛందస్సు, మజ్జవల్ల పంక్తి ఛ్ఛందస్సు, ప్రాణంవల్ల బృహతీ ఛందస్సు పుట్టాయి. హల్లులలో క వర్గం మొదలు ప వర్గం వరకూ అయిదు వర్గాలతో స్పర్శాత్మకుడైన జీవుడూ; అకారాది అచ్చులతో స్వరాత్మకమైన దేహమూ; శ, ష, స, హ లతో ఊష్మవర్ణాత్మకాలైన ఇంద్రియాలూ

ఏర్పడ్డాయి; య, ర, ల, వ, అనే అంతస్థాలూ; 1. షడ్జం, 2.ఋషభం, 3. గాంధారం, 4. మధ్యమం, 5. పంచమం, 6. నిషాదం, 7. దైవతం, అనే సప్తస్వరాలూ; ఆత్మ బలమైన శబ్ద బ్రహ్మమూ, ఇవన్నీ చతుర్ముఖుని లీలావిశేషాల వల్ల పుట్టాయి. పరమేశ్వరునకు వ్యక్తము, అవ్యక్తము అని రెండు రూపాలు. వ్యక్తరూపం వైఖరీవాక్కు; పరా, పశ్యంతీ, మధ్యమా అనే వాక్కులు అవ్యక్తరూపం. ఈ వ్యక్తావ్యక్తరూపాలు రెండింటికి ప్రణవమే ఆత్మ. భగవంతుడు, అవ్యక్తాత్ముడు కావటంవల్ల పరిపూర్ణుడు. వ్యక్తాత్ముడు కావటంచేత ఇంద్రాది శక్తి సంయుక్తుడు అయి కనిపిస్తాడు. అనంతరం అనంత వీర్యవంతులైన ఋషుల సంతానం సవిస్తారమై వృద్ధి కాలేదని తలచి బ్రహ్మ తన పూర్వ శరీరాన్ని వదిలాడు. నిషిద్ధం కాని కామంపై ఆసక్తి కల మరొక్క దేహాన్ని ధరించాడు. నిత్యం ప్రజా సృష్టి యందు ఆసక్తుడు అయ్యాడు. అయినా ప్రజాభివృద్ధి జరుగ లేదు. కారణం తెలియక ఆశ్చర్యపడ్డాడు. అది వృద్ధి అయ్యే విధానాన్ని గూర్చి ఆలోచించాడు. దైవం ఇచట ప్రతికూలం; కాబట్టి దైవానుకూలత అవసరం అనుకున్నాడు; దైవానుకూలత కోసం ఎదురు చూస్తూ దైవాన్ని ధ్యానిస్తూ సందర్భోచిత కర్తవ్యాలు నిర్వర్తించసాగాడు. అంతట బ్రహ్మదేవుని దేహం రెండు భాగలయింది. అందొకటి స్వరాట్టు అయిన, స్వాయుంభువు మనువుగా; మరొకటి అతని భార్య శతరూప అనే అంగనగా రూపొందాయి. ఆది మిథునమైన ఆ దంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, అనే ఇద్దరు పుత్రులూ; ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే ముగ్గురు పుత్రికలూ పుట్టారు. వారిలో ఆకూతిని రుచి ప్రజాపతికి; దేవహూతిని కర్దమ ప్రజాపతికి; ప్రసూతిని దక్ష ప్రజాపతికి ఇచ్చి వివాహం చేసారు. ఈ దంపతుల వల్ల కలిగిన అనంత ప్రజా సంతతుల వల్ల జగత్తంతా నిండుగా అయ్యాయి."

389 అని మైత్రేయుడు చెప్పగా విదురుడు విని సంతోషం పొందినవాడై హరిపాదభక్తి పరవశుడై మునిమఖ్యుడైన మైత్రేయుణ్ణి చూచి మళ్ళీ ఇలా అన్నాడు.

390 "స్వయంభువుడు అయిన బ్రహ్మదేవుని కుమారుడు స్వాయంభువుడు హరిచరణ సేవా పరాయణుడు. ఆదిరాజోత్తములలో అగ్రగణ్యుడై జనుల మన్ననలు అందుకున్నాడు

391 పండితులచే సేవించబడు ఓ మునులలో అగ్రగణ్యుడా! ఆ స్వాయంభువుని చరిత్ర అఖండమైన ఆనందాన్ని అందించేది. సమస్త సౌభాగ్యాలనూ సమకూర్చేది. మిక్కిలి యోగ్యమైనది. అందువల్ల ఆయన వృత్తాంతం దయచేసి నాకు తెలియజెప్పు.

392 అంతేకాక, విష్ణు పాదపద్మాల మకరందాన్ని త్రాగి మైమరచి మహాత్ముల మహనీయ చరిత్రను పరిశుద్ధమైన బుద్ధితో వినినవారి జన్మ తప్పక సార్థకం అవుతుంది."

393 ఇలా పలుకుతున్న విదురునితో దయాహృదయు డైన మైత్రేయ మహాముని ఇలా అన్నాడు "నాయనా! వేదశాస్త్రం చదువుకునే మానవులూ, శ్రీహరి పాదాలు అనే కమలాల

మీద అనురాగం గల సజ్జనులూ ఏ ఫలాన్ని పొందుతారో భగవద్భక్తుల దివ్యమైన కథలను ఆసక్తితో వినడంవల్ల అటువంటి ఫలమే లభిస్తుంది."

394 ఇలా చెప్తున్న మైత్రేయ మహాముని హృదయం దానవాంతకుడైన శ్రీహరి కథలు అనే అమృతంలో తేలియాడింది. ఆయన శరీరం సంతోషంతో పొంగి పులకించింది. ఆయన నయనాలు ఆనందభాష్పాలు వర్షించాయి.

395 మహానుభావుడైన మైత్రేయుడు విదురునితో ఇలా చెప్పసాగాడు "స్వాయంభువుడు తన భార్య శతరూపతో కూడా బ్రహ్మదేవునకు నమస్కారం చేసాడు. వినయంతో తల వంచుకొని, చేతులు జోడించి ప్రీతి పూర్వకంగా ఇలా అన్నాడు. "ఓ పద్మంలో జనించిన బ్రహ్మదేవా! ఈ విశ్వంలోని సకల ప్రాణులనూ పుట్టించుటకూ, పోషించుటకూ, సంహరించుటకూ, కారణభూత మైన వాడవు నీవే. మేము చేయవలసిన పని ఏమిటో, మాకు ఆజ్ఞాపించు. ఎలాంటి పని చేస్తే నీకు మిక్కిలి సంతోషం కలుగుతుందో, అది చేస్తాము. తండ్రికి భక్తితో సేవ చేసిన తనయుడు ఈ లోకంలో, ఆ లోకంలో అఖండ యశస్సు ఆర్జిస్తాడు. అందరి అభిమానానికి పాత్రుడవుతాడు."

396 అందుచేత, ఆ సుకార్యాలు అన్నీ తెలియజెప్పు పితామహా! బ్రహ్మదేవా!"

397 అని పలికి స్వాయంభువుని మృదు మధుర వాక్యాలకు చతుర్ముఖ బ్రహ్మదేవుడు చాలా సంతోషించాడు. అంతరంగంలో అనురాగం పొంగిపొరలగా అనుంగు నందనునితో కమలసంభవుడు ఇలా అన్నాడు.

398 "నాయనా! స్వాయంభువా! కన్నతండ్రి ఆజ్ఞను శిరసావహించి తనకు తగిన పని యని ఏ పని చెబితే ఆ పనిని దక్షతతో తక్షణం చేయడం; పద్మాక్షుడైన శ్రీహరి పాదసేవ చేయడం; తండ్రి ఆజ్ఞానుసారం ప్రజలను పాలించటం; తనయుడు తన తండ్రికి సేవచేయడం క్రిందకే వస్తాయి.

399 అందుచేత.

400 పుణ్యాత్మా! స్వాయంభువా! శ్రీమహావిష్ణువు యజ్ఞపురుషుడూ, పరమపురుషుడూ, హృషీకేశుడూ, కేశవుడూ, పద్మాక్షుడూ. అయన గూర్చి అధికమైన భక్తితో యజ్ఞాలు చెయ్యి. అలా చేస్తే ఆ శ్రీపతి ఎంతగానో సంతోషిస్తాడు. ఆ దేవుడు సంతోషిస్తే లోకాలన్నీ సంతృప్తి చెందుతాయి. అందుకని నీవు యజ్ఞాలు ఆచరించు.

401 పవిత్రమైన చిత్తశుద్ధితో పరమేశ్వరార్పణ బుద్ధితో యజ్ఞకార్యాలు చేయాలి. అలాకాకుండా స్వార్థబుద్ధితో పనులు చేయడం అంటే, వరిపొట్టును దంచి బియ్యం రాలేదని బాధపడటం లాంటిది. అందుచేత ధననాశమే గాని లవలేశం కూడా లాభం ఉండదు. హరి భక్తులు కాని వారు తాము ఆశించిన మోక్షాన్ని అందుకోలేరు.

402 అందుచేత, కుమారా! స్వాయంభువా! పాపాలనే తీగలకు కొడవలివంటివాడవైన నీవు నిర్వికారుడైన శ్రీహరినిగూర్చి యజ్ఞం చేయాలని సంకల్పించు. నీ సంకల్పం సత్య స్వరూపమై శుభప్రదమవుతుంది. నీవు, నీ కుమారులూ సంతోషంతో భూమండలాన్ని ఏలే భారం వహించండి. నిర్మలమైన ధర్మ మార్గంలో, సజ్జనులైన ప్రజలను రక్షిస్తూ, పరిపాలించండి."

వరాహావతారంబు

403 ఆ మాటలు విని స్వాయంభువుడు పద్మభవుడైన బ్రహ్మదేవునితో ఇలా అన్నాడు. తండ్రీ! నీ ఆజ్ఞ శిరసావహించి నీవు ఎలా చెప్తే అలా చేస్తాను. అయితే నాకూ నా కుమారులకూ, నివసించటానికి తగిన చోటు ఎక్కడా కనబడుట లేదు.

404 జగద్విధాతవు, బ్రహ్మదేవుడవు అయిన నా జనకుడా! ఈ సృష్టిలోని సమస్తమైన జంతుజాలానికి ఆధారభూతమైన భూమి ఇప్పుడు మహాసముద్ర మధ్యంలో మునిగి ఉంది. అందువల్ల మాకు ఉండటానికి చోటు కనిపించుట లేదు.

405 అందుచేత, ఓ బ్రహ్మ దేవా! ఇప్పుడు భూమిని ఉద్ధరించే ఉపాయం ఆలోచించి నన్ను అనుగ్రహించు" అని స్వాయంభువుడు పలుకగా బ్రహ్మదేవుడు తన మనస్సులో ఇలా అనుకున్నాడు.

406 "నీళ్ళ నడుమ మునిగిపోయి ఉన్న భూమండలాన్ని పైకి తీసుకురావటం ఎలా? లోకాలను సృష్టించేటప్పుడు ముందు నీళ్లను పుట్టించాను. తర్వాత భూమిని సృష్టించాను. ఇప్పుడు ఆ భూమి జల మధ్యంలో మునిగి పాతాళం లోనికి చేరింది. దానిని ఏవిధంగా యథాస్థితికి తీసుకురావాలి.

407 లోకాలన్నిటినీ సృష్టించాలనే ఆతృతతో సన్నాహాలకు ఎంతో ప్రయాసపడుతున్నాను. కాని ఈ భూమిని ఉద్ధరించడం ఎలా? నాచేత ఈ పని ఎలా జరుగుతుంది?" అని బ్రహ్మ తన మనస్సులో తలపోసి సకల భూతాలలోనూ అంతర్యామిగా ఉండే సర్వాంతర్యామీ, పురుషోత్తముడూ, పద్మాక్షుడు, లక్ష్మీదేవి భర్తా అయిన శ్రీమహావిష్ణువును తలచాడు. వెంటనే ఆ పద్మభవుడు అయిన బ్రహ్మ ముక్కు నుండి యజ్ఞవరాహమూర్తి బొటనవ్రేలంత పరిమాణంతో జన్మించి, ఆకాశానికి ఎగిరి, ఒక్క క్షణంలోనే అక్కడ ఉన్న వారందరూ ఆశ్చర్యచకితులయ్యేలా పెద్ద ఏనుగంత అయ్యాడు.

408 అప్పుడు, ప్రజల్ని సృష్టించడంకోసం నియమించబడిన మరీచి మొదలైన మునులూ, మనువూ, మనువు కుమారులూ, యజ్ఞవరాహాన్ని చూశారు. "ఎంత ఆశ్చర్యం ముక్కురంధ్రంనుండి, వెలువడ్డ వేలంత బాలవరాహం క్షణంలోనే, పెద్ద ఏనుగంత అయి మహాపర్వతం అంత అయింది. ఇలాంటి విచిత్రం ఎక్కడైనా ఎప్పుడైనా జరిగిందా." అని

తమలో తాము తర్కించుకున్నారు. బ్రహ్మదేవుడు ఎంతో సంతోషంతో ఇలా అనుకున్నాడు.

409 "నా మనస్సులోగల, దుఃఖభారాన్ని, దూరం చేయటంకోసం, దేవాధిదేవుడైన రాజీవముల వంటి కన్నులు గల శ్రీహరి, ఈ విధంగా యజ్ఞవరాహరూపం ధరించాడు. ఎంతో వింత అయిన విషయం ఇది."

410 బ్రహ్మదేవుడు ఈవిధంగా భావిస్తూ వుండగా, యజ్ఞవరాహమూర్తి అయిన విష్ణువు.

411 వరహావతారుడు అయిన హరి ప్రళయకాలంలోని మేఘాల సమూహాలు భయంకరంగా గర్జించినట్లు విజృంభించి దిక్కులు పిక్కటిల్లేలా గంభీరంగా ఘుర్ ఘుర్ అని గర్జించాడు (వరాహం అరుపు ఘుర్). నాయనా పుణ్యవర్తనుడవైన విదురా! ఆ ఘన గంభీర ధ్వని విని బ్రహ్మదేవుడూ, మునులూ అపారమైన ఆనందాన్ని పొందారు.

412 అప్పుడు, ఆ కపట వరాహమూర్తి కావించిన ఘుర్ఘురావానికి, బ్రహ్మాండభాండం అంతా దద్దరిల్లిపోయింది. ఆ శబ్దం విని జనలోకంలో, తపోలోకంలో, సత్యలోకంలో ఉండే మునులు ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలలోని మంత్రాలతో, ఆ యజ్ఞవరాహమూర్తిని కీర్తించారు. యజ్ఞవరాహరూపాన్ని ధరించిన పరాత్పరుడు, సజ్జనులను చక్కగా పరిపాలించే, పరమ దయామయుడు కాబట్టి ఒక మహా దిగ్గజంలా క్రీడించాలని వేడుకపడ్డాడు.

భూమ్యుద్ధరణంబు 413

కఠిన సటాచ్ఛటోత్కట జాత వాత ని–
ర్ధూత జీమూత సంఘాత మగుచు
క్షురనిభ సునిశిత ఖురపుటాహత చల–
త్ఫణిరాజ దిగ్గజ ప్రచయ మగుచుఁ
జండ దంష్ట్రోత్థ వైశ్వాన రార్చిస్రవ–
ద్రజత హేమాద్రి విస్రంభ మగుచు
ఘోర గంభీర ఘుర్ఘుర భూరినిస్వన–
పంకి లాఖిల వార్ధి సంకులముగఁ
బొరలుఁ గెరలు నటించు నంబరము దెరల
రొప్పు నుప్పర మెగయును గొప్పరించు
ముట్టె బిగియించు ముసముస మూరుకొనుచు
నడరు సంరక్షితక్షోణి యజ్ఞఘోణి.

భూమిని రక్షించు ఆ యజ్ఞవరాహం కర్కశమైన తన మెడమీది జూలు విదిల్చింది. అప్పుడు పుట్టిన వాయువేగానికి మేఘమండలమంతా చెల్లాచెదరై పోయింది. చురకత్తితో

సాటిరాగల మిక్కిలివాడియైన ఆ వరాహమూర్తి గిట్టల కొనల తాకిడులకు, భూమండలానికి అడుగున ఉన్న ఆదిశేషుడు, దిగ్గజాలు, తల్లడిల్లి పోయారు. ఆ యజ్ఞవరాహం కఠోరాలైన కరకు కోరల రాపిడివల్ల పుట్టిన అగ్నిజ్వాలలకు, వెండికొండ కైలాశమూ, బంగారుకొండ మేరువూ, కరగి ద్రవించిపోతాయేమో అనిపించింది. ఆ మహావరాహం భయంకరమూ, గంభీరమూ అయిన తన ఘుర్ఘురారావంవల్ల సముద్రాలన్నీ, అల్లకల్లోలం అయ్యేటట్లు చేస్తున్నది. ఈవిధంగా ఆ ఆదివరాహం పొరలుతూ పొంగుతూ సంతోషంతో గంతులువేస్తూ. రొప్పుతూ, ఆకాశానికి ఎగురుతూ, విజృంభిస్తూ, మూతి బిగిస్తూ, కోపంతో ముసముస అంటూ నేలను మూచూస్తూ, ఇలా అనేక విధాలుగా తిరుగుతూ, చెలరేగుతూ ఉంది.

414 అంతేకాకుండా ఆ యజ్ఞవరాహం

415 ఆ యజ్ఞవరాహం ఒకసారి పద్నాలుగు భువనాలూ, దొంతరలు దొంతరలుగా దొర్లి పడిపోయేలా కొమ్ములతో చిమ్ముతుంది. మరోసారి తన మూపురమనే నూరే రాయితో పసిడి కాంతులు, ప్రసరించేలా మేరుపర్వతాన్ని రుద్దుతుంది. ఇంకోసారి సప్తసముద్రాల జలాలు బురదలై పోయేలా ఎగిరి గంతులువేస్తూ తిరుగుతుంది. వేరొకసారి మిక్కిలి భయంకరంగా తోకను తిప్పడంవల్ల పుట్టిన గాలితాకిడికి, ఆకాశం దద్దరిల్లి బ్రద్దలయ్యేటట్లు చేస్తుంది. ఒక్కొక్క మాటు కనుగొనకుల్లో అగ్నికణాలు కురిపిస్తూ, మహా భయంకరంగా కనిపిస్తుంది. ఇంకో మాటు మహా యోగులకు సేవ్యమైన భవ్య దివ్య వైభవంతో శోభిల్లుతుంది.

416 ఆవిధంగా విహరిస్తూ, ఉదయము మధ్యాహ్నమూ, సాయంకాలమూ చేసే యజ్ఞము యొక్క స్వరూపము కలవాడు, యజ్ఞవరాహరూపం ధరించిన ఆ మహావిష్ణువు మహా ప్రళయ కాలంలో తాను నిద్రలో ఉన్నప్పుడు జలంలో నున్న భూమి రసాతలంలోకి చేరిన దానిని ఉద్ధరించటానికై, సముద్రంలో ప్రవేశించాడు. ఆ వేగానికి సముద్రుడు అల్లకల్లోలమైన మనస్సుతో అలలు అనే చేతులు పైకెత్తి యజ్ఞవరాహా! నన్ను రక్షించు రక్షించు అని వేడుకున్నాడు. ఆ వరాహమూర్తి తన వాడి యైన, వంకరలు తిరిగిన కత్తులవంటి గిట్టల కొనలతో సముద్రజలాలను చెల్లాచెదురు చేస్తూ పాతాళం లోపలికి దూసుకొని పోయి అక్కడ భూమిని చూశాడు.

417 ఆ సమయంలో సముద్రంలో దాగి వున్న ఒక భయంకర రాక్షసుడు హిరణ్యాక్షుడు ఎదురయ్యాడు. ఆ క్రూర దానవుడు కులపర్వాతాలను గిట్టలతో పగులకొట్టేది. భూమిని ప్రియురాలుగా గ్రహించినదీ, భూమండలాన్ని వెదుకుతూ ఉన్నదీ, యజ్ఞమయ మైన శరీరం కలదీ అయిన ఆ వరాహాన్ని తన ఎదుట దర్శించాడు.

418 అలా చూసీ చూడగానే వాడికి ఆగ్రహం వచ్చింది. రోషంతో భీకరమైన ఆకారం కలవాడు అయ్యాడు.

419 ఆ రాక్షసుడు హిరణ్యాక్షుడు సహింపరాని మహా శౌర్యంతో గిరగిరా గద త్రిప్పి వేశాడు. వరాహమూర్తి అది తప్పించుకున్నాడు. క్రోధంతో, గర్వంతో, అపారమైన పరాక్రమంతో విజృంభించిన మృగరాజు గజరాజును మట్టుపెట్టినట్లు ఆ వరాహమూర్తి తన వాడి కోరల అంచులతో వాడిని విదలించి తుదముట్టించాడు.

420 ఆ రాక్షసుడు హిరణ్యాక్షుని ఈ విధంగా వధించి వాడి వేడివేడి నెత్తురు ధారలతో నిండిన చెక్కిళ్ళు గలవాడైన వరాహమూర్తి సాయంసమయాన ఎఱ్ఱబడిన మేఘాలతో గైరికాది ఖనిజాలతో, జాలువారిన మహా పర్వతం వలె ఒప్పుతూ, భూమిని తన కోర చివర ధరించి సముద్రంలో నుండి బయటికి వచ్చాడు.

421 పాడ్యమి నాటి చంద్రరేఖలా విరాజిల్లుతున్న వరహావతారుడి తెల్లని కోరకొనపై నున్న ఆ భూమి, స్వామిని ఎప్పుడూ ఎడబాయని శ్రీ మహాలక్ష్మి ఆయనకు పూసిన కస్తూరి పంకంలా, కనిపించింది.

విధాత వరాహస్తుతి

422 అటువంటి యజ్ఞవరాహమూర్తిని చూచి బ్రహ్మాదిదేవతలు ఇలా కీర్తించారు.

423 దేవదేవా! జయం జయం నీకు పరమేశ్వరా! జయం జయం. నీవు యజ్ఞాధిపతివి. వేదమూర్తివి, దుష్టశిక్షణ శిష్టరక్షణార్థం వరాహావతారం ధరించిన నీకు పరమ భక్తితో ప్రణమిల్లుతున్నాము. నీవు వరాలు ఇచ్చే వాడవు, ఈ మహాసముద్రాలన్నీ నీ రోమకూపాలలో ఇమిడి ఉన్నాయి. విశాల విఖ్యాత కీర్తివీ, పరమ కరుణామూర్తివీ, పరమ పవిత్ర చరిత్రుడవూ, పద్మాల రేకులకు సాటివచ్చే కన్నులు కలవాడవూ, మిక్కిలి మంగళ ఆకారుడవూ, శ్రీరమా చిత్త చోరుడవూ అయిన నీకు ఇదిగో చేతులెత్తి నమస్కారాలు చేస్తున్నాం.

424 అని ఇంకా ఈవిధంగా దేవతలు దేవాదిదేవుణ్ణి స్తుతించారు.

425 ఓ స్వామీ! నీ చర్మం నుండి, సమస్త వేదాలూ జనించాయి; నీ రోమకూపాల నుండి అగ్నులు ఆవిర్భవించాయి; నీ కన్నులనుండి హోమ ద్రవ్యమైన నెయ్యి, నీ నాలుగు పాదాలనుండి నాలుగు హోతలతో కూడిన యజ్ఞ కర్మలూ, మజ్జనుండి స్రుక్కూ, ముక్కునుండి స్రువమూ, ఉదరమునుండి ఇడాపాత్రమూ, చెవులనుండి, ముఖంనుండి చమసం, ప్రాశిత్రం అనే పాత్రలూ, కంఠం నుండి ఇష్టులు అనే మూడు యజ్ఞాలూ, నాలుక నుండి, ప్రవర్గ్యం అనే యజ్ఞం పుట్టాయి; నీ చర్వణమే అగ్నిహోత్రం; సధ్యం అంటే హోమరహితాగ్ని, అపసధ్యం అంటే ఔపోసనాగ్ని నీ శరస్సు నుంచి జనించాయి; చయనాలు నీ ప్రాణ స్వరూపాలు; నీవు యజ్ఞాధికారుడవు; యజ్ఞవరాహమూర్తివి.

426 అంతేకాక భగవంతుడవైన నీవు మళ్ళీమళ్ళీ ఆవిర్భవించటం "దీక్షణీయ" మనే యజ్ఞము; నీ కోరలు "ప్రాయణీయ" మనే దీక్షానంతరం జరిపే ఇష్టి, "ఉదయనీయం" అనే సమాప్తేష్టి; సోమరసం నీ రేతస్సు; నీ ఉనికియే ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయం సమయం అనే మూడు యజ్ఞాంశలు. నీ చర్మం మాంసం మొదలైన సప్తధాతువులూ అగ్నిష్టోమం, ఉర్ధ్యం, షోడశి, వాజపేయం, అతిరాత్రం, ఆప్తోర్యామం, ద్వాదశాహం మొదలైన యజ్ఞ భేదాలు; సమస్త యజ్ఞాలు నీ శరీర సంధులు; సోమంతో కూడినవీ, కూడనివి అయిన క్రతువులన్నీ నీవే; నీవే యజ్ఞ బంధాలతో అలరారుతూ ఉంటావు.

హవరూపివి హవనేతవు
హవభోక్తవు నిఖిలహవఫలాధారుఁడవున్
హవరక్షకుఁడవు నగు నీ
కవితథముగ నుతులొనర్తు మయ్య; ముకుందా!

427 భూమ్యుద్ధరణ చేసిన దేవదేవుని దేవతలు స్తుతిస్తున్నారు. వరహావతారుడా! నీవు యజ్ఞ స్వరూపుడవు, యజ్ఞ కర్తవు, యజ్ఞ భోక్తవు, యజ్ఞఫల ప్రదాతవు, యజ్ఞ రక్షకుడవు, ముకుందుడవు; సమస్తము నీవే; నిన్ను హృదయ పూర్వకంగా కీర్తిస్తున్నాము.

428 సత్వగుణంవల్ల, మంచి భక్తి ప్రాప్తిస్తుంది. భక్తితో కూడిన మనస్సు పవిత్రం అవుతుంది. అటువంటి భక్తి యుక్తమైన పవిత్ర హృదయ పద్మంతో తలచి సేవించదగిన ఓ దేవాధిదేవా! నీకు నమస్కారం.

429 పద్మనాభా! వరాహా! పర్వతాలతో, నదీనదాలతో, సముద్రాలతో, అరణ్యాలతో నిండిన ఈ భూమండలం నీ తెల్లని కోర చివర ప్రకాశిస్తున్నది. ఆ భూదేవి మనోహరమైన సరోవర జలాలలో దిగిన మదించిన గజేంద్రుని దంతాగ్రాన తగులుకుని ఉన్న ఆకుతో కూడిన తామరపువ్వు లాగా చూడముచ్చటగా ఉంది.

430 అంతేకాదు,

431 చతుర్వేద స్వరూపమైన శరీరాన్ని ధరించి ఉన్న ఓ యజ్ఞవరాహా! నీవు జ్ఞానవంతుల అంతరంగాలనే నీటి మడుగులలో క్రీడిస్తూ ఉంటావు. భూదేవికి, శ్రీదేవికి మనోహరుడవు. దేవతలందరికి అగ్రేసరుడవు. నీ తెల్లని కోరల చివర తగులుకున్న భూమి కొండల చక్రవర్తి కైలాస పర్వతం వెండి శిఖరాన విరాజిల్లుతూ ఉండే, నీలమేఘంలా అందాలు చిందుతూ ఉంది.

432 కరుణ నిండిన హృదయం కలవాడవై, సకల చరాచర సమూహంతో నిండిన ఈ భూమండలాన్ని సముద్రజలాల్లో మునిగిపోకుండా కాపాడు. ఈ భూమి మాకు తల్లి. ఎలాగంటావేమో, మాకు ఈ లోకానికి తండ్రివి. నీవు భరించుటచే భూదేవి నీ భార్య అయింది. అందుకని ఆమె మాకు తల్లి అవుతుంది. నీతోపాటు, ఈ భూమికి నమస్కారం

చేస్తాము. యజ్ఞకర్త అరణి యందు అగ్నిని నిల్పిన విధంగా నీవు నీ తేజస్సును ఈ భూమి యందు నిల్పడం వల్ల ఈ ధరిత్రి పవిత్రమై ఒప్పుతూ ఉంది.

433 శ్రీవల్లభా! వాస్తవంగా ఆలోచిస్తే సమస్త లోకాలను క్రమానుసారంగా సృష్టించడ మన్నది, అత్యద్భుతమైన విషయం. అటువంటి శక్తి ముందు పాతాళంలో ఉన్న భూమిని యథాస్థితికి తెచ్చి నిలిపిన ఈ నీ సామర్థ్యం ఏమంత ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఇటువంటి మహా కార్యాలు నిర్వహించటానికి నీవే సమర్థుడవు. ఇతరులకు ఈ కృత్యాలు అసాధ్యాలు.

434 "నందకం" అనే ఖడ్గాన్ని ధరించినవాడా! ఈశ్వరుడా! ఓ శ్రీహరీ! నేర్పుతో సకల లోకాలను నియమబద్ధంగా ఏర్పాటు చేసిన నేర్పరివి. మంత్రసిద్ధుడైన యాజ్ఞికుడు అరణి యందు అగ్నిని నిలిపినట్లు నీవు దయపూని మేము నిలబడి మనుగడ సాధించడానికి ఈ భూమిని ఈ విధంగా సుస్థిరంగా నిలబెట్టావు.

435 ఓ మాధవా! విష్ణుమూర్తీ! ఆహ్లాదంతో వేదశాస్త్ర స్వరూపమైన ఆదివరాహమూర్తివైన నీవు పాతాళంనుండి బయటికి వస్తూ సముద్రజలాలతో తడిచిన నీ శరీరాన్ని విదిలించావు. ఆ సమయంలో నీ మెడమీది జూలు నుండి నీటి చుక్కలు నలుదెసలా చిందాయి. పరమ పవిత్రా లయిన ఆ జల బిందువులలో తడిసి తపోలోకంలో, జనలోకంలో, సత్యలోకంలో, నివసించే మేమంతా ఎంతగానో పరిశుద్ధులము అయ్యాము.

436 ఓ రమావల్లభా! ఈశ్వరా! కేశవా! వేదమయా! దివ్య స్వరూపా! దేవదేవా! ఈ ప్రపంచం సృష్టించేది, రక్షించేదీ, లయంచేసేదీ నీవే. సర్వమూ నీవే అయి ఈ సమస్త లోకాలనూ మళ్ళీమళ్ళీ సృష్టిస్తున్నావు. అంతులేని నీ లీలలు "ఇటువంటివి" అని వర్ణించడం మా వల్ల కాదు.

437 వరాహా! దామోదరా! అఖిల లోక పాలకులకు ఈశ్వరుడు అయిన వాడా! మంగళ చరిత్రా! లోక కల్యాణం కోసం నీవు చేసే కార్యాలు అనంతాలు. "మహాసముద్రంవంటి వాటి అంతు తెలుసుకుంటాను." అని అనుకునేవాడు మతి లేనివాడూ, అజ్ఞానీ అవుతాడు గాని విజ్ఞాని కాడు. ఈ సమస్త ప్రపంచం నీ యోగమాయా సముద్రంలో విలీనం అయి ఉందన్న సంగతి తెలిసి కూడా నీ ప్రభావాన్ని తెలియని మందబుద్ధులను ఏమనాలి. నీ చరణ దాసులకు సర్వదా సమధిక సౌఖ్యాన్ని కలిగించేవి, అపారమైన కరుణ అనే అమృత తరంగాలు పొంగిపొరలే నీ కడగంటి చూపులతో మమ్మల్ని చక్కగా చూసి సుఖసంతోషాలను అనుగ్రహించు."

438 అని బ్రహ్మజ్ఞాన సంపన్నులైన మునివరేణ్యులు భక్తిప్రపత్తులతో వినయ వినమ్రతలతో, తమ అంతరంగాలలో ఆనంద తరంగాలు పొంగిపొర్లగా గిట్టలతో పర్వతాలను సైతం పగులగొట్టే జగజ్జెట్టి యైన వరాహస్వామిని ప్రస్తుతించారు.

439 పిమ్మట విశ్వరూపుడైన ఆ యజ్ఞవరాహమూర్తి మహా భయంకరమూ, అత్యంత గంభీరమూ ఐన ఆ సముద్రపు నీటిని అంతా తన గిట్టలతో ఆక్రమించి, మళ్లీ భూమిని ఎప్పటిలాగా సుఖంగా నీళ్లమీద నిలిచి ఉండేలా సుస్థిరం చేసాడు. తరువాత అనంత గుణ సంపన్నుడైన ఆ స్వామి అదృశ్యమయ్యాడు..

440 ఈ కథ శుభప్రదమైనది. ఈ కథను భక్తితో చదువువారిని, వినువారిని అందరినీ కరుణతో శ్రీమహావిష్ణువు కటాక్షిస్తాడు. అటువంటి వారి విషయంలో శ్రీహరి చాలా ప్రసన్నుడు అవుతాడు. ఆ విధంగా, శ్రీహరి ప్రసన్నుడైన వారికి సమస్త సన్మంగళాలూ సంప్రాప్తిస్తాయి. ఇందుకు సందేహం లేదు.

441 తన భక్తుల హృదయాంతరాళాలలో, విష్ణుమూర్తి విలాసంగా విహరిస్తూ ఉంటాడు. అటువంటి సజ్జనులకు కోరిన వస్తువులన్నీ సమృద్ధిగా సిద్ధిస్తాయి. అక్షయమైన మోక్షం అరచేతిలో ఉన్నంత సులువుగా అందుబాటులో ఉంటుంది అంటే ఇక అస్థిరమైన సామాన్య వస్తువుల విషయం వేరే చెప్పాలా?

442 అందువల్ల సమస్త లోకాలకూ స్తుతింపదగినవి అయిన విష్ణుదేవుని కథలు అనే అమృత ధారలను కమ్మగా త్రాగిన నాలుక, అసత్యాలు అయిన ఇతర కథలు అనే ఉప్పునీళ్లను తాగడానికి ఇష్టపడుతుందా? నందనవనంలోని మందార మకరందాన్ని, త్రాగటం అలవాటైన మేటి తుమ్మెద వేపచెట్ల వైపు వెళ్ళాలనుకుంటుందా?”

443 అని మైత్రేయమహర్షి వికార విదూరుడైన విదురునకు వినిపించిన ఈ కథా విధానాన్ని వ్యాసమునీంద్రుని పుత్రుడైన శుకమహర్షి అర్జునుని మనుమడు అయిన పరిక్షన్నరేంద్రునికి వినిపించి ఇంకా ఇలా అన్నాడు.

444 మైత్రేయుడు ఇలా చెప్పగా వినిన విదురుడు ఇలా అన్నాడు. “సచ్చరిత్రుడా! పరమ పవిత్రమైన విష్ణుదేవుని చరిత్రం ఎంత విన్నా నా మనస్సుకు తనివితీరకుండా ఉంది.

445 మునీశ్వరా! సుగుణసాంద్రా! యజ్ఞవరాహమూర్తి కథ నీ దయవల్ల విన్నాను. కానీ ఇంకా విశదంగా వివరించి చెప్పు. మధురాతి మధురమైన విష్ణు కథా సుధా రసాన్ని చెవులనే దోసిళ్ళతో ఆస్వాదించకపోతే మానవుల సంసార తాపాలు తీరవు కదా.

446 అందుకని అడుగుతున్నాను.

447 శ్రీమహావిష్ణువు యజ్ఞవరాహ రూపం ధరించి విజృంభించి హిరణ్యాక్షుడనే రాక్షసుణ్ణి సంహరించాడని చెప్పావు కదా! ఓ మునీశ్వరా! ఓ పవిత్ర చరిత్రుడా! ఆ వరాహం తన కోర చివర ఈ ధరణీ మండలాన్ని ఎలా ధరించింది? హిరణ్యాక్షునికి,

విష్ణువునకూ విరోధం రావడానికి కారణం ఏమిటి? ఆ రాక్షసుణ్ణి శ్రీహరి ఏవిధంగా సంహరించాడు? సవిస్తరంగా ఇదంతా నాకు చెప్పు" అనగా, మైత్రేయుడు విదురునితో ఇట్లా అన్నాడు. నాయనా, ఆ శ్రీహరి కథలు వినాలి అనే ఆసక్తి గల నీకు జన్మ సాఫల్యం సిద్ధించింది. ఇందుకు సందేహం లేదు. ఆ శ్రీమన్నారాయణుని మాయ తెలుసుకోవడానికి బ్రహ్మకైనా తరం కాదు.

448 ఓ పుణ్యపురుషుడా! నీవు అడిగిన ఈ కథను పూర్వం ధ్రువుడు పరమ విష్ణు భక్తుడు అయిన నారదుణ్ణి అడిగి తెలుసుకున్నాడు. హరికథా శ్రవణం వల్ల అతడెంతో మహిమాన్వితుడైనాడు.

449 అటువంటి ప్రభావాన్ని సంపాదించిన ధ్రువుడు యమధర్మరాజును ఎడమకాలితో తన్ని ఈ లోకంలోనూ, పర లోకంలోనూ కూడా ప్రసిద్ధికెక్కి ఉన్నతపదాన్ని అందుకున్నాడు. అటువంటి వాసుదేవుని లీలావిశేషాలను బ్రహ్మదేవుడు దేవతలకు చెప్పాడు. అదంతా నీకు విశదంగా చెప్తాను.

దితికశ్యప సంవాదంబు

450 అట్టి విష్ణు కథలు చెప్తాను శ్రద్ధగా విను.

451 దితి దక్షప్రజాపతి పుత్రిక, కశ్యపప్రజాపతి భార్య. ఒకరోజు ఆమె మనస్సులో సంతానకాంక్ష పెల్లుబికింది. మన్మథుని పుష్ప బాణాలు ఆమె హృదయాన్ని అల్లకల్లోలం చేశాయి. విరహవేదన భరించలేక తన పతి దగ్గరకు భోగవాంఛతో వెళ్ళింది. ఆయన అప్పుడే నిశ్చల నియమంతో వేదవేద్యుడూ, జ్యోతిర్మయుడూ అయిన మహావిష్ణువును ఉద్దేశించి యథావిధిగా అగ్నికార్యం నెరవేర్చి, సూర్యాస్తమయ సమయంలో హోమశాల ముందర కూర్చుని ఉన్నాడు. ఆయనతో ఆమె వినయంగా ఇట్లా అంది.

452 "ప్రాణేశా! అరటిచెట్టును పట్టి గజరాజు గజిబిజి చేసినట్లు, రతిరాజు మన్మథుడు తన పదునైన పూలబాణాలతో నా హృదయాన్ని కదిలించి వేస్తున్నాడు. ఆ బాధ భరించలేక నీ పాదపద్మాల దగ్గరకు వచ్చాను. నీ ఆధిపత్యం పటుత్వం ప్రదర్శించి నన్ను కాపాడు.

453 అంతేకాకుండా నా సవతులు అందరు నీ కృపవల్ల గర్భవతులై ఎంతో సంతోషంతో ఉన్నారు. నేనే శోకంతో వ్యాకులమైన మనస్సుతో అలమటిస్తున్నాను. ఆర్తురాలనైన నన్ను రక్షించటం నీకు పరమ ధర్మము. నీవు విద్వాంసుడవు, నీకు తెలియని విషయాలు ఏమీ లేవు. నీ వంటి సత్పురుషులైన మహానుభావులకు నా వంటి ఆర్తులను, రక్షించి వారి కోరికలు సఫలం చేయటం పరమ ధర్మం కదా." అని మళ్ళీ ఇలా అన్నది.

454 "ఓ మహానుభావా! పతి వద్ద గౌరవం సంపాదించిన సతులకు కోరిన కోరికలు తీరుతాయి. గొప్ప కీర్తి లభిస్తుంది. అటువంటి వారు లోకుల పొగడ్తలను అందుకుంటూ విలసిల్లుతారు.

455 అగ్ని శిఖ ఒకటే అయినప్పటికీ, దీపముతో ముట్టించిన దీపము రెండు దీపములు అయినట్లు, పురుషుడు తన భార్య యందు పుత్రరూపంలో జన్మిస్తాడు.

456 ఈ విషయాన్ని, ఆత్మస్వరూపుడైన తానే కుమారుడై జన్మిస్తాడు. ఆత్మావై పుత్రా. అని వేదాలు చెబుతున్నాయి. ఇది నీకు తెలియని విషయం కాదు. అతి దీనంగా ఉన్న నన్ను కరుణతో కాపాడు. పరమ బుద్ధిశాలీ!

457 ఓ పురుషశ్రేష్ఠుడా! దయాశాలి అయిన మా తండ్రి దక్ష ప్రజాపతికి ఆడపిల్లలంటే ఎంతో అభిమానం. ఆయన ఒకనాడు కూతుళ్లను మమ్మల్ని అందరిని పిల్చి, "కమలాల వంటి కన్నులు గల మా అందాల పుత్రికలూ! మీ మనస్సుకు నచ్చిన భర్తలను తెలియజేయండి ఇచ్చి పెండ్లి చేస్తాను" అని అడిగాడు. అప్పుడు మేము పదమూడు మందిమి నీ పేరు చెప్పి నిన్నే వరించాం కదా."

458 అని కామంతో మోహితురాలు అయిన దితి దీనంగా అనేక సార్లు అర్థించింది. అప్పుడు ధృతిమంతుడైన కశ్యపుడు ఆర్తురాలు, పతివ్రత, తన సతి అయిన దితిని అనునయిస్తూ ఇలా అన్నాడు.

459 "నీవు చెప్పినట్లే, పురుషులకు స్త్రీల వలన ధర్మార్థ కామ మోక్షాలు సిద్ధిస్తాయి. నావికుడు తన నావతో సముద్రాన్ని తాను దాటటమే కాకుండా ఇతర ప్రయాణీకులను కూడా దాటించినట్లు, గృహస్థు తన గృహస్థాశ్రమం ద్వారా తాను తరిస్తూ ఇతర ఆశ్రమవాసులను కూడా తరింపచేస్తూ ఉంటాడు. అటువంటి గృహస్థుడిలో భార్య అర్థభాగం, అటువంటి అర్ధాంగియందు తన గృహకృత్యాల భారమంతా ఉంచి పురుషుడు నిర్విచారంగా సుఖం అనుభవిస్తాడు. అంతేకాకుండా, మిగిలిన ఆశ్రమవాసులు జయించలేని ఇంద్రియాలనే శత్రువులను (అరిషడ్వర్గాలను) సతీ సమేతుడైన గృహస్థుడు కోటలో ఉన్న రాజు శత్రు సమూహాలను జయించినట్లు అవలీలగా జయిస్తాడు. అటువంటి భార్యకు ప్రత్యుపకారం చేసి ఋణం తీర్చుకోవడానికి సమస్త సుగుణాలతో కూడి ఉన్న సత్పురుషులకు సైతం నూరేళ్ళకు గానీ, జన్మజన్మలకు గానీ సాధ్యంకాదు. అటువంటప్పుడు మావంటివాళ్లకు ఎలా సాధ్యమౌతుంది. ఇక నీ మనస్సులోని దుఃఖాన్ని విడిచిపెట్టు" అని చెప్పి కశ్యపుడు ఇలా అన్నాడు.

460 చక్కటి కన్నులున్న సుందరీ! నీవు సంతాన వాంఛతో నా దగ్గరకు వచ్చావు. గుణవంతురాలూ, శీలవంతురాలూ, అయిన ఇల్లాలి మనస్సులోని కోరిక తీర్చడం భర్త ఆవశ్య కర్తవ్యం.

తరుణీ! యొక్క ముహూర్త ముండు మిది సంధ్యాకాల మిక్కాల మం
దరయన్ భూతగణావృతుం డగుచుఁ గామారాతి లీలన్ వృషే
శ్వర యానంబున సంచరించుట నభావ్యం బయ్యె నీ యుగ్రవే
ళ రమింపంగ నిషిద్ధకర్మ మగు నేలా ధర్మమున్ వీడఁగన్?

ఓ తరుణీమణీ! ముహూర్తకాలం ఆగు. ఇది సంధ్యాసమయం. ఇప్పుడు మన్మథుడికి శత్రువైన పరమ శివుడు నంది వాహనంపై భూత గణాలతో కూడి విహరిస్తూ ఉంటాడు. కాబట్టి ఈ సమయం మంచిది కాదు. ఈ ఉగ్రవేళలో కలయిక నిషేధించబడింది. ఎందుకు ధర్మాన్ని అతిక్రమించాలి. ఒక్క ముహూర్తకాలం పాటు ఆగు.

462 కాంతా! అదుగో, అటు చూడు. నీ మరిది రుద్రుడు (రుద్రుడూ, కశ్యపుడూ బ్రహ్మదేవుని పుత్రులు, అందుచేత సోదరులు) రుద్రభూమినుండి సుడిగాలుల వల్ల చెలరేగిన ధూళితో నిండిన దేహంతో కలవాడై, కావిరంగుచే ప్రకాశిస్తూ భయంకరంగా చెదరి కదలుతున్న జటాజూటంతో, తెల్లని విభూతి పూతలతో, బంగారు కాంతులతో వెలిగిపోతున్నాడు.

463 అగ్ని, చంద్రుడు, సూర్యుడు, ఆ రుద్రుని నేత్రాలు. ఆ త్రినేత్రుడు ఆ కన్నులు పెద్దవి చేసి మన వైపు అధిక రోషంతో చూస్తున్నాడు. ఆయన మన బంధువే కదా ఫరవాలేదు అని అనుకో వద్దు సుమా.

464 రుద్రునికి మిత్రులూ, శత్రువులూ; మాన్యులూ, సామాన్యులూ; నచ్చినవారూ, నచ్చనివారూ అనే భేదాలు లేవు. ఆయన సమబుద్ధి కలవాడు, సర్వ ప్రాణుల యందు తాను అంతర్యామిగా ఉంటాడు.

465 ఓ వనితా! మా సోదరుడైన ఆ దేవదేవుని మరది గదా అని మనస్సులో ఫరవాలేదు అనుకో వద్దు. ఆయన సర్వేశ్వరుడు; పరాత్పరుడు; త్రిలోకపావనుడు; పాప హరుడు.

466 మేము గాని, ఎంతో మంచివారైన విద్వాంసులు గాని, అ మహాత్ముని అవిద్యారూపకమైన మాయకు లోబడి ప్రవర్తిస్తుంటాము. ఆ మాయ కూడా అనుభవించి విడిచిన పుష్పమాలికవలే, దూరంగా ఉండి కూడా ఆ మహాత్ముని పాదపద్మాలను సేవించాలనే ఆసక్తి కలిగి ఉంటుంది. అటువంటి మాయదేవిని అనుసరిస్తూ మేము ఉంటాను. అంతే కాదు, ఇంకా విను.

467 ఎవరి అనుగ్రహంవల్ల బ్రహ్మదేవుడు, ఇంద్రాది దిక్పాలకులు తమతమ పదవులను అధిష్టించి అతి వైభవంగా ఉంటున్నారో, ఎవరి ఆజ్ఞకు లోబడి ఈ సమస్త ప్రపంచానికీ రాణి అనదగిన మాయ ఎల్లప్పుడూ ప్రవర్తిస్తూ ఉంటుందో, ఎవరి గొప్పదనం ఎంతటిదో వేదాలు కూడా నిరూపించలేవో, ఎవరిని అందరూ సేవిస్తారో, ఎవరు తనతో సాటివారూ,

తనకంటే మేటివారూ లేనివారో అటువంటి దేవదేవుని, త్రిపురాసుర సంహారుని, హరుని, అస్థిమాలాధరునీ, ఆది భిక్షువుని, బూడిద పూసుకునేవాడనీ, శ్మశానవాసి అనీ, అపహాస్యం చేసేవారు పరమ నిర్భాగ్యులు.

468 కుక్కలకూ, నక్కలకూ, ఆహారంకాదగినదీ, ఇహ పరాలకు దూరం అయినట్టిదీ అయిన శరీరాన్ని శాశ్వతమని నమ్ముకొని, దానిని వస్త్రాలతోనూ, పూలదండలతోనూ, ఆభరణాలతోనూ, అలంకరించుకునే వారు మూర్ఖులు.

469 అట్టి శివ వ్యతిరేకులు పరమ దౌర్భాగ్యులని తెలుసుకొ" అని తన ప్రియసతి అయిన దితికి కశ్యపప్రజాపతి తెలిపాడు. కాని ఆమె మన్మథుని బాణాలచే దెబ్బతిన్న మనస్సు కలది అయి, కశ్యపునితో ఇంకా అలా మాట్లాడ సాగింది.

దితి గర్భంబు ధరించుట

470 దితి తన పట్టు వదలకుండా సిగ్గుతో తలవంచుకొని, ఇది తగనిపని అనికూడా చూడకుండా సహనం కోల్పోయి వారకాంతలాగ కామోత్కంఠతో పతిని కౌగలించు కున్నది.

471 ఇలా చేస్తున్న ఇల్లాలు నిర్బంధాన్ని వదిలించుకోలేక, కశ్యపప్రజాపతి ఈశ్వరునకు నమస్కారం చేసి ఏకాంతంగా తన కాంత కోరిక తీర్చాడు. వెంటనే కాళ్ళు చేతులు కడుగుకొని స్నానంచేసి ప్రాణాయామ పూర్వకంగా, శాశ్వతమూ, పరమ పవిత్రమైన బ్రహ్మ గాయత్రీ మంత్రాన్ని జపించాడు.

472 దితికూడా కూడనిపని చేసినందుకు మనస్సులో సిగ్గు అతిశయించగా తలవంచుకున్నది. పశుపతి యైన రుద్రుడు ఏమి చేస్తాడో అనే సంశయంతో, భయంతో, తన భర్త కశ్యపునితో ఎంతో ప్రియంగా ఇలా అన్నది

473 దితి అప్పుడు కశ్యపుణ్ణి చూసి ఇలా అన్నది "సర్వభూత సంరక్షకుడైన పరమేశ్వరుడు నేను చేసిన అపరాధాన్ని క్షమించి నా గర్భాన్ని రక్షించు గాక; రుద్రుడు దయాసముద్రుడు, మహానుభావుడు, స్వయంప్రకాశకుడు. ఆయన అనుజ్ఞ దాటరానిది. ఆయన కోరికలు కలవారికి కోరికలు తీరుస్తాడు. కోరికలు లేనివారికి మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. దుండగులను దండిస్తాడు. ధర్మదండాన్ని ధరిస్తాడు. దుర్జన శిక్షకుడూ, పరమాత్ముడూ, సర్వవ్యాపకుడూ, నిర్గుణుడూ, నిష్కాముడూ, భక్తసులభుడూ, సంపన్నుడూ, జగన్నాథుడూ, అపార కృపామయ హృదయుడూ, అత్యంత చింతాక్రాంతలైన కాంతలను కటాక్షించేవాడూ, సతీదేవి వల్లభుడూ అయిన సర్వేశ్వరుడు నన్ను మన్నించు గాక" అని సన్నుతించింది.

474 పద్మాలలాంటి కన్నులు గల ఆ దితి సంతానము లేనిది కాబట్టి, తన వల్లభుని వల్ల తనకు గర్భం నిలిచినందుకు మనస్సులో ఎంతగానో సంతోషించింది.

475 అంతట కశ్యపప్రజాపతి ఆ సమయానికి చేయవలసిన సంధ్యావందనం కార్యక్రమాలు ముగించుకున్నాడు.

476 తన భార్యకు గర్భం నిలిచినందుకు ఆ మరీచి పుత్రుడైన కశ్యపప్రజాపతి ఆనందం అతిశయించినా, చేయరాని పని చేసినందుకు మనస్సులో బాధపడుతూ, పల్చని ఉదరం గల సుందరి అయిన తన కాంతతో ఇలా అన్నాడు.

477 "ఇంతీ! దితి! నీవు మన్మథుని చెరుకువింటి నుంచి వెలువడిన పదునైన బాణ పరంపరల ధాటికి తట్టుకోలేక చెదరిన హృదయం కలదానివి అయి; లోకనిందకు జంకక; సిగ్గూ భయమూ విడిచిపెట్టి; ఆరాటంలో బలవంతంగా వెలయాలి వలే వ్యామోహానికి లొంగిపోయి సంగమించావు.

478 అలా జరుగుట వలన

479 భామా! నా మాట విను భూతగణాలచే ప్రేరేపించబడినవారై రుద్రుని అనుచరులు భద్రుడు, అనుభద్రుడు అనే వారిద్దరూ నీకు కుమారులై జన్మిస్తారు. వారు మిక్కిలి శక్తి సంపన్నులూ భయంకరమైన కార్యాలు చేసేవారు.

480 ఆ నీ కుమారులు మహా బలవంతులూ, అతి గర్విష్ఠులూ. వారిద్దరూ తమ పరాక్రమాటోపంతో నిరంతరమూ సజ్జనులను బాధిస్తూ భూమికి భారమైన వారు అవుతారు.

481 అటువంటి దుష్కర్ముల, దుండగాలకు మహాత్ములు సహించలేకపోతారు. వారు సర్వజ్ఞుడైన విష్ణువుకు వీరి క్రూరకృత్యాలు, విన్నవించుకుంటారు. ఆయన ఆగ్రహించి ఇంద్రుడు వజ్రాయుధంతో కొండలను ఖండించినట్లు ఆ దుర్మార్గులను హతమారుస్తాడు. "

482 ఈవిధంగా తన పతి అయిన కశ్యపప్రజాపతి చెప్పగా విని దితి ఎంతో భయపడింది. చాలా ఆందోళన చెందింది. వెలవెలబోతున్న ముఖంతో భర్త ముఖము వైపు చూస్తూ ఇట్లా అన్నది.

483 "అవునండి. లోకంలో తామసగుణం మనసు నిండా ఉన్నవారు మంచివారికి అపరాధం చేస్తారు. వారు తమ ఆయుస్సు, సంపదలు నష్టపోయి శత్రువుల చేతిలో అకాల మరణం పొందుతారు. ఇది లోకసహజమే కానీ. నీ పుత్రులు సజ్జనులకు ఎంత అపకారాలు చేసినా కూడా, శ్రీమహావిష్ణువుల వారు దయార్ద్రహృదయులు కనుక దయతలచి వారిని కాపాడరా?"

484 ఇలా చెప్పిన దితితో కశ్యపప్రజాపతి ఇలా అన్నాడు "ఓ అందమైన దితీదేవీ! నీవు చేసిన ఈ తప్పు వలన ఇలాంటి పరిస్థితి వచ్చింది. సరేకాని, దీనికి మనసులో బాధపడకు.

శ్రీమహావిష్ణువు పాదపద్మాలను ధ్యానించటం, నన్ను సంతోషంగా సేవించటం తప్పక చెయ్యి.

485 బహు రమణీయమైన సుందరీమణీ! దితీ దేవి! నా కొడుకులలో హిరణ్యకశిపుడికి గొప్ప ధార్మికుడు, గొప్ప విష్ణుభక్తుడు అయిన కొడుకు పుడతాడు. అతను శ్రీహరి పాదాలపై అర్పించబడిన మనసు కలవాడు అవుతాడు.

486 అంతేకాకుండా.

487 మహా పుణ్యాత్ముడూ, వంశ పావనుడూ, బుధజన శ్రేష్ఠుడూ కావటంవల్ల, ఆ మహామహుని కీర్తిలతలు బ్రహ్మాండభాండం అంతా వ్యాపిస్తాయి.

488 వాలుకన్నులు గల అందగత్తెవి అయిన ఓ దితీ! అతడు దుర్మార్గుడైన హిరణ్యకశిపుని పుత్రుడే అయినప్పటికీ, శ్రీహరి పాద భక్తుడు కావటంవల్ల, మాసి రంగు తగ్గిన బంగారం అగ్నితో పరిశుద్ధమైనట్లు, వంశాని కంతా పరమ పవిత్రు డౌతాడు.

489 శ్రేష్ఠమైన అష్టాంగ యోగక్రియలలో ఆరితేరిన మహా యోగీశ్వరులు సైతం ఆ మహానుభావుని సత్ప్రవర్తనకూ, సాధు శీలానికి మురిసిపోయి ఆయన అడుగుజాడలలో తాము కూడా నడవాలని తమ మనస్సులలో నిత్యమూ కోరుకుంటారు.

490 అతను పరమ భగవద్భక్తులలో అగ్రగణ్యుడూ, సద్గుణాలకు సముద్రంవంటి వాడూ, మహితాత్ముడూ. ఆ మహానుభావుడు తన హృదయకమలంలో లక్ష్మిదేవి భర్తా, తులసి మాల ధరించువాడూ, పరాత్పరుడూ అయిన విష్ణువును సంతోషంగా నిరంతరం నిలుపుకొని ఆ హరిసేవా మార్గంలోనే జీవితమంతా నడవాలని నిశ్చయించుకున్నవాడు అయి లౌకికములైన వస్తువులను చులకనగా చూస్తాడు.

491 అటువంటి వాడు నీ మనుమడు

492 నీ మనుమడు శరీరాదులపై అభిమానం లేనివాడై వైరాగ్యంతో కూడిన స్వభావం కలవాడై ఇతరుల అభివృద్ధికి సంతోషిస్తూ, అలాగే ఇతరుల దుఃఖానికి, సంతాపం చెందుతూ ఉంటాడు. ఈ విశ్వం సమస్తమూ, భగవన్మయమని భావిస్తాడు. అటువంటి భావన భగవంతుని దయ వల్లనే కలిగిందని విశ్వసిస్తాడు. అటువంటి భగవంతుణ్ణి సంతోషంతో ఏకాగ్ర దృష్టితో, ఆత్మసాక్షిగా దర్శిస్తాడు. భయంకరమైన ఎండాకాలంలో సర్వజీవులకు తాపాన్ని పోగొట్టే చంద్రునిలా, సమస్త జీవుల సంతాపాన్ని పోగొడతాడు. ఆయనకు శత్రువు అనే వాడు ఉండనే ఉండడు.

493 అంతేకాకుండా, ఆ హిరణ్యకశిపుని కుమారుడు శ్రీహరి ధ్యానంలో అత్యంతమైన నిష్ఠ కలవాడై పరమ భాగవతులలో అగ్రగణ్యుడు అవుతాడు.

494 నిర్మలమైన తన లోపలా వెలుపలా, సృష్టి అంతటా సర్వ రూపాలు తనవే అయిన, రమావల్లభుడూ అయిన విష్ణువు యొక్క మకరకుండలాలతో మనోహరమైన ముఖాన్ని సంతోషంగా సందర్శిస్తాడు.

495 నీ మనుమడు మనువుతో సమానుడైన వాడు. మహానుభావులలో కెల్లా మహనీయునిగా కీర్తింపబడతాడు. తన మనస్సులో ఈ ప్రపంచమంతా హరిమయంగా తలంచుతాడు. మరియు మహాత్ము లందరిలో నీ మనుమడు మహనీయుడై కీర్తి పొందుతాడు" అని కశ్యపుడు చెప్పాడు.

496 కశ్యపప్రజాపతి పలుకులు విన్న దితి తన కొడుకులు విష్ణువు చేతిలో మరణిస్తారన్న మాటకు విచారించింది. తన మనుమడు పరమ భాగవతుడై సజ్జనులచే గౌరవించబడువాడు అవుతాడన్న మాటకు ఎంతో సంతోషించింది.

497 ఇలా దితి దుఃఖ సంతోషాలతో కాలం గడుపుతూ ఉండగా, కశ్యపుని వీర్యంతో నిండిన దితి గర్భం భరింపరాని తేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ, అన్య తేజస్సులను అతిశయిస్తూ, దినదినాభివృద్ధి పొందుతూ ఉంది.

దితిగర్భప్రకారంబుజెప్పుట 498 ఆ దితి గర్భంలోనుంచి అతిరమణీయమైన ఆకారంతో ఒక తేజస్సు ఇతర తేజస్సు లన్నింటినీ అణచివేస్తూ వెలువడి, నింగీ నేలా నిండుకొని, సూర్యచంద్రుల కాంతులను కప్పివేసింది. సూదికూడా దూరనంతగా మిక్కిలి చిక్కనైన చీకటి భయంకరంగా అంతటా వ్యాపించింది. అందరూ భయంతో వణికిపోయారు.

499 దేవతలంతా బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి, అతని పాదపద్మాలకు నమస్కరించి, చేతులు జోడించి భయంతోనూ తత్తరపాటుతోనూ ఇలా విన్నవించారు. "ఓ బ్రహ్మదేవా! నీవు దేవతాకులంలో శ్రేష్ఠుడవు. పాపమనే సముద్రాన్ని దాటించేవాడవు. సృష్టికి కారణమైనవాడవు.

500 నీవు చరాచరప్రపంచానికి అధినేతవు. సర్వమూ ధరించేవాడవు. లోకపాలకు లందరిలో అగ్రగణ్యుడవు. పూజనీయమైన స్వరూపం కలవాడవు. సరస్వతికి భర్తవైన ఓ దేవదేవా! ఈ బ్రహ్మాండంలో నీకు తెలియనిది ఏదైనా ఉన్నదా? ఆపదల పాలై నిన్ను శరణు చొచ్చిన మమ్మల్ని గురించి మనస్సులో ఆలోచించు.

501 దేవా! కార్యరూపమైన ఈ చరాచర ప్రపంచానికి నీవే కారణమైనవాడవు. నీ చేతనే ఈ సమస్త లోకాలు సృష్టింపబడ్డాయి. సర్వ ప్రాణుల ఆంతర్యం తెలిసినవాడవు. లోకపాలకులలో మశ్రేష్ఠుడవు. విజ్ఞాన సంపన్నుడవు. మాయాప్రభావంతో ఈ సృష్టికర్త రూపాన్ని పొందావు. రజోగుణాన్ని పొందిన నీలో విశ్వమంతా లీనమై ఉంటుంది. యోగులై నిష్కాములై నిన్ను ధ్యానమార్గాన దర్శిస్తూ ప్రాణాయామంతో ఆత్మారాములై నీ

అనుగ్రహాన్ని పొందినవాళ్ళకు అవమానా లెక్కడివి? తాళ్ళతో కట్టివేయబడిన పశువుల్లాగా ఎవ్వని ఆజ్ఞకు బద్ధులై సమస్తజీవులు ప్రవర్తిస్తారో అటువంటి నీకు నమస్కరిస్తున్నాము. పగలూ రాత్రీ అనే విభాగం లేకుండా సమస్తకర్మలూ లోపించిన లోకాలకు క్షేమాన్ని ప్రసాదించు. శరణు కోరి వచ్చిన మాపైన నీ పరిపూర్ణమైన దయతో నిండిన కటాక్షాన్ని ప్రసరింపజేసి కాపాడు. కశ్యపుని వీర్యం దితి గర్భంలో అన్ని దిక్కులనూ ఆక్రమించి కట్టెలో రగుల్కొనే అగ్నిలాగా లీనమై వృద్ధిపొందుతున్నది." అని విన్నవించిన దేవతల నందరికీ ఆనందం కలిగే విధంగా బ్రహ్మ ఇలా అన్నాడు.

సనకాదుల వైకుంఠ గమనంబు

502 "ఓ దేవతలారా! సనక సనందనులు మొదలైనవారు మీకు పూర్వులు. నా మానసపుత్రులు. పుణ్యాత్ములు. నడచివచ్చే మోక్షస్వరూపులు. సర్వ విషయాలలో సమగ్రమైన బుద్ధి, వివేకం కలవారు.

503 ధీరులూ, కోరికలు లేనివారూ అయిన ఆ సనక సనందనాదులు యథేచ్ఛగా లోకాలన్నీ తిరుగుతూ ఒకనాడు విష్ణు పాదపద్మాలను సేవించాలనే కోరికతో బయలుదేరారు.

504 జ్ఞానులలో శ్రేష్ఠులైన ఆ సనక సనందనాదులు అలా వెళ్ళి వెళ్ళి శ్రేష్ఠమైన వైకుంఠ నగరాన్ని చూసారు. అది దివ్యమైన శోభతో నిత్యమూ దేదీప్యమానంగా మనోహరంగా ఉంటుంది. శరణుకోరే భక్తులు దాని పేరును స్తుతిస్తారు. అది జన్మబంధాలను ఛేదిస్తుంది; సజ్జనులచేత పొగడ బడుతుంది; భక్త జనులను పాలించే గుణాలకు ఆలవాలమైనట్టిది.

505 ఆ వైకుంఠ మహానగరంలో నివసించేవారు నిష్కామ ఫలమే తమకు సత్ఫలంగా భావిస్తూ, కైవల్యధర్మం కలవారై, విష్ణు పాదపద్మాలను పూజిస్తూ, అపురూపాలైన విష్ణు స్వరూపాలను ధరించి ఎల్లప్పుడూ సుఖంగా ఉంటారు.

506 రజస్తమోగుణాలకు అతీతుడూ, చక్కని కీర్తి కలవాడూ, స్వచ్ఛమైన సత్త్వగుణం కలవాడూ, జన్మరహితుడూ, ఆద్యంతాలు లేని భగవంతుడూ, అనంతశక్తిశాలీ, వేదాంతవేద్యుడూ, నిశ్చలం నిర్మలం అయిన ధర్మం మూర్తీభవించినవాడూ అయిన విష్ణుమూర్తి పేరుతో ఆ నగరంలోని ఉద్యానవనం పెంపొందుతున్నది.

507 మోక్షమే మూర్తీభవించిందా అన్నట్లున్న ఆ ఉద్యానవనం 'నైశ్రేయసం' అనే పేరుతో కనువిందు చేస్తూ ఉంటుంది. ఆ వనంనిండా ఎన్నెన్నో కల్పవృక్షాలు స్వేచ్ఛగా పెరిగి పూలతో, పండ్లతో నిండి ఉంటాయి. అవి అన్ని వేళలా అన్ని ఋతువుల వైభవంతో శోభిస్తూ, అర్థిజనుల మనస్సులలో మొలకెత్తిన కోరికలను కొరత లేకుండా తీరుస్తుంటాయి. కొల్లలుగా విరబూచిన మొల్లపూవుల సుగంధంతో కూడిన మకరంద బిందువులను మందమారుతాలు అక్కడ నలుమూలలా వెదజల్లుతూ ఉంటాయి. తమ

సుందరీమణులతో విమానాలలో విహరించే గంధర్వులు ఆ కమ్మని పూలతేనెల సోనలను ఆస్వాదిస్తూ మైమరచి మహానుభావుడైన విష్ణుదేవుని కథలు చెప్పుకొనడం మరిచిపోతూ ఉంటారు. అంతలోనే వారు ఆ అజ్ఞానంనుండి తేరుకొని విచ్చలవిడిగా విషయవాసనలను రెచ్చగొట్టే ఆ సువాసనలు నారాయణుని పాదపద్మాల సేవకు ఆటంకాలని భావించి ఆ సువాసనలను తృణీకరించి విష్ణుసేవాపరాయణులై సంచరిస్తూ ఉంటారు. పావురాలూ, హంసలూ, బెగ్గురు పక్షులూ, చిలుకలూ, కోకిలలూ, వానకోయిలలూ, తీతువుపిట్టలూ, నెమళ్ళూ, చక్రవాకాలూ మొదలైన పక్షులు వారి మనస్సులలో ఆనందం పొంగిపొరలేటట్లు చేస్తూ ఉంటాయి. ఆ కోలాహలాన్ని మించి విష్ణుకథలను నిరంతరం గానం చేస్తున్నట్లు ఝుంకారం చేస్తున్న గండుతుమ్మెదలతో కూడిన మేలుజాతి పూలతీగలు కనువిందు చేస్తుంటాయి. వందనీయ చరిత్రుడైన వైకుంఠనిలయుని కంఠంలో వనమాలికలుగా వెలసి విలసిల్లడానికి ఈ తులసి ఎంతటి తపస్సు చేసిందో అని ఆనందంతో అభినందిస్తున్నట్లు మంచి గంధపుచెట్లు, మందారాలు, మల్లెలు, కమలాలు, సురపొన్నలు, పొన్నలు, పొగడలు, అశోకాలు, గోరంటలు, కలువలు, పారిజాతాలు గుత్తులు గుత్తులుగా పూచి తులసీవనాలపై సుగంధాలు విరజిమ్ముతూ ఉంటాయి. అక్కడ ఒత్తుగా పూచిన పూలగుత్తులతో గుబాళించే పొదరిండ్లున్నాయి. ఆ పొదరిండ్లలో ఎత్తైన స్తనకుంభాల బరువుకు నకనకలాడే సన్నని నడుములు కల కొందరు సుందరీమణులు విహరిస్తుంటారు. ఆ లతాంగులు నీలిరంగు పట్టుచీరలు కట్టుకొని, బంగారు గజ్జెల ఒడ్డాణాలు సింగారించుకొని ఉంటారు. వారి వయ్యారపు నడకల సొగసులు హంసలనూ, నెమళ్ళనూ ఎగతాళి చేస్తున్నట్లుంటాయి. వారి వాలుకన్నులు మన్మథుని పూలబాణాలను పరిహసిస్తుంటాయి. వారి సౌందర్యానికి లొంగక, వారితో శృంగారక్రీడలను కోరుకోకుండా, అక్కడి విష్ణుభక్తులు గోవిందుని చరణారవిందాలను సేవించడం వల్ల లభించిన నవరత్నాలు పొదిగిన బంగారు విమానాలను ఎక్కి అక్కడి పుణ్యప్రదేశాలలో విహరిస్తూ ఉంటారు. అందాలదేవి అయిన లక్ష్మీదేవి ముల్లోకాల సౌందర్యం మూర్తీభవించినట్లుగా మణులు చెక్కిన కాలి అందెలు ఘల్లుఘల్లున మ్రోగుతుండగా తన మనోనాథుడయిన వైకుంఠనాథుని మందిరంలో తన చంచలత్వాన్ని మాని సంచరిస్తూ ఉంటుంది. ఆమె తన చేతిలోని లీలాకమలాన్ని త్రిప్పుతూ ఉండగా ఆమె నీడ ఆ మేడలోని బంగారు పాలరాతి గోడలపై ప్రతిఫలిస్తుంది. అప్పుడది విష్ణుమందిర సమ్మార్జనమే పరమధర్మమని ప్రకటిస్తున్న ట్లుంటుంది. వనంలోని పరిమళాలను వెదజల్లే తులసీదళాలను దండలు కట్టి లక్ష్మీదేవి తన హృదయేశ్వరుని పదకమలాలపై అర్పిస్తూ ఉంటుంది. ఆ సమయంలో శ్రమవల్ల కలిగిన స్వేద బిందువులవల్ల నుదుటనున్న కస్తూరీ తిలకం కరిగి అంటుకొని కదలుతున్న

ముంగురులతో, నువ్వుపువ్వువంటి చక్కదనాల ముక్కుతో ముద్దులు మూటగట్టే ఆమె ముఖపద్మం అక్కడి కోనేటినీటిలో ప్రతిబింబిస్తుంది. అప్పుడు ఆమె నీల మేఘశ్యాముడైన విష్ణువు తన ముఖాన్ని ముద్దాడుతున్నట్లు భ్రమించి సిగ్గుతో తల వంచుకొంటుంది. అటువంటి దిగుడు బావుల చుట్టూ గట్టులపైన పగడాలతీగలు అల్లుకొని ఉంటాయి. ఈ విధంగా ఎంతో హృద్యమైన ఆ ఉద్యానవనం పుణ్యానికి ఆస్థానమై, ధర్మానికి సంస్థానమై, సుకృతాలకు మూలస్థానమై వెలుగొందుతూ ఉంటుంది.

508 విష్ణువునకు విముఖులైనవాళ్ళూ, ఇతర లౌకిక సుఖాలతో సతమతమయ్యే మనస్సు కలవాళ్ళూ, పాపపు నడవడి కలవాళ్ళూ, నరకానికి కారణాలై దూషింపదగిన చెడ్డ కథలందు ఆసక్తి కలిగి మెలిగేవాళ్ళూ భగవంతుని పాదపద్మాలను సేవించే భక్తులుండే ఆ పవిత్ర ప్రదేశాన్ని చేరుకోలేరు.

509 ఇంకా...

510 పాపాలను హరించేవాడూ, పరాత్పరుడూ, కేశవుడూ, అనంతుడూ అయిన విష్ణువును సేవించడానికి ప్రధానసాధనం భక్తి మాత్రమే. కేవలం ధర్మశాస్త్ర పరామర్శతో పండిన బుద్ధికౌశలం కలిగిన మానవులు ఆ నారాయణుని మాయచేత మరింత మోహితులై అతని పాదపద్మాలను సేవించే పద్ధతిని తెలుసుకోలేరు. అందుచేత వారు ఆ వైకుంఠ స్థానాన్ని అందుకోలేకపోతున్నారు.

511 పద్మనాభుడైన విష్ణువు యొక్క దివ్యమంగళ కథలను ఆలపించడం వల్ల పెల్లుబికిన ఆనందబాష్ప ధారలతో చెమ్మగిలుటవలన అందగించిన చెక్కిళ్ళూ గద్గదమైన కంఠమూ పులకరించిన మేనులూ కలవాళ్ళూ, వైరాగ్యభావం కల మనస్సు కలవాళ్ళూ, అహంకారాన్ని పూర్తిగా విడిచినవాళ్ళూ; సజ్జనులుండే ఆ వైకుంఠ పుణ్యప్రదేశంలో ఉంటారు.

512 అక్కడ ఆ వైకుంఠంలో...

వరవైకుంఠము సారసాకరము దివ్యస్వర్ణశాలాంక గో
పురహర్మ్యావృతమైన తద్భవన మంభోజంబు తన్మందిరాం
తరవిభ్రాజిత భోగి గర్ణిక తదుద్యద్భోగ పర్యంకమం
దిరవొందన్ వసియించు మాధవుఁడు దా నేపారు భృంగాకృతిన్

513 శ్రేష్ఠమైన వైకుంఠమే ఒక సరోవరం. దివ్యమైన బంగారు మంటపాలతో, గోపురాలతో, మేడలతో కూడిన ఆ మహామందిరమే పద్మం. ఆ మందిరం మధ్యభాగాన ప్రకాశించే ఆదిశేషుడే తామరదుద్దు. శేషతల్పంపై శయనించే మాధవుడే తుమ్మెద. మిక్కిలి ప్రసిద్ధమైన ఆణిముత్యం ఈ పద్యం. వరవైకుంఠపురము అనగానే ఈ పద్యాన్ని

గుర్తుచేసుకోలేని తెలుగువాళ్ళలో పండితులు కాని పామరులు కాని ఎవరు ఉండేవారు కాదు. సనక సనందన సనత్కుమార సనత్సుజాతులు నలుగురు చతుర్ముఖుని పుత్రులు. వారు పరమ బ్రహ్మవేత్తలు, ఆది ఋషులు, దేవర్షులు. వారు ఒకసారి నారాయణుని దర్శించుకోడానికి వెళ్ళారు. ఆ సందర్భంలోని వైకుంఠపుర వర్ణన యిది.

514 అప్పుడు...

515 విష్ణువు పాలించేదీ, బంగారు విమానా లెక్కి విహరించే పుణ్యపురుషులతో నిండినదీ, వైభవంతో కూడిన మహాప్రభావంతో శోభిల్లేదీ అయిన ఆ వైకుంఠధామాన్ని లోకకళ్యాణ స్వరూపులైన సనక సనందనాదులు తృప్తి చెందిన మనస్సులతో తమ యోగశక్తితో వడివడిగా సమీపించారు.

516 అలా సనకాదులు వైకుంఠపురము సమీపించి...

సనకాదుల శాపంబు

517 విష్ణువును చూడాలనే ఆనందంతో ఆ సనకాది మహర్షులు ఇతరమైనవేవీ చూడకుండా మరకతమణి తోరణాలతో అలంకరింపబడిన గోడలతో, రత్నాలు పొదిగిన కవాటాలతో ఒప్పుతున్న ఆరు మహాద్వారాలను దాటి ఏడవ మహాద్వారాన్ని చేరుకున్నారు. అక్కడ కావలి కాస్తున్న సమాన వయస్సు కల ఇద్దరు ద్వారపాలకులను చూచారు.

518 ఆ ద్వారపాలకు లిద్దరూ నవరత్నాలు పొదిగిన బంగారు కంకణాలు, ఉంగరాలు, హారాలు, భుజకీర్తులు, కాలి అందెలు ధరించి ఉన్నారు. ఇంపైన సువాసనలతో గండుతుమ్మెదలను ఆకర్షించే మేలుజాతి పూలదండలను వక్షస్థలాలపై అలంకరించుకొని ఉన్నారు. గదలు పట్టుకొని చతుర్భుజాలతో ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. వారి కళ్ళు రోషాగ్నితో ఎఱ్ఱబడి ఉన్నాయి. వారి ఫాలభాగాలు ముడిపడ్డ కనుబొమలతో వంకరలు తిరిగి ఉన్నాయి. వారి హస్తాలలో పేము బెత్తాలు కదులుతున్నాయి. ఆ విధంగా వారిద్దరూ ముకుందుని శుద్ధాంతమందిరం ముందు నిలబడి ఉన్నారు. వృద్ధులై కూడ సనకాది యోగులు శుద్ధమైన మనస్సు కలవారై....

519 చతురమతులైన ఆ సనకాదులు ఐదేండ్ల బాలురవలె కనిపిస్తూ అనుమానించకుండా నిరాటంకంగా ఆ ద్వారపాలకులను సమీపించారు.

520 శ్రీనాథుని దర్శించాలనే ఆసక్తితో వెళ్తున్న ఆ యోగులను దుష్టస్వభావం కల ఆ ద్వారపాలకులు కుటిలబుద్ధితో, ప్రతికూల వాక్కులతో పోకుండా అడ్డగించారు.

521 అలా అడ్డగించగా ఆ సనకాది యోగులు కోపంతో ఎరుపెక్కిన కన్నులు కలవారై, దేవతలు చూస్తుండగా కలకలాన్ని వారిస్తూ అక్కడున్నవారంతా వింటూ ఉండగా...

522 ఇలా అన్నారు.

523 "పరాత్పరుడూ, అనంతుడూ, భక్తజనపాలకుడూ, దీనబంధువూ, ప్రియతముడూ, సర్వేశ్వరుడూ అయిన విష్ణువును సేవించడానికి మేము ఎప్పుడూ నిరాటంకంగా ఇక్కడికి వస్తూ సంతోషంగా అతనిని ఆరాధిస్తూ ఉంటాము. అటువంటి మమ్ములను అడ్డగించి మా సేవకు ఆటంకం కలిగించిన ఈ దుర్మార్గులను మీరు చూచారు గదా."

524 ఇలా పలికి సనక సనందనాదులు ద్వారపాలకులైన జయవిజయులను చూచి ఇలా అన్నారు. "మీరు మనస్సులలో మీ స్వామి మేలు కోరుకొనేవారై మోసగాళ్ళైన ఇతరులు భగవంతుని మందిరంలోకి ప్రవేశిస్తారేమో అనే అనుమానంతో కొందరినీ రానివ్వడం, కొందరిని అడ్డగించడం ద్వారపాలకుల ధర్మంగా భావించి కపటం లేని మమ్మల్ని అడ్డగించారు. ప్రశాంతమూ, దివ్యమూ, శుభకరమూ అయిన ఆకారం కలిగినవాడూ, ఎవరితోనూ విరోధం లేనివాడూ, సమస్త విశ్వం తనలో ఇమిడి ఉన్నవాడూ అయిన భగవంతుడు ప్రాప్యం, ప్రాపకం, ప్రాప్తి అనే భేదాలు లేనివాడు కనుక మహాకాశంలో ఘటాకాశం, పటాకాశం వేరు వేరుగా కాక లీనమై ఉన్నట్లు తోచే విధంగా విద్వాంసులు ఆ మహాత్ముని అందరిలోనూ ఆత్మరూపంలో అభేదంగా దర్శిస్తారు. అంతేకాక లోకంలో రాజులు దోషులైన సేవకులను దండించినట్లు భగవంతుడు మిమ్మల్ని దండిస్తాడేమో అనే భయంతో మమ్మల్ని అడ్డగించామని భావించారేమో. భూసురులమైన మాకూ, వైకుంఠాధిపతి ఐన భగవంతునికీ భేదం లేదు కనుక అనుమానించవలసిన పని లేదు. ఇది తెలిసికూడ మందబుద్ధులై మమ్మల్ని అడ్డగించి చేయరాని పని చేసి మా శాపానికి అర్హులయ్యారు. కావున కామక్రోధలోభాలనే శత్రుగుణాలతో (అరిషడ్వర్గాలు – కామం, క్రోధం, మోహం, లోభం, మదం, మాత్సర్యం) భూలోకంలో పుట్టండి."

525 ఆ ద్వారపాలకులు పదునైన దారుణ బాణాలతో కూడ వారింపరాని వారి మాటలు విని ఉలిక్కిపడి తల్లడిల్లారు.

526 ఆ విష్ణుభటులు పరితాపం పొంది సనకాది మునుల పాదాలకు భక్తితో మ్రొక్కి, నుదుట చేతులు జోడించి...

527 ఇలా అన్నారు.

528 "ఓ యోగీశ్వరులారా! మా మనస్సులు నొచ్చుకొనే విధంగా మీరన్న కఠినవాక్యాలకు మేము దుఃఖించడం లేదు. వ్యర్థజీవనులమై సత్పురుషులను అవమానించిన మా పాపమే మాకీ గతి పట్టించింది. ఇక భవిష్యత్తులో శుభం చేకూర్చుకోడానికి మేము ప్రయత్నిస్తాము.

529 అది ఎలాగంటే...

530 మమ్మల్ని కరుణించాలనే సంకల్పం మీ మనసుల్లో ఉంటే ఈ మాత్రం దయచేయండి. అదేమంటే మేము లోభమోహాలతో పుట్టినచోట శ్రీహరి నామాన్ని

మరువకుండా ఉండేటట్లు అనుగ్రహించండి. అందువల్ల తర్వాతి జన్మాలలో మాకు శుభం కలుగుతుంది."

శ్రీహరి దర్శనంబు

531 జయవిజయులు ఇలా అంటున్న సమయంలో...

532 అందరికీ ప్రభువైనవాడూ, అంతములేనివాడూ అయిన హరి ఆ కలకలాన్ని విని, లక్ష్మీదేవితో సరస సల్లాపాలు చేస్తూ వినోదించడాన్ని చాలించి, ఆశ్రయించినవారి కష్టాలను పోగొట్టేవాడై, శాశ్వత వైభవంతో శుభాలను కలిగించేవాడై అంతఃపురం యొక్క మాణిక్యాలు పొదిగిన మందిర ద్వారాలను దాటి మాననీయ స్వరూపంతో వచ్చాడు.

533 ఇంకా...

534 లక్ష్మీదేవి కూడా తొట్రుపాటు కలిగినదై వెంట రాగా, పరమహంసలైన మునీశ్వరులు నమస్కరించే తమ పాదపద్మాలకున్న క్రొత్త మణులు పొదిగిన బంగారు అందెలు అడుగడుగుకూ మనోహరమైన శబ్దాలు చేస్తుండగా శ్రీహరి మహానుభావులచేత నమస్కరింపబడేవాడై, యోగులచేత సేవింపబడేవాడై శ్రీహరి వచ్చాడు.

535 అప్సరసలు తమ చేతులకున్న మణులు పొదిగిన బంగారు కంకణాలు గల్లుగల్లున మ్రోగుతుండగా హంసరెక్కలవంటి తెల్లని వింజామరలను వీస్తున్నారు. ఆ వింజామరల గాలికి చంద్రబింబంలా వెలుగుతున్న వెల్లగొడుగు అంచులలో వ్రేలాడుతున్న ముత్యాల హారాలు బాగా కదులుతున్నాయి. వాటిమీదనుండి చల్లగా జారిపడుతున్న మంచుబిందువులతో అందాలు చిందే దివ్యమంగళ స్వరూపుడై శ్రీహరి వచ్చాడు.

536 ఇంకా...

537 ఆ శ్రీహరి మునీశ్వరు లందరూ వర్ణించే మందహాస సుందరమైన ప్రసన్న ముఖపద్మంతో అలరేవాడు. విశేషమైన ప్రేమతో చెమ్మగిల్లిన కన్నులున్న తన భక్తజనుల హృదయాలలో నివసిస్తూ తనరేవాడు. విశాలమైన నల్లని వక్షస్థలంపై వైజయంతి అనే మాలచేత అలంకరింపబడి రాజిల్లేవాడు. నమస్కరించే జనులను రక్షించడంలో దయామృత తరంగాలు పొంగిపొరలే పద్మనేత్రాలు కలవాడు. ఆ విష్ణువు యోగిపుంగవు లందరిచేత సేవింపబడేవాడు. సజ్జనులను రక్షించడానికి సమర్థుడైనవాడు. అత్యంత మహిమాన్వితమై అఖిలలోకాలకు చూడామణి అయిన వైకుంఠపురాన్ని అలంకరించేవాడు.

538 ఆ శ్రీహరి నడుము చుట్టూ ప్రకాశించే పచ్చని పట్టుపంచెతో బంగారు మొలత్రాడు వెలుగులు వెదజల్లుతున్నది. కంఠం చుట్టూ ఉన్న రత్నహారాల కాంతులు కౌస్తుభమణి కాంతులతో కమ్ముకొంటున్నాయి. మెరుపుతీగలను మించి ప్రకాశించే కర్ణకుండలాల కాంతులు చెక్కిళ్ళ కాంతులతో కలిసిపోతున్నాయి. గొప్పనైన నవరత్నాలు పొదిగిన కిరీటం కాంతులు నలుదిక్కులలో వ్యాపిస్తున్నాయి. గరుత్మంతుని మూపుపై ఆనించిన

ఎడమచేతికి భుజకీర్తులు, మురుగులు, కంకణాలు ముచ్చట గొలుపుతుండగా, కుడి అరచేతిలో తిప్పుతున్న అందమైన పద్మం అమరి ఉండగా శ్రీహరి వచ్చాడు.

539 ఆ శ్రీహరి పాదపద్మాలలోని కేసరాలవలె తులసీదళాలు వెలుగులు వెదజల్లుతున్నవి. ఆ తులసీదళాలతో మిళితమైన మకరంద సుగంధాలతో చల్లగా మెల్లగా వీచే కమ్మని పిల్లగాలులను ఆస్వాదిస్తూ సేవాభావంతో యోగీంద్రులు ఆయన వెంట నడుస్తున్నారు. ఆ యోగీశ్వరుల మనస్సులకు విష్ణుమూర్తి దివ్యస్వరూపం ఆనందదాయకమై వెలుపలి లోపలి ఇంద్రియాలకు సంతుష్టి కలిగిస్తున్నది. ఆ అనుభవం చేత వారు గగుర్పాటు చెందుతున్నారు. ఇటువంటి పరిపూర్ణ తేజోవంతమైన స్వరూపంతో విష్ణుమూర్తి నడచి వచ్చాడు. ఆయన ప్రక్కన లక్ష్మీదేవి నడచివస్తున్నది. మిక్కిలి శ్రేష్ఠమైన ఆమె సౌందర్యం విష్ణుమూర్తి సౌందర్యానికి లోబడి అందులో ఒక అంశంగా వెలుగొందుతున్నది. ఆ విధంగా సకల జగత్తులకు ఈశ్వరుడైన విష్ణువు అక్కడికి వచ్చాడు.

540 ఆ విధంగా సుస్థిరమూ శుభకరమూ అయిన శోభావైభవంతో వచ్చిన ఆ విష్ణుమూర్తి పగడాల పెదవి క్రొంజిగురాకులా ఉంది. స్వామి చిరునవ్వు ఆ చిగురాకుపై విలసిల్లే మల్లెమొగ్గల అందాన్ని అందుకున్నది. అటువంటి గోవిందుని సుందర ముఖపద్మాన్ని సనక సనందనాదులు ఆనందంగా సందర్శించారు. మనస్సులు తృప్తి చెందక మళ్ళీ మళ్ళీ మాధవుణ్ణి సందర్శించారు.

541 ఆ సనక సనందనాది మునులు అచంచలమైన భక్తితో ఆ శ్రీహరి ముఖాన్ని చూపులు త్రిప్పుకోలేక చూసి చూసి, ఎట్టకేలకు చూపులు త్రిప్పుకొని స్వామి పాదాలమీద కేంద్రీకరించారు. ఆ పాదాలు కల్మషము లేని భక్తుల భేదాలను పోగొట్టేవి, మునుల మనస్సులకు మోదాన్ని కలిగించేవి, మోక్షమందిరం యొక్క ద్వారాలను తెరిపించేవి, వేదాలను క్రొంగ్రొత్త నూపురాలుగా చేసికొని పొగడ కెక్కినవి.

542 కోరిక తీరిన ఆ సనక సనందాది మహర్షులు నిరంతరం యోగమార్గాసక్తులైన మహాయోగులు సైతం ఎంత వెదకినా కనిపించని మహానుభావుడైన విష్ణువును కన్నులారా చూసారు. పద్మరాగ మణుల కాంతులతో ప్రకాశించే ఆ భగవంతుని పాదపద్మాలను తమ హృదయాలలో పదిలపరచుకొని పదేపదే నమస్కారాలు చేశారు.

543 ధ్యానించేవారికి మాత్రమే వశమయ్యేవాడూ, తత్త్వజ్ఞులకు దర్శన మిచ్చేవాడూ, భక్తులైన వారికి బ్రహ్మానందాన్ని ప్రసాదించే స్వరూపం కలవాడూ అయిన ఆ పరాత్పరుణ్ణి మునీశ్వరులు తమ మనస్సులలో నిలుపుకున్నారు.

సనకాదుల హరి స్తుతి

544 కన్నులకు విందు కావించే దివ్యమంగళ స్వరూపాన్ని ధరించిన ఆ మహానుభావుడు, పురుషోత్తముడు, అనంత తేజోనిధి అయిన విష్ణువును సనకసనందనాదులు ఇలా సంస్తుతించారు.

545 "పద్మదళాల వంటి నేత్రాలు కలిగినవాడా! భక్తజనులపై వాత్సల్యాన్ని చూపే దేవా! నీ కుమారుడూ, మాకు జనకుడూ అయిన బ్రహ్మదేవుడు మాకు ఉపదేశించిన ఉపాయంతో నీ దివ్య మంగళ స్వరూపాన్ని చూడగలిగాము. ప్రభూ! కృతార్థులమైన మా జన్మ సార్థకమయింది.

546 దేవా! నీవు దుష్టుల హృదయాలలో ఉండికూడ వారికి కనిపించవు. పట్టుదలతో నీ దివ్యమంగళ స్వరూపాన్ని ఆశ్రయించి ఆరాధించేవారిని అంతులేని దయతో చేరదీసి వారి మనస్సులను తృప్తి పరుస్తావు. పద్మనయనా! సర్వలోకాధిపతీ! నిన్ను చూడాలనే కోరిక కలగడం వల్లా, నీ గురించి చెప్పుకొనడం వల్ల, సుస్థిరమైన భక్తియోగంలో నిష్ణాతులైన ఆత్మవిదులైనవారు రాగద్వేషాలు తొలగించుకున్నట్టి యోగిజనుల మనస్సులనబడే పద్మాలలో నీవు కూర్చుని ఉంటావని తెలుసుకుంటారు.

547 నీ పాదాలపై మనస్సు లగ్నం చేసిన భక్తులు నీ భక్తికి వ్యతిరేకాలైన ఇతర ముఖ్యమైన కార్యాలు ముక్తి నిచ్చేవైనా వాటిని పాటింపరు.

548 దయాగుణమే అలంకారంగా గలవాడా! పాపాలను తొలగించేవాడా! పొగడ దగినదీ, దోషాలు లేనిదీ, శుభగుణాలకు కాణాచియైనదీ, గొప్ప కీర్తిచేత విరాజిల్లేదీ అయిన పవిత్రమైన చరిత్ర కలవాడవు. నీ పాదపద్మాల సేవచేత నిర్మలమైన మనస్సు కల మహానుభావులు ఇతర విషయాలను భావించరు.

549 అంతులేని తపస్సు చేసి సాంసారిక పాపాలను పోగొట్టుకొని తిరిగే మేము ఈరోజు నీ పాదదాసులపై కోపించి శపించాము. మహాపాపాన్ని కల్గించే చెడుమార్గంలో అడుగుపెట్టి ధర్మహాని చేసి నరకానికి పాత్రుల మయ్యాము. మా తప్పు మన్నించి మమ్మల్ని రక్షించు.

కరమనురక్తి షట్పదము గమ్రసుగంధమరందవాంఛచేఁ
దరమిడి శాతకంటకవృతస్ఫుటనవ్యతరప్రసూనమం
జరులను డాయు పోల్కిని భృశంబగు విఘ్నములన్ జయించునీ
చరణసరోజముల్గొలువ సమ్మతి వచ్చితిమయ్య కేశవా!

550 కేశవా! తుమ్మెద కుతూహలంతో కమ్మని మకరందం కోసం వాడిముళ్ళతో కూడిన కొంగ్రొత్త పూలగుత్తులను సమీపించే విధంగా మిక్కిలి ఆటంకాలను అధిగమించి నీ పాదపద్మాలను ఆరాధించడానికి వచ్చాము.

551 పద్మనాభా! మాధవా! నీ పాదపద్మాలపై సమర్పింపబడి అందాలు చిందే ఈ తులసి పవిత్రమైనట్లు నీ కథామృతంతో కూడిన మాటలను ఎటువంటి కల్మషం లేకుండా విన్నట్టి మా చెవులు పవిత్రాలై విలసిల్లుతాయి.

552 మహనీయమైన కీర్తియొక్క విలాసంచేత ప్రకాశించే సుగుణాలు కలవాడా! అందరికీ ఆశ్రయింప దగినవాడా! అచ్యుతా! పంచేంద్రియాలకు లొంగినవారికి కనిపించక నల్ల అవిసె పూవుల కాంతితో ఒప్పే నీ సహజ స్వరూపాన్ని ఇప్పుడు మేము సంతృప్తిగా చూసి మా కన్నులు ధన్యతను పొందాయి. నీకు మ్రొక్కిన మమ్మల్ని ఆదరించు.

553 అని ఈ విధంగా సనక సనందనాదులు శ్రీహరి పాదపద్మాలకు మ్రొక్కి భక్తితో పరవశమైన మనస్సు కలవారై విన్నవించారు. గోవిందుడు సంతోషించి ఆ మునీశ్వరులను చూసి ఇలా అన్నాడు.

బ్రహ్మణ ప్రశంస

554 "ఈ ఇద్దరు జయుడు, విజయుడు అనే పేర్లు కల నా ద్వారపాలకులు. వీరు మిమ్మల్ని లెక్కచేయక, నా ఆజ్ఞను అతిక్రమించి చేసిన నేరానికి మీరు తగిన శిక్షే విధించారు. అది నాకు ఇష్టమే. అంతేకాక సేవకులు చేసే అపరాధం యజమానిదే అవుతుంది. కాని ఈ తప్పుకు మాననీయుడినైన నన్ను మన్నించి దయచూపండి. అంతేకాక..." అంటూ శ్రీహరి ఇంకా ఇలా అన్నాడు.

555 "శరీరంలో పుట్టిన భయంకరమైన కుష్ఠరోగంచేత చర్మం చెడిపోయి రంగు మారే విధంగా సేవకులు చేసే చెడ్డ పనులు యజమానుల గొప్ప కీర్తిని, పేరుప్రతిష్ఠలను పోగొడతాయి. వారికి లోకంలో చెడ్డపేరు వస్తుంది.

556 మీవల్ల నాకు లభించిన పుణ్యక్షేత్రం ఈ వైకుంఠం. ఇది ఎంతో పవిత్రమై, పొగడదగినదై, సుందరమై, అమృతమయమై, కీర్తివైభవంతో శోభిస్తూ అలరారుతున్నది. ఇది తన పేరు విన్నవారిని ఎటువంటి అపవిత్రులనైనా, కుక్క మాంసం తినే శ్వపచులనైనా పవిత్రులను చేస్తుంది.

557 అటువంటి నేను మీవంటి సాధుజనులకు అపకారం చేసినవారు నాకు బాహువులవంటి వారైనా ఖండించడానికి వెనుకాడను. ఇంక ఇతరులను మీముందు లెక్కచేయడ మెక్కడిది?

558 సకల పాపములను శమింపజేయ గలది, సమస్త లోకాలను పవిత్రం జేయగలదీ అయిన గంగకు జన్మస్థానమైనట్టివి మఱియు బ్రాహ్మణశ్రేష్ఠులను సేవించుట వలన లభించెడివి అయిన నా పాదపద్మ యుగము కలిగిన నన్ను. . .

559 విరక్తునిగా తేలికగా భావింపక, శుభకరాలైన తన కటాక్షాలనే పూలదండలతో సకల సంపదల వైభవం కలిగిన లక్ష్మి నా వక్షస్థలాన్ని అలంకరించింది.

560 ఆశలు లేనివాడై ధర్మమార్గంలో సంచరించే బ్రాహ్మణోత్తముడు తినే చిన్న అన్నంముద్ద వల్ల నా మనస్సుకు కలిగే సంతృప్తి యజ్ఞయాగాలలో నేతిలో ముంచి అగ్నిముఖంగా వ్రేల్చబడే హవిస్సును అందుకొని ఆరగించేటప్పుడు కూడా కలుగదు.
561 ఎదురులేని యోగమాయావైభవంతో ఎల్లప్పుడూ ప్రసిద్ధుడనైన నేను బ్రాహ్మణుల పవిత్రమైన పాదపద్మ పరాగాలను భక్తితో నా నవరత్న ఖచిత సువర్ణ కిరీటంపై ధరిస్తాను. అటువంటి నా పాదపద్మాలలో జన్మించిన గంగాజలాన్ని తలపై ధరించి శివుడు మొదలైన దేవతలు వెంటనే పవిత్రు లవుతున్నార ఎవడైతే బ్రాహ్మణులు తనకు అపకారం చేసినా తిరిగి కోపగించడో, ఎవడైతే బ్రాహ్మణులను నన్నుగా భావిస్తాడో అటువంటివాడు ధర్మానుసారంగా నాకు మిక్కిలి ఇష్టమైనవాడు.
562 ఎవరైతే గోవులను, బ్రాహ్మణులను, నన్ను, దీనజనులను భేదభావంతో చూస్తారో వారు అధోగతి పాలవుతారు. వారిని యమభటులు త్రాచుపాములవలె, భయంకరమైన గ్రద్దలవలె రోషంతో ముక్కులతో చీల్చుతారు.
563 బ్రాహ్మణోత్తములు ఎన్ని విధాలుగా తమను అవమానించినా చిరునవ్వుతోను సంతోషంతోను నిత్యం వారిని పూజిస్తూ, తండ్రిని కన్నకొడుకులు అనురాగపూర్వకంగా పిలిచే విధంగా మంచిమాటలతో వారిని గౌరవిస్తూ పిలిచేవారు నాతో సమానులౌతారు.
564 వినండి. అటువంటి పుణ్యాత్ములకు నేను ఎప్పుడూ ప్రియతముడనై అమ్ముడుపోతూ ఉంటాను. పూర్వం భృగుమహర్షి నన్ను తన్నినా కోపించకుండా మిక్కిలి సంతోషంతో ఆదరించాను కదా!
565 మునులారా! నా హృదయకమలంలోని అభిప్రాయాన్ని వీళ్ళు తెలిసికొనలేక మీ ఆజ్ఞను మీరిన దోషానికి తగిలఫలాన్ని పొందారు. నా సంకల్పం కూడా ఇదే. వీళ్ళు భూమిపై పుట్టి కొద్దికాలంలోనే తిరిగి నా సమీపానికి వచ్చేటట్లు అనుమతించండి." అని ఆ ముకుందుడు చెప్పగా విని సనకాది మునులు అతని సుకుమార వచనామృతాన్ని రుచిచూచి కూడా కోపాన్ని విడువలేనివారై...
566 సనకాది మునిశ్రేష్ఠుల మనస్సులు తృప్తిచెందలేదు. పరిమితంగా, గంభీరంగా, వివిధార్థాలతో అవగాహన కందక అమృతంతో సమానమై మాధుర్యగుణంతో కూడి, దోషరహితమైన ఆ మహావిష్ణువు మాటలకు మనస్సులో సంతోషించి "మన ప్రభువు ఇప్పుడు స్నేహంతో మనలను అభినందిస్తున్నాడో లేక నిందిస్తున్నాడో లేక మనము విధించిన శిక్షకు సంకోచిస్తున్నాడో తెలియదు" అనుకొంటూ వితర్కించుకొని అంతలోనే... హరి తమపై దయ కలిగి ఉన్నాడని అర్థం చేసికొని, కుతూహలంతో పులకించిన శరీరాలు కలవారై ఉత్కంఠతో సంతోషించి నుదుట చేతులు జోడించి....

567 హరి తమపై దయ కలిగి ఉన్నాడని అర్థం చేసికొని, కుతూహలంతో పులకించిన శరీరాలు కలవారై ఉత్కంఠతో సంతోషించి నుదుట చేతులు జోడించి....

568 స్వయంగా కల్పించుకున్న యోగామాయాప్రభావం వల్ల విలసిల్లే ఐశ్వర్యంతో పరాక్రమంతో సర్వోత్కృష్టుడైన విష్ణువుతో ఆ మునులు వినయంతో ఇట్లా అన్నారు.

569 "దేవా! తేజోవంతమైన నిత్యైశ్వర్యం కల నాయకుడవు, భగవంతుడవు, పుణ్యమూర్తివి. మేము చేసిన పని నీకు సమ్మతమే అన్నావు. నీ లీలలు తెలిసికొనడం ఎవరికి సాధ్యం?

570 దేవా! నీవు పరమపావనుడవు, సాధుజన రక్షకుడవు, సర్వజ్ఞుడవు. దేవతలందరికీ పరదేవతలైన బ్రాహ్మణుల ఆత్మలకు అధినాయడవైన నీకు ఆ బ్రాహ్మణులే అధిదేవత లైనారట. ఎంత చోద్యం!

571 కమలనయనా! నీవలన ఉద్భవించిన ధర్మం నీ అవతారాల వల్ల కాపాడబడి సుస్థిరంగా ఉంటున్నది. దేవా! దయామయా! పాపవిమోచనా! మార్పు పొందని సత్యస్వరూపంతో ఉన్న నిన్ను గమనించిన పెద్దలు నీవే ఆ ధర్మానికి ఫలస్వరూపమనీ, ఆ ధర్మంలోని ప్రధాన రహస్యమనీ చెప్తూ ఉంటారు.

572 దేవా! మంచి వివేకం కలవాడా! గుణభూషణా! లోకపాలకా! నిత్యవినోదీ! ఎవని సంపూర్ణ అనుగ్రహం పొంది మునీశ్వరులు కోరికలు లేనివారై మృత్యుభయాన్ని పోగొట్టుకుంటారో అటువంటి నీకు ఈ లోకంలో మరొకరి అనుగ్రహమా? ఎంత వింత!

573 లక్ష్మీదేవి పాదపద్మాలు ఎల్లప్పుడు సంపదలను కోరుకునే భక్తుల శిరస్సులకు అలంకారాలు. పద్మకేసరాలనుండి స్రవించే మకరందం మీది ఆశతో వచ్చే తుమ్మెదవలె ఆ లక్ష్మీదేవి భక్తజనులు అర్పించిన తులసిమాలలు కల నీ పాదపద్మాలను భక్తితో సేవిస్తూ ఉండగా....కృపాకటాక్షములు పొంగిపొరలగా పొడచూపే భాగవతులమీద అనురక్తి యొక్క నీ మహిమ గమనించుటకు బహు విచిత్రమైనది. కమలాక్షా! నిత్యశుభాకారా! లక్ష్మీమనోహరా! నీ మహిమ చిత్రమైనది.

574 దేవదేవా! నీవు శాశ్వతమైన ఐశ్వర్యాన్ని ప్రసాదించేవాడవు. అందమైన శ్రీవత్సమనే పుట్టుమచ్చతో అలరారేవాడవు. "ఈ శ్రేష్ఠులైన బ్రాహ్మణుల పాదాలకు అంటిన పుణ్యపరాగమే నా శరీరానికి ఆభరణం" అన్నావు. సమస్తలోకులకు బ్రాహ్మణుల గొప్పతనాన్ని తెలియజేయడానికే గదా పవిత్రమైన ఆ రూపు ధరించావు.

575 అంతేకాక...

576 నీవు ధర్మమూర్తివి, సమస్త విశ్వానికి కర్తవు. అటువంటి నీవు రక్షింపదగినవారిని రక్షించకపోతే వేదాలలో చెప్పిన ధర్మమార్గం అధర్మమార్గం అవుతుంది. కనుక సత్త్వగుణాన్ని స్వీకరించినవాడవై ఈ ప్రాణుల క్షేమాన్ని తెలుసుకొని రక్షిస్తావు.

ధర్మద్రోహులను నీ దైవశక్తిచేత దండించే నీకు వేదధర్మ... మార్గాన్ని నాశనం చేసే పద్ధతులు ప్రియంకావు. బ్రాహ్మణులపై దయ కలిగి వినయంతో పల్మిన ఈ మాటలు భక్తవరుదుడవైన నీకు యుక్తమై ఉన్నాయి.

577 ఆ విధంగా ఇతరులపట్ల వినయంతో మాట్లాడితే గౌరవానికి హాని అవుతుందని నీవు భావించినట్లైతే...

578 విశ్వానికి కర్తవూ, విశ్వమూర్తివీ, విశ్వరక్షకుడవూ అయి విరాజిల్లే నీకు గౌరవహాని ఎక్కడిది? ఈ వినయాలు నీ లీలావిలాసాలు కదా!

579 మహానుభావా! మునులమైన మమ్ములను మిక్కిలి సంతోషంతో గౌరవించడం సజ్జనులను ఆదరించే నీ స్వభావం తప్ప మరొకటి కాదు. ఒక విన్నపం. ఈ జయ విజయులపై....

580 మేము వీరిని శపించాము. దేవా! అంతకంటె కఠినంగా శిక్షించాలనుకుంటే నీ ఇష్టం. అలాకాక అధిక సంపదలిచ్చి రక్షించాలనుకుంటే రక్షించు.

581 నీవు ఎలా చేసినా మాకు ఇష్టమే కనుక నిర్దోషులూ, నిష్కల్మష హృదయులూ ఐన ఈ జయవిజయులను మేము అనరాని మాటలు అని ఉంటే మమ్మల్నయినా నీ ఇష్టం వచ్చినట్లు శిక్షించు" అని చేతులు జోడించి నమస్కరించిన సనకాది మునులను దయతో చూచి...

582 పుణ్యాత్ముడైన భగవంతుడు ఇలా అన్నాడు "మునులారా! ఈ జయవిజయులు భూలోకానికి వెళ్ళి అక్కడ లోభమోహాలు కలవారై రాక్షసులై జన్మిస్తారు.

583 దేవతలకు అపకారం చేస్తూ సర్వలోక కంటకులై జీవిస్తూ నాపట్ల వైరభావం కలవారై....

584 ఎంతో సాహసంతో నన్నెదిరించి నాతో యుద్ధం చేసి నా సుదర్శన చక్రం చేత మరణించి తిరిగి సంతోషంతో నా సన్నిధికి చేరుతారు.

585 అంతే కాక...

586 నన్ను విరోధంచేతనైనా తమ మనస్సులలో భావించడంవల్లనూ, నా సమక్షంలో నా ముఖాన్ని చూస్తూ మరణించడం వల్లనూ వీళ్ళు పుణ్యాత్ములై నా ఆస్థానంలో నివసిస్తారు.

587 ఓ మునులారా! వినండి. ఆ తరువాత ఎన్నటికీ వీళ్ళు భూమిమీద జన్మించరు. మీరు చెప్పినట్లే నేను ఆలోచించాను. కనుక ఇక మీ మనస్సులలో....

588 దీనికోసం చింతించకండి." అని విష్ణువు చెప్పగా బ్రహ్మపుత్రులైన ఆ సనక సనందాదులు అనంతుడైన శ్రీహరి భావాన్ని తెలుసుకొని అధికమైన ఆనందంలో తేలి ప్రసన్న హృదయాలతో క్షీరసాగర శయనుడూ, ఆర్తజనులను రక్షించడమే అలంకారంగా గలవాడూ, పాపాలను రూపు మాపేవాడూ అయిన శ్రీహరిని స్తుతించారు.

589 ఇంకా...

590 అప్పుడా సనకాదులు పులకింత మొలకెత్తగా, ఆనందబాష్ప ధారలు కనులవెంట ప్రవహించగా మునులు శరణు కోరే ఉత్తముడూ, ఇంతవాడని అంతవాడని లెక్కింపరానివాడూ, దేవతలలో శ్రేష్ఠుడూ అయిన విష్ణువుయొక్క దివ్యమంగళ శరీరాన్ని, అతని వైకుంఠ మందిరాన్ని సందర్శించి క్రొంగ్రొత్త తామర రేకులవంటి కన్నులు గల అతనికి నమస్కరించి...

591 తాము మాట్లాడిన మాటలను విష్ణువు మాటలుగా భావిస్తూ స్నేహభావంతో విష్ణుమూర్తి భార్య అయిన లక్ష్మీదేవిని స్తుంతించి, ఆ శ్రీహరిచేత....

592 అనుజ్ఞ పొందినవారై ఆ సనకాదులు తమ నివాసాలకు వెళ్ళారు. శ్రీనాథుడు జయవిజయులను దయతో చూసి వెంటనే ఇలా అన్నాడు.

593 "మీరు తప్పనిసరిగా రాక్షసజాతిలో పుట్టవలసి వచ్చింది. నేను అడ్డులేని శక్తిసామర్థ్యాలు ఉన్నవాడనైనా బ్రాహ్మణుల శాపాన్ని నివారించలేను.

594 అందువల్ల మీరు వెంటనే రాక్షసులై జన్మించి నాకు శత్రువులై మీ మనస్సులలో ఎల్లప్పుడు నన్నే స్మరిస్తూ నాచేత మరణించి ఇక్కడికి వస్తారు.

595 "వెళ్ళండి" అని ఆజ్ఞాపించి వికసించిన పద్మపత్రాలవంటి కన్నులు కలవాడూ, ఇంద్రాది దిక్పాలకుల కిరీటాలలోని మణులచేత ప్రకాశించే పాదపీఠం కలవాడూ అయిన హరి లక్ష్మీదేవి వెంటరాగా సంతోషంతో తన నిర్మల పుణ్య మందిరానికి వెళ్ళాడు.

596 అప్పుడు...

597 జయవిజయులు తమ తేజస్సును కోల్పోయి నిశ్చేష్టులై నేల కూలారు. ముల్లోకాలలోను, దేవతా విమానాలలోను హాహాకారాలు చెలరేగాయి.

598 ఆ జయవిజయులే ఇప్పుడు దితి గర్భంలో ఉన్నారు. వారి సాటిలేని మేటి తేజస్సే మీ తేజస్సు లన్నిటినీ వమ్ము చేసింది.

599 దీని కంతా ప్రధానకారణం ఆ హరి. ఆ శ్రీనాథుని లీలలు వింతగా ఉంటాయి. సమస్త జీవరాసుల వృద్ధిక్షయాలకు కారణమైనవాడూ, ఆది అంతం అనే వికారాలు లేనివాడూ, దయకు నిలయమైనవాడూ అయిన విష్ణువు మీకు మేలు చేస్తాడు. ఈ విచారం వదలిపెట్టి వెళ్ళండి. మీ కోరికలు తీరుతాయి."

600 అని బ్రహ్మదేవుడు చెప్పగా విని దేవతలు ఆ వృత్తాంతాన్ని అర్థం చేసుకొని స్వర్గలోకానికి వెళ్ళి పోయారు. దితి తన భర్త మాటలను తలచుకొని అసంతృప్తి చెందింది.

హిరణ్యకశిప హిరణ్యాక్షుల జన్మ

601 తన కుమారులు దేవతలను బాధిస్తారని దితి తలపోయసాగింది. నూరు సంవత్సరాలు గడిచాయి. అప్పుడు దితి సకల లోకకంటకులైన కుమారులను కన్నది.

602 ఆ సమయంలో...

ధరణి గంపించెఁ గులపర్వతములు వడఁకె
జలధులు గలంగెఁ దారకావళులు డుల్లె
గగన మగలెను మ్రొగ్గె దిక్కరులు దిశల
మిడుఁగుఱు లెగసెఁ బిడుగులు పుడమిఁ బడియె.

603 భూమి కంపించింది. కులపర్వతాలు వణికాయి. సముద్రాలు కలతపడ్డాయి. నక్షత్రాలు నేల రాలాయి. ఆకాశం బ్రద్దలైంది. అష్టదిగ్గజాలు ఊగిపోయాయి. దిక్కులనిండా అగ్నికణాలు ఎగిసిపడ్డాయి. భూమిమీద పిడుగులు పడ్డాయి.

604 హోమగుండాలలోని అగ్నులకు పొగలు క్రమ్మాయి. ఎదురుగాలులు బలంగా వీచాయి. అంతటా చెట్లు తలక్రిందులుగా విరిగి పడ్డాయి. గ్రహాలు, నక్షత్రాలు వెలవెలబోయాయి. మేఘాలు రక్తవర్షాన్ని కురిపించాయి. దిక్కులలో మెరుపులు మిరుమిట్లు గొలిపాయి. గ్రహణసమయం కాకుండానే రాహువు సూర్యుణ్ణి పట్టుకున్నాడు. చిమ్మచీకట్లు అంతటా వ్యాపించాయి. కుక్కలు మోరలెత్తి మొరిగాయి. పట్టపగలే నక్కలు కూసాయి. పక్షులు బాధతో ధ్వనులు చేశాయి. దేవతావిగ్రహాలు కన్నుల్లో భాష్పబిందువులు కమ్ముకోగా పక్కకు ఒరిగాయి.

605 ఆవులు రక్తాన్నీ చీమును పిదికాయి. గాడిదలు భయంకరంగా ఓండ్రపెట్టాయి. ఏనుగుల గండస్థలాలమీది మదజలం ఎండిపోయింది. గుఱ్ఱాల తోకలు నిప్పులు చెరిగాయి.

606 సహింపరాని తేజస్సుతో దితి కుమారులు పుట్టిన సమయంలో గుహలు ప్రతిధ్వనించాయి. పాపగ్రహాల మైత్రితో పుణ్యగ్రహాలు వక్రమార్గంలో వర్తించాయి.

607 ఆ విధంగా భయంకరంగా తోచిన అపశకునాలను చూసి ప్రళయకాలం వచ్చిందని అనుకున్నారే కాని, క్రూరంగా సాధుజనులను సంహరించే రాక్షసుల పుట్టుక వల్ల సంభవించిన కల్లోలంగా తెలిసికొనక సనకాది యోగులు తప్ప సమస్త ప్రాణికోటి తల్లడిల్లింది.

608 ఆ విధంగా దితికి కుమారులు పుట్టిన తర్వాత...

609 ఆ రాక్షసులు కులపర్వతాలవంటి శరీరాలతో, భయంకరమైన భుజబలంతో ఒప్పుతున్నారు. వారి పాదాల తాకిడికి భూమి చలించిపోతున్నది. రత్నాలు చెక్కిన బంగారు భుజకీర్తులు, మకరకుండలాలు, మొలనూళ్ళు, కంకణాలు, ఉంగరాలు,

కిరీటాలు, కాలి అందెలు స్వచ్ఛమైన కాంతులు వెదజల్లుతుండగా తమ శరీరకాంతులతో సూర్యకాంతిని సైతం హీనపరుస్తూ....

610 ఉన్న సమయంలో కశ్యపుడు తన కుమారులను చూడాలనుకొని దితి మందిరానికి వచ్చి పుత్రులను చూచి, వారికి నామకరణం చేయాలనుకొని....

611 దితి గర్భంలో తాను మొదట పెట్టినట్టి తేజస్సువల్ల పుట్టి అద్భుతంగా వెలిగేవానికి 'హిరణ్యకశిపుడు' అనీ, కానుపు సమయంలో దితికి మొదటగా పుట్టి సూర్యతేజస్సుతో వెలిగేవానికి 'హిరణ్యాక్షుడు' అని మంచి మనస్సుతో పేర్లు పెట్టి కశ్యపుడు తన ప్రవిత్రమైన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

హిరణ్యాక్షుని దిగ్విజయము

612 అప్పుడు సాటిలేని తేజస్సుతో విరాజిల్లుతున్న హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని వల్ల వరాలు పొందిన గర్వంతోను, వారింపరాని శత్రువుల ఉక్కడగించే అవక్రపరాక్రమం యొక్క అతిశయంతోను సమస్త లోకపాలకులను జయించి తనవశం చేసుకొని తన కెక్కడా మృత్యుభయం లేక నిర్భయుడై సుఖంగా ఉన్నాడు. అతని సోదరుడైన హిరణ్యాక్షుడు ప్రతిరోజూ మదపుటేనుగు తొండంవంటి తన భుజాదండం మీద గదాదండాన్ని ధరించి తనను ఎదిరించి యుద్ధం చేయగలిగిన శత్రువీరుడు ఎక్కడా కనిపించక భూలోకమంతా తిరిగి స్వర్గంపై దండెత్తి అక్కడ యుద్ధచేయడానికి ఇష్టపడని దేవతలను చూచాడు. హితులు చెలరేగగా, శత్రువులు కలతపడగా అందమైన వైజయంతీమాలను ధరించి, కాలి గండపెండేరాలు మ్రోగుతుండగా, తన దేహకాంతి నాలుగుదిక్కుల్లో పిక్కటిల్లగా వస్తున్న హిరణ్యాక్షుని చూచి దేవతలు బ్రహ్మ వరాన్ని గుర్తుకు తెచ్చుకొని భయపడి గరుత్మంతుని చూచి పారిపోయే పాములవలె తమ మందిరాలను జిల్లేళ్ళకు, ఉమ్మెత్తలకు నివాసాలుగా చేసి ఎక్కడెక్కడికో పారిపోయారు.

613 "పౌరుషం పోగొట్టుకొని, తమ ఆయుధాలను విడిచిపెట్టి దేవతలు భయపడి కర్తవ్యాన్ని విస్మరించి పారిపోయారు కదా" అని సింహగర్జన చేసి మేరుపర్వతం వంటి స్థైర్యం కలిగిన హిరణ్యాక్షుడు గొప్ప భుజబలంతో, విజృంభించిన గర్వాతిశయంతో సముద్రంలో ప్రవేశించాడు.

614 ఈ విధంగా ప్రవేశించగా...

615 వరుణదేవుని సైనికులు హిరణ్యాక్షుని తేజాన్ని తేరిపార చూడలేక, పౌరుషం కోల్పోయి సముద్రం మధ్యభాగంలో ఎక్కడికో పారిపోయారు.

616 హిరణ్యాక్షుడు తన నిట్టూర్పులవల్ల పుట్టిన సముద్రకల్లోలాన్ని తన గదాదండంతో దృఢమైన శక్తితో అణచివేశాడు.

617 ఇంకా ఆ పైన ఆ రాక్షసేశ్వరుడు ఆ మహాసముద్రంలోపల శత్రురాజులను చీల్చిచెండాడి అనేక సంవత్సరాలు విహరించాడు. పరిపూర్ణ ప్రభావంతో అక్కడ ఉన్న వరుణుని పట్టణం అయిన ఆ చక్కటి విభావరి నగరానికి వెళ్ళి . . .

618 ఇంకనూ.

619 జలచర సమూహాలకు రాజై పాతాళ లోకాన్ని పాలిస్తున్న వరుణుని చూచి హిరణ్యాక్షుడు పరిహసిస్తూ "ఈ విశ్వంలో సమస్త లోకపాలకులలో పేరెన్నిక గల మహాబలవంతుడవని లోకం నిన్ను పొగడుతున్నది కదా! ఇప్పుడు నీ పౌరుషాన్ని ప్రదర్శిస్తూ యుద్ధంలో నన్ను ఎదిరించి చూడు. నీ బాహుబలాన్ని, పేరు ప్రతిష్ఠలను అణచివేస్తాను" అని పలుకగా విని సముద్రరాజైన వరుణుడు శత్రువుయొక్క విజయాలను, అభివృద్ధిని, శక్తిని, తన బలాన్ని అంచనా వేసికొని ఆ రాక్షసునితో యుద్ధానికి....

620 సమయం కాదనుకొని తన మనస్సులోని కోపాగ్నిని సహనం అనే నీళ్ళతో చల్లార్చుకొంటూ ఆ హిరణ్యాక్షునితో ప్రశాంతవాక్కులతో ఈ విధంగా అన్నాడు.

621 "నేను ప్రశాంతమైన మనస్సుతో యుద్ధం చేయకూడదనే నియమంతో ఉన్నాను. ఇప్పుడు యుద్ధం చేయలేను. నీ భుజబలం యొక్క ఆటోపాన్ని జయింపగల ప్రతివీరులు ఎక్కడా లేరు, ఒక్క విష్ణువు తప్ప.

622 ఆ మహాత్ముడు వైకుంఠంలో ఉన్నాడు. ఎన్నోసార్లు యుద్ధరంగంలో శత్రువులను ఓడించి శక్తి సామర్థ్యాలలో పేరుమోసిన వీరుడని భూజనులంతా పొగడుతారు. వెంటనే ఆ వైకుంఠానికి వెళ్ళు. అప్పుడు ఆ హరి నీతో యుద్ధం చేసి నీ కోరిక తీరుస్తాడు.

623 నిందకు లొంగి యుద్ధరంగంలో నిల్వలేక పారిపోయే పిరికిపందలను వెంటాడడం మగతనమా? బుద్ధిహీనుడా! అందరూ శరణు కోరే గోవిందుడు నీ పని పడతాడు. పోగలిగితే అక్కడికి వెళ్ళు. ఆ హరి ఎప్పుడూ రాక్షసులతో పోరాడుతూ జయిస్తూ ఉంటాడు.

624 అంతేకాక...

625 పురుషోత్తముడూ, మునులు పూజించే పాదపద్మాలు గలవాడూ అయిన విష్ణువు ప్రతియుగంలోనూ పురుషరూపంతో భూమిమీద అవతరించి పరాక్రమవంతులూ దుష్టులూ ఐన రాక్షసులను సంహరిస్తాడు.

626 కనుక ఓ రాక్షసరాజా! కయ్యమో దయ్యమో ఏదో ఆ హరికే చెప్పుకో"అని హేళనగా అంటూ "నీ భుజబలం తరిగి నేల కూలుతావు. కుక్కలు నిన్ను చుట్టుముట్టుతాయి. ఇప్పుడే అక్కడికి వెళ్ళినట్లైతే నీ బలం, సామర్థ్యాలు బయటపడతాయి. తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేము"

627 అని వరుణుడు చెప్పగా హిరణ్యాక్షుడు కోపించి, తన మనస్సులో ఏమాత్రం భయం లేనివాడై "ఈరోజే దేవతల మిత్రుడూ, రాక్షసుల శత్రువూ అయిన ఆ జనార్దనుని యుద్ధభూమిలో ఎదిరిస్తాను" అంటూ వైకుంఠ నగర మార్గం పట్టి....

628 వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చి "ఓ రాక్షసరాజా! ఎక్కడికి వెళ్తున్నావు?" అని అడిగిన నారదునితో హిరణ్యాక్షుడు ఇలా అన్నాడు.

629 "పద్మనాభుడూ, శ్రీపతీ, అనంతుడూ అయిన హరిని ఎదుర్కొని యుద్ధంలో అతణ్ణి అంతం చేసి మొత్తం రాక్షసజాతికి సంతోషం కలిగించాలనే పట్టుదలతో వైకుంఠం దారి పట్టాను". ఆ మాట విని నారదుడు ఇలా అన్నాడు.

630 "గొప్ప భుజబలం కల ఆ మహాత్ముడు ఇప్పుడు వైకుంఠంలో లేడు. భూభారాన్ని వహించడానికి ఆదివరాహ రూపాన్ని ధరించి రసాతలంలో ఉన్నాడు. నీవు అక్కడికి వెళ్ళగలిగితే వెళ్ళు. అక్కడ నీకు విష్ణువుకు యుద్ధం తప్పక జరుగుతుంది."

వరహావతారుని ఎదిరించుట

631 అలా నారదమహర్షి చెప్పగా, హిరణ్యాక్షుడు అగ్నిహోత్రంలా మండిపడ్డాడు. కమలలోచనుడైన విష్ణువును ఎదిరించాలని ఉత్సాహపడ్డాడు. ముల్లోకలాకు భయం కలిగించేలా, తన భుజబలాన్ని ప్రదర్శించుతూ, పెద్ద గదను చేతబట్టి, అతిశయించిన తేజస్సుతో ఆ మహా సముద్రగర్భంలోనికి అతి వేగంగా వెళ్ళాడు.

632 అలా వెళ్ళి సముద్ర మధ్యభాగంలో...

633 హిరణ్యాక్షుడు తన ఎదుట దట్టమైన కోరలు కలిగి, దేవతలలో శ్రేష్ఠుడై, భూభారాన్ని మోయడానికి సమర్థుడై, యజ్ఞమయమై, మేఘంలాగా నల్లగా ఉన్న ఆది వరాహమూర్తిని వీక్షించాడు.

634 ఆ సమయంలో వరాహరూపంలో ఉన్న హరి...

635 కమలములవంటి తన కన్నుల కాంతులను ప్రసరింప జేస్తూ, తన చూపుతో ఆ హిరణ్యాక్షుని దేహకాంతిని వెంటనే నశింపజేశాడు.

636 ఇంకా ఆ ఆదివరాహం అడ్డులేని శౌర్యంతో నిరాటంకంగా విహరిస్తూ...

తుదమొదళ్ళకుఁ జిక్కి దునిసి పాఱఁగ మోరఁ–
గులశైలములఁ జిమ్ముఁ గొంత దడవు
బ్రహ్మాండభాండంబు పగిలి చిల్లులువోవఁ–
గొమ్ములఁ దాటించుఁ గొంతద డవు
జలధు లేడును బంకసంకులం బై యింక–
ఖురముల మట్టాడుఁ గొంత దడవు

నుదురాజు సూర్యుఁడు నొక్క మూలకుఁ బోవఁ–
గుఱుచ వాలము ద్రిప్పుఁ గొంత దడవు
తుదమొదళ్ళకుఁ జిక్కి దునిసి పాఱఁగ మోరఁ–
గులశైలములఁ జిమ్ముఁ గొంత దడవు
బ్రహ్మాండభాండంబు పగిలి చిల్లులువోవఁ–
గొమ్ములఁ దాటించుఁ గొంతద డవు
జలధు లేడును బంకసంకులం బై యింక–
ఖురముల మట్టాడుఁ గొంత దడవు
నుదురాజు సూర్యుఁడు నొక్క మూలకుఁ బోవఁ–
గుఱుచ వాలము ద్రిప్పుఁ గొంత దడవు

637 కొంతసేపు తుదా మొదలూ ఏకమై ముక్కలయ్యేటట్లు కులపర్వతాలను తన ముట్టెతో కూలదోస్తూ, కొంతసేపు బ్రహ్మాండభాండం పగిలి చిల్లులుపడే విధంగా తన కొమ్ములతో చిమ్ముతూ, కొంతసేపు సప్తసముద్రాలు బురదలై ఇంకిపోయే విధంగా తన గిట్టలతో మట్టగిస్తూ, కొంతసేపు చంద్రుడూ సూర్యుడూ ఒకమూలకు తోసుకుపోయేటట్లు తన పొట్టితోకను త్రిప్పుతూ...తిరుగుతూ, కుప్పించి దూకుతూ, దాటుతూ, ఇగిలిస్తూ, ఎగురుతూ, నేలను బొరియలుగా తవ్వుతూ హిరణ్యాక్షుని గుండెలు తల్లడిల్లే విధంగా ఆ వరాహం యుద్ధానికి సిద్ధమై....

638 ఇంకా...

639 కన్నులు నిప్పులు కురియగా వాడికోరపైన భూమిని ధరించినవాడై వరాహమూర్తి తనకు ఎదురు రాగా చూచి హిరణ్యాక్షుడు 'అడవిలో సంచరించవలసిన ఈ జంతువు నీళ్ళల్లో విహరించేదిగా ఎలా అయింది?'....

640 అని ఆశ్చర్య భయాలు తన మనస్సులో అతిశయించగా హిరణ్యాక్షుడు భయంకర వరాహ రూపాన్ని ధరించిన రాక్షస గర్వ నాశకుడైన ఆ హరితో ఇలా అన్నాడు

641 "బుద్ధిలేని ఓ పెద్ద వరాహమా! బ్రహ్మ ఇచ్చిన వరదానాన్నిబట్టి చూస్తే రసాతలంతో కూడిన భూమి శాశ్వతంగా నా ఆధీనమైనదే.

642 పూనికతో నీవీ భూమిని తీసుకువెళ్ళకు. విడిచి పెట్టు. కాదని తీసుకుపోతే నీ ప్రాణం తీస్తాను. నా మాటలను విను. మొండిపట్టు ఎందుకు పడతావు?

643 మాయగాడివై ఇప్పుడీ భూమిని దొంగతనంగా తీసికొని పోతుంటే నిన్ను నా గొప్ప భుజబలం చేత అణచివేయకుండా చూస్తూ ఊరుకుంటానా?

644 గొప్ప యోగమాయ యొక్క బలంచేత లభించిన అల్పమైన పౌరుషంతో ఉన్న నిన్ను పాతిపెట్టి, నా మిత్రులకు, సేవకులకు ఆనందాన్ని కలిగిస్తాను. నా గదాఘాతంతో ముక్కలైన నీ తలను చూసి దేవతలందరూ నిర్మూలంగా నశిస్తారు" అని హిరణ్యాక్షుడు చెప్పగా విని యజ్ఞవరాహ రూపంతో విలసిల్లుతున్నట్టి....శ్రీహరి బ్రహ్మ మొదలైన దేవతల కందరికీ ఆ రాక్షసుని వల్ల వచ్చే కీడును ఊహించి విచారించి వాడికోర చివర ప్రకాశిస్తున్న భూదేవితో స్థిరంగా ఉన్నాడు.

645 ఆ రాక్షసుని మాటలు అనబడే అంకుశాల పోట్లకు మిక్కిలి కోపించిన హరి భయపడిన ఆడయేనుగుతో ఉన్న గజేంద్రుని వలె భూదేవితో కూడి అతిశయించాడు.

646 వాడియైన తెల్లని కోరల కాంతులు ఆకాశంలో వ్యాపించగా సముద్రంనుండి బయటికి వచ్చిన భయంకరమైన యజ్ఞవరాహ రూపాన్ని ధరించిన విష్ణువును....

647 ఏనుగు వెంటబడిన మొసలి వలె ఆ హిరణ్యాక్షుడు వెంబడించి, పాపసముద్రాన్ని దాటించేవాడూ, వరాహరూపాన్ని ధరించినవాడూ, గిట్టలతో మేరుపర్వతాన్ని మట్టగించినవాడూ అయిన హరితో ఇలా అన్నాడు.

648 "నిందించినా రోషం చెందక, సిగ్గుపడక, మోసంతో యుద్ధం చేసి గెలవాలని ఆలోచిస్తూ ఇలా పిరికిపందలాగా పారిపోవడం నీ మగతనానికి తగిన పనేనా?

649 అని హిరణ్యాక్షుడు ఆక్షేపంచగా శ్రీహరి మనస్సు కోపంతో రగుల్కొనగా...

650 పద్మనాభుడైన విష్ణువు భూమిని అనాయాసంగా భూమిని నీళ్ళపై నిలిపి, దానికి ఆధారంగా తన బలాన్ని చక్కగా పెట్టాడు. అది చూచి దేవతలు ఆనందించారు.

651 పూలవాన బోరున కురిసింది. దేవదుందుభులు వైభవోపేతంగా మ్రోగాయి. గంధర్వగానం వినిపించింది. అప్సరసల నాట్యాలు ఆనందాన్ని కలిగించాయి.

652 ఆ సమయంలో యజ్ఞవరాహ రూపాన్ని ధరించిన విష్ణువు బంగారు మకరకుండలాలు, భుజకీర్తులు, కంఠహారాలు, కంకణాలు, ఉంగరాలు మొదలైన ఆభరణాల కాంతులు ఆకాశ మంతటా వ్యాపింపగా యుద్ధానికి సంసిద్ధుడై...

653 పెద్ద గదాదండాన్ని చేత పట్టుకొని, మణులు పొదిగినట్టి చిత్రమైన బంగారు కవచాన్ని అందంగా ధరించి, హిరణ్యాక్షుడు పలికిన కటువైన మాటలు వాడి బాణాలై తన హృదయాన్ని కలత పెట్టగా విష్ణువు మిక్కిలి పరాక్రమం కలవాడై వస్తున్న అతణ్ణి చూచి ఆగ్రహోదగ్రుడై....

654 కూడా నవ్వుతూ ఇలా అన్నాడు.

655 ఓరీ అమంగళ కార్యాలను ఆచరించేవాడా! విను. గర్వంతో నన్ను అడవిలో కనిపించే మృగంగా నీ మనస్సులో భావిస్తున్నావు. ఔను. నేను అడవి జంతువునే. నువ్వు

యుద్ధరంగంలో స్థిరంగా నిలువగలిగితే బలిపశువుగా వచ్చే నీవంటి కుక్కలను ఈరోజు సంహరిస్తాను.

656 ఓరీ దురాత్మా! నీకు శక్తి ఉన్నట్లైతే నన్ను యుద్ధంలో ఎదిరించి పోరాడడానికి సిద్ధం కా. ఈరోజు నీ కోరికలను తీరుస్తాను. ఊరికే నిన్ను నీవు పొగడుకొనడం తగదు.

657 ఓ రాక్షస కులాధమా! విను. రణరంగ విశారదులైన సత్పురుషులు మృత్యుపాశాలలో చిక్కుకొని కూడా నీలాగా తమను తాము పొగడుకొని సంతోషించారా? ఎందుకీ ఆత్మస్తుతులు? ఎంచి చూస్తే ఇవి పౌరుషవంతుని లక్షణాలా?

658 దేవతల శత్రువైన ఓ హిరణ్యాక్షా! చూస్తూ ఉండు. నీవు చెప్పే పాతాళలోకపు గొప్ప నిధిని నేను గ్రహించి గర్విస్తాను. నన్ను సిగ్గులేనివానిగా లెక్కించావు కనుక నేను నీతో దాగి ఉండే యుద్ధం చేస్తాను. నీ గదాదండానికి భయపడి పారిపోతున్నా నన్నావు కదా! నన్నెదుర్కో. నేను నీ కోరికలను తీరుస్తాను.

659 నీవు సేనానాయకుడవు. శూరుడవై ఈరోజు యుద్ధభూమిలో నన్ను ఎదిరించితే నీ బలాన్నీ ఆయువునూ తీసుకొంటాను చూడు. తిరుగులేని పరాక్రమంతో నేటినుండి భూమి రాక్షసులు లేనిదై వన్నెకెక్కేలా చేస్తాను.

660 రాక్షస కులాధమా! నన్ను ఎదిరించగల శౌర్యము, ధైర్యము, బలం నీకు ఉన్నట్లైతే యుద్ధభూమిలో నిలబడు. నీ అప్పులు కన్నీరు కార్చడాన్ని ఆపదలిస్తే వెంటనే వెళ్ళిపో. అనవసరమైన ప్రగల్భా లెందుకు?

661 నన్నిక్కడ పూడ్చిపెడతా నన్నావు. అంతటివాడవే కావచ్చు. యమపురంలో కాపురానికి వెళ్ళేముందు నీకు ఇష్టమైన చుట్టాలను చివరిసారిగా చూసుకొని రా."

662 అని ఈవిధంగా కమలాక్షుడైన విష్ణువు హిరణ్యాక్షుని ఆక్షేపించి పలికిన పరిహాసపు మాటలకు అతడు కోపం తెచ్చుకొని, రోషమూ గర్వమూ కలగలసిన మనస్సు కలవాడై, కనుగొనల్లో నిప్పుకణాలు వెలిగ్రక్కగా, తోక త్రొక్కిన నల్లత్రాచులాగా చీకాకు కలుగగా...

663 శరీరం కంపించగా, వేడి నిట్టూర్పులు విడుస్తూ, కనుబొమలి ముడిపడగా, రోషంతో మనస్సు కలత చెందిన మనస్సు కలవాడై గదను తీసుకొని సాహసంతో విష్ణువునకు ఎదురు నడిచాడు.

664 ఆ సమయంలో హిరణ్యాక్షుడు అతిభయంకరమైన ఆకారం కలవాడై....

665 మదించిన ఆ రాక్షసరాజు మిక్కిలి కోపంతో విష్ణువును గదతో దెబ్బ వేయగా, రాక్షససంహారి అయిన హరి ఆ దెబ్బను లక్ష్యపెట్టక, శౌర్యంతో ఆ గదను స్వాధీనం చేసికొని ముక్కలు చేసాడు. రాక్షసుడు వెఱ్ఱెత్తిపోయి మరొక గదతో భయంకరంగా విష్ణువును కొట్టాడు.

666 రాక్షసవైరి అయిన హరి ఆ దెబ్బ తనకు తగలకుండా గదాయుద్ధనైపుణ్యం వెల్లడించే హస్తలాఘవంతో ఆ గదను పట్టుకొని దానితోనే శత్రువు విశాలమైన వక్షస్థలం అదిరిపోయేటట్లు కొట్టాడు. వాడు ఎంతో చికాకుపడి, అంతలోనే తెప్పరిల్లి, శత్రుమర్దనుడైన ఆ జనార్దనుణ్ణి కొట్టాడు.

667 ఈ విధంగా తలపడి ఒకరినొకరు జయించాలనే కోరిక కలవారై ఆ ఇద్దరూ కోపంతో ఉవ్వెత్తుగా లేచే కెరటాలతో ఒకదాని నొకటి కొట్టుకొంటున్న ఉత్తర దక్షిణ సముద్రాల లాగా, పెద్ద తొండాలతో పరస్పరం ఢీకొంటున్న రెండు మత్తగజాల లాగా, రోషంతో భయంకరంగా గాండ్రిస్తూ తలపడుతున్న రెండు పెద్దపులుల్లా, పొగరుబోతుతనంతో రంకెలు వేస్తూ క్రుమ్ములాడుకుంటున్న ఆబోతుల జంటలాగా సహింపరాని సింహబలంతో పోరాటం చేస్తున్నప్పుడు హిరణ్యాక్షుడు ఎడమ వైపుకు గిఱ్ఱున తిరగగా, విష్ణువు కుడివైపు తిరిగి గదాదండంతో శత్రువు వక్షాన్ని పిడుగుపాటు వంటి దెబ్బతో పగులగొట్టాడు. వాడు తెలివి తప్పి తెప్పరిల్లి లేచి హరి నుదుటిపై కొట్టి నొప్పించాడు. అప్పుడు ఆ ఇద్దరు వీరులు తమ శరీరాలు రక్తంతో తడిసిపోగా పూచిన అశోకవృక్షాలవలె ఉన్నారు. ఒకరికొకరు దూరంగా వెళ్తూ, సమీపిస్తూ, కొడుతూ, అరుస్తూ, ఒకరు మరొకరి రక్తాన్ని వాసన చూస్తూ, తిరస్కారంతో కూడిన హేళనలు చేస్తూ యుద్ధం చేస్తున్నారు. ఆ సమయంలో ఆ మహాబలుల యుద్ధాన్ని చూడాలనే కోరికతో బ్రహ్మ సమస్త మునీంద్రులను, సిద్ధులను, సాధ్యులను, దేవతల సమూహాన్ని వెంటబెట్టుకొని వచ్చి భూమి కొరకు రాక్షసునితో యుద్ధం చేస్తున్న యజ్ఞవరాహ స్వామితో ఇలా అన్నాడు.

బ్రహ్మస్తవంబు

668 "దివ్యస్వరూపా! పరమాత్మా! ఈ పాపాత్ముడైన రాక్షసుడు నా వరంవల్ల గర్వించి లోకాలనన్నిటినీ చీకాకు పరుస్తున్నాడు. ఇటువంటి దుశ్చరిత్రుని చంపకుండా ఇలా నిర్లక్ష్యం చేయడం సరి కాదు. వీనిని సంహరించు. భూదేవికి శుభం కలుగుతుంది.

669 శుభకరా! చిన్న పిల్లవాడు చేతిలో భయంకర సర్పాన్ని పట్టుకొని ఆడుకొనే విధంగా ఈ రాక్షసరాజును చంపకుండా ఊరికే ఉపేక్షించడం మంచిదా?

670 అంతే కాక...

671 పుణ్యాత్మా! ఈ అభిజిత్తు ముహూర్తంలోనే (మిట్ట మధ్యాహ్నమే) రాక్షసుని చంపకపోతే ఆ తరువాత రాక్షసులవేళ అయిన సాయంకాలం వస్తుంది. ఆ సమయంలో రాక్షసుల మాయాబలం వృద్ధి చెందుతుంది. అప్పుడు చంపడం సాధ్యం కాదు. కావున సాధుజనులకు మేలు చేసే సంకల్పంతో ఇప్పుడే వీనిని చంపు."

672 అని ఈ విధంగా పల్కిన బ్రహ్మ మాటలు విని విష్ణువు దేవతలంతా చూస్తుండగా మందహాస వదనారవిందంతో ఒప్పుతూ రాక్షసుని ఎదుట నిలబడి...

673 విష్ణువుయొక్క తెల్ల తామరల వంటి కన్నులు రోషంతో ఎఱ్ఱతామరల వలె కాగా తన పెను గదాదండంతో ఆ రాక్షసుని దవడపై తీవ్రంగా మోదాడు. వాడు ఆ దెబ్బను తట్టుకొన్నాడు.

674 ఆ హిరణ్యాక్షుడు వెంటనే భయంకరమైన గదను పట్టుకొని విచిత్ర భంగిమలతో, బాహుగర్వంతో విష్ణువును సమీపించి అతని చేతిలోని గదను సముద్రంలో పడగొట్టాడు.

675 అప్పుడు...

676 హరి నిరాయుధుడు కావడంతో హిరణ్యాక్షుడు యుద్ధధర్మాన్ని పాటించి పోరాటం ఆపి నిలబడి చూస్తూ ఉన్నాడు. ఆకాశమంతా దేవతల హాహాకారాలతో నిండిపోయింది.

677 కమలాక్షుడైన విష్ణువు రాక్షసరాజైన హిరణ్యాక్షుని యుద్ధధర్మానికి, అపార శౌర్యస్ఫూర్తికి మిక్కిలి ఆశ్చర్యపడినా పట్టుదల విడువలేదు.

678 భూమిని ఉద్ధరించిన విష్ణువు ఆ రాక్షసరాజును వధించడం కోసం తన మనస్సులో సుదర్శన చక్రాన్ని స్మరించాడు. ఆ చక్రం దైత్యుల వంశమనే మహారణ్యాన్ని దహించే జాజ్వల్యమానమైన దావానలం. ఎల్లప్పుడు జయజయ శబ్దాలతో ప్రతిధ్వనించే దిక్చక్రం కలది. సర్వదా ఆశ్రయించేవారికి రక్షణ కలిగించేది. సమస్త భూమండలాన్ని పాలించేది.

679 ఆ సుదర్శనచక్రం ప్రచండ సూర్యమండలం వలె తీవ్రంగా వెలిగిపోతున్నది. చెలరేగుతున్న అగ్నిజ్వాలలతో కోపంతో ఉన్న సమస్త శత్రువుల అడ్డులేని అహంకారమనే అంధకారాన్ని అణచివేస్తున్నది. సహింపరాని రివ్వురివ్వుమనే ధ్వనులతో సాగరఘోషను చులకన చేస్తున్నది. అది సమస్త దేవతలచేత పొగడబడుతూ, అనంత కాంతులతో విరాజిల్లుతూ, తన కాంతులతో బ్రహ్మాండాన్ని నింపుతూ వేగంగా వచ్చి విష్ణువు కుడిచేతిని అలంకరించింది. రాక్షసవైరి యైన విష్ణువు ఆ చక్రాన్ని ధరించి ఆకాశంనుండి దేవతలు జయజయ ధ్వానాలు చేస్తుండగా హిరణ్యాక్షునికి ఎదురుగా నడిచాడు.

680 చక్రాన్ని ధరించి అమితోత్సాహంతో వస్తున్న ఆదివరాహమూర్తిని చూచి హిరణ్యాక్షుడు పెదవులు తడుపుకుంటూ, మొక్కవోని శౌర్యంతో, ధైర్యం చెడక భయంకరమైన గదతో కొట్టాడు.

681 హిరణ్యాక్షుడు విసిరిన గదను విష్ణువు ఆనందంగా మందహాసం చేస్తూ ప్రక్కన పడేవిధంగా కాలితో తన్నాడు.

682 ఈ విధంగా గదను దూరంగా తన్ని హిరణ్యాక్షునితో విష్ణువు ఇలా అన్నాడు.

683 "రాక్షసరాజులలో నీచుడవు. పెద్ద గద పట్టుకొని మహాబలవంతుడ నని గర్వించి యుద్ధరంగంలో నన్నెదిరిస్తున్నావు. రారా!" అని పలుకగా హిరణ్యాక్షుడు చెలరేగి గదతో విష్ణువును కొట్టాడు. ఆయన ఆ గదను గరుత్మంతుడు పామును పట్టినట్లుగా ఒడిసిపట్టుకొన్నాడు.

684 హిరణ్యాక్షుడు తన బలం విష్ణువు యొక్క అడ్డులేని శౌర్యం ముందు ఎందుకూ పనికిరాదన్న సంగతి మనస్సులో తెలిసికూడ దురభిమానంతో ఎదిరించాడు.

685 అప్పుడు...

686 రాక్షసుడు ప్రళయాగ్నిలాగా భయంకరంగా మండుతున్న శూలాన్ని అందుకొని యజ్ఞవరాహ రూపంలో ఉన్న విష్ణువుపై వేశాడు. సద్బ్రాహ్మణునిమీద చాపల్యంతో ప్రయోగించిన చేతబడిలాగా; ఇంద్రుడు తన వజ్రాయుధంతో గరుత్మంతుని రెక్కలోని ఈకను మాత్రమే త్రుంచ గలిగినట్లు; హిరణ్యకశిపుని అంతటి శూలమూ వ్యర్థమైపోయింది. విష్ణువు తన చక్రాయుధంతో ఆ శూలాన్ని మధ్యలోనే చటుక్కున రెండుగా ఖండించాడు. అది చూసి దేవతలకు సంతోషం చెలరేగింది; రాక్షసులకు సంతోషం క్షీణించింది.

687 ఆ సమయంలో రాక్షసుడు తన శూలం చక్రాయుధం చేత ఖండింపబడటం చూచి...

688 ఆ రాక్షసుడు కోపంతో మండిపడి కఠోరమైన తన పిడికిలితో విష్ణువును పొడిచాడు. హరి పూలదండ తాకిన ఐరావతం వలె కలత చెందక విరాజిల్లాడు.

689 ఆ రాక్షసుడు విష్ణువుమీద కోట్లకొలది మాయలు ప్రయోగించాడు. భూమండలమంతా దుమ్ము రేగి చీకటితో నిండిపోయింది. మేఘాలు భయంకరంగా రాళ్ళను, మలమూత్రాలను, కుళ్ళిన ఎముకలను, రక్తప్రవాహాన్ని కురిపించి చీకాకును కలిగించాయి.

690 ఇంకా...

691 భూతాలు, పిశాచాలు, డాకినులు జుట్టు విరబోసుకొని, భయంకరమైన కరకు కోరలతో, దౌడలతో, ఎఱ్ఱని కన్నులతో గుంపులుగా ఆకాశంలో నిల్చి ఆయుధాలు ధరించి, పెద్దగా కేకలు వేస్తూ యక్ష రాక్షస సైన్యాలతో కూడి కనిపించాయి.

692 అప్పుడు...

693 ప్రాతః, మధ్యాహ్న, సాయంకాలములు అను కాలత్రయంలో లేదా మూడు యాగములందు చరించువాడైన ఆ యజ్ఞవరాహ రూప విష్ణువు ఆ రాక్షసరాజు మాయను నిరోధించగల ఆయుధాలలో అగ్రగణ్యమైన తన చక్రాయుధాన్ని ప్రయోగించాడు.

694 విష్ణువు ప్రయోగించిన ఆ చక్రం యొక్క సూర్యకాంతి భూమండలమంతా నిండి ఆ మాయావి అయిన రాక్షసుడు ప్రయోగించిన మాయాచక్రాన్ని అతడు చూస్తుండగా అణచివేసింది.

695 ఆ సమయంలో ఇక్కడ....

696 తన భర్త అయిన కశ్యప ప్రజాపతి చెప్పిన మాటలు తప్పవేమో అని దితి అనుకొంటుండగా హిరణ్యాక్షుని పతనాన్ని సూచిస్తున్నట్లుగా ఆమె పాలిండ్లనుండి రక్తధారలు ప్రవహించాయి.

697 అప్పుడు ఆ రాక్షసుడు కృతఘ్నునికి చేసిన ఉపకారం లాగా తాను ప్రయోగించిన వందల కొలది మాయలు హరిమీద పనిచేయక విఫలం కాగా మొక్కవోని శౌర్యంతో విష్ణువును సమీపించి రెండు చేతులు చాచి అతని వక్షస్థలాన్ని బలంకొద్ది పొడచి బాధపెట్టాడు. విష్ణువు తప్పించుకొని ప్రక్కకు తొలిగాడు. రాక్షసుడు విజృంభించి బలమైన పిడికిలితో వరాహమూర్తిని పొడిచాడు. హరి అలసిపోక కోపంతో భయంకరమైన ఆకారం కలవాడై ఇంద్రుడు వృత్రాసురుణ్ణి సంహరించిన విధంగా వజ్రాయుధం వంటి తన అరచేతితో మోటుగా నున్న రాక్షసుని నడుముపైన తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బకు హిరణ్యాక్షుడు గిరగిర తిరిగి కన్నులు తేలిపోగా సోలిపోయి ఎట్టకేలకు తేరుకొని ఎదుట నిలబడ్డాడు. అప్పుడు....

హిరణ్యాక్ష వధ

698 మెడమీద జూలుతో, శత్రువుల గొప్ప వక్షస్థలాన్ని బద్దలు కొట్టే కోరలతో, వాడియైన గిట్టల నైపుణ్యంతో, బ్రహ్మాండము అను గంట కట్టబడిన మొలతో ఉన్న ఆ యజ్ఞవరాహానికి పటుత్వం కోల్పోయిన ఆ హిరణ్యాక్షుడు లొంగిపోయాడు.

699 ఆ విధంగా లొంగిపోగా...

700 ఆకాశంనుండి చూస్తున్న ఇంద్రాది దేవతలు సంతోషించే విధంగా విష్ణువు వజ్రంలాగా కఠోరమైన చేతితో హిరణ్యాక్షుని గూబమీద కొట్టాడు. ఆ దెబ్బతో రాక్షసరాజు కన్నులనుండి రక్తం చిందగా గాలిదెబ్బకు కూకటివేళ్ళతో కూలిన వృక్షంలాగా నేలపై కూలిపోయాడు.

701 అప్పుడా రాక్షసవీరుడు బుడబుడమని నెత్తురు కక్కుతూ, వికారమైన ఆకారంతో, కన్నులు బయటికి పొడుచుకురాగా, పండ్లు కొరుకుతూ నేలమీద పడి ప్రాణాలు విడిచాడు.

702 అట్లా పడిన హిరణ్యాక్షుని చూచి బ్రహ్మ మొదలైన దేవతలు ఆశ్చర్యపడి తమ మనస్సులలో 'ఇతడు ఈ అవస్థను ఎట్లా పొందాడా' అని తలుస్తూ ఇంకా ఇలా అనుకున్నారు.

703 "లింగశరీరాలను భంగం చేసికొనడానికి మహా యోగిపుంగవులు యోగమార్గాల ద్వారా ఏ మహానుభావుని తమ హృదయాలలో పదిల పరచుకుంటారో ఆ మహావిష్ణువు చేతిదెబ్బ తిని, అతని ముఖపద్మాన్ని చూస్తూ చచ్చిన ఈ రాక్షసుడు ఎంత అదృష్టవంతుడో, ఎంత ఉత్తముడో?

704 వీళ్ళు శ్రీహరి యొక్క ద్వారపాలకులే కదా! మునీశ్వరుల శాపం వల్ల ఈ నీచ రాక్షసజన్మను పొంది ఈరోజు విష్ణువు చేతనే చావడం వల్ల వచ్చే జన్మలో వైకుంఠంలో శాశ్వతంగా నివసిస్తారు. వీళ్ళకు ఇక చావు పుట్టుకలు ఉండవు."

705 అని అనుకొంటూ ఆశ్చర్యపడి పరమ పవిత్రమైన శరీరాన్ని ధరించినవాడూ, వికసించిన కమలాల వంటి కన్నులు కలవాడూ, దేవతలనూ మునులనూ రక్షించడంలో సమర్థుడూ, రాక్షసులనే ఏనుగులకు సింహం వంటివాడూ అయిన విష్ణువును (చూచారు).

దేవతలు శ్రీహరిని నుతించుట

706 దేవతలు ఆ మహావిష్ణువును చూచి...

707 "ఓ కమలాక్షా! ఈ లోకంలోని అందరి రహస్యాలను తెలిసికొని, అసూయతో పగబట్టిన ఈ దేవతల శత్రువైన హిరణ్యాక్షుని చంపావు. కాబట్టి ఇక అందరికీ శుభం కలుగుతుంది" అంటూ నుదుట చేతులు చేర్చి వినమ్రులై వివేకవంతుడూ, పుణ్యాత్ముడూ అయిన విష్ణువును స్తుతించారు.

వరహావతార విసర్జనంబు

708 అప్పుడు...

709 దేవతల శత్రువైన హిరణ్యాక్షుని చంపినందుకు బ్రహ్మాది దేవతలూ, మునులూ తనను కొనియాడుతున్న సంస్తుతులకు యజ్ఞవరాహమూర్తి అయిన విష్ణువు మనస్సులో ఎంతో సంతోషించి సంపూర్ణ మంగళోత్సవం ఒప్పే విధంగా అందరినీ దయాదృష్టితో చూస్తూ....

710 వైకుంఠానికి వెళ్ళిపోయాడు. ఆ మహోత్సవానికి సూచకంగా దేవదుందుభులు అమోఘంగా మ్రోగాయి. భూమిపైన పూలవాన కురిసింది. అంతటా హోమకుండాలు అగ్నులతో తేజరిల్లాయి. సూర్యమండలం, చంద్రమండలం సహజ కాంతులతో ప్రకాశించాయి.

711 అని బ్రహ్మదేవుడు దేవతలకు చెప్పినటువంటి ఈ పవిత్ర చరిత్రను మైత్రేయుడు విదురునికి వివరించిన విధానాన్ని....

712 శుకయోగి పరీక్షిత్తుకు మంచిమనస్సుతో వినిపించాడని సూతుడు శౌనకాది మునులకు చక్కగా తెలియ జెప్పాడు.

713 ఈ విధంగా మైత్రేయుడు చెప్పగా విని విదురుడు సంతోషించాడు" అని...

714 పాపాలను తొలగించే ఈ చరిత్రను విన్న, చదివిన లోకులకు విశేషకీర్తీ, విష్ణుపాదాలపై భక్తీ, ఇహపర సుఖాలూ తప్పక లభిస్తాయి"

715 అని చెప్పి మళ్ళీ సూతుడు మహర్షులతో ఇట్లా అన్నాడు. "ఆ విధంగా హిరణ్యాక్షుని కథ విన్న పరీక్షిత్తు శుకమహర్షిని చూచి "మునీంద్రా! హిరణ్యాక్షుడు చచ్చిన తరువాత

లోకం సమస్థితిని పొందిన సంగతిని చెప్పు. స్వాయంభువ మనువును సృష్టించిన తర్వాత బ్రహ్మ పశుపక్ష్యాది జంతువులను సృష్టించడానికి ఎన్ని మార్గాలను కల్పించాడు? భాగవతోత్తముడైన విదురుడు శ్రీకృష్ణునకు అపకారం చేయ దలచిన దుష్టులైన ధృతరాష్ట్రుని కొడుకులను విడిచిపెట్టి, తన తండ్రియైన వేదవ్యాసునితో సమానుడై, వాక్కూ కర్మా సమస్తమూ శ్రీకృష్ణునిపై చేర్చి భగవద్భక్తులను సేవిస్తూ, పుణ్యతీర్థాలను సేవించడం వల్ల మనోవికాసం పొంది, పాపాలను పోగొట్టుకొని మైత్రేయ మహామునిని ఏమని ప్రశ్నించాడు? అవి అన్నీ తెలియజేయండి" అని అడిగిన రాజుతో శుకమహర్షి ఇలా అన్నాడు.

716 పవిత్రమైన మనస్సుగల ఆ విదురుడు మైత్రేయుణ్ణి చూచి ఎంతో సంతోషంతో ఇట్లా అన్నాడు. "చాతుర్యం కల మనస్సు కల ఓ మహర్షీ! సమస్తసృష్టికీ కర్త అయిన బ్రహ్మ ప్రజాసృష్టి కోసం ముందుగా ప్రజాపతులను సృష్టించి, ఆ తర్వాత ఇంకా ఏమి సృష్టించాలనుకున్నాడు? ముందుగా సృష్టించిన మరీచి మొదలగు మునులు బ్రహ్మదేవుని ఆదేశానుసారం లోకాల నన్నిటినీ ఎలా సృష్టించారు? కీర్తివంతులైన ఆ ప్రజాపతులు భార్యలతో ఉన్నప్పుడు ఏమేమి సృష్టించారు? భార్యలను ఎడబాసిన తర్వాత ఏం సృష్టించారు?

717 దయామయ హృదయా! బుధులచే పొగడబడే ఓ మహర్షీ! వాళ్ళంతా కలిసికట్టుగా తమలో తాము సమైక్యమై ఏమేమి సృష్టించారు? నాకు వివరంగా చెప్పు"

దేవమనుష్యాదుల సృష్టి

718 ఆ విధంగా ప్రశ్నించిన విదురునితో మైత్రేయుడు ఇలా అన్నాడు "జీవులకు అగోచరుడూ, పురుషోత్తముడూ, యోగమాయా సమేతుడూ, కాలస్వరూపుడూ, నిర్వికారుడూ అయిన జగన్నివాసుడు ఆదికాలంలో సృష్టిని గురించి తీవ్రంగా ఆలోచించాడు. ఆ ఆలోచనా ఫలితంగా సత్త్వం, రజస్సు, తమం అనే మూడు గుణాలు పుట్టాయి. ఆ మూడు గుణాలలో రజోగుణం నుండి మహత్తత్త్వం పుట్టింది. ఆ మహత్తత్త్వం నుండి మూడు గుణాల అంశలు కల అహంకారం పుట్టింది. ఆ అహంకారం నుండి పంచతన్మాత్రలు పుట్టాయి. వాటినుండి సమస్త సృష్టికి మూలకారణాలైన పంచభూతాలు పుట్టాయి.

719 ఆ పంచభూతాలలో ఏ ఒక్కదానికీ ప్రత్యేకంగా లోకాన్ని సృష్టించడం చేతకాక, అన్నీ ఒక గుంపుగా కలిసి పాంచభౌతికమైన ఒక బంగారు గ్రుడ్డును సృష్టించాయి. ఆ గ్రుడ్డు మహాజలాలలో తేలియాడుతూ వృద్ధి పొందుతూ ఉండగా...

720 నారాయణుడనే పేరుతో ప్రసిద్ధి కెక్కే పరబ్రహ్మం వెయ్యి దివ్యసంవత్సరాలు ఆ అండాన్ని అధిష్ఠించి ఉన్నాడు. ఆ వాసుదేవుని బొడ్డునుండి వేయి సూర్యుల కాంతితో వెలుగుతూ, సమస్త ప్రాణిసమూహంతో కూడిన ఒక పద్మం పుట్టింది. ఆ పద్మంలో నుండి

భగవదంశతో చతుర్ముఖ బ్రహ్మ పుట్టాడు. స్వయం ప్రకాశుడైన ఆ బ్రహ్మ నామ రూప గుణాలు అనే సంకేతాలు కలిగి సమస్త జగత్తులనూ సృష్టించాడు.

721 బ్రహ్మదేవుడు తామిస్రం, అంధతామిస్రం, తమం, మోహం, మహామోహం అనే ఐదు విధాలైన మోహస్థితి కలిగిన అవిద్యను పుట్టించి, అది తనకు మోహమయమైన శరీరమని భావించి ఏవగించుకొని, ఆ దేహాన్ని వదిలివేశాడు. బ్రహ్మ వదిలిపెట్టిన ఆ దేహం ఆకలి దప్పులకు స్థానమై రాత్రమయ మయింది. దానిలో నుండి యక్షులూ, రక్షస్సులూ అనే ప్రాణులు పుట్టగా వారికి ఆకలి దప్పులు అధికం కాగా కొందరు బ్రహ్మను భక్షిద్దా మన్నారు, మరి కొందరు రక్షిద్దా మన్నారు.

722 ఈ విధంగా పలుకుతూ వారు బ్రహ్మ సమీపానికి వెళ్ళగా, బ్రహ్మ భయకంపితుడై "నేను మీ తండ్రిని. మీరు నా కుమారులు. నన్ను హింసించవద్దు" అంటూ "మా భక్షత... రక్షత" అనే శబ్దాలను ఉచ్చరించాడు. ఆ కారణంగా వారికి యక్షులు, రక్షస్సులు అనే పేర్లు వచ్చాయి. ఆ తరువాత బ్రహ్మ తేజోమయమైన మరొక దేహాన్ని ధరించి, సత్త్వగుణంతో కూడినవారూ, ప్రకాశవంతులూ అయిన దేవతలను ప్రముఖంగా సృష్టించి, ఆ తేజోమయమైన దేహాన్ని వదలివేయగా అది పగలుగా రూపొంది దేవతలందరికీ ఆశ్రయ మయింది. తరువాత బ్రహ్మ తన కటిప్రదేశం నుండి మిక్కిలి చంచలచిత్తులైన అసురులను సృష్టించాడు. వారు అతికాముకులు కావడం వల్ల ఆ బ్రహ్మదేవుణ్ణి చుట్టుముట్టి రతిక్రియను అపేక్షించి, సిగ్గు విడిచి వెంట పడగా బ్రహ్మ నవ్వుతూ పరుగులు తీసి, శరణాగతుల కష్టాలను తొలగించేవాడూ, భక్తులు కోరిన రూపంలో దర్శనం ఇచ్చేవాడూ అయిన నారాయణుని చేరి ఆయన పాదాలకు ప్రణమిల్లి ఇలా అన్నాడు.

723 "సమస్త దేవతలచేత పొగడబడేవాడా! విశ్వానికి క్షేమాన్ని కలిగించేవాడా! రక్షించు! రక్షించు! ఉపేక్షించక నన్ను రక్షించు. నా మాటను ఆలకించు. నేను నీ ఆజ్ఞను తలదాల్చి క్రమంగా...

724 ఈ ప్రజలను సృష్టించగా వారిలో పాపాత్ములైన ఈ రాక్షసులు నన్నే రమించాలని రాగా చింత చెంది ఇక్కడికి వచ్చాను. ఓ సుచరిత్రా! నన్ను రక్షించు.

725 అంతేకాక లోకంలో ఉండేవారికి కష్టాలను కలిగించడానికి, కష్టాలు పడేవారి కష్టాలను దూరం చేయడానికి నీకంటె సమర్థు లెవరున్నారు?" అని స్తోత్రం చేయగా, బ్రహ్మదేవుని దైన్యాన్ని తెలిసికొని నిస్సందేహంగా అందరి హృదయాలను దర్శించే శ్రీహరి "ఓ బ్రహ్మ! నీ ఈ ఘోరమైన శరీరాన్ని విడిచిపెట్టు" అని ఆజ్ఞాపించగా బ్రహ్మ ఆ దేహాన్ని త్యాగం చేసాడు.

726 అప్పుడు ఆ దేహం నుండి మణులు పొదిగిన క్రొత్త బంగారు కాలి అందెలు ఘల్లుఘల్లుమని మ్రోగే పాదపద్మాలు కలది, మెత్తని పట్టుచీరపై మిలమిల మెరుస్తున్న మొలనూలుతో ఇసుకతిన్నెలవలె ఉన్న కటిప్రదేశం కలది, ఒకదానితో ఒకటి ఒరసికొంటున్న కుచకుంభాల బరువుకు నకనకలాడే నడుము కలది, మద్యపానం మత్తుతో చలిస్తున్న అప్పుడే వికసించిన పద్మాలవంటి కన్నులు కలది, కృష్ణపక్షపు అష్టమినాటి చంద్రుని పోలిన నుదురు కలది, మదించిన తుమ్మెదలకు సాటి వచ్చే శిరోజాలు కలది, అందమైన సంపంగి పువ్వు వలె సోగదేలిన ముక్కు కలది, చిరునవ్వులు చిందే చూపుల కలది, తామరపూలవంటి చేతులు కలది....

727 అబ్జపాణి అని పిలువదగిన ఆ సుందరి సంధ్యారూపంలో పుట్టగా, రాక్షసులు చూచి కౌగలించి, తమలో తాము ఇలా మాట్లాడుకున్నారు.

728 "ఈ సౌకుమార్యం, ఈ నవయౌవనం, ఈ సౌందర్యం, ఈ జాణతనం, ఈ సౌభాగ్యవిశేషం ఏ స్త్రీలకూ లేదు. ఇది చాల చిత్రంగా ఉంది".

729 అని ఆశ్చర్యపడి ఆ రాక్షసులు "మనమంతా ఈమెను చూచినప్పటినుండి కామోత్కంఠులమై ఉండగా ఈమె మాత్రం మన మీద ఏమాత్రం మక్కువ చూపకుండా ఉండటానికి కారణం ఏమిటి?" అని అనేక విధాలుగా అనుకొని, ఆ సంధ్యాసుందరితో....

730 ఇలా అన్నారు.

ఓ కదళీస్తంభోరువ!
యే కుల? మే జాడదాన? వెవ్వరి సుత? వి
ట్లేకాంతంబున నిచ్చట
నే కారణమునఁ జరించె? దెఱిఁగింపు తగన్.

731 అరటి బోదెల లాంటి నున్నటి తొడలు గల సుందరీ! నీదే కులం? నీదే ఊరు? నీ తల్లిదండ్రులు ఎవరు? ఎందుకు నీవు ఇక్కడ వంటరిగా తిరుగుతున్నావు? మాకు తెలిసేలా చెప్పు. సృష్టి ఆదిలో తను సృష్టించిన రాక్షసులబారి నుండి తప్పించుకోడానికి బ్రహ్మదేవుడు తన దేహాన్ని విడిచాడు. ఆ దేహంనుండి ఆ రాక్షసులను మోహంలో పడేసిన సంధ్యాసుందరి జనించింది. చిట్టిపొట్టి పదాలతో ఎంతటి గంభీర భక్తిభావాలైనా, సరస శృంగారమైనా పండించగల మేటి పోతన గారి ఆ సంధ్యాసుందరి వర్ణన యిది.

732 నీ సౌందర్య సంపదతో ఇంపైన ఈ పుణ్యభూమిలో మోహంతో నీవెంట పడిన దుర్బలులమైన మమ్మల్ని ఎందుకు చేరనివ్వవు? మన్మథుని బాధ మాకు ఎక్కువయింది కదా!"

733 అంటూ వాళ్ళు ఆమె సౌందర్యాన్ని వర్ణించడానికి అలవి కాక ఆలోచిస్తూ...

734 కుచకుంభాల బరువువల్ల జవజవలాడే నడుము ఆకాశం కాగా, అందమైన చిగురాకువంటి హస్తంలో ప్రకాశించే పూలచెండు అస్తమించే సూర్యబింబం కాగా, నల్లగా మెరుస్తూ విప్పారిన కొప్పుముడి చీకటి రేకలు కాగా, స్వచ్ఛమైన భావాలను వెల్లడిస్తూ మెరిసే చూపులు నక్షత్రాలు కాగా, శరీరానికి పూసుకున్న గంధపు పూత సంధ్యారాగం కాగా, స్త్రీరూపాన్ని ధరించిన ఆ సంధ్యాదేవిని అసురులు చుట్టుముట్టి, హృదయాలలో పెచ్చరిల్లిన మోహావేశంతో ఆమెతో మళ్ళీ ఇలా అన్నారు.

735 క్రొత్తగా వికసించిన తామరపువ్వు వంటి ముఖం కలదానా! పద్మం ఒకే స్థలంలో ఉంటుంది, కాని నీ పాదాలనే పద్మాలు అనేక స్థలాలలో అనేక ప్రకారాలుగా ప్రకాశిస్తున్నాయి కదా!"

736 అని ఈ విధంగా ఆ రాక్షసులు పలుకుతూ తమ మనసులో తమకం అధికం కాగా ఆ సంధ్యాసుందరిని పట్టుకున్నారు. అది చూచి బ్రహ్మ తన మనస్సులో ఎంతో సంతోషించాడు.

737 అప్పుడు బ్రహ్మ తన చేతిని వాసన చూడగా గంధర్వులూ అప్సరసలూ పుట్టారు. బ్రహ్మ తన శరీరాన్ని వదలివేయగా అది...

738 వెన్నెల రూపాన్ని పొందగా, ఆ దేహాన్ని విశ్వావసువు ముందు నడుస్తున్న గంధర్వులూ అప్సరసలూ తీసుకున్నారు. మళ్ళీ బ్రహ్మ కునుకుపాటు, ఉన్మాదం,ఆవులింత, నిద్రలతో కూడిన శరీరాన్ని ధరించి పిశాచాలనూ, గుహ్యకులనూ, సిద్ధులనూ, భూతాలనూ పుట్టించగా వాళ్ళు దిగంబరులై వెంట్రుకలు విరబోసుకొని ఉండడం చూచి బ్రహ్మ కన్నులు మూసుకొని అప్పటి తన శరీరాన్ని వదలి వేయగా దానిని పిశాచులు గ్రహించారు. అనంతరం బ్రహ్మ తనను అన్నవంతునిగా భావించి అదృశ్య శరీరుడై పితృదేవతలనూ సాధ్యులనూ పుట్టించగా వారు తమను పుట్టించిన అదృశ్యదేహానికి కార్యమైన దేవభాగాన్ని అందుకొనగా ఆ కారణం వల్ల శ్రాద్ధ సమయాలలో పితృగణాలనూ సాధ్యగణాలనూ ఉద్దేశించి హవ్యకవ్యాలను సమర్పిస్తారు.

739 సజ్జనులు సంస్తుతించే ఓ పరీక్షిన్మహారాజా! విను. బ్రహ్మదేవుడు తిరోధానశక్తి వల్ల నరులను, సిద్ధులను,విద్యాధరులను పుట్టించి వారికి తిరోధానం అనే పేరుగల ఆ దేహాన్ని ఇచ్చాడు. తర్వాత బ్రహ్మ తనకు ప్రతిబింబంగా ఉన్న శరీరంనుండి కిన్నరులనూ, కింపురుషులనూ పుట్టించగా వారు ఆ బ్రహ్మదేవుని ప్రతిబింబాలైన శరీరాలను ధరించి ఇద్దరిద్దరు జతకూడి బ్రహ్మదేవునికి సంబంధించిన గీతాలను గానం చేయసాగారు. అప్పుడు బ్రహ్మ తన మనస్సులో...

740 తాను చేసిన సృష్టి అభివృద్ధి చెందకుండా ఉన్నందుకు బ్రహ్మ చింతించి, నిద్రించి, కాళ్ళూ చేతులూ విదిలించగా రాలిన రోమాలన్నీ పాములుగా మారాయి.

741 బ్రహ్మదేవుడు తాను పూనిన పని నెరవేరినట్లుగా భావించి తన అంతరాత్మ తృప్తిపడే విధంగా సమస్త జగత్తులో పవిత్రులూ, ముల్లోకాలలో శ్రేష్ఠులూ ఐన మనువులను సృష్టించాడు.

742 ఆ విధంగా పుట్టించి బ్రహ్మ వారికి పురుషరూపమైన తన దేహాన్ని ఇవ్వగా ఆ మనువులు తమకంటే ముందుగా సృష్టింపబడిన వారితో కలిసి బ్రహ్మతో ఇలా అన్నారు. "దేవా! సకల లోకాలకు సృష్టికర్తవైన నీవు చేసిన ఈ విస్తృతమైన సుకృతం ఆశ్చర్యకరమైనది. యజ్ఞాలు మొదలైన క్రియాకాండ అంతా ఈ మనువులను సృష్టించడం వల్ల ప్రశంసనీయమయింది. యజ్ఞాలలోని హవిర్భాగాలను మా నాలుకలతో ఆస్వాదించే అవకాశం మాకు లభించింది" అని అంతరంగాల్లో సంతోషం పెల్లుబుకుతూ ఉండగా బ్రహ్మదేవుని ప్రస్తుతించారు.

743 బ్రహ్మ శ్రేష్ఠమైన తపస్సు, యోగం, విద్య, సమాధి వీటితో కూడినవాడై ఋషివేషాన్ని ధరించి, ఇంద్రియాలతో కలిసిన ఆత్మస్వరూపుడై ఋషిగణాలను సృష్టించి, వారికి తన శరీరాంశాలైన సమాధి, యోగం, ఐశ్వర్యం, తపస్సు, విద్య, వైరాగ్యం అనే వాటిని క్రమంగా ఒక్కొక్కరికి సంక్రమింపచేసాడు" అని మైత్రేయుడు తెలియజేయగా విని విదురుడు మహానందం పొంది గోవిందుని పాదారవిందాలను తన మనస్సులో స్మరించి, మళ్ళీ మైత్రేయునితో ఈ విధంగా అన్నాడు.

744 ఉత్తమ గుణాలు కల మైత్రేయా! భూమిమీద స్వాయంభువ మనువు వంశం ధర్మసమ్మతమనీ, ఆ వంశంలో స్త్రీపురుష యోగం వల్ల ప్రజావృద్ధి జరిగిందనీ నీవు చెప్పావు. అంతేకాక ఆ స్వాయంభువ మనువుకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారనీ అన్నావు. వారు ఏడు దీవులతో కూడిన భూమండలమంతా ధర్మమార్గం ఎంతమాత్రం తప్పకుండా పుణ్యాత్ములై ఎట్లా పాలించారు? ఓ మునివరా! వారి చరిత్ర అంతా నాకు దయార్ద్రబుద్ధితో వివరించు.

745 అంతేకాక ఆ స్వయంభువ మనువు యోగలక్షణ సంపన్నురాలైన తన కుమార్తె దేవహూతి అనే కన్యారత్నాన్ని ఏ విధంగా కర్దముడనే ప్రజాపతికి ఇచ్చి వివాహం చేసాడు? ఆ దేవహూతి యందు మహాయోగీశ్వరుడైన కర్దముడు ఏ విధంగా సంతానాన్ని కన్నాడు? అంతేకాక ఆ కర్దమ ప్రజాపతి తన కూతురైన రుచి అనే కన్యను దక్షప్రజాపతికి ఇచ్చాడని నీవు చెప్పావు. ఆ రుచి యందు దక్షప్రజాపతి ప్రజలను ఎట్లా సృష్టించాడు? ఇవన్నీ వివరంగా నాకు చెప్పు" అని అడుగగా మైతేయుడు ఇలా అన్నాడు.

కర్దమునికి హరి ప్రత్యక్షం బగుట

746 ఓ పుణ్యాత్ముడవైన విదురా! విను. కృతయుగంలో బ్రహ్మదేవుని చేత ప్రజలను సృష్టించడానికి కర్దమ మునీశ్వరుడు నియమింపబడ్డాడు. అందుకు కర్దముడు సంతోషించి...

747 ధీరుడైన ఆ ముని సరస్వతీ నదీతీరంలో పదివేల దేవతా సంవత్సరాలు విడువకుండా తపస్సు చేస్తూ ఒకనాడు ధ్యానతత్పరుడై, ఏకాగ్రచిత్తంతో అత్యంత సంతోషంతో...

748 వరాల నిచ్చేవాడూ, దయతో కోరిన కోరికలను తీర్చే స్వభావం కలవాడూ, దేవతల చేత నమస్కరింపబడేవాడూ, లక్ష్మీపతీ, పాపాలను తొలగించేవాడూ, సుదర్శన చక్రాన్ని ధరించేవాడూ అయిన విష్ణువును ఆరాధించగా ఆ దేవుడు కరుణించి...

749 ఆకాశంలో ప్రత్యక్షం కాగా...

750 సూర్య చంద్ర కిరణాలు సోకి వికసించిన తామరపూలతోను, కలువపూలతోను కట్టిన అందమైన పూలమాలను ధరించినవాడూ, కంకణాలను, నూపురాలను, కంఠాభరణాలను, ఉంగరాలను, రత్నహారాలను, మకర కుండలాలను, కిరీటాన్ని ధరించి ప్రకాశించేవాడూ, అందమైన లక్ష్మీదేవితో కౌస్తుభమణితో అలంకరింపబడి మెరిసే వక్షస్థలం కలవాడూ, సొగసైన చిరునవ్వు వెన్నెలతో ప్రకాశించే చెక్కుటద్దాలతో విరాజిల్లుతున్నవాడూ, శంఖం, చక్రం, గద, పద్మం చేతుల్లో ధరించినవాడూ, తుమ్మెదల వంటి నల్లని ముంగురులతో అందంగా ప్రకాశించే ఫాలభాగం కలవాడూ, పచ్చని పట్టువస్త్రం ధరించినవాడూ, మందహాసంతో దయ పొంగిపొరలే చూపులు కలవాడూ, పద్మనాభుడూ అయిన హరిని...

751 ఇంకా శబ్దబ్రహ్మమే శరీరంగానూ, అస్తిత్వమే ఆత్మగానూ కలిగి జ్ఞానం చేత మాత్రమే తెలుసుకోదగినవాడై గరుత్మంతుని మూపుమీద పాదపద్మాలు మోపి ఉన్న ఆ గోవిందును చూచి కర్దముడు ఆనంద తరంగాలతో పరవశుడై కోరిక తీరినవాడై సాష్టాంగ ప్రణామాలు చేసి...

752 చేతులు జోడించి నిర్మలమైన భక్తిభావంతో మైమరచి వికసించిన పద్మాలవంటి కన్నులు కలిగిన విష్ణుముఖాన్ని చూస్తూ ఇలా అన్నాడు.

753 ఓ పుండరీకాక్షా! అఖిల ప్రాణులకు అంతరాత్మవై ఉండే నీ దర్శనం కోరి పురాకృత పుణ్యంతో నిండి అనేక జన్మలుగా నిరంతర యోగాభ్యాస నిపుణులైన యోగీశ్వరులు కీర్తిస్తుంటారు. అట్టి యోగీశ్వరులకు ఈశ్వరుడవైన నీ పాదపద్మాలను దర్శించాను. సంసార సముద్రాన్ని దాటగలిగాను. ధన్యుడనైనాను. మాధవా! ముకుందా! దయారూపా! లక్ష్మీరమణా! నాకు కన్నులున్నందుకు ఫలం ఇప్పుడు లభించింది.

754 అంతేకాక దేవా! నీ మాయవల్ల సమ్మోహితులై మతిమాలినవారై సంసార సముద్రాన్ని దాటించే నీ చరణకమలాలను తుచ్ఛమైన కోరికలతో ఆరాధించి, నరకపు దారి పట్టే కాముకుల కోరికలను కూడ నీవు తీర్చుతూ ఉంటావు. అటువంటి కాముకులను నిందించే నేనుకూడ గృహయజ్ఞ నిర్వహణలో గోవువలె ఉపకరించేదీ, అన్నింటికీ

మూలమైనదీ, ధర్మార్థకామములకు నెలవైనదీ, అనుగుణమైన నడవడి గలదీ అయిన భార్యను పెండ్లాడాలని కోరి కల్పవృక్షమూలాల వంటి నీ పాదపద్మాలను సేవించాను. అయినా ఒక విశేషం ఉంది. విన్నవిస్తాను విను. పరబ్రహ్మ స్వరూపుడవైన నీ వాక్కులు అనే త్రాళ్ళతో బంధింపబడిన ప్రజలు కామోపహతులైనారట. నేను కూడా వారిని అనుసరించడం కాలాత్మకుడవైన నీకు ఇష్టమైన విధంగా కర్మమయమైన నీ ఆజ్ఞాచక్రాన్ని అనుసరించడానికే కాని కామం కోసం కాదు. నీ మాయచేత నిర్మించ బడినదీ, కాలాత్మకమైన మహావేగం కలదీ, అక్షర పరబ్రహ్మాన్ని అనుసరించి తిరిగేదీ, అధిక మాసంతో కలిసి పదమూడు నెలలు అనే ఆకులు గలదీ, మూడువందల అరవై అహోరాత్రాలు అనే కణుపులు గలదీ, ఆరు ఋతువు అనే చుట్టు పట్టా కలదీ, మూడు చాతుర్మాస్యాలు అనే నడిమిబొడ్డు కలది. అపరిమితాలైన క్షణాలు అనే ఆకులతో విరాజిల్లేదీ, అయిన కాలచక్రం సమస్త జీవుల ఆయుస్సును మ్రింగివేయటానికి ఆసక్తి కలదై కామోపహతులైన వారిని అనుసరించే పశుప్రాయులైన లోకులను విడిచి, సంసార తాపాన్ని శాంతింపచేసే నీ పాదాలనే గొడుగుల నీడలను ఆశ్రయించిన వారినీ, నీ గుణవర్ణనమనే అమృతరసాన్ని అస్వాదిస్తూ దేహధర్మాలను లెక్కచేయని నీ భక్తులైనవారి ఆయుస్సును హరించడానికి సమర్థం కాదు" అని పలికి...

755 పుణ్యాత్మా! విశ్వవంద్యా! సర్వేశ్వరా! నీవు ఒక్కడివే అయినా నీ మాయవల్ల పుట్టిన సత్త్వం మొదలైన శక్తులు సాలీడు సాలెగూడును సృష్టించి మళ్ళీ తనలో లీనం చేసుకున్నట్టు ఈ లోకాలు పుట్టడానికి, వృద్ధిపొందడానికి, నాశం కావడానికి కారణభూత మౌతున్నాయి. అటువంటి నీ అపార లీలావిలాసమైన మహాసముద్రాన్ని దాటడం ఎవరికైనా సాధ్యం అవుతుందా?

756 దేవా! శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే విషయాలచే సుఖం కలిగించే స్వరూపాన్ని వృద్ధిచేయడం మమ్మల్ని అనుగ్రహించడానికే గాని నీకోసం కాదు. నీ మాయవల్ల ఈ లోకవ్యాపారాలన్నీ ప్రవర్తింప చేస్తూ మా మనోరథ సిద్ధి అనే అమృతాన్ని నిండుగా వర్షించే నీకు నమస్కరిస్తున్నాను."

757 అని ఈవిధంగా కర్దముడు స్తోత్రం చేయగా విష్ణువు విని గరుత్మంతుని మూపుపై ఒయ్యారంగా కూర్చొని అనురాగంతో కూడిన చిరునవ్వు వెన్నెలలు వెల్లివిరిసే చల్లని చూపులతో ఆ మునీంద్రుణ్ణి చూస్తూ ఇలా అన్నాడు.

758 మునీంద్రా! నీవు ఏమి కావాలని కోరి నన్ను భక్తితో ఆరాధించావో ఆ కోరిక నీకు తప్పక నెరవేరుతుంది సుమా!"

759 అని పలికి ఇంకా "బ్రహ్మదేవుని కుమారుడూ చక్రవర్తీ అయిన స్వాయంభువ మనువు బ్రహ్మావర్త దేశంలో సప్తసముద్రాల నడుమ ఉన్న భూమండలాన్నంతా

పరిపాలిస్తున్నాడు. ఆ మహాత్ముడు రేపు తన భార్య శతరూపతో కూడి, పెండ్లి కావలసిన కూతురును వెంటబెట్టుకొని వచ్చి వయస్సులో, స్వభావంలో, సంకల్పంలో, ఉత్తమగుణాలలో నీకు తగినట్టి ఆ పుత్రికను నీకిచ్చి వివాహం చేస్తాడు. నీ కోరిక తీరుతుంది. నన్ను మనస్సులో స్మరిస్తూ ఉంటే ఆ మనుపుత్రిక నిన్ను పెండ్లాడి, నీ వల్ల మిక్కిలి సౌందర్యవతులైన తొమ్మిదిమంది కుమార్తెలను కంటుంది. ఆ తొమ్మిదిమంది కన్యలకు మునులవల్ల ఉత్తములైన కుమారులు జన్మిస్తారు. నీవు నా ఆజ్ఞానుసారం నీవు చేసే సమస్త కార్యాలనూ నాకు అర్పిస్తూ ఏకాగ్రమైన మనస్సుతో ప్రాణికోటికి అవసరమైనప్పుడు అభయ మిస్తూ, దానాలు చేస్తూ, కరుణామూర్తివై, సుజ్ఞానివై, నాలో లోకాలన్నీ ఉన్నాయనీ, నీలో నేనున్నాననీ తెలుసుకొని నన్ను సేవించు. అంత్యకాలంలో నన్ను చేరగలవు. నీ తేజస్సువల్ల నేను నీ భార్య గర్భంలో ప్రవేశించి నా కళాంశతో నీ కుమారుడనై జన్మించి నీకు తత్త్వవిద్యను బోధిస్తాను." అని ఈ విధంగా విష్ణువు కర్దమునికి తెలిపి అతడు చూస్తూ ఉండగా అంతర్ధానమై...

760 సాటిలేని సరస్వతీ నదీజలాలతో పెంపొందిన గున్నమామిడి గుబురులతో కనువిందు చేస్తున్న బిందు సరోవరాన్ని దాటి, గరుత్మంతునిపై ఎక్కి, అతని రెక్కల కదలికల చప్పుళ్ళలో సలక్షణమైన సామగానాన్ని వింటూ ఆనందిస్తూ...

761 హరి వైకుంఠానికి వెళ్ళాడు. అనంతరం కోరికలు కొనలుసాగగా, జనులచేత నమస్కరింపబడే కర్దముడు, పారవశ్యంతో వెంటనే బిందుసరోవరానికి వెళ్ళి, భక్తితో విష్ణువును స్మరిస్తూ ఉన్నాడు. I1748

దేవహూతి పరిణయంబు

762 అప్పుడు స్వాయంభువ మనువు బంగారు రథమెక్కి భార్యతో కూడి పెండ్లికి ఎదిగిన తన కుమార్తెను వెంట బెట్టుకొని, ఆమెకు తగిన వరుణ్ణి అన్వేషిస్తూ లోకాలన్నీ తిరిగి, ఎక్కడా అటువంటివాడు కనబడక వచ్చి వచ్చి...

763 కర్దముని విష్ణువు దయతో చూచినప్పుడు, కర్దముని కన్నులనుండి రాలిన ఆనందబాష్ప బిందువులు నేలపై పడి, సరస్వతీ నది తనను చుట్టుకొని ప్రవహించునట్లుగా, బిందుసరోవరం ఏర్పడి ప్రసిద్ధమైన పుణ్యతీర్థమైనది. స్వాయంభువ మనువు తన కూమార్తెకు వరునికోసమై తిరుగుతూ, తన కన్నులముందర ఆ బిందుసరోవరాన్ని చూశాడు.

764 అక్కడ కర్దముని తపోవనం ఉంది. ఆ ఆశ్రమ వాటిక కానుగచెట్లు, మద్దిచెట్లు, పొగడచెట్లు, తెల్లమద్దిచెట్లు, వేపచెట్లు, కడిమిచెట్లు, కలిగొట్టుచెట్లు, చందనవృక్షాలు, కొబ్బరిచెట్లు, కర్పూరవృక్షాలు, దిరిసెనచెట్లు, లవంగలతలు, మాదీఫలాల చెట్లు, తియ్యమామిడిచెట్లు, ఎఱ్ఱచందనం చెట్లు, పోకచెట్లు, సంపెంగచెట్లు, మారేడుచెట్లు,

వెలగచెట్లు, మల్లెలు మొల్లలు అల్లుకొన్న చక్కని పొదరిండ్లు కలిగి విలసిల్లుతున్నది. ఇంకా...

765 బాగా పండిన పండ్ల బరువుతో క్రిందికి వంగిన చెట్ల కొమ్మలమీద నివసించే పక్షిమూకల కలకల ధ్వనులతో దిగంతాలు ప్రతిధ్వనిస్తూ ఆ ఆశ్రమం శుభకరంగా ఉంది.

766 పండిన పండ్లను మిక్కిలి వాడిగా ఉన్న తమ ముక్కులతో పొడిచి, ఆ సందులనుండి స్రవిస్తూ ఉన్న ఫలరసాన్ని త్రాగి, రామచిలుకలు సంతోషంతో చేస్తున్న అర్థవంతాలైన వేదగానాలు వీనులవిందు చేస్తున్నాయి.

767 లేత తియ్య మామిడి చిగుళ్ళను తినడం వల్ల వగరెక్కి పొగరెక్కిన కోయిలలు పంచమస్వరంతో మధురంగా కూస్తున్నాయి.

768 అక్కడి సాటిలేని తమాలవృక్షాలను చూచి మేఘాలని భ్రాంతిపడి నెమళ్ళు ఉల్లాసంతో ఒళ్ళు మరచి పురులు విప్పి చూడముచ్చటగా ఆడుతున్నాయి.

769 నీటి పక్షులతో, నీటికోళ్ళతో, బెగ్గురు పక్షులతో, కొంగలతో, చక్రవాకాలతో, తుమ్మెదలతో, కలహంసలతో, కమలాలతో, తెల్ల కలువలతో, ఎఱ్ఱ కలువలతో విరాజిల్లే సరోవరాలు ఉన్నాయి.

770 ఏనుగులు, పెద్దపులులు, తోడేళ్ళు, అడవిదున్నలు, కుందేళ్ళు, ఎలుగుబంట్లు, లేళ్ళు, చమరీమృగాలు, సింహాలు, వరాహాలు, ఖడ్గమృగాలు, దుప్పులు, కోతులు, శరభాలు మొదలైన అడవి మృగాలు సంచరిస్తున్నాయి.

771 అటువంటి కర్దమ మునీంద్రుని తపోవనాన్ని దర్శించి స్వాయంభువ మనువు పరిమిత పరివారంతో ఆశ్రమంలోనికి ప్రవేశించి, అక్కడ...

772 పవిత్రమైన బ్రహ్మచర్య వ్రతానికి తగిన తపోవ్యాపారం చేత చక్కగా ప్రకాశిస్తున్న కర్దముని శరీరం మిక్కిలి చిక్కిపోయినప్పటికీ విష్ణు సంకీర్తనం అనే అమృతరసాన్ని దొన్నెలవంటి చెవులతో త్రాగి ఉండడం వల్ల కృశించినట్లుగా కనిపించడం లేదు. జడలూ, నారచీరలూ, జింక చర్మమూ ధరించి తామరరేకులవంటి విశాలమైన నేత్రాలతో ఒప్పుతూ సానబట్టని వెలకట్టరాని వినూత్న రత్నంలా వెలుగుతున్నాడు. అటువంటి కర్దముని చూచి స్వాయంభువ మనువు భక్తిభావంతో ఆయన పాదాలకు నమస్కరించాడు.

773 ఈ విధంగా నమస్కరించగా కర్దముడు స్వాయంభువ మనువును తన ఇంటికి వచ్చిన అతిథిగా భావించి అర్ఘ్యపాద్యాలతో తృప్తి పరచి, భగవంతుని ఆదేశాన్ని గుర్తుకు తెచ్చుకొని అతనితో ఇలా అన్నాడు.

774 ఉత్తమ గుణాలకు స్థానమైన రాజా! భగవద్భక్తుడవైన నీవు దుర్జనులను శిక్షించడానికి, సజ్జనులను రక్షించడానికి లోకంలో పర్యటిస్తూ ఉంటావు. ఓ

పుణ్యపురుషా! నీవు సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, యముడు, వరుణుడు, ఇంద్రుల అంశలు కలవాడవు. విష్ణుస్వరూపుడవు. అటువంటి నీకు నేను పరమభక్తితో నమస్కరిస్తున్నాను. నీవు ఎల్లప్పుడూ సమస్త లోకాలలో విజయాన్ని సంపాదించే మణులు పొదిగిన బంగారు రథమెక్కి, విల్లు ధరించి, వీర సైనికుల పదఘట్టనలతో భూమి దద్దరిల్లగా జైత్రయాత్ర సాగిస్తుంటావు.

775 ఓ రాజా! నీవు ఈ జగత్తులో సూర్యునివలె సంచరించకపోతే ఈ లోకాలన్నీ నిద్రలో మునిగి, బ్రహ్మచే కల్పించబడిన వర్ణాశ్రమాలు అనే సముద్రం అల్లకల్లోలమై, సేతువువంటి సదాచార సంపద సంకరమై పోతుంది. జాతి సాంకర్యం ఏర్పడి దొంగల భయంవల్ల లోకాలన్నీ నశించిపోతాయి.

776 అని చెప్పి "నీ రాకకు కారణం ఏమిటి?" అని అడుగగా, నిత్యకర్మానుష్ఠాలు నిర్వర్తించిన కర్దమ ప్రజాపతితో స్వాయంభువ మనువు ఇలా అన్నాడు.

777 "ఓ మునివరేణ్యా! బ్రహ్మ తాను రచించిన వేదాల నన్నింటినీ ఈ భూమిమీద వెలయించడానికి మిమ్ములను తన ముఖంనుండి సృష్టించాడు.

778 దుర్మార్గులైన దొంగల బాధలను పొందకుండా సమస్త భూమిని పాలించడానికి బ్రహ్మ తన భుజాలనుండి మమ్మల్ని సృష్టించాడు.

779 ఆ బ్రహ్మకు బ్రాహ్మణజాతి అంతఃకరణంగా, క్షత్రియజాతి శరీరంగా ఒప్పుతున్నవి. ఈ రెండూ విష్ణుదేవునిచేత తప్పక రక్షింపవలసినవి.

780 విష్ణుస్వరూపుడవూ, దుష్టులకు చూడరానివాడవూ అయిన నీ దర్శనం నా అదృష్టం వల్ల లభించింది. నీ పాద పద్మాలలోని కేసరాల వల్ల ఎఱ్ఱబడిన నా శిరస్సూ, నీ మాటలు అనే అమృతంతో నిండిన నా చెవులూ సకల శుభాలకు స్థానాలై సఫలత్వాన్ని పొందాయి. నేను ధన్యుడ నయ్యాను. కుమార్తెపై గల వాత్సల్యం వల్ల మనస్సులో ఆందోళనపడుతూ, సమస్త దేశాలు తిరిగి అలసిపోయాను. నా విన్నపాన్ని ఆలకించు" అని ఇంకా ఇలా అన్నాడు.

781 "ఓ మహాయోగీశ్వరా! దేవహూతి అనే ఈ కన్యక నా కూతురు. ఈమె లోకంలో మిక్కిలి సౌందర్యవంతులైన పురుషులను ఎవ్వరినీ వరించడానికి ఇష్టపడక, చింతాక్రాంతురాలై, నారద మహర్షి వల్ల నీ రూపగుణాలను విని నిన్నే వివాహమాడాలని వచ్చింది. అందుకని నీవు ఈ శుభకార్యానికి అంగీకరించి నా కుమార్తెను స్వీకరించు.

అమలినగృహమేధిక క
ర్మములకు ననురూపగుణ విరాజితశీల
క్రమములఁ దనరిన తరుణిం
బ్రమదమున వరింపు మయ్య భవ్యచరిత్రా!

782 పవిత్రచరిత్రా! శుద్ధమైన గృహస్థాశ్రమ కృత్యాలను నిత్యం నిర్వహించడానికి అనురూపమైన గుణమూ, శీలమూ కల ఈ కాంతను సంతోషంతో అర్ధాంగిగా అంగీకరించు.

783 ఓ పుణ్యాత్మా! ఎంతటి విరక్తులకైనా అయాచితంగా తమంత తామే లభించిన సౌఖ్యాలను వదలకూడదని అన్నారు కదా! అటువంటప్పుడు కోరుకున్నవాళ్ళు అనుకోకుండా లభించిన ఇష్టమైన సుఖాలను మానుకుంటారా?

784 ఇంకా విను. ఫలితం పొందడం కోసం ఒక పని చేయడానికి పూనుకొన్నవాడు లోభిని అడిగితే ఆ పని చెడడమే కాక, గౌరవానికి భంగం కూడ వాటిల్లుతుంది. నీవు వివాహం చేసుకోవాలనే కోరికతో ఉన్నావని తెలిసికొని ఇక్కడికి...

785 వచ్చాను. నా విన్నపాన్ని మన్నించి నా కుమార్తెను వరించు" అని చెప్పిన స్వాయంభువ మనువును చూచి కర్దముడు సంతోషంతో ఇలా అన్నాడు.

786 "ఓ పుణ్యాత్మా! అన్యులను కాదని నాకోసం తీసుకొని వచ్చిన ఈ లతాంగి అందచందాలలో మహాలక్ష్మితో సమానురాలై ఒకనాటి రాత్రి చంద్రుని వెన్నెలతో మెరుస్తున్న తన మేడపై పాదాలకు బంగారు అందెలు అలంకరించుకొని చెలికత్తెలతో ఆడుకొంటుండగా ఆకాశంలో విమానంలో వెళ్తున్న విశ్వావసుడనే గంధర్వరాజు ఈమెను చూచి మోహంతో తూలి నేలపైన పడ్డాడు.

787 విష్ణువును తెలిసికొనని పురుష పశువులు ఈమెను చూడలేరు. ఏం చెప్పను? అటువంటి జవరాలు అదృష్టవశాన తనంత తాను వలచినప్పుడు కోరుకొననివాడు ఉంటాడా?

788 గుణం, రూపం, నడవడి ఈ కన్యామణికి, నాకు సమానంగా ఉన్నాయి. కనుక ఇది పుణ్యకార్యంగా భావించి ఈమెను నేను వరించి స్వీకరిస్తాను.

789 ఓ పుణ్యాత్మా! దీనికొక నియమం ఉంది. అది చెపుతాను విను. గుణవతియైన ఈమెకు సంతానం కలిగేవరకు మాత్రమే నేను గృహస్థధర్మాన్ని నిర్వర్తిస్తాను.

790 ఓ సచ్చరిత్రా! ఆ తర్వాత విష్ణువుయొక్క ఆజ్ఞను శిరసావహించి, అతడు చెప్పినట్లుగా జితేంద్రియుడనై సన్యసిస్తాను.

791 ఓ రాజా! విష్ణువు వల్లనే లోకాలన్నీ పుట్టి, పెరిగి, నశిస్తాయి. బ్రహ్మాదుల కతడే కారణభూతుడై ఉన్నాడు.

792 కావున ఆ దేవుని ఆజ్ఞను జవదాటకూడదు" అని కర్దముడు పలుకగా విని స్వాయంభువ మనువు తన భార్య అయిన శతరూప అభిప్రాయాన్ని, కూతురైన దేవహూతి అభిప్రాయాన్ని తెలిసికొని ఆ కర్దముని నియమానికి ఒప్పుకొని, సంతోషిస్తూ ఉత్తమ గుణ సంపన్నుడైన ఆ కర్దమునికి దేవహూతిని ఇచ్చి యథావిధిగా వివాహం చేయించాడు. ఆ

తరువాత శతరూప తమ కూతురు అల్లుడు యైన దేవహూతి కర్దములకు పారిబర్హం అనే పేర్లు గల వివాహానికి తగిన దివ్య వస్త్రాలను, ఆభరణాలను ఇచ్చెను. ఆ విధంగా తన కులాచారాన్ని అనుసరించి పెండ్లి చేసి చింతను పోగొట్టుకొన్నవాడై స్వాయంభువ మనువు కుమార్తెను ఎడబాసి పోతున్నాననే విచారంతో ఆమెను కౌగిలించుకొని, చుబుకం పుణికి, చెక్కిలి ముద్దాడి, శిరస్సు మూర్కొని, అతిశయించిన ప్రేమతో ఉబికిన బాష్పధారలతో ఆమె శిరస్సును తడిపి "తల్లీ! పోయి వస్తాను" అని చెప్పి కర్దముని వీడ్కొని భార్యతో రథమెక్కి సపరివారంగా బయలుదేరాడు.

793 కదులుతూ ఉన్న కెరటాలు గల బిందు సరస్సును దాటి, సరస్వతీనదిని దాటి, ఆ నదీతీరంలో తామరపూలతోను, దట్టమైన చెట్లతోను ఒప్పుతున్న మునీశ్వరుల ఆశ్రమాలను ముప్పిరిగొన్న ఆనందంతో చూస్తూ స్వాయంభువ మనువు తన పట్టణమార్గాన్ని పట్టి వెళ్ళాడు.

794 అలా వెళ్ళి వెళ్ళి బ్రహ్మావర్తదేశంలో...

795 పూర్వం విష్ణువు యజ్ఞవరాహరూపం ధరించి ఒక్కసారిగా ఒళ్ళు విదిలించగా అతని శరీరం మీది బిరుసైన వెంట్రుకలు ఆ ప్రదేశంలో రాలాయి. వాటివల్ల పచ్చని దర్భలూ, రెల్లుగడ్డీ, యజ్ఞకార్యాలకు యోగ్యమైన అగ్నీ పుట్టాయి. వాటితో ఋషులు అక్కడ యజ్ఞాలు చేశారు. యజ్ఞాలకు విఘ్నాలు కలిగిస్తున్న రాక్షసులను తుదముట్టించారు. అటువంటి బ్రహ్మావర్తదేశంలో స్వాయంభువ మనువు కూడా విష్ణువు నుద్దేశించి యజ్ఞం చేసి ప్రజ్ఞానిధియై విరాజిల్లిన తన పట్టణాన్ని సమీపించాడు.

796 ఆ విధంగా తన పట్టణాన్ని సమీపించగా పురజనులు కానుకలను తెచ్చి ఇచ్చి అనేక విధాలుగా స్తుతిస్తుండగా, మంగళవాద్యాలు మ్రోగుతుండగా స్వాయంభువ మనువు తన అంతఃపురం ప్రవేశించాడు.

797 అలా ప్రవేశించి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికాలనే తాపత్రయాన్ని రూపుమాపే భగవద్భక్తిని పెంపొందించుకుంటూ పుత్రులు, మిత్రులు, ఆప్తులు, బంధువులతో కూడి పరమానందంగా ఉన్నాడు.

798 అతడు ప్రతిదినం మిక్కిలి భక్తితో విష్ణువునందే మనస్సు నిల్పి, గంధర్వవీణను మేళవించి విష్ణువున కంకితంగా కమ్మని గీతాలను గానం చేస్తూ సంతుష్టాంతరంగుడై భోగభాగ్యాల మీద ఆసక్తి లేనివాడై, సర్వదా నారాయణ సేవాపరాయణుడై అనంత మహిమాన్వితుడైనాడు.

799 విష్ణువు పాదపద్మాలపై సమర్పింపబడిన తులసీదళాల ప్రవిత్ర పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ, ఆ భగవంతుని లీలావిలాసలను స్మరిస్తూ, కీర్తిస్తూ, చర్చిస్తూ, వింటూ ఆ

దేవుని సేవలకు ఆటంకాలై సంసారబంధాలైన ధర్మార్థకామాలను తిరస్కరించి మోక్షసాధకాలైన సత్కార్యాలను నిర్వహించాడు.

800 వేదార్థాలకు మాత్రమే గోచరమయ్యే ఆ భగవంతుని చరిత్రను ప్రసంగించడంలో ఆసక్తి కలిగిన మనస్సు కల ఆ స్వాయంభువ మనువుకు ఎన్ని జాములు గడిచినా గడువనట్లే ఉంది.

801 ఆ స్వాయంభువ మనువు విష్ణువు దివ్యమంగళ చరిత్రలను వింటూ, ఆయన రూపాన్ని ధ్యానిస్తూ, ఆయన లీలలను గానంచేస్తూ, ఆయనను ఆరాధిస్తూ, తన స్వప్న, జాగ్రత్, సుషుప్తి అవస్థలకు అతీతంగా ప్రవర్తించాడు. విష్ణుభక్తుడు కనుక శరీరానికి, మనస్సుకు సంబంధించిన వ్యథలను పొందలేదు. దేవతలవల్లా, మానవులవల్లా, పంచభూతాలవల్లా కలిగే బాధలలో చిక్కుకోలేదు. ఉత్తములైన మునీశ్వరులకు సంతోషం కలిగేవిధంగా వర్ణాశ్రమ ధర్మాలను సక్రమంగా నడుపుతూ, సర్వప్రాణులకు మేలు చేస్తూ డెబ్బైయొక్క మహాయుగాలు పాలించాడు. సమ్మోదంతో, సాటిలేని మేటి యశస్సుతో సచ్చరిత్రుడై విరాజిల్లాడు.

802 ఈ విధంగా విదురునికి మైత్రేయుడు దయతో స్వాయంభువ మనువు చరిత్రను వినిపించి "కర్దముని కథను వివరిస్తాను" అని సంతోషంగా చెప్పాడు.

కర్దముని విమానయానంబు

803 ఈ విధంగా స్వాయంభువుడు దేవహూతిని కర్దమునికి ఇచ్చి వివాహం చేసి వెళ్ళిపోగా, ఆ తర్వాత దేవహూతి పతిభక్తి కలిగి శివునికి పార్వతి సేవ చేసిన విధంగా భర్తయే సర్వస్వముగా భావించి, ఆ మునీశ్వరుని మనస్సులోని అభిప్రాయాలకు అనుగుణంగా దినదినం భక్తి, ప్రేమ రెట్టింపుకాగా సేవలు చేస్తూ, మిక్కిలి తేజస్సుతో ప్రకాశిస్తూ, కామం, క్రోధం, కపటం, లోభం మొదలైన దుర్గుణములకు దూరంగా ఉండి, తన సౌందర్యాన్ని పోషించుకుంటూ, చాతుర్యంతో, చనువుతో, ప్రేమతో పతినే దైవంగా భావించి మృదుమధురంగా అతనితో మాట్లాడుతూ పతివ్రతయై ప్రకాశించింది. దైవయోగాన్ని సైతం తప్పింప సమర్థుడైన కర్దమ ప్రజాపతి తన సేవలో మిక్కిలి కృశించిన దేవహూతిని దయతో చూసి ముద్దుగా ఇలా అన్నాడు.

804 "దేవీ! మాననీయమైన ధర్మమార్గం వల్ల మహిమ ప్రాప్తిస్తుంది. ఆ మహిమ వల్ల గొప్ప తపస్సు దానివల్ల ఏకాగ్రత సిద్ధిస్తాయి. వాటివల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. దానివల్ల ఆత్మయోగం లభిస్తుంది. ఆ ఆత్మయోగం విష్ణువుయొక్క కటాక్షాన్ని ప్రసాదిస్తుంది. ఆ కటాక్షం కారణంగా అవ్యయమైన దివ్యభోగాలు, అనంత సుఖాలు సమకూరుతాయి. ఈ విధంగా నాకు సమకూడిన సమస్త సంపదలూ నిరంతరం నన్ను సేవిస్తున్న నీకూ సంప్రాప్తిస్తాయి. నీకు నేను తిరుగులేని దివ్యదృష్టిని కూడా ఇస్తాను.

805 ఓ తరుణీ! ఆ దివ్యదృష్టివల్ల అన్నింటినీ నీవు చూడవచ్చు. చూడు. ఇక భగవద్దత్తాలు కాని ఇతర తుచ్ఛభోగాల విషయం వేరే చెప్పటం దేనికి? అవి ఆ విష్ణువు కనుబొమలు చిట్లించినంతమాత్రాన నశిస్తాయి.

806 సాటిలేని రాజ్యవైభవాలతో గర్వాంధులైన రాజులు కనులు గానక పాపమార్గంలో ప్రవర్తిస్తారు. అటువంటి వారికి అందరాని ఈ దివ్యభోగాలు నీ పాతివ్రత్య మహిమ వల్ల నీకు లభించాయి. ఈ సుఖాలను నీవు సమబుద్ధితో అనుభవించు. నీకు కార్యసిద్ధి కలుగుతుంది" అని కర్దముడు పలుకగా దేవహూతి కడకన్నులలో సిగ్గు చిందులు త్రొక్కగా, మనోవ్యథ మాయం కాగా, మోము వంచుకొని వినయంతో చనువుతో పారవశ్యంతో యోగమాయావిశారదుడైన తన భర్తవంక చూస్తూ ముద్దుముద్దుగా ఇలా అన్నది.

807 "ఓ పుణ్యాత్మా! నీవు అమోఘమైన యోగమాయకు అధిపతివి. అత్యంత సమర్థుడవు. అటువంటి నీయందు సాటిలేని దివ్యభోగాలు ఉన్నాయని తెలుసు. నీ సాంగత్యం వల్ల అవన్నీ నాకు లభిస్తాయి. అయినప్పటికీ నీవు సంతానం కలిగేవరకు మాత్రమే శరీరసంగమం కలిగి ఉంటానని ఒక నియమం ఆనాడు సెలవిచ్చావు. ఆ మాట మనస్సులో పెట్టుకొని నీ సాంగత్యాన్ని నాకు దయతో అనుగ్రహించు. నన్ను మన్నించు. నీ సంయోగాన్ని అభిలషిస్తూ కృశించిన ఈ శరీరం స్నానపాన భోజనాదులవల్ల ఎలా తృప్తి పడుతుంది? అటువంటి నా కోరికను తీర్చటానికి రతిరహస్యాలను ప్రకాశితం చేసే కామశాస్త్రాన్ని నాకు నేర్పు. అందుకు తగిన నానావిధాలైన వస్త్రాలు, అలంకారాలు, పూదండలు, మైపూతలు, శయనమందిరాలు, ఉద్యానవనాలు మొదలైన సమస్త వస్తువులనూ సమకూర్చి నన్ను కనికరించు" అని దేవహూతి చెప్పగా విని మహాత్ముడైన కర్దముడు తన యోగమాయాబలంతో ఆ క్షణంలోనే (ఒక దివ్యవిమానాన్ని సృష్టించాడు).

808 ఆ విమానంలో అందమైన మందిరాలు కనువిందు చేస్తున్నాయి. ఆ మందిరాలన్నీ మణిమయ స్తంభాలతో, గరుడపచ్చలు పరచిన నడవలతో, వజ్రాల తలుపులు గల గోడలతో, పగడాల గడపలతో, ఇంద్రనీల మణిఖండాలతో నిండి తళతళ మెరిసే బంగారు కలశాలతో, అంచులలో పద్మరాగాల మొగ్గలు చెక్కిన చక్కని వైడూర్యపు చూరులతో, గాలికి రెపరెపలాడుతున్న జెండా గుడ్డలతో, మధుర మధురంగా ఝుంకారం చేసే తుమ్మెదలతో కూడి వ్రేలాడుతున్న పూలదండల తోరణాలతో అత్యంత మనోహరంగా అలరారుతున్నాయి.

809 ఇంకా అందలి గదులలో జిలుగు దువ్వలువలు, చీనాంబరాలు, పట్టుచీరలు మొదలైన పలువిధాలైన వస్త్రాలు శోభిల్లుతున్నాయి. అపురూపమైన రంగురంగుల పట్టెమంచాలు అమర్చబడి ఉన్నాయి.

810 అందలి అందమైన ఉద్యానవనాలలో విలాసంగా విహరిస్తున్న రాజహంసలు, కోయిలలు, పావురాలు, చక్రవాకాలు, చిలుకలు, నెమళ్ళు మొదలైన పక్షులు మందిరాల గోడలమీద చెక్కబడిన కృత్రిమ పక్షులను చూచి తమ జాతికి చెందిన నిజమైన పక్షులుగానే భావించి ఎంతో ఉత్కంఠతో వాటిని పలుకరిస్తూ అక్కడి చెట్లకొమ్మలపై కేరింతలు కొడుతూ ఆడుతుంటాయి.

811 ఇంకా...

812 ఆ విమానం మెత్తని శయ్యలతో, మేలైన గద్దెలతో, కేళీగృహాలతో, క్రీడాపర్వతాలతో, పాలరాతి భవనాలతో, పండ్లచెట్లతో నిండిన వనాలతో కూడి ఉన్నది.

813 ఆ విమానం సమస్త ఋతుశోభలతో, సకల శుభాలతో, సర్వసంపదలతో పెంపొందుతూ అన్ని సుఖాలను అనుభవించటానికి యోగ్యమై, అన్ని కోరికలను అందించగలదై, అందమైన అలంకారాలతో ఒప్పుతున్నది.

814 అటువంటి దివ్యమైన విమానాన్ని సృష్టించి, అందలి శోభావిశేషాలను నిర్మాణం చేసిన తాను కూడా తెలుసుకొనంతటి అద్భుత నిర్మాణాలు కలదానిని దేవహూతికి చూపి, ఆమె సంతోషించడం లేదని తెలిసికొని సమస్త ప్రాణుల అంతరంగాలలో గల అభిప్రాయాలను గ్రహించేవాడూ, తృప్తిపడిన మనస్సు కలవాడూ అయిన కర్దముడు ఇలా అన్నాడు.

815 "ఓ సుందరీ! భగవంతునిచే నిర్మింపబడినదీ, సమస్త శుభాలను కలిగించేదీ అయిన ఈ బిందుసరోవరంలో స్నానం చేసిన ప్రాణులన్నింటికీ కోరికలు తీరుతాయి. కావున నీవు...

816 ఓ లజ్జాశీలీ! ఈ సరోవర జలాలలో భక్తితో స్నానం చేసి సంతోషంగా ఈ విమానాన్ని ఎక్కు" అని కర్దముడు బుజ్జగిస్తూ పలికాడు.

దేవహూతితో గ్రుమ్మరుట

817 కలువకన్నుల ఆ దేవహూతి కర్దముని మాటలు విన్నది. ఆమె పతిసేవలో అలసిపోయి యున్నది. చీర మాసిపోయింది. శిరోజాలు జడలు కట్టాయి. శరీరం ధూళిధూసరితమై కృశించింది. వక్షస్థలం వివర్ణమయింది. ఆమె భర్త ఆజ్ఞానుసారం సరస్వతీ నదీజలాలతోను, జలచరాలతోను నిండిన బిందుసరోవరంలో దిగి స్నానం చేసే సమయంలో ఆ జలప్రవాహంలోనుంచి నాజూకైన సన్నని పట్టువస్త్రాలు ధరించినవారూ, నవయౌవనంలో ఉన్నవారూ,

కలువపూల పరిమళం కలవారూ అయిన వేలకొద్ది కన్యలు ఆమెకు కనిపించి ఇలా అన్నారు.

818 "ఓ యువతీ! ధర్మకార్యాలు ఆచరించే మేము నిర్మలమైన భక్తితో నీకు సేవలు చేయగలం. నీవు మమ్మల్ని దయతో చూడు.

819 ఇలా అని వారంతా దేవహూతిని సమీపించి, ఆమెకు తలంటి, నలుగు పెట్టి, చందన కర్పూరాలు వెదజల్లే బంగారు బిందెల జలాలతో స్నానం చేయించి, తెల్లని వస్త్రాలతో తడి ఒత్తి, శరీరమంతా అగరు ధూపాలు వేసి, కస్తూరి పూతలు పూసి, మధురంగా ధ్వనించే మణిమంజీరాలు పాదాలకు తొడిగి, చిరుగంటల సవ్వడితో ఒప్పే ఒడ్డాణం నడుముకు అలంకరించి, రత్నాలు చెక్కిన కర్ణాభరణాలు, ఉంగరాలు, కంకణాలు మొదలైన విలువైన బంగారు ఆభరణాలను ఇచ్చి, పూలదండలు సింగారించి, షడ్రసోపేతమైన భోజనాదులతో సంతృప్తి పరచారు.

820 ఇంకా బంగారు పళ్ళెరాలలో కర్పూరం వెలిగించి హారతులిచ్చి, రమణీయమైన రత్నపీఠంమీద కూర్చోబెట్టి అద్దం చేతికిచ్చారు. దేవహూతి అద్దంలో ప్రతిఫలించిన తన రూపాన్ని చూచుకొని తన పతి అయిన కర్దముని మనస్సులో భావించింది. మరుక్షణంలో కర్దముడు, వేలకొలది కన్యకలు ఆమె చెంత ఉన్నారు. అది చూచి భర్తయొక్క యోగమాయా ప్రభావానికి ఆమె ఆశ్చర్యపడ్డది. అప్పుడు కర్దముడు స్నానం చేసి ఆసీనురాలైన దేవహూతిని చూచి, వివాహానికి పూర్వం ఆమె ఎలా ఉండేదో అలాగే చెక్కు చెదరని చక్కదనంతో ఉన్నందుకు మహానందం పొందాడు. కన్యలందరూ తమ్ము సేవిస్తూ ఉండగా సతీసమేతుడై విమానం ఎక్కి, చుక్కలతో చుట్టబడిన రోహిణీ సహితుడైన చంద్రునిలా ప్రకాశించాడు.

821 విమానారూఢుడై సమస్త దిక్పాలురు విహరించడానికి యోగ్యమైనదీ, మెల్లగా చల్లగా వీచే మలయమారుతాలతో కూడినదీ, సమీపంలో ప్రవహించే సెలయేళ్ళ నీటి తుంపురుల చల్లదనం కలదీ అయిన మేరుపర్వతం శిఖరాల మీద, నిత్యమంగళ స్వరూపుడైన ఆ కర్దముడు, సురసుందరీ సమేతుడైన కుబేరునిలా విహరించాడు.

822 ఇంకా...

823 కర్దమ మహర్షి కోరినచోటికి సంకల్పమాత్రంతోనే తీసుకెళ్ళే ఆ విమానం ఎక్కి, దేవహూతితోపాటు గొప్ప వేడుకతో విహరించాడు. చక్కటి దివ్యఉద్యానవనాలు, సరిక్రొత్త విహారప్రదేశములు, పద్మాలతోనూ, కలువలుతోనూ కలకలాడుతున్న మానస సరోవర తీరాలు, మనోహరమైన పొదరిండ్లు, చైత్రరథం అనే కుబేరుని తోట మున్నుగు అన్నిటినీ తన ఇంతితో ప్రేమపూర్వకంగా విహరించాడు.

824 ఈ విధంగా కర్దముడు వివిధ ప్రదేశాలను విమానంమీద వాయువేగంతో విహరించి సమస్త దేవతలను అతిశయించినవాడై నేల నాలుగు చెరగులూ సంచరించాడు. మోక్షప్రదాత, పరమపూజ్యుడు అయిన విష్ణుదేవుని భావించి, సేవించే పుణ్యాత్ములు పొందజాలని వస్తువులుంటాయా? ఇలా కర్దముడు దేవహూతికి సమస్త భూమండలాన్ని చూపించి, మళ్ళీ తన నివాసానికి తీసుకొని వచ్చి, శృంగారకేళీ విలాసాలకు అభిముఖురాలైన భార్య హృదయాన్ని గుర్తించి, రతిక్రీడా పరాయణుడైనాడు. ఆ దంపతులు అనేక విధాలైన అభీష్ట సుఖభోగాలను అనుభవిస్తూ పెక్కు సంవత్సరాలు ఒక్క క్షణంగా గడిపాడు. అన్యోన్యం తియ్యనైన చూపులతో విడిపోని కౌగిలింతలతో సరసమైన సంభాషణలతో కలిసి మెలిసి కాలగమనం గమనించకుండా నూరేండ్లు గడిపాడు.

కపిలుని జన్మంబు

825 మునిశ్రేష్ఠుడైన కర్దముడు ఒకనాడు కుతూహలంతో తొమ్మిది విధాలైన వేరువేరు దేహాలను ధరించి క్రమంగా తన వీర్యాన్ని తన భార్య అయిన దేవహూతి గర్భంలో తొమ్మిది విధాలుగా నిలిపాడు.

826 ఆ కారణంగా కర్దమునివల్ల దేవహూతి తొమ్మిదిమంది కుమార్తెలను కన్నది. ఆమె తన మనస్సులో ఎంతో సంతోషించింది. అప్పుడా ముని (సన్యసింప దలిచాడు).

827 (కర్దముడు) సన్యసింప దలిచాడు. ఆ విషయం అతని భార్య దేవహూతి తెలిసికొని మనస్సులో పుట్టిన ఆవేదన అధికం కాగా, చింతతో చెక్కిలిమీద చేయి చేర్చి, కాలివ్రేలితో నేలపై వ్రాస్తూ తన భర్తతో ఇలా అన్నది.

828 "ఓ పుణ్యాత్ముడా! సంతానం కలిగే వరకు నాతో ఉంటానని పూర్వం చెప్పి పుత్రికలను అనుగ్రహించావు. ఈ యువతులు తమకు తామే భర్తలను ఎలా వెదుక్కోగలరనే భయం నాకు కలుగుతున్నది. అందుకని కుమార్తెలకు తగిన వరులను వెదకి వారికి వివాహం చేసి, నాకు వేదాంత విషయాలను తెలియజెప్పగల కుమారుని ప్రసాదించి నన్ను కటాక్షించు. సాధుజన సంస్తవనీయా! సంసార దుఃఖాన్ని తొలగించడానికి అన్ని విధాల సమర్థుడవు నీవు. ముక్తి మార్గాన్ని తెలిపేవారు లేక మోహం వల్ల ఇంతకాలం వ్యర్థంగా గడిచిపోయింది.

829 ఓ మహాత్మా! నాకు ఈ లోక సంబంధాలైన సుఖాలను అనుభవించాలనే ఆసక్తి నశించింది. భోగాలపై విరక్తి కలిగింది. ఇంతకు ముందు చంచలభావంతో కామోపభోగాలను కోరిన దానినై, స్వచ్ఛమైన నీ భావాన్ని తెలుసుకోలేక ఏవేవో అర్థించాను. నా పట్ల నీ అనుగ్రహం ఫలించింది. నిన్ను నిర్మల భక్తితో సేవించడం చేత ముక్తి లభిస్తుంది కదా!

830 అంతేకాక...

831 అందరిపట్ల సమానబుద్ధి కలిగినట్టి సజ్జనుల మైత్రి ఉత్తమగతికి కారణమౌతుంది. నీచమైన బుద్ధి కలిగి, చంచలచిత్తులైనట్టి దుర్జనుల స్నేహం వలన దుర్గతి కలుగుతుంది. ఈ సంగతి మనస్సులో భావించి, యోగిజన సన్నుతుడవైన నిన్ను నేను సేవిస్తాను. ప్రాణుల సాంగత్యం వల్లనే ఎట్టివారికైనా పుణ్యాలో లేక పాపాలో ప్రాప్తిస్తాయి".

832 అని ఈ విధంగా దేవహూతి మిక్కిలి వేదనతో పరితపిస్తూ పలుకగా, కర్దముడు విష్ణుదేవుని వాక్యాలు స్మరించుకొని మనుపుత్రి అయిన దేవహూతిని చూచి ఇలా అన్నాడు.

833 "ఓ మనుసుతా! నీవు మనస్సులో దుఃఖించవద్దు. అనఘుడూ అక్షరుడూ అయిన విష్ణుభగవానుడు కొద్ది కాలంలోనే నీ గర్భంలో ప్రవేశిస్తాడు.

834 నీవు ఉత్తమ నియమాలతో వ్రతాలతో నిష్ఠతో చరించు. నిగ్రహంతో కూడిన మనస్సు కలదానివై నిండైన తపస్సును, శ్రద్ధాభక్తులతో కూడిన దానధర్మాలను ఆచరించు.

835 నారాయణుని పాదపద్మాలను నిండైన భక్తితో పూజించు. పురుషోత్తముడైన ఆ విష్ణువు నీ పూజలకు సంతృప్తి చెంది నీ గర్భంలో నివసిస్తాడు. నీ మనస్సులో పుట్టే సందేహాల ముడులను విడదీస్తాడు".

836 అని కర్దముడు చెప్పగా దేవహూతి తన మనస్సులో సంతోషించి, అతని మాటల ననుసరించి పరాత్పరుడు, భగవంతుడు, అనంతుడు, కమలాక్షుడు, పాపమోచనుడు అయిన విష్ణువును పూజిస్తూ ఉండగా కొన్నేండ్లు గడిచాయి. అప్పుడు రాక్షససంహారి అయిన విష్ణువు కర్దమ మునీశ్వరుని తేజస్సును (ధరించాడు).

837 (విష్ణువు కర్దముని తేజస్సును) ధరించి జమ్మిచెట్టు తొఱ్ఱలో నుంచి అగ్ని పుట్టినట్లుగా దేవహూతి గర్భంలోనుండి జన్మించాడు.

838 ఆ సమయంలో ఆకాశంలో దివ్యమంగళ వాద్యాలు ధ్వనించాయి. దేవతలందరూ సంతోషంతో మందారపుష్పాల వర్షాన్ని కురిపించారు. గంధర్వులూ, కిన్నరులూ పాటలు పాడారు. అప్సరసలు నాట్యం చేశారు. దిక్కుల్లో క్రమ్మిన పొగమంచు మాయమయింది. సముద్రాలు ప్రశాంతాలైనాయి. సజ్జనుల మనస్సులకు సంతోషం కలిగింది. హోమాగ్నులు మిక్కిలి తేజస్సుతో వెలిగాయి. వృక్షాలన్నీ ఫలపుష్పాలతో నిండిపోయాయి. పొలాలలో నానావిధాలైన పైరులు ప్రకాశించాయి.

839 ఇటువంటి మహోత్సవ సమయంలో దేవహూతికి తత్త్వజ్ఞానాన్ని బోధించడానికి ఆమె గర్భంలో పుట్టిన పరబ్రహ్మ స్వరూపుడైన నారాయణుని దర్శించడానికి మరీచి మొదలైన మునులతో కూడి బ్రహ్మదేవుడు వచ్చి, ఆ మహాత్ముని దర్శనం చేసికొని కర్దమ దేవహూతులను చూచి ఇలా అన్నాడు.

840 "ధన్యచరితులైన ఓ దంపతులారా! మీరు కృతార్థులు. నిజమైన భక్తితో, నిష్కపటమైన మనస్సుతో విష్ణుదేవుని సేవించారు. మీ పూజకు తగిన ఫలం మీకు లభించింది.

841 ఆశ్రితుల భయాన్ని పోగొట్టేవాడు, మునీశ్వరులు కీర్తించే చరిత్ర గలవాడు అయిన పరాత్పరుడు మీ కోర్కెను చక్కగా నెరవేర్చాడు. అందువల్ల మీ జన్మ సార్థకం అయింది.

842 నీతికోవిదులైన ఓ దంపతులారా! వినండి. ఆసక్తితో, అద్వితీయమైన భక్తితో విష్ణువును పూజిస్తే అదే ముక్తిని ప్రసాదిస్తుంది. మీ పుణ్యాన్ని ఏమని పొగడగలను?"

843 అని చెప్పి మళ్ళీ కర్దముని చూచి ఇలా అన్నాడు "నీ కుమార్తెలను ఉత్తమ స్వభావం కలిగివారు, సదాచార సంపన్నులూ అయిన మునిశ్రేష్ఠుల కిచ్చి వివాహం చెయ్యి. అలా అయితే వారివల్ల ప్రజాసృష్టి అనేక విధాలుగా అభివృద్ధి చెందుతుంది" అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

844 "ఓ పుణ్యాత్ముడా! మహాత్ముడు, మహా తేజోవంతుడు అయిన ఈ నీ కుమారుడు సమస్త ప్రాణుల హృదయాలలోని మనోరథాలను నెరవేర్చే ఘనుడు. కనుక ఇతనిని ఈశుడు, పరమేశ్వరుడు, అపరాజితుడు, అమేయుడు, అచ్యుతుడు, అనంతుడు, ఆద్యుడు, అవికారుడు, అక్షరుడు అయిన పుండరీకాక్షునిగా భావించు.

845 ఓ దేవహూతీ! మాననీయాలైన జ్ఞానవిజ్ఞాన యోగాలు అనబడే ఉపాయాలచే కర్మజీవుల్ని ఉద్ధరించడానికై కమలాక్షుడు నీ కడుపున జన్మించాడు. బంగారు రంగు కలిగిన జటాజూటం కలవాడు, వికసించిన కమలాల వంటి కన్నులు కలవాడు, పద్మం, హలం, వజ్రం, అంకుశం మొదలైన రేఖలతో విరాజిల్లే అరికాళ్ళు కలవాడు, సత్త్వగుణ సంపన్నుడు అయి ఇప్పుడు నీ గర్భంలో జన్మించిన ఈ మహాత్ముడు నీకు తత్త్వబోధ చేస్తాడు. దానితో నీ హృదయంలోని సంశయాలన్నీ తీరిపోతాయి.

846 ఇంకా...

847 (నీ కుమారుడు) పేరెన్నిక గన్నవాడై, ప్రసిద్ధులైన సిద్ధపురుషులచేత సేవింప బడుతూ మహనీయమైన సాంఖ్యయోగంతో ప్రకాశించే పరతత్త్వమందు సుస్థిరుడై 'కపిలుడు' అనే పేరుతో ఈ మూడు లోకాలలోను సంచరిస్తాడు" అని బ్రహ్మదేవుడు తెలిపాడు.

కన్యకానవక వివాహంబు

848 ఈ విధంగా పలికి బ్రహ్మదేవుడు ఆ మరీచి మహర్షిని వివాహ నిమిత్తం అక్కడే ఉంచి తన కుమారులైన నారదుడు, సనకుడు మొదలైన వారితో కలిసి తన నివాసానికి వెళ్ళాడు

849 తరువాత ఆ కర్దముడు బ్రహ్మదేవుని ఆదేశానుసారం తన కుమార్తెలకు యథావిధిగా పెండ్లిండ్లు చేయాలని నిశ్చయించినవాడై కళను మరీచికి, అనసూయను అత్రికి, శ్రద్ధను

అంగిరసునకు, హవిర్భువును పులస్త్యునకు, గతిని పులహునకు, క్రియను క్రతువుకు, ఖ్యాతిని భృగువుకు, అరుంధతిని వసిష్ఠునకు, శాంతిని అధ్వర్యునకు ఇచ్చి తన కులాచారం ప్రకారం వివాహం చేయగా ఆ మునులు కర్దముని కన్యలను పెండ్లాడి అతని సత్కారాలు అందుకొని ఆయన అనుజ్ఞతో సతీసమేతంగా తమ తమ ఆశ్రమాలకు వెళ్ళారు. ఆ తరువాత కర్దముడు దేవదేవుడైన విష్ణువు తన ఇంట్లో పుట్టి పెరుగుతున్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని ఏకాంత ప్రదేశంలో కపిలునికి నమస్కరించి ఇలా అన్నాడు.

850 "ఓ మహాత్మా! విను. పూర్వం తాము చేసిన అమంగళ కార్యాలు అనే కార్చిచ్చులో కాలిపోతూ ఉన్న జీవులు బైట పడలేక ఎడతెగని సంసార బంధాలలో బంధింపబడి ఉంటారు. దేవతల అనుగ్రహం వల్లా, బహుజన్మల పరిచయం వల్లా ప్రాప్తించిన యోగసమాధిలో నిష్ఠాగరిష్ఠులైన యోగిశ్రేష్ఠులు ఏకాంత ప్రదేశంలో ఏమరుపాటు లేక ఏ మహానుభావుణ్ణి దర్శిస్తారో అటువంటి దేవాదిదేవుడవైన నీవు నా ఇంటిలో జన్మించావు.

851 ఇంకా సంసార చక్రంలో త్రిప్పబడుతూ, పరమ పామరులమైన మా ప్రవర్తన లెక్కించక, పూర్వం ఆనతి ఇచ్చిన మేరకు మాట తప్పకుండా నన్ను అనుగ్రహించటానికై నా కుమారుడవై జన్మించావు" అని మళ్ళీ ఇలా అన్నాడు.

852 "ఓ పరమపురుషా! మహాత్మా! ప్రకృతికి అతీతమైన బలపరాక్రమాలు కలిగి నాలుగు చేతులతో ప్రకాశించే నీ అనేక అవతారాలు అన్నివిధాల నీకు అనుగుణంగా అలరారుతున్నాయి.

853 అంతేకాక...

854 ఓ హరీ! అనవరతం నిన్ను ఆశ్రయించే జనులను ఆదుకోడానికై నీవు అంగీకరించే రూపాలు నీకు అనురూపాలే అవుతూ ఉంటాయి.

855 పరమ పవిత్రమైన తత్త్వజ్ఞానాన్ని పొందడం కోసం విద్వాంసులైనవారు విడువకుండా నమస్కరించే పాదపీఠం కల నిన్ను వర్ణించడం ఎవరికి సాధ్యం?

856 ఓ భక్తవరదా! అపారమైన షడ్గుణైశ్వర్యాలకు నీవు కారణభూతుడవు. పరమేశ్వరుడవు. ప్రకృతి, పురుషుడు, మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు అన్నీ నీవే. వీనిని క్షోభింపజేయడానికి కారణమైన కాలం కూడ నీ స్వరూపమే. నీవు స్థిరమూర్తివి. జగదంతర్యామివైన స్వామివి. చిచ్ఛక్తి యుక్తుడవు. సమస్త విశ్వాన్నీ ఉదరంలో పదిలపరచుకున్న సర్వజ్ఞుడవు. స్వతంత్రుడవు. సర్వసాక్షివి. అటువంటి నీవు ఇప్పుడు కపిలు డనే పేరుతో వెలుగుతూ ఉన్నావు. ఓ పుణ్యపురుషా! నీకు నమస్కరిస్తున్నాను. నీవు నాకు పుత్రుడవై పుట్టడంవల్ల నేను దేవ, ఋషి, పితృ ఋణాలు మూడింటినుండి విముక్తి పొందాను.

857 ఉత్తమ వ్రతాలలో, యోగాలలో, ధ్యానాలలో నియమం కలవాడినై, నీ రెండు పాదపద్మాలను నా హృదయంలో పదిల పరచుకొని దుఃఖాలన్నింటినీ దూరం చేసికొని, పుణ్యప్రదేశాలలో సంచరిస్తాను".

858 అని ఈ విధంగా విన్నవించుకుంటున్న కర్దమ మునీంద్రుని మాటలు విని భగవంతుడైన కపిలుడు ఆయనను చూచి అనురాగ పూర్వకంగా ఇలా అన్నాడు.

859 "ఓ కర్దమ మునీశ్వరా! నేను ఇంతకు ముందు నీకిచ్చిన వాగ్దానం మేరకు అవ్యాజమైన అనుగ్రహంతో నీ ఇంట పుట్టాను. అవాప్తకాముడనైన నాకు కోరికలు ఏవీ లేవు. నేను ఈ మునివేషం ధరించడం నాకోసం కాదు. మహాత్ములైన మునులకు పరమాత్మ సంబంధమైనదీ పరమ వివేకంతో కూడినదీ అయిన తత్త్వజ్ఞానాన్ని ప్రబోధించడం కోసం ధరించిన దేహంగా దీనిని తెలుసుకో. భక్తి పూర్వకంగా నా పాదాలను ధ్యానించు. మహిమతో విరాజిల్లే నీ బుద్ధిని నాయందు లగ్నం చెయ్యి.

860 నీవు అధికమైన నిష్ఠ కలవాడవై యోగమార్గాన్ని అనుసరించు. సమస్త కర్మలనూ నాకే అర్పించు. మోహానికి లొంగిపోకు. మనోవికారాలను విసర్జించు. మోక్షం కోసం నన్ను భక్తితో భజించు.

861 పరమేశ్వరుడను, పరంజ్యోతిని, అనఘుడను, అనంతుడను, దేవదేవుడను, సమస్త ప్రాణుల హృదయాంతరాళలో నివసించేవాడను, ఆద్యుడను, అజుడను, ఆద్యంత రహితుడను, దురితదూరుడను అయిన నన్ను....

862 ...స్థిరంగా నీ హృదయకమలం మధ్య పదిలంగా నిలిపి జితేంద్రియుడవై మనోనేత్రంతో సూటిగా దర్శించు.

863 అలా అయితే...

864 నీవు మోక్షాన్ని పొందుతావు" అని కపిలుడు పలుకగా కర్దముడు ఆ మునికుల శ్రేష్ఠునకు ప్రదక్షిణం చేసి అత్యంత భక్తితో నమస్కరించి కుతూహలంతో...

కర్దముని తపోయాత్ర

865 కర్దముడు మునులు నివసించే అరణ్యానికి వెళ్ళి, అక్కడ మౌనవ్రతాన్ని పాటిస్తూ, లోకసంబంధాలను త్యజించి, హోమాది అగ్నికార్యాలను విడిచి, స్థిరనివాసం లేనివాడై, తనలోని పరమాత్మనే శరణు జొచ్చినవాడై....

866 కర్దముడు పరబ్రహ్మను చిత్తంలో నిల్పుకొని, అహంకారాన్ని విడిచి, మమకారాన్ని వదలి, దయామయ హృదయంతో సమస్త ప్రాణులను తనతో సమానంగా చూస్తూ, ప్రశాంత స్వభావం కలవాడై, అలలు లేని సముద్రం వలె ధీరుడై, సమస్త ప్రపంచాన్ని విష్ణుమయంగా భావిస్తూ, భక్తియోగంతో భాగవతులు పొందే పరమపదాన్ని అందుకున్నాడు – అని మైత్రేయుడు విదురునితో చెప్పి ఇంకా ఇలా అన్నాడు. "కర్దముడు అరణ్యానికి వెళ్ళిన తరువాత మాతృప్రేమ కలిగిన కపిలుడు బిందుసరోవరం దగ్గర

నివసించి ఉండగా దేవహూతి తనకు తత్త్వమార్గాన్ని చూపగలిగే కుమారుని చూచి బ్రహ్మ చెప్పిన మాటలను తలచుకొంటూ ఇలా అన్నది.

కపిల దేవహూతి సంవాదంబు 867

అసదింద్రియ ఘర్షణమున
వసుమతి నిర్విణ్ణ నగుచు వనరెడి నా కీ
యసదృశమోహతమో విని
రసనం బనఘాత్మ! యే వెరవున ఘటించున్.

"ఓ పుణ్యాత్మా! అసత్యలైన ఇంద్రియాల సంఘర్షణం వల్ల ఖిన్నురాలినై విచారిస్తున్న నాకు ఈ సాటిలేని మోహాంధకారంలోనుంచి బయటపడే అవకాశం ఏ ఉపాయం వల్ల కలుగుతుంది?

868 ఓ పుణ్యాత్మా! దట్టమైన కారుమేఘాల చీకట్లతో ఆవరింపబడిన ఈ మహాప్రపంచానికి నీవు ఒక్కడివే ఏకైక నేత్రమై సూర్యునివలె వెలుగుతూ ఉంటావు.

869 లోపాలు లేనివాడవు, అసహాయ దర్శనం కలవాడవు, మనోవికారాలు లేనివాడవు, సంసారమనే తీగలకు కొడవలి వంటివాడవు, జ్ఞానులలో ఉత్తముడవు, అందరికి శరణు కోరదగినవాడవు, ధర్మమును విస్తరించేవాడవు, శాశ్వతమైన వైభవములకు అధినాయకుడవు అయిన ఓ కపిలా! నా అంతులేని వ్యామోహమనే చీకటిని దూరం చేయడానికి నీవు కాక ఇతరు లెవరున్నారు?

870 ఓ మహాతపస్సంపన్నా! నిన్ను శరణు వేడుచున్నాను. నన్ను కాపాడు" అని దేవహూతి వినయంగా ప్రార్థించగా కపిలుడు సాటిలేని మేటి దయతో సజ్జనులకు మోక్షాన్ని ఇవ్వడానికి తగిన సాధనమైన తల్లి మాటలను అనురాగ పూర్వకంగా...

871 విని, మందహాస సుందర వదనారవిందుడై మనస్సులో సంతోషం అతిశయించగా పరమశాంతుడై కన్నతల్లితో ఇలా అన్నాడు.

872 "విను. గాఢమైన సంసారబంధానికీ మోక్షానికీ జీవుని చిత్తమే కారణం. అది సత్త్వరజస్తమోగుణాలతో సమ్మేళనం పొందినప్పుడు సంసారబంధానికి హేతువవుతుంది. ఇంకా...

873 ఆ చిత్తం శ్రీమన్నారాయణుని మీద సంసక్తమైనపుడు మోక్షానికి హేతువవుతుంది" అని మునికుల సాగరానికి చంద్రుని వంటివాడైన కపిలుడు తల్లికి కోరికతో వినిపించి, మళ్ళీ ఆప్యాయంగా ఇలా అన్నాడు.

874 "ఇంకా నేను నాది అనే అహంకార మమకార రూపమైన అభిమానంవల్ల కామం, క్రోధం, లోభం మొదలైన దోష సమూహాలు ఆవిర్భవిస్తాయి. చిత్తం వానికి లోనుగాకుండ వానినుండి విడివడినప్పుడు పరిశుద్ధ మవుతుంది. చిత్తం పరిశుద్ధమైనప్పుడు సుఖం,

దుఃఖం అనేవి ఉండక ఒకే రూపంగా వెలుగొందుతుంది. ఏకరూపమైన అటువంటి చిత్తంలోనే పరమాత్మ సాక్షాత్కరిస్తాడు. ఆ పరమాత్మ ప్రకృతికంటె అతీతుడు, స్వయంప్రకాశుడు, సూక్ష్మస్వరూపుడు, అపరిచ్ఛిన్నుడు, ఉదాసీనుడు. అటువంటి పరమాత్మనూ, ఆ పరమాత్మ తేజస్సువల్ల నిస్తేజమైన ప్రపంచాన్నీ యోగివరేణ్యులు భక్తిజ్ఞానవైరాగ్యాలతో కూడిన చిత్తంతో దర్శించినవారై మోక్షప్రాప్తికి సర్వాంతర్యామి అయిన శ్రీమన్నారాయణునియందు సమర్పింపబడిన భక్తి మార్గమే ఉత్తమోత్తమ మైనదని, తక్కిన మార్గాలు దానికి సాటిరావని చాటిచెప్పారు. ఇంద్రియార్థాలైన శబ్దస్పర్శరూపరసగంధాలతో కలయిక అసద్విషయమై, దృఢమైన బంధానికి కారణం అవుతుంది. ఆ సంగమమే భగవంతుని సంబంధమై సద్విషయమైనపుడు మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే అంతఃకరణాల సంయమనానికి హేతుభూతమై సత్పురుషులకు తెరిచిన మోక్షద్వారం అవుతుంది అని విద్వాంసుల అభిప్రాయం. సహన స్వభావం కలిగి, సమస్త జీవులకు ఆప్తబంధువులై, శాంతమూర్తులై, కరుణార్ద్రహృదయులై, కర్మఫలాలను పరిత్యజించి, తనవారు, బంధువులు అనే అభిమానం విడిచి, నన్ను చక్కగా ఆశ్రయించినవారై, నా గుణగణాలను ధ్యానిస్తూ, నా చరిత్రను వీనులవిందుగా ఆలకించి ఆనందిస్తూ, నా కథలే చెప్పుకొంటూ, నా కథలే వింటూ ఉండేవారు పరమ భాగవతోత్తములు. అటువంటి వారిని ఆధ్యాత్మికం, ఆధిదైవికం, ఆధిభౌతికం అనే తాపత్రయాలు ఏమీ చేయలేవు. అటువంటి సర్వసంగ పరిత్యాగులైన పరమభాగవతుల సాంగత్యం మాత్రమే కోరదగినది. అదే సకల దోషాలను నివారిస్తుంది. అటువంటివారి స్నేహంవల్ల సర్వప్రాణుల హృదయాలలో చెవులలో సుధారసం చిందించే నా కథాప్రసంగాలు ప్రాప్తిస్తాయి. నా గుణాలను వినడంవల్ల సక్రమమైన మార్గంలో శీఘ్రంగా మోక్షాన్ని ప్రసాదించే శ్రద్ధాభక్తులు ఉద్భవిస్తాయి. ఎవడు నేను చేసిన ఈ విశ్వసృష్టినీ, నా లీలావిహారాలనూ తలపోస్తూ అందువల్ల ప్రభవించిన భక్తిచేత ఇంద్రియ సుఖాలకూ, కనిపించేవీ వినిపించేవీ అయిన ఇహలోక పరలోక సుఖాలకూ లోనుకాకుండా, మనోనిశ్చలత్వం కోసం చక్కని యోగమార్గాన్ని అవలంబిస్తాడో అతడు యోగి అని చెప్పబడతాడు. అటువంటి యోగి ప్రకృతిగుణాలను అనుసరించటం వల్లనూ, వైరాగ్యాన్ని పెంపొందించే జ్ఞానయోగం వల్లనూ, ఆత్మార్పణ రూపమైన భక్తియోగం వల్లనూ సాక్షాత్కరించిన ఆత్మస్వరూపం గల నన్ను తన హృదయాంతరంలో నిలుపుకొంటాడు" అని కపిలుడు చెప్పగా విని దేవహూతి అతనితో ఇలా అన్నది.

875 "ఏ భక్తి నీ గుణగణాలకు అంకితమై సంసారపాపాలను పోగొట్టి శీఘ్రంగా మోక్షలక్ష్మిని చేకూరుస్తుందో ఆ భక్తి స్వరూపాన్ని నాకు బాగా తెలిసేటట్లు దయచేసి చెప్పు.

876 అంతేకాక నీచేత పేర్కొనబడిన యోగవిద్యనూ, అందలి విభాగాలనూ, అందులోగల తత్త్వార్థాలనూ సంపూర్ణంగా, సుస్పష్టంగా మందబుద్ధినైన నాకు తెలిసేలా వెల్లడించు" అనగా కపిలుడు ఇలా అన్నాడు.

877 "అమ్మా! సద్గుణసమూహం, యోగలక్షణాలు కలదానా! విను. సకలపదార్థాలకూ సంబంధించిన యథార్థస్వరూపాన్ని పూర్తిగా తెలియజేసేవి వేదాలు. వేదసంబంధమైన సత్కర్మలకూ సదాచారాలకూ దేవతలు సంతృప్తులౌతారు. సహజమూ నిర్హేతుకమూ అయిన భగవంతుని సేవారూపమైన భక్తి ముక్తికంటె గొప్పది. జీర్ణాశయమందలి జఠరాగ్ని తిన్న అన్నాన్ని జీర్ణం చేసినట్లుగా భగవద్భక్తి జీవులు కావించిన కర్మలనూ కర్మఫలాలనూ లోగొంటుంది. అందువల్ల జీవుని లింగమయ శరీరం నశిస్తుంది. విష్ణుభక్తి విశేషాలను వివరిస్తాను విను.

878 కొందరు మహాత్ములు నిర్మలమైన భక్తిభావంతో నా పాదపద్మాలను తమ హృదయపద్మాలలో పదిలపరచుకొని ఎంతో కుతూహలంతో పరస్పరం సంభాషించుకుంటూ ఆ సంభాషణలలో నా దివ్యస్వరూపాన్నీ, నా లీలావిశేషాలనూ కొనియాడుతూ ఉంటారు. వారు సర్వదా తమ సమస్త కర్మఫలాలనూ నాకే అర్పించి భక్తి పరవశులై ముక్తిని కూడా వాంఛింపరు.

879 కొందరు భాగవతోత్తములు ప్రసిద్ధికెక్కిన నా పురాణ స్వరూపాలను స్మరిస్తూ ఉంటారు. అందాలు చిందే ముఖమూ, కరుణారసం విరజిమ్మే అరుణనేత్రాలూ కలిగి భక్తులకు వరాలను ప్రసాదించే నా దివ్యావతారాలనూ వాని వైభవవిశేషాలనూ మనస్సులో నిలుపుకుంటారు. తమ భక్తియోగ మహత్త్వంవల్ల అలనాటి నా సంలాపాలను స్మరించుకొని కొనియాడుతుంటారు. నవనవోన్మేషమైన నా అవయవ సౌభాగ్యాన్నీ, సుందరమైన నా మందహాసాన్నీ, మనోహరాలైన నా మధురవాక్కులనూ మాటిమాటికీ మననం చేసుకుంటూ మనస్సూ, ప్రాణమూ పరవశింపగా మోక్షంమీద అపేక్ష లేకుండా ఉంటారు.

880 ఆ విధంగా మోక్షాసక్తి లేనివారై కూడా వారు అణిమాది అష్టసిద్ధి సంసేవితమూ, శాశ్వతానంద సంధాయకమూ, వర్ణనాతీతమూ, మహనీయమూ, సంపూర్ణ వైభవోపేతమూ, సకలలక్షణ సమేతమూ, మహోన్నతమూ అయిన వైకుంఠధామాన్ని పొందుతారు.

881 ఈవిధంగా పొంది...

882 అమ్మా! ఆ పుణ్యాత్ములు నా కాలచక్రానికి మ్రింగుడు పడనివారై నిరుపమానమైన నిత్య సౌఖ్యాలతో అలరారుతుంటారు. అది ఎలాగంటే...

883 సర్వసముడనైన నేను స్నేహంవల్ల కుమారుని వలెనూ, విశ్వాసంవల్ల చెలికాని వలెనూ, హితం కూర్చడంవల్ల ఆత్మీయుని వలెనూ, మంత్రం ఉపదేశించడంవల్ల ఆచార్యునివలెనూ ఉంటూ వారికి నిత్యమూ పూజింపదగిన ఇష్టదైవాన్నై, కాలచక్రం వల్ల భయం కలుగకుండా వారిని కాపాడుతూ ఉంటాను."

884 అని ఈవిధంగా చెప్తూ మళ్ళీ ఇలా అన్నాడు.

885 "ఇంకా విను. ఈ భువికీ దివికీ నడుమ పలుసారులు తిరుగుతూ ఉండే ఆత్మ ధనం, పశువులు, పుత్రులు, మిత్రులు, స్త్రీలు మొదలైన తగులాలపై వ్యామోహం విడిచిపెట్టి పాపాలను సంహరించేవాడనూ, ప్రపంచమంతటా వ్యాపించినవాడనూ అయిన నన్ను ఏకాగ్రచిత్రంతో ఆరాధించినట్లైతే ఆ మానవుని మృత్యుమయమైన సంసారసముద్రం నుండి తరింపజేస్తాను.

886 ప్రధానమనే మూలప్రకృతికీ, పురుషునకూ అధీశ్వరుడనూ, భగవంతుడనూ అయిన నన్ను కాకుండా ఇతరులను ఎన్నుకొన్నవారు సంసారభయంలో పడిపోతారు. కనుక నా ఆజ్ఞ జవదాటలేక భయంతో గాలి వీస్తుంది. అగ్ని మండుతుంది. సూర్యుడు ఎండ కాస్తాడు. ఇంద్రుడు వర్షిస్తాడు. మృత్యువు భయపడి పారిపోతుంది. అందువల్ల ఈ సృష్టి విజ్ఞానంతో పాటు వైరాగ్యంతో కూడిన భక్తియోగంతో యోగివరులైనవారు వైకుంఠాన్ని ఆశించి నా చరణాలను సంస్మరిస్తూ ఏ భయమూ లేకుండా ఉంటారు.

887 అత్యంత భక్తితో చిత్తాన్ని ఎంతవరకు నాయందే లగ్నంచేసి ఉంచుతారో అంతవరకు ఆ సత్పురుషులకు ఈలోకంలోనే మోక్షం సంప్రాప్తిస్తుంది."

888 అని కపిలాచార్యుడు విష్ణుసంబంధమైన భక్తియోగ స్వరూపాన్ని తల్లికి వినిపించి ఎంతో సంతోషంతో మళ్ళీ ఇలా అన్నాడు.

889 "అమ్మా! ఈవిధంగా భక్తియోగ స్వరూపం నీకు తెలిపాను. ఇక తత్త్వజ్ఞాన లక్షణాలను వేరువేరుగా తెలుపుతాను. ఏ తత్త్వజ్ఞాన లక్షణాలను తెలుసుకొన్న మానవులు ప్రకృతి గుణాలనుండి విముక్తు లవుతారో, మనస్సులోని సందేహాలు విడిపోయి స్వస్వరూపాన్ని తెలుసుకుంటారో, అటువంటి తత్త్వజ్ఞానం కైవల్యప్రాప్తికి కారణం అవుతుంది. అందువల్ల ఆత్మస్వరూపం ఎలాంటిదో చెపుతాను. అనాది యైనవాడూ, పురుషశబ్ద వాచ్యుడూ, సత్త్వరజస్తమోగుణాలు లేనివాడూ , ప్రకృతి గుణాలకంటె విలక్షణమైన గుణాలు కలవాడూ, ప్రత్యక్షస్వరూపం కలవాడూ, తనంతతాను వెలిగేవాడూ, విశ్వమంతటా ఉన్నవాడూ అయిన పరమాత్మ గుణత్రయాత్మకమూ, అవ్యక్తమూ, భగవంతుని అంటిపెట్టుకున్నదీ అయిన ప్రకృతిలో అప్రయత్నంగా అలవోకగా లీలగా ప్రవేశించాడు. ఆ ప్రకృతి గుణత్రయ మయమైన స్వరూపంతో సాకారమైన ప్రజాసృష్టి చేయటం ప్రారంభించింది. అది చూచి పురుషుడు వెంటనే

మోహాన్ని పొంది విజ్ఞానం మరుగుపడగా, గుణత్రయాత్మకమైన ప్రకృతిని ఆశ్రయించి, పరస్పరం మేళనం పొందారు. అప్పుడు పురుషుడు ప్రకృతి గుణాలను తనయందే ఆరోపించుకొని జరుగుతున్న కార్యాలన్నింటికీ తానే కర్తగా భావించుకొని సంసారబంధంలో కట్టుబడి పరాధీనతకు లోనవుతాడు. ఈశ్వరుడు కర్త కాకున్నా జరుగుతున్న కర్మలకు సాక్షీభూతుడు కావటంవల్ల ఆత్మకు కార్యకారణ కర్తృతాలు లేవనీ, అవి ప్రకృతికి అధీనమైనవనీ, సుఖదుఃఖాలు అనుభవించడం ప్రకృతికంటె విలక్షణుడైన పురుషునిదనీ అనుభజ్ఞులు తెలుసుకుంటారు" అని చెప్పగా విని దేవహూతి కపిలునితో "మహాత్మా! ప్రకృతి పురుషులు అస్తిత్వం కలదీ, అస్తిత్వం లేనిదీ అయిన ప్రపంచానికి కారణభూతులు. కాబట్టి ఆ ప్రకృతి పురుషుల లక్షణాలు సదసద్వివేక పురస్సరంగా సెలవీయ కోరుతున్నాను" అన్నది. అప్పుడు భగవంతుడైన కపిలుడు దేవహూతితో ఇలా అన్నాడు.

890 "త్రిగుణాత్మకం, అవ్యక్తం, నిత్యం, సదసదాత్మకం, ప్రధానం అనేవి ప్రకృతి విశేషాలు. ఈ విశేషాలతో కూడి ఉన్నది కనుక ప్రకృతిని విశిష్టం అని ప్రాజ్ఞులు పేర్కొన్నారు.

891 ఆ ప్రకృతి ఇరవై నాలుగు తత్త్వాలు కలదై ఉంటుంది. ఎలాగంటే పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ; శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే పంచ తన్మాత్రలూ; చర్మం, కన్ను, ముక్కు, చెవి, నాలుక అనే పంచ జ్ఞానేంద్రియాలూ; వాక్కు, చేతులు, కాళ్ళు, మలావయవం, మూత్రావయవం అనే పంచ కర్మేంద్రియాలూ; మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే అంతఃకరణ చతుష్టయమూ కలిసి ఇరవైనాలుగు తత్త్వాలు కలిగి సగుణబ్రహ్మకు సంస్థానం అయిన ప్రకృతిని వివరించాను. ఇక కాలం అనే ఇరవై ఐదవ తత్త్వాన్ని గురించి చెబుతాను. కొందరు పురుష శబ్ద వాచ్యుడైన ఈశ్వరుని స్వరూపమే కాలంగా చెప్పబడుతున్నదంటారు. అహంకార మోహితుడై ప్రకృతితో సంబంధం పెట్టుకున్న పురుషుడు జీవుడై భయాదులను అనుభవిస్తాడు. ప్రకృతి గుణాలన్నింటిలో సమానంగా అంతర్యామియై నిర్విశేషుడై ప్రవర్తించే భగవంతుని చేష్టా విశేషాలను కలుగచేసేదే కాలం అనబడుతుంది. అదికూడా జీవరాసులలో అంతర్యామిగా ఉన్నప్పుడు పురుషుడు అనీ, వానికి వెలుపల వ్యాపించి ఉన్నపుడు కాలం అనీ అనబడుతుంది. ఆత్మమాయ కారణంగా ప్రకృతి తత్త్వాలలో విలీనమైన జీవునివల్ల కదిలింపబడినదీ, జగత్తుకు కారణమైనదీ అయిన ప్రకృతియందు భగవంతుడు సృజనాత్మకమైన తన వీర్యాన్ని ఉంచగా ఆ ప్రకృతి తనలోనుంచి హిరణ్మయమైన మహత్త్వాన్ని పుట్టించింది. అనంతరం సకల ప్రపంచానికి మూలమైనవాడూ, లయవిక్షేప శూన్యుడూ అయిన ఈశ్వరుడు తన సూక్ష్మవిగ్రహంలో

ఆత్మగతమైన మహదాది ప్రపంచాన్ని వెలిగిస్తూ, తన తేజఃప్రసారం చేత తనను నిద్రింపజేసే తమస్సును హరించి వేశాడు" అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు.

892 "వాసుదేవం, సంకర్షణం, ప్రద్యుమ్నం, అనిరుద్ధం అనే దివ్యమైన ఈ నాలుగు వ్యూహాలూ ముల్లోకాలలోనూ సేవింపదగినవి. సుగుణవతీ! వాటిని నీకు వివరించి చెబుతాను.

893 వాసుదేవవ్యూహం ఆకలిదప్పులు, శోకమోహాలు, జరామరణాలు అనే ఆరు ఊర్ములనుండి విడివడినదై ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం అనే షడ్గుణాలతో పరిపూర్ణమై సత్త్వగుణ ప్రధానమై, నిర్మలమై, శాంతమై, నిత్యమై, భక్తజన సంసేవ్యమై అలరారుతూ ఉంటుంది. మహత్తత్త్వం నుండి క్రియాశక్తి రూపమైన అహంకారం పుట్టింది. ఆ అహంకారం వైకారికం, తైజసం, తామసం అని మూడు విధాలుగా విడివడింది. వానిలో వైకారికాహంకారం అనేది మనస్సుకూ, పంచేంద్రియాలకూ, అకాశాది పంచభూతాలకూ...

894 ఉత్పత్తి స్థానమై దేవతారూపమై ఉంటుంది. తైజసాహంకారం బుద్ధిరూపాన్నీ, ప్రాణరూపాన్నీ కలిగి ఉంటుంది. తామసాహంకారం ఇంద్రియార్థాలతో సమ్మేళనం పొంది ప్రయోజనమాత్రమై ఉంటుంది. ఇంకా...

895 వైకారికమైన సాత్త్వికాహంకారాన్ని అధిష్ఠించి సంకర్షణ వ్యూహం ఒప్పుతుంటుంది. వేయి పడగలతో ప్రకాశించేవాడూ, అనంతుడూ అయిన సంకర్షణ పురుషుడు మహానుభావుడై పంచభూతాలతో, పంచేంద్రియాలతో, మనస్సుతో నిండి ఉంటాడు. కర్త, కార్యం, కారణం అనే రూపభేదాలు కలిగి శాంతత్వం, ఘోరత్వం, మూఢత్వం మొదలైన లక్షణాలతో ఉల్లాసంగా ఉంటాడు. ఈ మేటి వ్యూహమే రెండవదైన సంకర్షణ వ్యూహం. దీనినుంచే మనస్తత్త్వం పుట్టింది.

బ్రహ్మాండోత్పత్తి

896 అది ఎలాగంటే ఈ మనస్తత్త్వానికి చింతనం సహజం. ఆ చింతనం సామాన్య చింతనం, విశేష చింతనం అని రెండు విధాలు. వీనినే క్రమంగా సంకల్పం, వికల్పం అని పేర్లు. ఈ సంకల్ప వికల్పాల వల్లనే సృష్టిలోని వస్తువులు వేరువేరు లక్షణాలతో మనకు కనిపిస్తాయి. వీనివల్లనే వివిధ కామాలు ఉత్పన్నమౌతాయి. కనుకనే ఇది ప్రద్యుమ్న వ్యూహం అని చెప్పబడుతుంది. ఇక అనిరుద్ధ వ్యూహం సంగతి చెబుతాను. ఇదే ఇంద్రియాలన్నిటికి అధీశ్వరమై, (హృషీకేశుడై,) యోగీంద్రు లందరకు సంసేవ్యమై, శరత్కాల మందలి నల్లకలువ వలె శ్యామల వర్ణంతో విరాజిల్లుతూ ఉంటుంది. తైజసాహంకారం వల్ల బుద్ధితత్త్వం పుట్టింది. ద్రవ్యాన్ని ప్రకాశింపజేసే జ్ఞానం, ఇంద్రియానుగ్రహం, సంశయం, మిథ్యాజ్ఞానం, నిద్ర, నిశ్చయం, స్మృతి అనేవి బుద్ధితత్త్వ లక్షణాలు. ఈ తైజసాహంకారం వల్లనే ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు

కర్మేంద్రియాలు, క్రియాజ్ఞాన సాధనాలు ఏర్పడుతాయి. ఈ తైజసాహంకారం వల్లనే ప్రాణానికి సంబంధించిన క్రియాశక్తి, బుద్ధికి సంబంధించిన జ్ఞానశక్తి కలుగుతాయి. ఈ రెండు శక్తులూ కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను పనిచేయిస్తాయి. భగవద్భక్తివల్ల ప్రేరేపించబడిన తామసాహంకారంనుండి శబ్దతన్మాత్రం పుట్టింది. ఈ శబ్ద తన్మాతంనుండి ఆకాశం పుట్టింది. ఆకాశం నుండి శ్రోత్రేంద్రియం (చెవి) పుట్టింది. శ్రోత్రం శబ్దాన్ని గ్రహిస్తుంది. అదే శబ్దం అర్థానికి ఆశ్రయమై శబ్దం వినేవానికి జ్ఞానజనకం అవుతున్నది. ఈ శబ్దతన్మాత్రం వల్ల ఆకాశం ఏర్పడింది. ఈ ఆకాశం సకల జీవులకు లోపల వెలుపల అవకాశం ఈయటమే కాక ఆత్మకూ, ప్రాణాలకూ, ఇంద్రియాలకూ ఆశ్రయంగా ఉంటుంది. కాలగమనం వల్ల మార్పు చెందే శబ్దతన్మాత్ర లక్షణమైన ఆకాశం వల్ల స్పర్శమూ, స్పర్శంవల్ల వాయువూ, ఆ వాయువువల్ల స్పర్శను గ్రహించగల చర్మమూ పుట్టి స్పర్శజ్ఞానాన్ని కలిగించింది. మెత్తదనం, గట్టిదనం, చల్లదనం, వెచ్చదనం ఇవి స్పర్శజ్ఞానానికి లక్షణాలు. వాయువునకు కదలుట, కదలించుట, వేరుచేయుట, కలుపుట, ద్రవ్యనేతృత్వం, శబ్దనేతృత్వం, సర్వేంద్రియాత్మకత్వం అనేవి లక్షణాలు. గంధంతో కూడిన ద్రవ్యాలను ఆఘ్రాణింపజేయటం ద్రవ్యనేతృత్వం. దూరంగా ఉన్న శబ్దాన్ని చెవికి వినిపింప జేయటం శబ్దనేతృత్వం. భగవత్ప్రేరణతో స్పర్శతన్మాత్రం వల్ల పుట్టిన వాయువువల్ల రూపం పుట్టింది. ఈ రూపం వలన తేజస్సు కలిగింది. నేత్రేంద్రియం వల్ల గ్రహింపదగింది రూపం. నేత్రాన్ని పొందిన రూపానికి అనగా కనుపించునటువంటి ఆకారానికి వృత్తులు ఉపలంభకత్వం (అనుభవం కలుగడం), ద్రవ్యాకారసమత్వం (ద్రవ్యంయొక్క ఆకారాన్ని ఉన్నదున్నట్లుగా చూపడం), ద్రవ్యోపసర్జనం (ద్రవ్యం అప్రధానం కావడం), ద్రవ్యపరిణామ ప్రతీతి (ద్రవ్యంయొక్క మార్పు తెలియడం). ఇక తేజస్సుకు సాధారణాలైన ధర్మాలు ద్యోతం, పచనం, పిపాస, ఆకలి, చలి. ద్యోతానికి ప్రకాశం, పచనానికి బియ్యం మొదలైన పాకం, పిపాసకు పానం, ఆకలికి ఆహారం, చలికి శోషణం అనేవి వృత్తులు. దైవప్రేరితమై మార్పు చెందిన తేజస్సువల్ల రసతన్మాత్రం పుట్టింది. ఈ రసతన్మాత్ర వల్ల జలం పుట్టింది. జిహ్వ అనే పేరుగల రసనేంద్రియం రసాన్ని గ్రహించేది అయింది. ఆ రసం ఒకటే అయినా ద్రవ్యాల కలయికలోని మార్పువల్ల వగరు, చేదు, కారం, పులుపు, తీపి, ఉప్పు అనే రుచులుగా మారి వాటి కలయిక వల్ల ఇంకా అనేకవిధాలుగా మార్పు చెందింది. తనలో చేరిన ద్రవ్యాల మార్పులనుబట్టి ఆర్ద్రం కావడం, ముద్ద గట్టడం, తృప్తినివ్వడం, జీవనం, అందలి మాలిన్యాన్ని నివారించడం, మెత్తపరచడం, తాపాన్ని పోగొట్టడం, బావిలో జలలు ఏర్పడి అడుగున ఉన్న జలం పైకెగయడం అనేవి ఈ జలవృత్తులు. రసతన్మాత్రవల్ల దైవప్రేరణతో మార్పుచెందిన

జలంనుండి గంధతన్మాత్రం పుట్టింది. ఈ గంధతన్మాత్రం వలన పృథ్వి (భూమి) ఏర్పడింది. ఘ్రాణేంద్రియం (ముక్కు) గంధాన్ని గ్రహించేదయింది. ఈ గంధం ఒకటే అయినా ఇంగువ మొదలైన పదార్థాలతో కలిసిన కారణంగా మిశ్రమగంధం అనీ, నిలువ ఉన్న పెరుగు ముద్ద, జంతుమాంసం మొదలైన వానితో కలిసినప్పుడు దుర్గంధం అనీ, కర్పూరం మొదలైనవానితో కలిసినపుడు సుగంధం అనీ, తామరపూలు మొదలైన వానితో కలిసినపుడు శాంతగంధం అనీ, వెల్లుల్లి మొదలైన వానితో కలిసినపుడు ఉగ్రగంధం అనీ, పాసిపోయిన చిత్రాన్నం వంటి వాటితో కలిసినపుడు ఆమ్లగంధం అనీ వేరువేరు పదార్థాలతో కలిసినపుడు మరెన్నో విధాలుగా పేర్కొనబడుతుంది. భూమికి సంబంధించిన సాధారణ ధర్మాలు ఏవనగా ప్రతిమల రూపాన్నీ వాటి ఆకారాలనూ నిలుపుకోవడం, జలం మొదలైన వాటితో అవసరం లేకుండా స్వతంత్రంగా నిలబడగలగటం, జలాదులకు తాను ఆధారమై ఉండటం, ఆకాశం, వాయువు, తేజస్సు, బలం వీనిని విభజించడం, సకల జీవరాసులకు దేహంగా పనిచేయటం అనేవి పృథ్వీవృత్తులు" అని చెప్పి కపిలుడు ఇంకా ఇలా అన్నాడు. "పంచభూతాలకు సాధారణ ధర్మాలు విన్నావు. ఇవికాక వానికి సంబంధించిన అసాధారణ ధర్మాలు విను. ఆకాశానికి అసాధారణగుణం శబ్దం. దీనిని శ్రవణేంద్రియం గ్రహిస్తుంది. వాయువుకు అసాధారణగుణం స్పర్శం. దీనిని త్వగింద్రియం గ్రహిస్తుంది. తేజస్సుకు అసాధారణగుణం రూపం. దీనిని నేత్రేంద్రియం గ్రహిస్తుంది. జలానికి అసాధారణగుణం రసం. దీనిని జిహ్వేంద్రియం గ్రహిస్తుంది. పృథివికి అసాధారణగుణం గంధం. దీనిని ఘ్రాణేంద్రియం గ్రహిస్తుంది. ఆకాశం మొదలైన అన్నింటితో సంబంధం ఉండడం వల్ల భూమికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అసాధారణ గుణాలు అయినాయి. మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు అనే ఈ ఏడు తత్త్వాలు ఒకదానితో ఒకటి కలిసి భోగానుభవానికి పాత్రుడైన పురుషుని కల్పించటానికి అసమర్థంగా ఉన్న ఆ సమయంలో కాలస్వరూపుడూ అంతుపట్టని అస్తిత్వం కలవాడూ, జగత్కారణుడూ, సత్త్వరజస్తమోగుణాలకు అతీతుడూ, సమస్తాన్ని నియమించేవాడూ, నిరంజనాకారుడూ అయిన సర్వేశ్వరుడు పైన చెప్పబడిన పురుషునిలో ప్రవేశించాడు. అప్పుడు ఒకదానితో ఒకటి కలగాపులగమై ఘర్షణ పొంది కలిసిపోయిన మహదాదుల వలన అధిష్ఠాతయైన భగవంతుని చైతన్యం కోల్పోయిన ఒక అండం పుట్టింది.

897 ఆ అండంలో మహత్తరమైన శక్తితో విరాట్పురుషుడు విరాజిల్లుతూ ఉంటాడు. ఆ అండాన్ని పొదువుకొని పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, అహంకారం, మహత్తు అనే ఆవరణాలు ఒకదానికంటె ఒకటి పదింతల ప్రమాణం కలిగి ఉంటాయి. లోకాలకు మేల్కట్టు చాందినీలవలె ఒప్పియున్న ఆ పొరలలో నుంచి విష్ణుదేవుని తేజస్సు ప్రకాశిస్తూ

ఉంటుంది. జలంతో తేలుతూ ఉన్న బంగారుమయమైన ఆ అండంలో మహానుభావుడు, అభవుడు, శ్రీహరి, దేవదేవుడు, విశ్వవిజేత అయిన నారాయణుడు ప్రవేశించి గగనమండలాన్ని భేదించి వేస్తాడు.

విరాట్పురుష ప్రకారంబు

898 ఆ అండంలో విరాట్పురుషుడు వెలుగుతూ ఉంటాడు. అతని ముఖం నుండి వాణి, వాణితోపాటు అగ్ని పుట్టాయి. ముక్కునుండి ప్రాణాలు, ఘ్రాణేంద్రియం పుట్టాయి. ఘ్రాణేంద్రియం నుండి వాయువులు, ప్రాణవాయువులు ఆవిర్భవించాయి. ప్రాణవాయువుల వల్ల కన్నులు, కన్నులవల్ల సూర్యుడు పుట్టారు. వానియందు ధ్యాన మేర్పడగా చెవులు పుట్టాయి. వానివల్ల శ్రోత్రేంద్రియం దిక్కులూ పుట్టాయి. చర్మంనుండి గడ్డం, మీసాలు మొదలగు రోమసమూహమూ, ఓషధులూ జనించాయి. ఇంకా...

899 చర్మం వలన మూత్రావయవం పుట్టింది. దానినుండి రేతస్సు పుట్టింది. రేతస్సువల్ల జలం పుట్టింది. దానివల్ల అపానం పుట్టింది. దానివల్ల మృత్యువు పుట్టింది.

900 విరాట్పురుషుని చేతులవల్ల బలం, చేతుల బలంవల్ల ఇంద్రుడు, పాదాలవల్ల గమనం, పాదగతులవల్ల ఉపేంద్రుడు ఉద్భవించటం జరిగింది.

901 విరాట్పురుషుని నాడులవల్ల రక్తమూ, రక్తంవల్ల నదులూ, జఠరం వల్ల ఆకలిదప్పులూ, ఈ రెండింటివల్ల సముద్రాలు పుట్టాయి.

902 విరాట్పురుషుని హృదయంవల్ల మనస్సూ, మనస్సువల్ల చంద్రుడూ, బుద్ధీ, చిత్తంవల్ల బ్రహ్మ, క్షేత్రజ్ఞుడు కలిగారు. ఇలా ఆ అండం నుండి సృష్టికారకుడైన పురుషుడు పుట్టాడు.

903 ఇంకా విరాట్పురుషునిలో జన్మించిన ఆకాశం మొదలైన పంచభూతాలూ, శబ్దం మొదలైన పంచతన్మాత్రలూ, వాక్కు మొదలైన ఇంద్రియాలూ, ఆ ఇంద్రియాల అధిదేవతలూ వేరువేరుగా ఉండిపోయాయి. అవి తమలో తాము సమైక్యం పొందనందువల్ల జీవుణ్ణి ప్రవర్తింపజేయలేక పోయాయి. ఆ యా దేవతలు అధిష్ఠించిన ఇంద్రియాలు, తాము ప్రత్యేకంగా క్షేత్రజ్ఞుని లోకవ్యవహారానికి ప్రేరేపింపజాలక వరుసగా ఆయా స్థానాలలో ఉండిపోయాయి. విరాట్పురుషుని ముఖాన అగ్ని వాగింద్రియంతో కూడి వర్తించి నప్పటికీ విరాట్పురుషుని కార్యమైన ఇతరేతర జీవుల శరీరోత్పత్తి కలుగలేదు. అట్లే విరాట్పురుషుని నాసికలో వాయువు జ్ఞానేంద్రియంతో వర్తించినప్పటికీ జీవోత్పత్తి కాలేదు. అదే విధంగా కన్నులలో సూర్యుడు చక్షురింద్రియంతో కూడి వర్తించినా వ్యర్థమే అయింది. అలాగే చెవులలో దిక్కులు శ్రోత్రేంద్రియంతో కూడినప్పుడు కూడ విరాట్పురుషుని కార్యం సాధించటంలో వృథా అయ్యాయి. రోమాలలో త్వగింద్రియంతో ఓషధులు వర్తించి విఫలమయ్యాయి. అలాగే జలం అధిదేవతగా కల

పురుషాంగం రేతస్సును పొందికూడా సృష్టికి సమర్థం కాలేదు. మలావయవం మృత్యువుతోకూడి అపానేంద్రియాన్ని చేరి నిరర్థకమే అయింది. హరిదేవతాకాలైన పాదాలు గతితో కూడి శక్తిహీనాలు అయ్యాయి. ఇంద్రదేవతాకాలైన చేతులు బలాన్ని పొంది కూడా నిరుపయోగాలైనాయి. నదీ దేవతాకాలైన నాడులు రక్తంతో కూడినప్పటికీ నిరర్థకాలైనాయి. కడుపు సముద్రాలతో కూడి ఆకలిదప్పులను పొందినప్పటికీ నిష్ప్రయోజనమైంది. హృదయం మనస్సుతో చంద్రుణ్ణి పొందికూడా ఊరక ఉంది. అట్లే బుద్ధి హృదయాన్ని పొందినప్పటికీ, చిత్తం రుద్రుణ్ణి చెందినప్పటికీ విరాట్పురుషుని కార్యాలు ఉత్పన్నం కాలేదు. అనంతరం అన్నిటికీ సమైక్యం కుదుర్పగల క్షేత్రజ్ఞుడు హృదయాన్ని అధిష్ఠించి, చిత్తంలో ప్రవేశించాడు. అప్పుడు విరాట్పురుషుడు, జలాలలో తేలుతున్న బ్రహ్మాండాన్ని అధిష్ఠించి సృష్టికార్యాన్ని ప్రవర్తింప గలిగాడు. నిద్రించిన జీవుని ప్రాణాలు మొదలైనవి తమ సొంతబలంతో కదలాడలేవు. లేవటానికి సమర్థాలు కావు. ఆ విధంగా అగ్ని మొదలైనవి తమకు అధిష్ఠానాలైన ఇంద్రియాలతో దేవాది శరీరాలు పొందికూడా, అవి శక్తిహీనా లయ్యాయి. క్షేత్రజ్ఞుడు ప్రవేశించగానే మెలకువ వచ్చినట్లు ఆయా శరీరభాగాలు పనిచేయటం ప్రారంభించాయి. అటువంటి విరాట్పురుషుని ఎడతెగని భక్తితో వివేకం కలిగి విరక్తులైన మహాత్ములు ధ్యానిస్తారు. ప్రకృతి, పురుషుల యథార్థజ్ఞానం వల్ల మోక్షమూ, కేవలం ప్రకృతి సంబంధంతో సంసారబంధమూ కలుగుతుంది" అని చెప్పి కపిలుడు దేవహూతితో మళ్ళీ ఇలా అన్నాడు.

ప్రకృతి పురుష వివేకంబు

904 "జనులచే స్తుతింపబడేదానా! సత్త్వరజస్తమో గుణాలతో నిండి, ప్రకృతి వల్ల ఏర్పడిన శరీరాన్ని ఆశ్రయించి కూడ పురుషుడు ప్రకృతి సంబంధమైన సుఖదుఃఖ మోహాలకు లోనుగాడు. ఎటువంటి వికారాలు లేకుండా, త్రిగుణాలకు అతీతుడై, తేటనీటిలో ప్రతిబింబించిన సూర్యబింబాన్ని ఆ జలం అంటని విధంగా సత్త్వరజస్తమో గుణాలు పురుషుణ్ణి స్పృశింపలేవు. అలా కాకుండా జీవుడు ప్రాకృతిక గుణాలలో చిక్కుకున్నట్లయితే ఈ జరుగుతున్న అన్ని సన్నివేశాలకు నేనే కర్తనని అహంకారంతో వ్యామోహంతో ప్రవర్తిస్తాడు. అతిశయమైన సంగం వల్ల అతడు ప్రకృతి దోషాలు పొంది....

905 సుర నర పశు పక్షి వృక్షాది నానావిధ యోనులందు జన్మించి కర్మవాసనలను విస్తరింపజేసికొని సంసార బంధాలలో చిక్కుపడి...

పూని చరించుచు విషయ
ధ్యానంబునఁజేసి స్వాప్నికార్థాగమ సం
ధానము రీతి నసత్పథ
మానసుఁ డగుచున్ భ్రమించు మతిలోలుండై.

906 చరిస్తూ, విషయసుఖాలను స్మరిస్తూ, కలలో కనిపించే ఐశ్వర్యాల వంటి సుఖాలలో మునిగి తేలుతూ ఉంటాడు. అతని మనస్సు చెడుమార్గాలలో ప్రవర్తిసుంది. అతడు చంచలబుద్ధితో భ్రమిస్తూ ఉంటాడు.

907 అందుచేత.

908 మోక్షంపై ఆసక్తి కలవాడు అఖండమైన భక్తియోగాన్ని అవలంబించాలి. విషయసుఖాలమీద విరక్తుడు కావాలి. యమం నియమం మొదలైన యోగమార్గాలను అభ్యసించి మనస్సును వశపరచుకొని...

909 చలించని శ్రద్ధాసక్తులతో నాయొక్క సత్యస్వరూపాన్ని తెలుసుకోవాలి. నా పాదాలు సేవించాలి. నా కథలను ఆకర్ణించాలి. సర్వజీవులయందు సమబుద్ధితో ప్రవర్తిందాలి. ఎవ్వరితోను వైరం లేకుండా ఉండాలి. బ్రహ్మచర్యం, మౌనం మొదలైన ఆత్మధర్మాలను అవలంబించాలి. ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలి. మితంగా భుజించాలి. ఏకాంతంగా ఉండాలి. మననశీలుడై ఉండాలి. మాత్సర్యాన్ని దూరం చేసుకోవాలి. మైత్రి, కరుణ అభ్యసించాలి. ఆత్మజ్ఞానం అలవరచుకోవాలి. తన శరీరం మీద, ఆత్మీయులైనవారి మీద ఆసక్తి తగ్గించుకోవాలి. అవి బంధనానికి హేతువు లవుతాయి. ఇంకా...

910 జీవేశ్వరుల యథార్థస్వరూపం (త్రిగుణాత్మకమైన ప్రకృతిలో చిక్కుకొన్నవాడు జీవుడనీ, త్రిగుణాలకు అతీతుడై వానిని నడిపించేవాడు ఈశ్వరుడనీ) తెలుసుకొనడంవల్ల బుద్ధి అంతర్ముఖ మౌతుంది. అందువల్ల బుద్ధియందలి సంకల్ప వికల్పాల క్రమం తెలుస్తుంది. అప్పుడు ఇతర పదార్థాలేవీ కన్పించవు. జీవాత్మజ్ఞానంతో కంటితో సూర్యుణ్ణి చూచినంత సూటిగా ఆత్మనాయకుడైన శ్రీమన్నారాయణుని దర్శనం లభిస్తుంది. అప్పుడు అహంకారానికి తావుండదు. అది మిథ్యాభూతమై తొలగిపోతుంది. సత్యం ప్రకాశమాన మవుతుంది. అందువల్ల ప్రధానకారణమైన మూలప్రకృతికి ఆధారమూ, సమస్త సృష్టినీ దృష్టివలె ప్రకాశింప చేసేదీ, విశ్వంలోని సమస్త కార్యకారణాలకూ మూలభూతమూ, పరిపూర్ణమూ, సర్వాంతర్యామి అయిన పరబ్రహ్మాన్ని పొందగలుగుతాడు" అని చెప్పి కపిలుడు ఇంకా ఇలా అన్నాడు.

911 "అమ్మా! విను. ఆత్మస్వరూపం తెలిసినవానికి పరమాత్మ స్వరూపం తెలుస్తుంది. ఎలాగంటే ఆకాశంలోని సూర్యుని కిరణాలు నీళ్ళలోనూ, ఇంటిగోడలలోని కిటికీసందులలోను ప్రసరించటం వల్ల సూర్యుడున్నట్లు మనం తెలుసుకుంటాము. మనస్సు బుద్ధి అహంకారం అనే ఈ మూడింటిలో ప్రసారమయ్యే ప్రకాశం ద్వారా పరమాత్మ స్వరూపాన్ని పరిపూర్ణంగా గుర్తించవచ్చు. చరాచర ప్రపంచంలో అంతర్యామిగా ఉండే ఆ మహామూర్తి ఆత్మవేత్తలైన మహాత్ముల అంతరంగాలలో అఖండ శోభావైభవంతో దర్శనమిస్తాడు. ఇంకా...

912 జీవుడు సుషుప్తిలో భగవంతునితో ప్రగాఢమైన సంబంధం కలిగి ఉంటాడు. వానియందలి పంచభూతాలు మొదలైన తత్త్వాలు ప్రకృతిలో విలీనాలై సంస్కార మాత్రంగా ఉంటూ, తమ పనులను చేయలేని స్థితిలో ఉంటాయి. ఆ సమయంలో సాధకుని ఆత్మ తానుమాత్రం మేల్కొని ఉండి ఎటువంటి అవరోధం లేనిదై పరమాత్మను భావన చేస్తూ ఉంటుంది" అని చెప్పగా విని దేవహూతి కపిలునితో ఇలా అన్నది.

913 "పుణ్యాత్మా! పంచభూతాలలో పృథివికి, గంధానికి, జలానికి, రసానికి అన్యోన్యమైన అవినాభావ సంబంధం ఎలా ఉన్నదో అదే విధంగా ప్రకృతికి, ఆత్మకు ఎల్లప్పుడు పరస్పర సంబంధం ఉంది కదా! అటువంటప్పుడు ప్రకృతి ఆత్మను ఎలా విడిచి పెట్టగలుగుతుంది? ఒక్కసారి కలిగిన తత్త్వజ్ఞానంవల్ల సంసారభయాలు ఎలా తొలగిపోతాయి? చచ్చిన తర్వాత మళ్ళీ పుట్టకుండా ఉండే మార్గం ఏది? ఇవన్నీ నాకు బాగా తెలిసేటట్లు చెప్పు. దేవతలచే సేవింపబడేవాడా! భక్తజన శరణ్యా! పరమపురుషా! దయతో ఈ జ్ఞానం నాకు కటాక్షించు. నన్ను రక్షించు."

914 దేవహూతి ఇలా ప్రశ్నించగా భగవంతుడైన కపిలుడు ఇలా అన్నాడు. "సాధకుడైన పురుషుడు ఎటువంటి ఫలాన్ని కోరకుండా తన ధర్మాలను తాను నిర్వర్తిస్తూ ఉండాలి. తన మనస్సును ఎల్లప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలి. నాయందు అచంచలమైన భక్తి కలిగి ఉండాలి. పుణ్యకథలను ఆసక్తితో వినాలి. ప్రకృతి పురుష సంబంధమైన యథార్థజ్ఞానాన్ని అవగతం చేసుకోవాలి. కోరికలను దూరంగా పారద్రోలి వైరాగ్యాన్ని పెంపొందించుకోవాలి. తపస్సుతో కూడిన యోగాభ్యాసం చేయాలి. అఖండమైన ఏకాగ్రతను అవలంభించాలి. ఈ సాధనవల్ల పురుషుని అంటుకొని ఉన్న ప్రకృతి దందహ్యమానమై అదృశ్యమైపోతుంది. అరణినుంచి ఉదయించిన అగ్ని అరణిని కాల్చి వేసినట్లు జ్ఞానం వల్లనూ, తత్త్వదర్శనం వల్లనూ పటిష్ఠమూ బలిష్ఠమూ దోషభూయిష్ఠమూ అయిన ప్రకృతిని అనుభవిస్తున్న జీవుడు సగంలోనే మొగం మొత్తి పరిత్యాగం చేస్తాడు" అని చెప్పి (ఇంకా ఇలా అన్నాడు).

915 "అమ్మా! విను. ప్రకృతి తన సహజ ప్రభావం వల్ల తనకు అధీశ్వరుడై తనలో ప్రవర్తించే పురుషునకు అమంగళాన్నీ, అనర్థాన్నీ ఆచరించలేదు.

916 ఓ ఉత్తమనారీ! మానవుడు నిద్రపోతున్నపుడు పీడకలలలో పొందే కష్టనష్టాలు మేలుకొనగానే అసత్యాలని తెలుసుకుంటాడు. అదే విధంగా ఆత్మనాథుడూ, కర్మసాక్షీ అయిన పరమేశ్వరునకు ప్రకృతికి సంబంధించిన దోషాలు ఎన్నటికీ అంటవు"

917 అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

918 "పుణ్యాత్మురాలా! ఆత్మజ్ఞాన సంపన్నుడైనవాడు బ్రహ్మపదం ప్రాప్తించే వరకు ఎంతకాలమైనా ఎన్ని జన్మలైనా ఎత్తుతూనే ఉంటాడు. వాని వైరాగ్యం చెక్కు చెదరదు. నా

భక్తులు ఉపదేశించిన విజ్ఞాన సంపదవల్ల ప్రబోధం పొందినవాడై ఎన్నో మారులు నా అనుగ్రహానికి పాత్రుడవుతూ ఉంటాడు. తాను పొందిన ఆత్మజ్ఞానంతో తన సందేహాలన్నింటినీ పోగొట్టుకుంటాడు. లింగదేహాన్ని విడిచిపెట్టి యోగిపుంగవుల అంతరంగాలకు సంభావ్యమైన నా దివ్యధామాన్ని తేజస్వియై చేరుకొంటాడు.

919 ఇంకా అణిమ గరిమ మొదలైన అష్టసిద్ధులు మోక్షానికి విఘ్నాన్ని కలిగిస్తాయి. అందువల్ల వాటిమీద మమకారాన్ని వదలిపెట్టి నా పాదపద్మాలను హృదయంలో పదిలపరచుకున్నవాడు మృత్యువును తిరస్కరించి మోక్షాన్ని పొందుతాడు" అని చెప్పి "ఇక యోగలక్షణాల విధానాలను వివరిస్తాను. విను'" అని భగవంతుడైన కపిలుడు దేవహూతితో ఇలా అన్నాడు.

920 "బుద్ధిమంతులై ఏ యోగమార్గంవల్ల తమ మనస్సును మరింత పరిశుద్ధం చేసికొని మాననీయమైన నా సన్నిధిని చేరుకుంటారో ఆ యోగధర్మాలను చెప్తాను విను.

921 అది ఎలాగంటే తన శక్తి వంచన లేకుండా తన ధర్మాలను తాను ఆచరించడం, శాస్త్రాలలో నిషేధింపబడిన కర్మలను మానడం, దైవికంగా అనగా తన ప్రయత్నం లేకనే లభించిన ధనంతో సంతోషించడం, మహాత్ములైన భగవద్భక్తుల దివ్యపాదపద్మాలను సేవించడం, ఇతరులకు ఏవగింపు కలిగించే పనులను మానుకొనడం, మోక్షధర్మాలైన శాంతి అహింస మొదలైన విషయాలపైన ఆసక్తి కలిగి ఉండటం, పరిశుద్ధమైన ఆహారాన్ని మితంగా తినడం, ప్రశాంతమై ఇబ్బందిలేని ఏకాంతప్రదేశంలో నివాసం చేయడం, హింస చేయకుండా ఉండడం, సత్యమార్గాన్ని తప్పక పోవడం, ఇతరుల వస్తువులను దొంగిలించకుండా ఉండడం, తనకు ఎంత అవసరమో అంతవరకే ధనం గ్రహించడం, బ్రహ్మచర్యాన్ని పాటించడం, తపశ్శౌచాలు కలిగి ఉండడం, సద్గ్రంథాలు చదవడం, సర్వేశ్వరుణ్ణి పూజించడం, మౌనంగా ఉండడం, ఎక్కువకాలం అనుకూలమైన పద్ధతిలో భగవంతుని ధ్యానిస్తూ కూర్చోవడం, ఈ ఆసనవిజయం వల్ల స్థిరత్వం సంపాదించడం, ప్రాణవాయువును స్వాధీనం చేసుకోవడం, ఇంద్రియాలను విషయాలనుండి నిగ్రహించడం, ఇంద్రియాల నుండి మరలిన మనస్సునందు హృదయాన్ని నిల్పడం, దేహమందున్న మూలాధారం మొదలైన స్థానాలలో ఏదో ఒక స్థానమందు హృదయంలో కల మనస్సుతో కూడా ప్రాణధారణ చేయడం, శ్రీమన్నారాయణుని దివ్య చరిత్రలోని లీలలను ధ్యానించడం, మనస్సును ఏకాగ్రంగా ఉంచుకోవడం, పరమాత్మ అయిన పద్మనాభుడు అంతటా నిండి ఉన్నాడని విశ్వసించడం ఇత్యాదులు యోగధర్మాలు. ఇవే కాకుండా ఇతర వ్రతాలను, దానాలను ఆచరించాలి. మనోమాలిన్యంతో కూడిన చెడుమార్గాలను విడిచిపెట్టాలి. ప్రాణాయామపరుడై చక్కగా ఆలోచించి శుచియైన ప్రదేశంలో ఎటువంటి ఆటంకం లేకుండా దర్భాసనంపై ఒక జింకచర్మాన్ని, దానిపైన వస్త్రాన్ని పరచి సుఖాస

నంపై కూర్చోవాలి. శరీరాన్ని నిటారుగా నిలుపుకొని కుంభక పూరక రేచక రూపమైన ప్రాణాయామంతో అన్నమయ ప్రాణమయాది కోశాలను శుద్ధి చేసుకొని చంచలమైన చిత్తాన్ని సుస్థిరం చేసుకొని, తీవ్రమైన సాధనతో బాగా కాచి కరిగించి మాలిన్యం పోగొట్టిన బంగారాన్ని వలె మనస్సును స్వచ్ఛం చేసుకోవాలి. ఈ విధంగా వాయువును వశం చేసుకొన్న యోగికి ప్రాణాయామమనే అగ్ని చేత వాతపిత్త శ్లేష్మాలనే దోషాలు నశిస్తాయి. ఏకాగ్రత వల్ల పాపాలు రూపుమాసిపోతాయి. మనోనిగ్రహం వల్ల చెడు సంసర్గాలు విడిపోతాయి. అటువంటి యోగి ధ్యానంవల్ల రాగద్వేషాలకు, త్రిగుణాలకు అతీతుడై తన ముక్కు చివరి భాగాన దృష్టిని కేంద్రీకరించాలి.

విష్ణు సర్వాంగ స్తోత్రంబు 922 అప్పుడే వికసిస్తున్న పద్మాలవంటి అందమైన కన్నులు కలవాడు, వక్షస్థలంపై అందమైన శ్రీవత్సం అనే పుట్టుమచ్చ కలవాడు, నల్లని మేఘంలా, నల్లకలువలా శ్యామలవర్ణం కలవాడు, తుమ్మెదలకు విందుచేసే వైజయంతీ మాలికతో విరాజిల్లేవాడు, కౌస్తుభమణితో శోభించే ముత్యాలహారం కంఠమందు ధరించినవాడు, యోగిజనుల హృదయకమలాలకు దగ్గరైనవాడు, ఎప్పుడును ప్రసన్నమైన చిరునవ్వు చిందులాడే ముఖపద్మం కలవాడు, కోటి సూర్యుల తేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశించేవాడు, విలువైన రమణీయ రత్నకుండలాలు, కిరీటం, హారాలు, కంకణాలు, కటకాలు, భుజకీర్తులు, అంగుళీయకాలు, అందెలు మొదలైన అలంకారాలతో విలసిల్లేవాడు, కటి ప్రదేశమందు ఘల్లు ఘల్లుమనే గజ్జెల మొలనూలు అలంకరించుకొన్నవాడు, భక్తులను లాలించి పాలించేవాడు అయిన శ్రీమన్నారాయణుని (ధ్యానం చేయాలి).

923 ఇంకా... కంజాతకింజల్క పుంజరంజిత పీత–
కౌశేయవాసు జగన్నివాసు
శత్రుభీకర చక్ర శంఖ గదాపద్మ–
విహిత చతుర్భాహు విగతమోహు
నుతభక్తలోక మనోనేత్రవర్ధిష్ణు–
లాలిత సద్గుణాలంకరిష్ణు
వరకుమారక వయఃపరిపాకు సుశ్లోకు–
సుందరాకారు యశోవిహారు
సకలలోక నమస్కృతచరణకమలు
భక్తలోక పరిగ్రహప్రకటశీలు
దర్శనీయ మనోరథదాయిఁ గీర్త
నీయ తీర్థయశోమహనీయమూర్తి.

924 పద్మకేసరాల రంగుతో మిసమిసలాడే పసుపుపచ్చని పట్టువస్త్రం కట్టుకున్నవాడు, లోకాలను తనలో పెట్టుకున్నవాడు, శత్రుభయంకరాలైన శంఖ చక్ర గదా పద్మాలను చతుర్బాహువులలో ధరించేవాడు, మోహాన్ని హరించేవాడు, స్తోత్రం చేసే భక్తులకు జ్ఞాననేత్రాన్ని అనుగ్రహించేవాడు, సుగుణాలనే సురుచిర భూషణాలను పరిగ్రహించే వాడు, నిత్యయౌవనుడు, భువనపావనుడు, సౌందర్యశీలుడు, యశోవిశాలుడు, సమస్త లోకాలూ నమస్కరించే పాదపద్మాలు కలవాడు, భక్తజనులను ఆదరించే భావాలు కలవాడు, కోరిన కోరికలను ప్రసాదించేవాడు, మహనీయ కీర్తితో ప్రకాశించేవాడు అయిన శ్రీహరిని (ధ్యానించాలి).

925 ఇంకా.

926 సాటిలేని మేటి సుగుణాలతో నిండియున్న వానిని, పాపాలను చెండాడే వానిని, స్థిరమైన వానిని, నడచివస్తున్న వానిని, వచ్చి కూర్చున్న వానిని, సుఖంగా పరుండిన వానిని, హృదయాంతరాలలో నివసించిన వానిని, సర్వేశ్వరుని, శాశ్వతమైన వానిని, సంస్తుతింపదగిన సచ్చరిత్ర కలవానిని (ధ్యానించాలి).

927 పరిశుభ్రము, పరిశుద్ధము అయిన మనస్సుతో, విజ్ఞాన తత్త్వ ప్రబోధకమైన సంకల్పంతో ఆ దివ్యమూర్తి రూపవైభవాన్ని ధ్యానించి అన్ని అవయవాలను విడమరచి చూచేటట్లు చిత్తాన్ని తదాయత్తం చేసి ఆ పరాత్పరుని ఒక్కొక్క శరీర భాగాన్నే పరిశుద్ధమైన అంతరంగంలో అనుసంధానం చేసికొని ధ్యానించాలి.

928 అది ఎటువంటిదంటే...

929 హలం, వజ్రం, అంకుశం, కమలం, ధ్వజం, ఛత్రం మొదలైన మంగళకరమైన రేఖలు కలవీ, చంద్రుని వెన్నెల వెలుగులవంటి గోళ్ళకాంతులతో భక్తుల మనస్సులలోని అజ్ఞానాంధకారాన్ని దూరం చేసేవీ, మనోజ్ఞమైన కాలి బొటనవ్రేలినుండి పుట్టిన గంగాతీర్థంచే శివుని జటాజూటాన్ని అలంకరించేవీ, భక్తితో ఆసక్తితో ధ్యానించే భక్తుల పాపాలనే పర్వతాలను వజ్రాయుధంలా పటాపంచలు చేసేవీ, దాసుల కోర్కెలు తీర్చేవీ, యోగుల హృదయాలనే పద్మాలలో విహరించే తుమ్మెదల వంటివీ అయిన హరి పాదపద్మాలను నిరంతరం హృదయాలలో స్మరిస్తూ ఉండాలి.

930 బ్రహ్మకు తల్లియై, దేవతలందరికీ ఆరాధ్యురాలై, కమల దళాలవంటి కన్నులుగల లక్ష్మీదేవి తన హృదయేశ్వరుడైన శ్రీహరి మోకాళ్ళను ఎంతో భక్తితో ఒడిలో చేర్చుకొని ఒత్తుతూ ఉన్న మనోహర దృశ్యాన్ని మనస్సులో మననం చేసుకోవాలి.

931 సొగసైన గరుత్మంతుని భుజాలమీద కాంతి సంపదలతో పెంపొందుతూ, విరిసిన దిరిసెనపువ్వు వన్నెలతో కన్నులవిందు చేసే పద్మనాభుని అందమైన ఊరుయుగ్మాన్ని అచంచలమైన భక్తితో భావిస్తూ మునులైనవారు తమ మనఃకమలాలలో నిల్పుకోవాలి.

932 అమ్మా! ఒయ్యారంగా అంచులు వ్రేలాడుతూ ఉండే మెత్తని పట్టుపీతాంబరం కట్టుకొని మొలనూలు మువ్వల సవ్వడి నివ్వటిల్లే పురుషోత్తముని కటిప్రదేశాన్ని భక్తితో భజించాలి.

933 ఇంకా విను. అఖిల లోకాలకు ఆధారభూతమై, బ్రహ్మపుట్టుకకు హేతుభూతమైన పద్మంతో విరాజిల్లే సరోవరం వంటి విష్ణుమూర్తి నాభీమండలాన్ని సంస్మరించాలి.

934 దివ్యమైన మరకతమాణిక్య దీప్తులు కలిగి, ముత్యాలహారాల కాంతులతో నిండిన కుచములు కలిగిన లక్ష్మీదేవికి నివాసమైన వక్షస్థ్సలాన్ని ఆత్మలో భావిస్తూ ఉండాలి.

935 యోగీశ్వరులచే నమస్కారాలు అందుకునేవాడూ, అందరికీ ప్రభువూ, లక్ష్మీపతీ అయిన ఆ మహావిష్ణువు యొక్క మెడ; నిత్యం కొలిచే సజ్జనుల మనోనేత్రాలకు ఆనందాలు పంచేటటువంటిదీ, అద్భుతమైన కౌస్తుభమణికాంతులలో తేలియాడేదీనూ. అట్టి ఆ విష్ణుమూర్తి మెడను మనసులో నిలుపుకుని దాని గుణాలను ధ్యానం చేయాలి.

936 సాగరమథన సమయంలో బరువైన మందర పర్వతం రాపిడిచే మెఱుగుపెట్టబడిన రత్నాల భుజకీర్తులు కలిగి లోకపాలకులకు అండదండలైన విష్ణుదేవుని బాహుదండాలను సంస్మరించాలి.

937 ఇంకా శత్రుసమూహాలకు సహింపరాని వేయి అంచుల సుదర్శన చక్రాన్ని, పద్మనాభుని కరపద్మంలో రాజహంసవలె విరాజిల్లే పాంచజన్య శంఖాన్ని, రాక్షసుల నెత్తురు చారికలతో కూడి దామోదరునికి ఆమోదదాయకమైన కౌమోదకి అనే గదను, గుప్పుమంటున్న కొంగ్రొత్త నెత్తావులు కమ్ముకున్న కమ్మ తెమ్మరల పిలుపు లందుకొని సంగీతాలు పాడే తుమ్మెదలతో కూడిన వైజయంతి అనే వనమాలికను, అఖిల లోకాలకు ఆత్మస్వరూపమైన కౌస్తుభమణిని వేరువేరుగా ధ్యానం చేయాలి. ఇంకా భక్తరక్షణ పరాయణత్వాన్ని స్వీకరించే దివ్యమంగళ రూపానికి తగినదై, మకరకుండలాల మణికాంతులు జాలువారే చక్కని చెక్కుటద్దాలతో ఎల్లవేళలా జయశ్రీకి మందిరాలైన అందాల కందమ్ములతో వంపులు తిరిగిన సొంపైన కనుబొమలతో, తేటి కదుపుల వంటి నల్లని ముంగురులతో, ముద్దులు మూటగట్టే ముకుందుని ముఖకమలాన్ని ధ్యానం చేయాలి. ఆర్తులై శరణాగతులైన భక్తులకు అభయమిచ్చే కరపద్మాలను మనస్సులో ధ్యానించాలి.

938 1) ఆదిభౌతికము, 2) ఆధ్యాత్మికము, 3) ఆదిదైవికము అనెడి కారణములు కలిగిన మూడు బాధలు (తాపములు) తాపత్రయం అనబడతాయి, భయంకరాతి

భయంకరములు అయిన ఆ తాపత్రయాలను ఉపశమింప చేయగలిగిన శ్రీమన్నారాయణుని దివ్య కటాక్షవీక్షణాలను మనస్సునందు స్మరించుకోవాలి.

939 సౌజన్యానికి నిధి వంటి ఓ తల్లీ! భక్తియోగాన్ని అవలంబించినవారు కమనీయకాంతులు ప్రసరించే విష్ణువుయొక్క ముసిముసి నవ్వులలోని ప్రసన్నతను మలినం లేని మనస్సులో మాటిమాటికి మననం చేసుకోవాలి.

940 తలలు వంచి నమస్కరించే దాసుల శోకబాష్ప సముద్రాలను ఎండించి కోరికలు పండించే హరియొక్క సుందర మందహాసాన్ని ఎడతెగకుండా భావించాలి.

941 మహామునులకే కాకుండా మన్మథునకు సైతం మరులు రేకెత్తించే మాధవుని మాయావిభ్రమ విరచితమైన భ్రూమండలాన్ని, మునీంద్రుల మనస్సులకు ఆనందాన్ని అందించే మందహాసాన్ని, క్రొంగ్రొత్త చిగురు తొగరు పెదవులను, ఆ పెదవుల కాంతికి జాజువారిన మొల్ల మొగ్గల చెలువాన్ని పరిహసించే పలువరసను తలపోయాలి. ఈ విధంగా అన్ని అవయవాలను వేరువేరుగా మనస్సులో నిలిపి ధ్యానం చేసుకోవాలి" అని దేవహూతికి కపిలుడు తేటతెల్లంగా తెలిపి మళ్ళీ ఇలా అన్నాడు.

సాంఖ్యయోగంబు

942 ఈవిధంగా నిష్కళంకజీవనుడైన మహాత్ముడు సర్వేశ్వరునిపై నిలిపిన భావసంపద కలవాడై సమధిక సద్భక్తితో మిక్కిలి మోదంతో పులకించిన శరీరం కలవాడై ఎంతో కుతూహలంతో సంతోషబాష్పాలు పొంగిపొరలగా ఆనందం అనే సముద్రంలో మునిగి విషయ బంధాల నుండి విముక్తి కలిగించే నా స్వరూప సంబంధాన్ని చేకూర్చుకొని ఉత్తమ ధ్యానంతో అన్నింటిని మించిన వెలుగునందు మనస్సును నిల్పగలుగుతాడు. హృదయ పూర్వకంగా మోక్షాన్ని అపేక్షిస్తాడు.

943 అందువల్ల మోక్షాన్ని అపేక్షించే మహానుభావుని మనస్సు సంసార బంధాలనుండి విముక్తమవుతుంది. దానిలో భగవంతునికంటె వ్యతిరిక్తమైన భాగానికి తావు లేదు. భగవంతునికంటె అన్యం కన్పించదు. ఇటువంటి వైరాగ్యం వల్ల పురుషునకు అనన్యస్థితి ప్రాప్తిస్తుంది. చిన్న వెలుగు తనకంటే పెద్దదైన వెలుగుతో కలిసినప్పుడు తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. అదే విధంగా జీవుడు తన శరీరం, మనస్సు మొదలైన వానియందు వేరే భావన లేక సర్వం భగవన్మయంగా సంభావిస్తాడు. ఆ అనన్యభావమే మోక్షం.

944 ఏ పురుషుడు తన జీవితానికి అంతిమ గమ్యాన్ని భావిస్తూ అన్య విషయాలనుండి నివృత్తమైన చిత్తంతో ఆత్మజ్ఞానమందు నిశ్చలమైన నిష్ఠ కలవాడై సుఖ దుఃఖాలను లక్ష్యపెట్టక అవి అహంకార ధర్మాలని గుర్తించి వర్తిస్తాడో ఆ పురుషునికి ఆత్మతత్త్వం సాక్షాత్కరిస్తుంది. అటువంటి వానినే జీవన్ముక్తుడని ప్రాజ్ఞులంటారు. అటువంటివాడు తన శరీరం నిలుచుండటం, కూర్చుండటం, తిరగడం మొదలైనవి ఏవీ తెలియకుండా ఉంటాడు. తల్లీ! ఇంకా విను.

945 మద్యపానం చేసి మైకంలో ఉన్న మనుష్యుడు పైబట్టను మరచిపోయి ప్రవర్తించిన విధంగా జీవన్ముక్తుడైనవాడు తన శరీరం దైవాధీనమనీ, అది ఎప్పుడో నశించిపోయేదనీ భావించి ఆత్మతత్త్వాన్ని అవగతం చేసుకొని ఉపేక్షాభావంతో ఉంటాడు. అంతేకాకుండా ఏకాగ్రభావంతో ఆత్మ సాక్షాత్కారం పొందినవాడై కర్మఫలం అనుభవింప వలసినంత వరకు భార్యాపుత్రులతో కూడిన ఈ సంసారాన్ని స్వప్నంలో లాగా అనుభవిస్తాడు. తర్వాత కలనుండి మేల్కొన్నవానిలాగా ఈ సంసార బంధాలన్నీ వదలిపెట్టి వర్తిస్తాడు.

946 పుత్ర మిత్ర కళత్రాదులకంటె మానవుడు వేరైనట్లు, మిణుగురుల కంటే, కొరవుల కంటే, పొగ కంటే అగ్ని వేరైనట్లు దేహం కంటే జీవాత్మ వేరై ఉంటుంది. పంచభూతాలు, ఇంద్రియాలు, అంతఃకరణము, వీటితో భాసించే ఈ ప్రకృతి రూప పరమాత్మ కంటే ఆత్మ వేరుగా ఉంటుంది. ఆ ఆత్మ బ్రహ్మ సంజ్ఞతో ద్రష్టయై ఒప్పుతూ అఖిల భూతాలలో తననూ, తనలో అఖిల భూతాలను కనుగొంటుంది.

947 ఇంకా...

948 సర్వ భూతాలలోను అనన్య భావంతో, సర్వత్ర ఆత్మగా వెలుగుతూ ఉంటుంది. ఆ దివ్యజ్యోతి ఒక్కటే అయినా పెక్కింటివలె కనిపిస్తుంది. ప్రకృతిగతమైన ఆ ఆత్మ దేవతలు, మనుష్యులు, జంతువులు, స్థావరాలు మొదలైన వేరువేరు యోనులలో వేరువేరు భావాన్ని పొందుతూ భిన్న గుణాలతో భిన్నంగా వెలుగుతూ ఉంటుంది. నిజానికి దేహాలు మాత్రమే వేరు కాని వెలుగు ఒక్కటే.

949 ఆత్మ సదసదాత్మకమై, భావాతీతమై, ఆత్మీయ భావంతో వర్తిస్తూ తన ఉజ్జ్వల తేజస్సుతో ప్రకృతిని తిరస్కరించి లోబరచుకుంటుంది.

950 ఈ ఆత్మ నిజస్వరూపంతో విరాజిల్లుతుంటుంది" అని కపిలుడు తెలియజెప్పగా విని దేవహూతి మళ్ళీ ఇలా అన్నది. "అసత్యమైన దేహంపై ఆత్మాభిమానం పెంచుకొని మూర్ఖుడై, కర్మలపై ఆసక్తి కలిగిన బుద్ధితో భ్రమించి, సంసారమనే పెనుచీకటిలో చాలాకాలం నిద్రామత్తుడైన జనుని మేల్కొల్పడం కోసం యోగభాస్కరుడవై పుట్టిన పుణ్యాత్ముడవు నీవు. కాబట్టి ఓ మహాత్మా! మహదాది భూతాలకు, ప్రకృతి పురుషులకు ఉన్న వేరువేరు లక్షణాలను చెప్పావు. వాటి వాటి స్వరూపాలను వివరించావు. ఆ విధంగానే సాంఖ్యయోగాన్ని అనుసరించి భక్తియోగ మహత్త్వాన్ని వెల్లడించు. పురుషుడు భక్తియోగం ద్వారా సమస్త ప్రపంచంనుండి విరక్తుడయ్యే విధం వివరించు. ప్రాణిలోకానికి అనేక విధాలుగా ఉండే సంసారానికి పరాపరుడవై కాలస్వరూపుడవై ఉన్న నీ స్వరూపాన్ని ఎరిగించు. కాలస్వరూపుడవైన ఏ నీ భయంవల్ల మానవులు పుణ్యకర్మలు చేస్తారో వానిని సవిస్తరంగా తెలిసేలా చెప్పు" అని అడుగగా దేవహూతితో కపిలుడు ఇలా అన్నాడు.

భక్తియోగంబు

951 "పద్మాలవంటి విశాలమైన కన్నులుగల తల్లీ! విను. ప్రజల సంకల్పాలను బట్టి ఆశయాలను బట్టి భక్తియోగం సిద్ధిస్తుంది. అదికూడ అనేకవిధాలుగా ఉంటుంది.

952 వానిని వివరిస్తాను. భక్తి తామసం, రాజసం, సాత్త్వికం అని మూడు విధాలు. వానిలో తామసభక్తి ఎలాంటిదంటే...

953 ఇతరులను హింసిస్తూ ఆడంబరం, అసూయ, రోషం, అజ్ఞానం, భేదబుద్ధి కలిగి నన్ను భజించేవాడు తామసుడు. అట్టి వానిది తామసభక్తి.

954 సౌజన్యఖనీ! ఆడంబరంతో కూడిన పూజాద్రవ్యాలతో అష్టైశ్వర్యాలకోసం, పేరుప్రతిష్ఠలకోసం పూజనీయుడనైన నన్ను పూజించడం రాజసభక్తి అవుతుంది.

955 సాటిలేని పాపాలను పరిహారం చేసేది భగవద్భక్తి ఒక్కటే అనే విశ్వాసంతో, భజింపదగిన పవిత్ర చరిత్రుడు భగవంతుడే అని మనస్సులో భావిస్తూ, సమస్త కార్యాలను భగవదంకితంగా ఆచరిస్తూ, లోకులకు మేలు చేకూర్చే పనులు చేస్తూ ఉండటం సాత్త్వికభక్తి.

956 మనుపుత్రికవైన ఓ తల్లీ! నా గుణాలను ఆలకించిన మాత్రాన ప్రాప్తమైన భక్తితో ఉదాత్తచిత్తులైన కొందరు పాపరహితుడనూ, అనంత కళ్యాణగుణ సహితుడనూ, పరమేశ్వరుడనూ అయిన నన్ను ఆశ్రయిస్తారు. అటువంటి ఉత్తముల మనోభావాలు సముద్రాన్ని సంగమించిన గంగానది మాదిరిగా చక్కగా సఫల మౌతాయి.

957 నిందనీయాలైన గుణాలు లేనివాడనైన నాయందు నిలుపవలసిన భక్తి లక్షణాలను తెలిపాను. నన్ను వదలకుండా, హేతువులు వెదకకుండా చేసే వ్రతమే అచంచలమైన భక్తి అని భావించు.

958 కోరికలు లేకుండా నన్ను భజించే నా భక్తులకు పైన చెప్పిన భక్తియోగం సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం అనే ముక్తులకు సాధనమౌతుంది. అందువల్ల మహాత్ములైనవారు తమ కోర్కెలు తీర్చేవే అయినా నా ఆరాధనకు దూరమైన ఏ సాధనలనూ చేయరు. దీనినే ఆత్యంతిక భక్తియోగం అని అంటారు.

సత్త్వరజస్తమోగుణాలకు అతీతమైన ప్రవర్తనగల మానవుడు నాతో సమానమైన రూపాన్ని పొందుతాడు" అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు.

959 "స్నాన సంధ్యాది నిత్యకర్మలందు, జగత్కళ్యాణార్థం చేసే యజ్ఞయాగాది నైమిత్తిక కర్మలందు అత్యంత శ్రద్ధాసక్తులు కలిగి ఉండడం, గురువులను పెద్దలను గౌరవించడం, పాంచరాత్రాగమంలో చెప్పబడిన ప్రకారం శ్రీహరిని నిష్కామ బుద్ధితో ఆరాధించడం, ఉత్సాహంతో నా రూపాన్ని దర్శించడం, కీర్తించడం, పూజించడం, నమస్కరించడం, స్మరించడం, నా చరిత్రలు వినడం, కర్మలలో చిక్కుకోకుండా ఉండడం, గొప్పవారిపైన

ఆదర గౌరవాలు, తనకన్న తక్కువ వారిపైన దయాదాక్షిణ్యాలు, తనతో సమానులపైన స్నేహానురాగాలు కలిగి ఉండడం, యమ నియమాలను పాటించడం మొదలైన సుగుణాలను అలవరచుకోవాలి. యోగాభ్యాసం చేయాలి. ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికాలను తాను తెలుసుకొని ఇతరులకు తెలియజేస్తూ ఉండడం... (చేయాలి).

960 ఇంకా...

961 విష్ణువు యొక్క కళ్యాణ గుణాలను కీర్తించేవాడై, చిత్తశుద్ధితో అనురక్తితో భగవద్భక్తులను సేవించడం, అహంకారం లేకుండా నిశ్చల హృదయంతో జీవించడం... (చేయాలి).

962 ఈ మొదలైన సుగుణాలతో భగవంతుని ఉద్దేశించి చెప్పిన ఇటువంటి ధర్మాలతో కూడి పవిత్రమైన మార్గంలో ఆసక్తమైన మనస్సు కలవాడైన పుణ్యాత్ముడు ఎల్లప్పుడు...

963 (ఆ పుణ్యాత్ముడు) అనంత కళ్యాణగుణ సంపన్నుడనైన నన్ను పొందుతాడు. గాలి ద్వారా పువ్వుల సుగంధం ఘ్రాణేంద్రియాన్ని ఆశ్రయించిన విధంగా ఇతరమైన ఎటువంటి అండదండలు లేకుండానే అనాయాసంగా నన్ను చేరుకుంటాడు.

హరి పరమాణురూపమున నందు వసించి విరాజమానుఁడై
సరి వెలుఁగొందు నిమ్ముల నసంఖ్యము లైన మహాండకోశముల్
నెఱిఁ దన యందు డింద నవనీరజనేత్రుఁ డనంతుఁ డాద్యుఁ డ
క్షరుఁడు పరాపరుం డఖిలకారణకారణుఁ డప్రమేయుఁ డై.

964 ఎల్లప్పుడు అఖిల జీవుల హృదయ కమలాలలో అంతర్యామినై ఉండే నన్ను అలక్ష్యం చేసి కేవలం నా విగ్రహాలను మాత్రమే ఆడంబరంగా పూజిస్తూ లోకాన్ని మోసగించేవాడు మూర్ఖుడు. అచంచలమైన భక్తితో నన్ను ఆరాధింపని వాని పూజలు బూడిదలో పోసిన హోమద్రవ్యాలవలె నిరర్థకాలు.

965 కమలాలవంటి కన్నులు గల తల్లీ! నేను సమస్త జీవులలో అంతర్యామినై ఉన్నాను. అటువంటి నాయందు, మిగిలిన జీవరాసుల యందు భేదదృష్టి కలిగి మాయావులై విరోధభావంతో మెలిగేవారికి మనశ్శాంతి దొరకదు. అటువంటి కుటిలాత్ములు ఎంతో ద్రవ్యం వెచ్చించి అట్టహాసంగా, ఆడంబరంగా నాకు పాదపూజలు చేసినా నేను తృప్తిపడను. సంతోషించను" అని చెప్పి సతీమతల్లియైన తల్లితో ఉత్తమగుణధుర్యుడైన కపిలుడు ఇలా అన్నాడు.

966 "తల్లీ! విను. చైతన్యం లేని రాళ్ళురప్పలకంటే చైతన్యంగల చెట్లుచేమలు శ్రేష్ఠమైనవి. స్పర్శజ్ఞానంగల చెట్లకంటె రసజ్ఞానం (రుచిచూచే శక్తి) గల క్రిమికీటకాలు శ్రేష్ఠమైనవి. వీనికంటె గంధజ్ఞానం (వాసన చూసే శక్తి) కలవి మరీ శ్రేష్ఠం. వీనికంటె శబ్దజ్ఞానం (వినగల శక్తి) కలవి గొప్పవి. ఇలాంటి శబ్దజ్ఞానం కలవాని కంటె కూడా

రూపజ్ఞానం (చూడగల శక్తి) కల కాకులు మొదలైనవి ఎంతో శ్రేష్ఠమైనవి. వానికంటే కూడా అనేక పాదాలు కల జెఱ్ఱులు మొదలైనవి శ్రేష్ఠం. వానికంటె...

967 (బహుపాదుల కంటె) చతుష్పాత్తులు (నాలుగు పాదాలు కల ఆవులు మొదలైనవి) గొప్ప. వీనికంటె రెండుపాదాలు గల మానవులు గొప్ప. వీరిలో నాలుగు తెగలున్నాయి.

968 ఆ తెగలలో...

969 (ఆ నాల్గు తెగలలో) బ్రాహ్మణులు ఉత్తములు. వీరికంటే వేదవేత్తలు శ్రేష్ఠులు. వీరికంటె వేదార్థం తెలిసినవాళ్ళు గొప్పవారు. వీరికంటె శాస్త్ర సంబంధమైన సందేహాలను చక్కగా తీర్చగల మీమాంసకులు అధికులు. వీరికంటె స్వధర్మపరాయణులు ఉత్తములు. వీరికంటే దేనిపైనా ఆసక్తిలేని నిస్సంగులు గొప్పవారు. వీరికంటె సద్ధర్మం ఆచరించేవారు అధికులు. అటువంటి ధర్మికులకంటే సర్వధర్మాలనూ, సర్వసంపదలనూ, సర్వబాధ్యతలనూ నాకే అర్పించి, అనన్యభావంతో సర్వత్ర సమవర్తనుడై జీవితం గడిపే పుణ్యాత్ముడు ఎంతో గొప్పవాడు.

970 అటువంటివానిని...

971 (అటువంటి పుణ్యాత్ముని) సమస్త ప్రాణికోటి ఎంతో గౌరవభావంతో చూచి, ఎప్పుడూ అభినందిస్తూ సంతోష సముద్రంలో మునిగి తేలుతుంటారు.

972 అప్పుడు దేవుడు జీవుని స్వరూపాన్ని ఏర్పరచుకొని అందులో ప్రవేశించి ఉంటాడు. అటువంటి జీవునిలో ఉన్న దేవుని యోగమార్గంతో కాని, భక్తిమార్గంతో కాని పురుషుడు పొందగలుగుతాడు. ఆ పరమాత్మ ప్రకృతి పురుషులతో కూడి కర్మలను చేస్తూ ఉంటాడు. ఆ పరమాత్మయే ప్రకృతినుండి వేరై కర్మలు చేయనివాడై కూడా ఉంటాడు. ఇదే భగవంతుని రూపం. ఇది జీవులందుగల పరస్పర భేదాలకు ఆధారమై అత్యంత శక్తిమంతమై ఉంటుంది. అదే కాలం అనబడుతుంది. అటువంటి కాలం మహదాది తత్త్వాలకు, మహత్తత్త్వాభిమానులకు భీతి గొల్పుతుంది. అందుకనే అది అన్ని జీవులకు ఆశ్రయమై, ఆ జీవులలో ఉంటూ ఒక ప్రాణిచేత మరొక ప్రాణిని గ్రసింపజేస్తుంది. భగవంతుడైన విష్ణువు యజ్ఞఫల ప్రదాతయై, ఆ జీవులను స్వాధీనంలో ఉంచుకొని, వాటిని పాలించే మహారాజుగా ప్రకాశిస్తూ ఉంటాడు. అతనికి ఇతడు మిత్రుడు, ఇతడు శత్రువు, ఇతడు బంధువు అంటూ ఎవరూ లేరు. అటువంటి విష్ణువు అందరిలోను ఆవేశించి అప్రమత్తుడై ఉంటాడు. ప్రమత్తులైన వారిని అణచివేస్తుంటాడు. ఆ పరమాత్ముని గురించిన భయం వల్లనే గాలి వీస్తుంది. సూర్యుడు ఎండ కాస్తాడు. ఇంద్రుడు వాన కురిపిస్తాడు. నక్షత్రాలు వెలుగుతాయి. చంద్రుడు వెన్నెలలు వెదజల్లుతాడు. ఆయా కాలాలలో చెట్లూ, తీగలూ మొదలైనవి ఓషధులతో కూడి పూలతో, పండ్లతో నిండి ఉంటాయి. నదులు ప్రవహిస్తాయి. సముద్రాలు హద్దు మీరకుండా

ఉంటాయి. అగ్ని మండుతుంది. భూమి కొండల బరువుకు క్రుంగకుండా ఉంటుంది. ఆకాశం అందరికీ చోటిస్తుంది. మహత్తత్త్వమే ఈ లోకానికి మూలభూతమైనది. ఏడు ఆవరణాలు గల ఈ లోకం అనే తన దేహాన్ని విస్తరింపచేస్తుంది. బ్రహ్మ మొదలైనవాళ్ళు సర్వేశ్వరుని ద్వారా ఈలోకసృష్టి నిమిత్తం నియమింపబడినవారై ప్రతిదినం ఆయా సృష్టికార్యక్రమాలలో జాగరూకులై ఉంటారు. తండ్రులు కుమారులకు జన్మనిస్తారు. కాలస్వరూపుడైన యముడు మృత్యుదేవత సాయంతో జీవులను చంపుతూ ఉంటాడు. స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచం అంతా భగవంతుని కట్టడిలో ఉంటుంది" అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు.

973 "గాలిలో ఎగిరే మేఘానికి గాలిశక్తిని తెలుసుకొనే శక్తి ఉండదు. అదేవిధంగా సకల లోకేశ్వరుడైన భగవంతుని శక్తిని గుర్తించే శక్తి ఎవ్వరికీ ఉండదు.

974 అమ్మా! విను. దేనివల్ల సుఖం దొరుకుతుందో అది దొరకకపోవడం వల్ల జనులు దుఃఖాలపాలు అవుతున్నారు. ఇదంతా భగవంతుని ఆజ్ఞానుసారం జరుగుతూ ఉంటుంది. ఇంకా...

975 అశాశ్వతాలైన ఇల్లు, పొలం, పశువులు, ధనం, సంతానం, భార్య, బంధువులు మొదలైన వస్తువులే శాశ్వతం అని నమ్మి దుష్టబుద్ధియైన మానవుడు అనేకప్రాణుల శరీరాలను పొందుతూ వివిధ యోనుల్లో జన్మిస్తూ ఉంటాడు. వానిపట్ల విరక్తి చెందడు. నరకం అనుభవించిన తర్వాతకూడా దేహి తన దేహాన్ని వదలక అదే ఎంతో సుఖప్రద మైనదిగా భావించి దానినే అంటిపెట్టుకొని ఉంటాడు. అంతేకాక అతడు దేవుని మాయకు లొంగినవాడౌతాడు.

976 కుమారులు, భార్య, పశువులు, ధనం, ఇల్లు మొదలైన వానిని రక్షించుకొనే ఆలోచనలతో దినదినమూ వేగిపోతూ క్రాగిపోయిన దేహంతో క్రుంగి కృశిస్తూ...

977 తెలివిలేనివాడై పాపకార్యాలను ఆచరిస్తూ ఇల్లాలి సరస సల్లాపాలతోనూ, పిల్లల ముద్దుమాటలతోనూ మురిసిపోతూ (ఉంటాడు). ఇంకా...

978 విను. ఇంద్రియాలకు లొంగి వాటి కుటిల గుణాలవల్ల కలిగే దుఃఖాన్నే పరమసుఖంగా భావించి, ఆ ఇంద్రియాలపై మరింత అభిమానాన్ని పెంచుకుంటూ...

979 ఎప్పుడూ తాము సంపాదించుకొన్న ధనాన్ని చూచుకొని పొంగిపోతూ, కుటిలబుద్ధి కలవాడై ఇంతరులను హింసిస్తూ చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తూ, తనవాళ్ళను....

980 పోషించుకుంటూ, వారు తినగా మిగిలినది తాను తింటూ, అప్పటికీ సంసారాన్ని ఈదలేక, బ్రతుకు బరువు భరించలేక స్వార్థపరుడై జవసత్త్వాలు కోల్పోయి, కుటుంబాన్ని పోషించడానికి...

981 శక్తి చాలక, అదృష్టం సన్నగిల్లి, కుటిల బుద్ధితో ఏ విధమైన పనులూ చేయలేని సోమరిపోతై పనికిరాని ప్రయత్నాలు చేస్తూ, పరమ మూర్ఖుడై దీనంగా తిరుగుతూ ఉంటాడు. రైతు బక్కచిక్కిన ముసలి ఎద్దును అసహ్యించుకొన్నట్లు ఆ దరిద్రుణ్ణి చూచి అతని ఆలుబిడ్డలు 'ఇతడు అశక్తుడు, ఈ పనికిమాలినవాడు మనలను పోషింపలేడు' అని ఏవగించుకొంటారు. ఈవిధంగా అతడు ఎక్కడా ఏ విధంగానూ సుఖంలేక ఇన్నాళ్ళూ తాను ఎవరినైతే తిండిపెట్టి పోషించాడో వారు పెట్టే తిండి తింటూ, ముసలితనంతో మూలుగుతూ బాధగా బరువుగా బ్రతుకును ఈడుస్తూ (ఉంటాడు).

982 రూపం మారిపోగా, బంధువులందరూ ఏవగిస్తుండగా, అంత్యకాలం సమీపించగా, గడప దాటి వెళ్ళలేక కుక్కలా తింటూ, శరీరంలో వణుకు పుట్టుకురాగా...

983 నానావిధాలైన వ్యాధులు బాధించగా, జఠరాగ్ని మందగించగా, తిండి పడిపోయి, ఆయాసం అతిశయించి, మిడిగ్రుడ్లు పడి, కంఠనాళం మూసుకుపోయి, గొంతులో గురక పుట్టి, బంధువుల అందరిమధ్య పండుకొని, వారు తనను పలుకరిస్తూంటే బదులు పలకడానికి నోరు పెకలక, భయంకరాలైన యమపాశాలు శరీరానికి చుట్టుకోగా, భార్యను పిల్లలను ఎవరు పోషిస్తారా అనే దిగులుతో శిథిలమై పోయిన ఇంద్రియాలతో తెలివి కోల్పోయినవాడై గిలగిలలాడుతూ...

984 అంతలో మృత్యువు ముంచుకురాగా మిక్కిలి భయంకరమైన రూపాలతో తీక్షణమైన చూపులతో ఇద్దరు యమదూతలు తనముందు వచ్చి నిలబడగా, వాళ్ళను చూచి గుండెలు పగిలి మలమూత్రాలను విడుస్తూ, యమపాశాలు కంఠాన్ని బంధించగా, ఈ శరీరాన్ని విడిచిపెట్టి యాతనాశరీరంలో ప్రవేశించి, పొడవుగా ఉండి నడవడానికి వీలులేని మార్గంలో యమభటులు బలవంతంగా ఈడ్చుకొని వెళ్ళుతుంటే, రాజభటులవెంట అపరాధిలా శిక్షలు అనుభవించడానికి సంసిద్ధుడై వెళ్తూ...

985 అక్కడ కుక్కలు పీక్కుతింటుంటే మూర్ఛపోతాడు. యమభటులు భయంకరంగా అరుస్తూ చేసే అదలింపులకు, బెదరింపులకు మనస్సు కలత చెందగా, శరీరమంతా కంపించిపోగా, పూర్వజన్మలో చేసిన పాపాలన్నీ జ్ఞప్తికి తెచ్చుకొని పరితపిస్తూ...

986 ఎడతెగని ఆకలి దప్పులతో లోలోపల వ్యాకులపడుతూ, సుడిగాలుల మధ్య సోలిపోతూ, భగభగమండే సూర్యకిరణాలకు వేడెక్కి మాడిపోతున్న ఇసుక ఎడారుల్లో కాళ్ళు కాలుతూ నడవలేక నడుస్తూ, కొరడా దెబ్బలకు బొబ్బలెక్కిన వీపుతో శిథిలమైన అవయవాలతో మార్గమధ్యంలో అచ్చటచ్చట మూర్ఛిల్లుతూ, దిక్కుమాలిన నీళ్ళలో మునిగితేలుతూ, పాపంలా క్రమ్ముకొన్న చిమ్మచీకటిలోనుంచి తొంబది తొమ్మిది వేల యోజనాల దూరంలో ఉన్న యమపట్టణానికి యమభటులచేత తీసుకొని పోబడతాడు.

987 ఈవిధంగా మహాపాపి యైనవాడు మూడు ముహూర్తాల కాలంలో, సామాన్యదోషి యైనవాడు రెండు ముహూర్తాల కాలంలో వెళ్ళి యాతనలను పొందుతారు. ఆ యమలోకంలో...

988 ప్రమత్తుడైన ఆ పాపాత్ముని పట్టుకొని కొరవులతో కాలుస్తారు. చురకత్తులు గ్రుచ్చుతారు. భగభగ మండే మంటలో పడవేస్తారు. ఒళ్ళంతా చిల్లులు పడేటట్లు చితుకబొడుస్తారు.

989 వేడినీళ్ళలో ముంచుతారు. పెద్ద గదలతోను, కత్తులతోను మొత్తుతారు. పొట్టలోని ప్రేవులను త్రెంచుతారు. మదపుటేనుగులతో త్రొక్కిస్తారు. పాములచేత క్రూరంగా కరిపిస్తారు. బండరాళ్ళు మీదకు విసరుతారు. అతని దేహాన్ని కోసి ఆ కండలను ఆ పాపాత్మునిచేతనే తినిపిస్తారు.

990 పాపాత్ముడు సంసార పోషణకై పడరాని పాట్లు పడుతూ, తన పొట్టను నింపుకొంటూ, అధర్మమార్గంలో నడుస్తూ, ప్రాణులను హింసిస్తూ మహాపాపం మూటకట్టుకొని యమలోకానికి పోయి అక్కడ తన సొమ్మును పోగొట్టుకొని మొరపెట్టుకునే దిక్కులేని దీనునివలె ఆక్రోశిస్తూ ఒకదాని వెంట ఒకటిగా తామిస్రం, అంధతామిస్రం, రౌరవం మొదలైన నరకాలలో పడి సహింపరాని పెక్కు బాధలను అనుభవిస్తూ, తన పాపాలన్నీ తరిగిపోయిన తరువాత మళ్ళీ మనుష్యజన్మను పొందుతాడు" అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు.

గర్భసంభవ ప్రకారంబు

991 "ఈశ్వరుడు శాశ్వతంగా ప్రకాశించేవాడు, అన్నిటినీ సంఘటిత పరిచేవాడు కాబట్టి జీవుడు తన పూర్వకర్మలను అనుసరించి మళ్ళీ దేహాన్ని పొందగోరుతాడు. జీవుడు పురుషుని వీర్యబిందు సంబంధంతో స్త్రీ గర్భంలో ప్రవేశిస్తాడు. ఒక్క రాత్రికి శుక్రశోణితాల ద్రవరూపమైన కలిలమై, తర్వాత ఐదురాత్రులకు బుద్బుదమై, ఆపైన పదవదినానికి రేగుపండత అయి, అనంతరం మాంసపిండమై గ్రుడ్డు ఆకారం పొందుతాడు. ఒక నెలకు శిరస్సు ఏర్పడుతుంది. రెండు నెలలకు కాళ్ళు చేతులు వస్తాయి.

992 మూడు నెలలకు గోళ్ళు, వెంట్రుకలు, ఎముకలు, చర్మం, నవరంధ్రాలు ఏర్పడుతాయి. నాలుగవ నెలకు సప్తధాతువులు కలుగుతాయి. ఐదవనెలకు ఆకలి దప్పులు సంభవిస్తాయి. ఆరవ నెలలో మావిచేత కప్పబడి, తల్లి కడుపులో కుడివైపున తిరుగుతూ ఉంటాడు. తల్లి తిన్న అన్నంతో త్రాగిన నీటితో తృప్తి పొందుతుంటాడు. వాత పిత్త శ్లేష్మలానే ధాతువులు అభివృద్ధి చెందుతూ ఉంటాయి. మల మూత్రాల గుంటలలో పొర్లుతూ, అందలి క్రిములు శరీరమంతా ప్రాకి బాధపెట్టగా మూర్ఛపోతూ ఉంటాడు. తల్లి తిన్న కారం, చేదు, ఉప్పు, పులుపు మొదలైన తీవ్రరసాలు అవయవాలను

తపింపచేస్తాయి. మావిచే కప్పబడి, బయట ప్రేగులచే కట్టివేయబడి తల్లిపొట్టలో తలదూర్చి, వంగి, ముడుచుకొని, పండుకొని ఉంటాడు. తన అవయవాలు కదలించటానికి శక్తిలేక పంజరంలో చిక్కిన పక్షివలె బంధితుడై ఉంటాడు. దైవదత్తమైన తెలివితో వెనుకటి జన్మలలోని పాపాలను తలచుకొని నిట్టూర్పులు విడుస్తాడు. కించిత్తుకూడా సుఖాన్ని పొందలేకుండా ఉంటాడు. ఏడవనెలలో జ్ఞానం కలుగుతుంది. కదలికలు కలుగుతాయి. మలంలోని క్రిములతో కలసి మెలసి ఒకచోట ఉండలేక కడుపులో అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. గర్భవాయువులకు కంపించిపోతూ దేహాత్మ దర్శనం కలిగి, విమోచనాన్ని యాచిస్తూ, మళ్ళీ గర్భవాసం కలిగినందుకు భయపడుతూ బంధనరూపాలైన సప్తధాతువులతో బంధితుడై, చేతులు జోడించి దీనముఖుడైన జీవుడు ఏ దేవుడు తనకు ఈ గర్భవాసం కలిగించాడో ఆ సర్వేశ్వరుని ఈ విధంగా స్తుతిస్తాడు.

993 ఎల్లప్పుడు లోకాలను రక్షించడానికి ఇచ్ఛానుసారం జన్మమెత్తుతూ ఉండే భగవంతుని పాదపద్మాలను అనురక్తితో, భక్తితో ఆరాధిస్తాను. ఆ పాదాలు నా భయాన్ని పటాపంచలు చేస్తాయి.

994 అంతేకాక పంచభూతాలు లేకున్నా పంచభూతాలతో ఏర్పడిన శరీరంతో కప్పబడి ఇంద్రియగుణాలు, ఇంద్రియార్థాల అస్తిత్వం తెలిసీ తెలియని అభాసజ్ఞానం కలిగిన నేను....

995 ఏ దేవుడు సమస్త జీవరాసులలో పంచేంద్రియాలతో పంచభూతాలతో నిండిన మాయను అంగీకరించి కర్మబంధాలకు లోబడి ఉన్నట్లు కన్పిస్తాడో, దహించుకొని పోతున్న జీవుని చిత్తంలో అవికారుడై, పరిశుద్ధుడై, అఖండజ్ఞాన స్వరూపుడై భాసిస్తుంటాడో ఆ ఉదాత్త చరితునికి, ఆ మొక్కవోని శౌర్యం కలవానికి, ఆ పరంజ్యోతికి, ఆ దయామయునికి, ఆ శాంతమూర్తికి, ప్రకృతి పురుషులకంటె అతీతుడైన ఆ భగవంతునికి ఈ భరింపరాని భయంకరమైన గర్భనరకంలో ఉన్న నన్ను రక్షించి శాంతి కలిగించమని నమస్కరిస్తున్నాను."

996 అని చెప్పిన కొడుకుతో తల్లి ఇలా అన్నది "ఓ మహానుభావా! ఎవని మాయవల్ల మానవులు వ్యామోహంలో పడి గుణకర్మ నిమిత్తంగా ఏర్పడ్డ ఈ సంసార మార్గంలో ప్రయాణిస్తూ ధైర్యం చాలక, అలసిపోయి దిక్కు తెలియక చీకాకు పడుతూ చివరకు ఆ దేవుని పాదాలను ధ్యానించాలనే విషయాన్ని కూడా మనస్సులో మరచిపోతారో, ఆ పురుషోత్తముని అనుగ్రహం లేనిదే ఆ మానవులకు ఆయన గుణగణాలను ధ్యానించాలనీ, ఆయన రూపాన్ని దర్శించాలనీ బుద్ధి పుడుతుందా? ఈ సంగతి నాకు కనువిప్పు కలిగేలా విప్పి చెప్పు" అని అడిగిన సద్గుణవల్లియైన తల్లితో కపిలుడు ఇలా అన్నాడు.

997 "ఆ భగవంతుడు మూడు కాలాల్లోనూ చరాచర ప్రపంచంలోని సమస్త జీవరాసులలో అంతర్యామిగా ఉండడం వలన బ్రతుకు తెరువున పయనించేవారు తాపత్రయాలు తప్పించుకోవడానికై అతన్ని ఆరాధిస్తారు" అని చెప్పి మళ్ళీ ఇలా అన్నాడు.

998 "అమ్మా! జీవుడు తల్లి గర్భంలో క్రిములతో నిండిన మలమూత్రాల నెత్తురు గుంటలో మునుగుతూ, ఆకలి మంటలతో దినదినం తపించే దేహం కలవాడై...

999 దైన్యంతో నిండిన ముఖం కలవాడై, ఆ గర్భనరకంనుండి బయటపడాలని భావిస్తూ, గడచిన నెలలు లెక్కించుకుంటూ 'నన్ను ఈ గర్భంనుండి వెలువరించే వాళ్ళు ఎవరైనా ఉన్నారా? '

1000 అని తలపోస్తూ 'దీనులను రక్షించే పుండరీకాక్షుడు ఒక్కడే నన్ను ఈ గర్భనరకం నుండి విముక్తుణ్ణి చేయగలడు. అయితే ఆ మహాత్మునకు నేను ప్రత్యుపకారం ఏమీ చేయలేను. చేతులు జోడించి నమస్కారం మాత్రమే చేయగలుగుతాను. నేను కేవలం జీవుడను. శమ దమాది గుణాలతో కూడిన రాబోయే జన్మలో విజ్ఞాన దీపాంకురాన్ని వెలిగించుకొని ఆ వెలుగులో పురాణపురుషుణ్ణి చూస్తాను' అనుకొని, మళ్ళీ ఇలా అనుకుంటాడు.

1001 'ఎన్నెన్నో దుఃఖాలకు నిలయమైన ఈ గర్భనరకం నుండి నేను బయట పడలేను. ఒకవేళ బయటకు వచ్చినా దేవమాయలకు లోనై వ్యామోహంతో భయంకరమైన సంసార వలయంలో చిక్కుకొని పరిభ్రమిస్తూ ఉండవలసిందే. అందుకని ఈ గర్భశోకాన్ని పోగొట్టేదీ, ఆత్మను సారథియై నడిపించేదీ అయిన విజ్ఞానాన్ని ఆశ్రయించి అంధకార బంధురమైన సంసార సాగరాన్ని దాటి ఆత్మను రక్షించుకుంటాను.

1002 ఇంకా...

1003 ఈ గర్భనరకం అనేక వ్యసనాలకు నిలయమైనది. అంతులేని దుఃఖాలకు మూలమైనది. ఎన్నో రంధ్రాలు గలది. క్రిములకు జన్మస్థానమైనది. ఇటువంటి ఎన్నో గర్భవాసాల ఆపదను పోగొట్టడానికై సంసార సాగరాన్ని తరింపజేసే కమలనాభుని పాదపద్మాలను ఆశ్రయిస్తాను.'

1004 తల్లీ! ఈ విధంగా నిశ్చయించుకొని అతిశయించిన నిర్మలజ్ఞానం కలవాడై, జీవుడు గర్భం నుండి వెడలిరాకుండా తొమ్మిది నెలలు అలాగే గడుపుతాడు.

1005 పదవ నెలలో జీవుడు తలక్రిందుగా తిరిగి, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లేక ఎంతో బాధపడుతూ జ్ఞానరహితుడై, నెత్తురు పులుముకున్న దేహంతో భూమిమీద పడి ఏడుస్తూ, ఎరుకలేనివాడై ఉండి, తన ఉద్దేశ్యం అర్థం చేసికోలేని ఇతరులచే పోషింపబడుతూ, తనకు కావలసిన దేదో చెప్పలేక, పెక్కు కీటకాలతో నిండిన ప్రక్కమీద పండుకొని, శరీరం దురద

పుట్టినా గోకుకొనలేక, కూర్చోడానికి లేవడానికి నడవడానికి శక్తి చాలక, తన ఒంటి నిండా దోమలూ నల్లులూ ఈగలూ మొదలైనవి ప్రాకి కుడుతూ ఉంటే వారింపలేక, క్రిములచే పీడింపబడే క్రిమిలా బాధపడుతూ, ఏడుస్తూ, జ్ఞానం లేనివాడై మెలగుతూ, శైశవంలో ఆయా అవస్థలను అనుభవించి, బాల్యంలో విద్యాభ్యాసం మొదలైన వాటితో శ్రమపడి, ఆ తర్వాత యౌవనంలో తన కోర్కెలు తీర్చుకొనడం కోసం సాహసంతో కూడిన పనికిమాలిన పంతాలూ పట్టుదలలూ పూనుతూ, కామోద్రేకంతో ప్రవర్తిస్తూ, పంచభూతాత్మకమైన తన దేహంమీద మాటిమాటికీ అహంకార మమకారాలు పెంచుకుంటూ, అందుకు తగిన పనులు చేస్తూ, సంసార బంధాలలో కట్టుబడి, దుష్టుల స్నేహంవల్ల కామం పండించుకొనడం, కడుపు నిండించుకొనడంతోనే సతమతమౌతూ, అజ్ఞానియై పెచ్చు పెరిగిపోతున్న మచ్చరంతో దానికి ఫలమైన దుఃఖాన్ని అనుభవిస్తూ, కామాంధుడై, తన నాశనానికి మూలకారణమైన చెడుపనులను చేస్తూ ఉంటాడు. ఇంకా...

1006 అమ్మా! దుర్మార్గుల సాంగత్యంవల్ల సత్యం, శుచిత్వం, దయ, ధైర్యం, మితభాషణం, బుద్ధి, సిగ్గు, ఓర్పు, కీర్తి, శమం, దమం మొదలైన గుణాలన్నీ నశిస్తాయి" అని చెప్పి కపిలుడు తల్లితో మళ్ళీ ఇలా అన్నాడు. "మూఢ హృదయులు, శాంతి లేనివాళ్ళు, దేహమే ఆత్మ అని భావించేవాళ్ళు, స్త్రీ వ్యామోహంలో చిక్కుకొని గొలుసులతో బంధించిన పెంపుడు మృగాలలాగా పరులకు వశమైన బుద్ధి కలవారు శోచనీయులు. అటువంటివారి సాంగత్యం వదలిపెట్టాలి. అందులోను స్త్రీసాంగత్యం బలీయమైన దోషం అని ప్రాజ్ఞులంటారు కదా!

1007 దీనికొక ప్రాచీన కథ ఉంది. పూర్వం ఒకనాడు బ్రహ్మదేవుడు తన కూతురైన సరస్వతి ఆడులేడి రూపాన్ని ధరించి ఉండగా చూచి, ఆమ సౌందర్య లావణ్యాలకు మురిసిపోయి, పరవశించిన హృదయంతో సిగ్గు విడిచి, తానుకూడ మగలేడి రూపాన్ని ధరించి నీచమని భావించకుండా ఆమె వెంటబడి పరుగులెత్తాడు. కాబట్టి పురుషునకు స్త్రీసాంగత్యం తగదు. నా నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మ, అతనిచే సృష్టింపబడిన మరీచి ప్రముఖులు, వారికి పుట్టిన కశ్యపాదులు, వీరిచే కల్పించబడిన దేవతలు, మనుష్యులు, వీరందరిలోను చక్కదనాల చుక్కలైన రమణీమణుల మాయలకు చిక్కకుండా మొక్కవోని మనస్సు కలిగి ఉండడం అన్నది పుండరీకాక్షుడైన ఒక్క నారాయణ మహర్షికే తప్ప ఇతరులకు ఎవ్వరికీ సాధ్యం కాదు" అని కపిలుడు మళ్ళీ ఇలా చెప్పాడు.

1008 "నా మాయయే స్త్రీరూపంలో పురుషులకు మోహాన్ని కలిగిస్తుంది. కాబట్టి పురుషులు పరస్త్రీ సాంగత్యాన్ని పరిత్యజించి యోగమార్గంలో చరిస్తూ ఉండాలి.

1009 స్థిరబుద్ధితో నా పాదపద్మాలను సేవించడంలో ఆసక్తి కలవారు స్త్రీసాంగత్యాన్ని నరకద్వారంగా మనస్సులలో భావిస్తారు.

1010 నా మాయచేత కల్పించబడిన కామినీరూపం దట్టమైన గడ్డిచే కప్పబడిన కూపానికి అనురూపమై, మృత్యుస్వరూపమై ఉంటుంది. ఇంకా...

1011 ధనధాన్యాలు, పశువులు, పుత్రులు, మిత్రులు, స్త్రీలు, గృహాలు మొదలైన వాటికి కారణభూతమైన ఈ శరీరంలో ఉన్న జీవుడు ఇవన్నీ అనుభవించి మళ్ళీ ఈ జన్మలోని కర్మఫలాన్ని అనుభవించడం కోసం ఇటువంటి శరీరాన్ని మళ్ళీ ధరిస్తాడు. ఆకాశంలోకి ఎగిరిపోయినా, భూమిలో దూరినా, దిక్కులకు పారిపోయినా, ఎక్కడ దాగినా కర్మఫలాన్ని అనుభవింపక తప్పదు.

1012 అటువంటి పురుషరూపాన్ని ధరించిన జీవుడు ఎడతెగని స్త్రీసాంగత్యంవల్ల భోగభాగ్యాలు, పిల్లలు, ఇల్లు మొదలైన వాటిపై ఆసక్తి పెంచుకొని వచ్చే జన్మలో స్త్రీగానే జన్మిస్తాడు. ఈ విధంగా స్త్రీత్వాన్ని పొందిన జీవుడు నా మాయవల్ల పురుషరూపాన్ని పొంది ధనాదులను ఇచ్చే భర్తను సంసారబంధనానికి కారణంగా తెలుసుకోవాలి. ఈ సంసారబంధమే మృత్యువు. జీవునకు ఆధారంగా లింగమయ దేహం నిలిచి ఉంటుంది. ఆ లింగమయదేహంతో తనకు నివాసమైన ఈ లోకంనుండి వేరు లోకాలను పొందుతూ పూర్వకర్మలయొక్క ఫలితాన్ని అనుభవిస్తూ, తిరిగి కర్మలపై ఆసక్తుడు అవుతూ ఉంటాడు. మనస్సుతో పంచభూతాలతో పంచేంద్రియాలతో ఏర్పడి సుఖ సాధనమైన దేహం క్రమంగా శుష్కించి నశిస్తుంది. అడవిలో వేటగాడు మృగాలకు గానాదులతో అనుకూలమైన సదుపాయాలు కూర్చేవాడైనా, అతడే మృగాలపాలిటికి మృత్యువుగా పరిణమిస్తాడు. అట్టి దేహాన్ని చాలించడమే మరణం. దానిని పొందడమే జననం. కనుక సకల వస్తువులకూ సంబంధించిన జ్ఞానాన్ని పొందడానికి జీవునకు సాధనం కన్ను. ద్రష్ట చూడదగిన దానిని చూడడం అనే యోగ్యత సంపాదించుకున్నప్పుడు జీవునకు పుట్టడం, గిట్టడం అనేవి ఉండవు. కాబట్టి మానవుడు పిరికితనాన్నీ, దైన్యభావాన్నీ వదలిపెట్టి, తొందర లేనివాడై, జీవుని స్వరూపాన్ని జ్ఞానం ద్వారా తెలుసుకొని, ధైర్యం వహించి బంధనాలు లేనివాడై యోగ్యమైన వైరాగ్యంతో కూడిన చక్కని జ్ఞానాన్ని అలవరచుకోవాలి. మాయాకల్పితమైన ఈ లోకంలో దేహం మొదలైన వానిపై ఆసక్తి లేకుండా ఉండాలి" అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు.

చంద్రసూర్యపితృ మార్గంబు

1013 "సంసారానికి కట్టుబడిన గృహస్థులు ధర్మార్థకామాలపై ప్రీతి కలిగి వాటితోనే సంతుష్టులై వాటిని సాంధించడంలోనే మునిగి తేలుతూ ఉంటారు. వేదాలలో నిర్ణయింపబడిన భాగవత ధర్మాలకూ భగవద్భక్తికీ విముఖులై ఉంటారు. దేవగణాలను నిత్యం ఆరాధిస్తూ ఉంటారు. పితృకార్యాలను భక్తితో

చేస్తూ సదాచార సంపన్నులై ఉంటారు. కానీ ఇట్లా దేవతలకూ పితరులకూ సంబంధించిన సత్కర్మలను ఆచరించడంలోనే నేర్పరులై, కోర్కెలు నిండిన చిత్తం గలవారై ఉండి మోక్షాన్ని అందుకోలేరు. వారు ధూమ్రాది మార్గాలలో చంద్రలోకం చేరి అచ్చట సుఖాలు అనుభవించి పుణ్యం తరిగి నశింపగా మళ్ళీ జన్మ ఎత్తడం కోసం భూలోకానికి వస్తారు.

1014 అంతేకాక...

1015 అత్యంత నిర్మలమైన ఆదిశేషుని పానుపుమీద హరి యోగనిద్రలో మునిగి ఉన్న సమయంలో సమస్త లోకాలూ ప్రళయాన్ని పొందుతాయి. అటువంటి సర్వేశ్వరుణ్ణి బుద్ధిమంతులైనవారు (ధ్యానిస్తారు).

1016 ఆ బుద్ధిమంతులు తమ భక్తిప్రపత్తులతో తమతమ ధర్మాలన్నింటినీ పద్మనాభునికే సమర్పించి, ప్రశాంత చిత్తులై, సర్వసంగ పరిత్యాగులై, పుండరీకాక్షుని ఆరాధన తప్ప ఇతర ధర్మాలనుండి దూరంగా ఉంటూ, నిత్యం ఆ దైత్యారినే ధ్యానిస్తూ (ఉంటారు).

1017 ఇంకా అహంకార, మమకారాలను వదిలి ప్రవర్తిస్తూ వెలుగు త్రోవల పయనించేవాడూ, గొప్ప చరిత్ర కలవాడూ, విశ్వమంతా నిండినవాడూ, పవిత్రమైన కీర్తి కలవాడూ, లోకాల సృష్టి స్థితి లయలకు కారణమైనవాడూ, నాశనం లేనివాడూ, జన్మరహితుడూ, శ్రేష్ఠులలో శ్రేష్ఠుడూ, పురుషోత్తముడూ, క్రొత్త తామరలవంటి కన్నులు కలవాడూ అయిన సర్వేశ్వరునిపై బుద్ధి నిలిపి, పునర్జన్మ లేని మహనీయమైన మార్గంలో స్వచ్ఛమై ఆనందమయమై తేజస్సుతో వెలిగిపోయే దివ్యపదాన్ని పొంది సుఖించే ధీరులు పునర్జన్మలను పొందడానికి ఎన్నటికీ భూమిపైకి తిరిగిరారు.

1018 ఇంకా పరమేశ్వరుడనే దృష్టితో బ్రహ్మదేవుణ్ణి ఉపాసించేవారు సత్యలోకంలో రెండు పరార్ధాల కాలం తరువాత వచ్చే ప్రళయం వరకు పరుడైన చతుర్ముఖుని పరమాత్మ రూపంలో ధ్యానిస్తూ ఉంటారు. సర్వేశ్వరుడు భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలను, మనస్సును, పంచేంద్రియాలను, పంచతన్మాత్రలను, వాటితో కూడిన సమస్త ప్రకృతినీ, సకల లోకాలనూ తనలో లీనం చేసుకుంటాడు. అప్పుడు సత్యలోకంలో నివసించే ఆత్మస్వరూపులు బ్రహ్మతో కూడ పరమానంద స్వరూపుడూ, సర్వోత్కృష్టుడూ అయిన పురాణపురుషునిలో లీనమౌతారు. కాబట్టి అమ్మా! నీవు సకల ప్రాణుల హృదయ పద్మాలలో నివసించేవాడూ, మహానుభావుడూ, నిష్కలంకుడూ, నిరంజనుడూ, అద్వితీయుడూ అయిన పురుషోత్తముణ్ణి శరణుపొందు" అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు.

1019 "సమస్త చరాచర ప్రాణికోటికి అధీశ్వరుడు, పవిత్రాలైన వేదాల పుట్టుటకు కారణభూతుడు, సర్వశ్రేష్ఠుడు అయిన పరమేశ్వరుడు యోగీంద్రులు, సనకాది

కుమారులు, సిద్ధులు, మునులు, దేవతలు భక్తియోగంతో తనను భజింపగా వారికి సగుణస్వరూపంతో దర్శనమిస్తాడు.

1020 అటువంటి సర్వేశ్వరుడు ఆయా సమయాలలో తన మహనీయ గుణగణాల కలయికచే అనేక రూపాలలో అవతరిస్తూ ఉంటాడు. ఈ విధంగా అతని అంశలు పంచుకొని పుట్టిన ఋషులు, దేవతలు తమ కర్మఫలాన్ని అనుసరించి పౌరుషంతో ఐశ్వర్యం, పారమేష్ఠ్యం మొదలైన అధికారాలు చేపట్టి కొంతకాలం అనుభవించి, యథాస్థానానికి తిరిగి వస్తారు. మరికొందరు కర్మానుసారమైన మనస్సు కలవారై, ధర్మమందు శ్రద్ధ కలవారై, ధర్మానికి విరుద్ధం కాకుండునట్లుగా, నిత్యమూ తాము చేయదగిన ఆచారాలను నిర్వర్తిస్తూ, రజోగుణంతో నిండిన మనస్సు కలవారై...

1021 కామప్రవృత్తికి లోబడి ఇంద్రియాలను జయింపలేక పితృదేవతలను అనుదినం ఆరాధిస్తూ గృహాలలో పడి సంసార నిమగ్నులై జీవిస్తూ, హరిపరాఙ్ముఖులై, ధర్మార్థకామాలను మాత్రమే నమ్ముకొని వర్తిస్తారు. అటువంటి వారు త్రైవర్గిక పురుషులని పిలువబడతారు.

1022 శుభగుణవిశిష్టుడు, అద్వితీయ పరాక్రముడు అయిన హరిని భజిస్తూ ఆయన మహిమలనే మననం చేస్తూ ఆయన మధుర కథాసుధను తనివితీరా త్రాగడం ఉత్తమలక్షణం. అలాకాకుండా మరికొందరు ఊరబంది అవివేకంతో తీయతీయని నేతివంటకాలను కాలదన్ని మలభక్షణకై పరుగెత్తినట్లుగా చెడ్డకథలను వింటూ ఆనందిస్తూ ఉంటారు.

1023 ధూమమార్గాల గుండా వెళ్ళి, పితృలోకం చేరి సుఖించేవాళ్ళు తమ పుణ్యం తరిగిపోగానే మళ్ళీ ఈ భూమిమీద తమ బిడ్డలకే బిడ్డలై జన్మిస్తారు. వశం తప్పిన మనస్సుతో మాతృగర్భంనుండి బయటపడింది మొదలుగా శ్మశాన భూమికి చేరే పర్యంతం ఆయా కర్మఫలాలను ఇక్కడే అనుభవిస్తాడు. కాబట్టి ఓ తల్లీ! నీవు...

1024 విను. సర్వశ్రేష్ఠుడు, పాపరహితుడు, అనంతుడు, అధీశ్వరుడు, పురుషోత్తముడు అయిన పరమేశ్వరుణ్ణి అన్నిరీతులా సద్బుద్ధితో సంతోషంగా సేవించు. దానివల్ల పునర్జన్మం లేని కైవల్యం నీకు లభిస్తుంది."

1025 అని చెప్పి కపిలుడు మళ్ళీ ఇలా అన్నాడు. "పరమేశ్వరుడైన వాసుదేవుని యందు అభివ్యక్తమైన భక్తియోగం బ్రహ్మసాక్షాత్కారానికి సాధనాలైన జ్ఞానాన్నీ వైరాగ్యాన్నీ కలుగజేస్తుంది. అటువంటి భగవద్భక్తితో కూడిన చిత్తం ఇంద్రియ వ్యాపారాలలో సమంగా వర్తిస్తుంది. అటువంటి మనస్సు కలవానికి హెచ్చుతగ్గులు, ప్రియాప్రియములు, విషయ లాలస, గ్రహింప దగినవీ, తిరస్కరింప దగినవీ ఉండవు. సర్వత్ర సమదర్శన మేర్పడుతుంది. తనలో ఉన్న ఆత్మ స్వరూపాన్ని తాను చూడగలుగుతాడు.

జ్ఞానస్వరూపుడు, పరబ్రహ్మ, పరమాత్ముడు, ఈశ్వరుడు అయిన పరమేశ్వరుడు ఒకే రూపం కలవాడై ఉండికూడా కనబడే రూపాన్ని బట్టీ, చూచేవారినిబట్టీ, చూడటానికి ఉపయోగపడే సాధనాలనుబట్టీ వేరువేరు రూపాలలో గోచరిస్తాడు. ఇదే యోగి అయినవాడు సంపూర్ణ యోగంవల్ల పొందదగిన ఫలం. కావున విషయాలనుండి వెనుకకు మరలిన ఇంద్రియాలవల్ల జ్ఞాన స్వరూపమూ, హేయగుణ రహితమూ అయిన పరబ్రహ్మ దర్శనం లభిస్తుంది. ఆ పరబ్రహ్మమే మనస్సు యొక్క భ్రాంతి వలన శబ్దం స్పర్శం మొదలైన వాని ధర్మాలైన అర్థాల స్వరూపంతో గోచరిస్తున్నది. ఆ పరబ్రహ్మం అర్థస్వరూపంతో ఎట్లా కనిపిస్తుందని నీకు సందేహం కలుగవచ్చు. అహంకారం గుణరూపం ధరించి సత్త్వరజస్తమస్సులై మూడు విధాలుగానూ, భూతరూపం ధరించి భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశాలనే అయిదు విధాలుగానూ, ఇంద్రియరూపం ధరించి పదకొండు విధాలుగానూ ఉంటుంది. ఈ విధంగా అహంకారమే నానావిధాలుగా భాసిస్తుంది. విరాట్పురుషుడు జీవస్వరూపుడు. జీవరూపమైన ఈ జగత్తు అనే గ్రుడ్డులో అతడు నిండి ఉంటాడు. ఈ పరమ రహస్యాన్ని శ్రద్ధా సహితమైన భక్తితోనూ, యోగాభ్యాసంతోనూ, నిశ్చల చిత్తం కలవాడై వైరాగ్యం పొందినవాడు దర్శిస్తాడు. అమ్మా! నీవు జ్ఞాన సంపన్నులైన పెద్దలు పూజింపదగిన చరిత్ర గలదానవు. కాబట్టి నీకు ఈ విషయమంతా వెల్లడించాను. సమస్త యోగసాధనలవల్ల పొందదగిన పరబ్రహ్మను నిర్గుణుడని జ్ఞానయోగులు పలుకుతున్నారు. నేను చెప్పిన భక్తియోగం ఆ పరమాత్మను సగుణుడుగా పేర్కొంటున్నది. వాస్తవానికి జ్ఞానయోగం భక్తియోగం రెండూ ఒక్కటే. ఇంద్రియాలు వేరువేరు రూపాలతో ఉంటాయి. అందువల్లనే ఒకే రూపంలో ఉండే వస్తువు అనేక విధాలుగా తోచినట్లు, ఒకే పరమాత్మ అనేక విధాలుగా గోచరిస్తున్నాడు.

1026 అమ్మా! నారాయణుడు సమస్త శాస్త్రాలను చదివినందువల్లను, అనుష్ఠానాలూ యజ్ఞాలూ తీర్థయాత్రలూ జపతపాలూ ఆచరించినందువల్లనూ కనిపించడు. వేదాలు అధ్యయనం చేయడం వల్లనూ, యోగాభ్యాసాల వల్లనూ, దానాలూ వ్రతాలూ చేసినందువల్లనూ గోచరింపడు. చంచలమైన మనస్సును లోగొని చెలరేగిన ఇంద్రియాలను జయించి, కర్మ లన్నింటినీ భగవదర్పితం చేసి, ఆత్మస్వరూపాన్ని గుర్తించి, తరిగిపోని వైరాగ్యంతో ఫలితాలను అపేక్షించకుండా ప్రవర్తించే పురుషుడు మాత్రమే దుర్గుణాలను దూరం చేసుకొని పాపాలను పటాపంచలు గావించి అనంత కళ్యాణ గుణ విశిష్టుడు పరమాత్మ అయిన ఆ హరిని చేరగలుగుతాడు.

1027 అందువల్ల నీకు నాలుగు విధాలైన భక్తి మార్గాలను విశదంగా తెలియజెప్పాను. అంతేకాక స్వేచ్ఛారూపమైన నా సంకల్పం ప్రాణులందు జనన మరణ రూపాలతో

ఉంటుంది. అజ్ఞానంతో ఆచరించే కర్మల మూలంగా కలిగే జీవుని ప్రవర్తనలు అనేక విధాలుగా ఉంటాయి. జీవాత్మ అటువంటి అకర్మలు ఆచరిస్తూ అత్మస్వరూపం ఇటువంటిది అని తెలియని స్థితిలో ఉంటాడు" అని చెప్పి మళ్ళీ ఇలా అన్నాడు. "ఇటువంటి అతిరహస్యమైన సాంఖ్యయోగ పద్ధతి దుష్టునకు, నీతి హీనునకు, మూర్ఖునకు, దురాచారునకు, డంబాలు కొట్టేవానికి, ఇంద్రియ సుఖాలకు లోబడిన వానికి, పిల్లలూ ఇల్లాలూ ఇల్లూ మొదలైన వానిపై ఆసక్తి కలవానికి, భగవంతునిపై భక్తి లేనివానికి, విష్ణు భక్తులను ద్వేషించే వానికి ఉపదేశింపకూడదు. శ్రద్ధాసక్తుడు, భక్తుడు, వినయసంపన్నుడు, ద్వేషరహితుడు, సర్వప్రాణులను మైత్రీభావంతో చూచేవాడు, విజ్ఞాన విషయాలను వినాలనే అసక్తి కలవాడు, ప్రాపంచిక విషయాలపై విరక్తుడు, శాంతచిత్తుడు, మాత్సర్యం లేనివాడు, స్వచ్ఛమైన మనస్సు కలవాడు, భక్తులందు ప్రేమ కలవాడు, పరస్త్రీలను మంచి భావంతో చూచేవాడు, చెడు కోరికలు లేనివాడు అయిన వానికి మాత్రమే ఈ సాంఖ్యయోగం ఉపదేశింప తగినది. అటువంటివాడే ఇందుకు అర్హుడైన అధికారి. ఈ ఉపాఖ్యానాన్ని ఏ పురుషుడైనా, పతివ్రత అయిన ఏ స్త్రీ అయినా శ్రద్ధాభక్తులతో నాపై మనస్సు నిలిపి వినినా, చదివినా అటువంటి పుణ్యాత్ములు నా దివ్య స్వరూపాన్ని పొందుతారు" అని కపిలుడు దేవహూతితో చెప్పాడని చెప్పి మైత్రేయుడు విదురుణ్ణి చూచి ఇంకా ఇలా అన్నాడు. "ఈ విధంగా కర్దమమహర్షి అర్ధాంగి అయిన దేవహూతి కపిలుని ఉపదేశం విని, మోహం తొలగిపోగా అతనికి సాష్టాంగ దండ ప్రణామాలు చేసి, పరబ్రహ్మకు సంబంధించిన తాత్త్వికమైన సాంఖ్య జ్ఞానంతో కపిలుణ్ణి స్తోత్రం చేయడం ప్రారంభించి ఇలా అన్నది.

1028 ఇంద్రియాలతో, ఇంద్రియార్థాలతో, మనస్సుతో, పంచభూతాలతో నిండి సమస్త జగత్తుకు బీజభూతమై సత్త్వరజస్తమోగుణ ప్రవాహానికి మూలకారణమై నారాయణుడనే నామంతో నీ దివ్యమంగళ విగ్రహం తేజరిల్లుతూ ఉంటుంది. అటువంటి నీ కళ్యాణమూర్తిని నీ నాభికమలం నుండి జన్మించిన చతుర్ముఖుడే సాక్షాత్తుగా దర్శించలేక ఎలాగో తన మనస్సులో కనుగొన గలిగాడు. అలా చూచి నీ అనుగ్రహంవల్ల అనేక శక్తులను తనలో వ్యక్తీకరించుకొని వేలకొలది శక్తులతో కూడినవాడై ప్రవాహరూపమైన ఈ విశ్వాన్ని సృజింప గల్గుతున్నాడు. సృష్టి సంబంధమైన సర్వకార్యాలను నిర్వహింప గలుగుతున్నాడు.

1029 అప్పుడు...

1030 మహాప్రళయ సమయంలో సమస్త భువన సముదాయాన్ని నీ ఉదరంలో పదిలంగా దాచుకొని మహాసాగర మధ్యంలో మఱ్ఱి ఆకు పాన్పుమీద మాయాశిశువుగా ఒంటరిగా శయనించి ఉంటావు.

1031 మహానుభావా! ఆ విధంగా వటపత్రశాయివైన నీవు లీలగా నీ కాలి బొటనవ్రేలిని నోటిలో నుంచుకొని అందలి అమృతాన్ని ఆస్వాదిస్తూ ఉంటావు. అటువంటి నీవు నా పూర్వపుణ్య విశేషంవల్ల ఇప్పుడు నా కడుపున పుట్టావు.

1032 అటువంటి పరమాత్మ స్వరూపుడవైన నీవు...

1033 అవతారాలమీద ముచ్చటపడి వరుసగా రఘురాముడుగా, కృష్ణుడుగా, వరాహస్వామిగా, నరసింహమూర్తిగా ఆకారాలు ధరించి దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తావు. ఉత్తమ ధర్మంపట్ల ప్రవృత్తమైన చిత్తం కల భక్తులకు జ్ఞానదృష్టిని ప్రసాదించటం కోసం వాసుదేవ సంకర్షణ అనిరుద్ధ ప్రద్యుమ్న వ్యూహాలను అవలంబించి ప్రవర్తిస్తావు. అనఘుడవు, అనంత కళ్యాణగుణ సంపన్నుడవు అయిన నీ మహత్త్వాన్ని అభివర్ణించడం చతుర్ముఖునకు, చతుర్వేదాలకు కూడా సాధ్యం కాదంటే నేనెంతదాన్ని? వెయ్యి మాటలెందుకు? నిన్ను తెలుసుకొని సన్నుతించటం నాకు శక్యం కాని పని.

1034 అంతే కాకుండా...

1035 ఓ జ్ఞానస్వరూపా! మంగళకరమైన నీ నామాన్ని స్మరించినా, కీర్తించినా దరిద్రులు శ్రీమంతులౌతారు. అటువంటివారు అగ్నిష్టోమం మొదలైన యజ్ఞాలు చేసినవారికంటె పరిశుద్ధు లవుతారు.

1036 అంతే కాకుండా...

1037 లోకాలన్నిటిలో విచిత్రమైన విషయ మేమిటంటే భక్తిపూర్వకంగా నీ నామాన్ని జిహ్వాగ్రాన నిలుపుకొని జపించినట్లయితే వాడు కుక్కమాంసం తినేవాడైనా వానితో బ్రాహ్మణుడు కూడా సాటి కాలేడు.

1038 ఈ పరమార్థాన్ని చక్కగా తెలిసికొన్న సజ్జనులు సర్వదా లోకపావనమైన నీ మధుర కథాసుధారసాన్ని తనివితీరా మనసారా త్రాగుతారు. అటువంటి వారికి సమస్త పుణ్యతీర్థాలలో స్నానం చేసిన ఫలం ప్రాప్తిస్తుంది. ఈ విధంగా వేదాలన్నీ గొంతెత్తి చాటుతున్నాయి. అందువల్ల అటువంటి మహనీయులే మాననీయులు, ఉత్తములు, సాధుసత్తములు.

1039 అందువల్ల పరబ్రహ్మవూ, పరమపురుషుడవూ, వెలుపలా లోపలా సంభావింప తగినవాడవూ, సకల జీవుల పాపాలను పటాపంచలు చేసేవాడవూ, స్వయంప్రకాశుడవూ, వేదమూర్తివీ, మహావిష్ణు స్వరూపుడవూ అయిన నీకు నమస్కరిస్తున్నాను." అని దేవహూతి స్తుతించగా పురుషోత్తముడూ, మాతృప్రేమతో నిండినవాడూ అయిన కపిలుడు కరుణరసార్ద్రహృదయుడై తల్లితో ఇలా అన్నాడు.

1040 "కమలదళాల వంటి కన్నులు గల తల్లీ! సుఖస్వరూపమూ, మోక్షప్రదమూ అయిన ఈ యోగమార్గాన్ని నీకు తేటతెల్లంగా వెల్లడించాను. దీనిని నీవు దృఢమైన భక్తితో అనుష్ఠించు.

1041 దీనిని ఏకాగ్రచిత్తంతో ఏమరుపాటు లేకుండా ఆచరించేవారికి జీవన్ముక్తి లభిస్తుంది. ఈ మార్గాన్ని ఇష్టపడని వారికి మృత్యుభీతి కలుగుతుంది. సుఖం దూరమవుతుంది."

1042 అని ఈ విధంగా కపిలుడు దేవహూతికి మనస్సు సంతోషించేటట్లు ఆత్మతత్త్వాన్ని ఉపదేశించి వెళ్ళిపోయాడని మైత్రేయుడు విదురునికి తెలియజేశాడు.

దేవహూతి నిర్యాణంబు

1043 ఆవిధంగా కపిలుడు వెళ్ళిపోయిన తరువాత దేవహూతి తన పుత్రుని ఉపదేశం వల్ల జ్ఞానోదయం కలిగినదైనా భర్త అయిన కర్దముని, కుమారుడైన కపిలుని ఎడబాసి దూడను పోగొట్టుకొన్న గోవు వలె తల్లడిల్లుతూ కపిల మహామునిని తలచుకొంటూ, కర్దముని తపశ్శక్తితో కల్పించబడినట్టి (ఉద్యానవనాన్ని చూసింది)

1044 (ఆ ఉద్యానవనంలో) పరిమళాలు వెదజల్లే పూలగుత్తులతో, పండిన పండ్లతో, చెంగావి చిగుళ్ళతో, వంగిన కొమ్మలతో ఉన్న గున్నమామిళ్ళు కనువిందుగా ఉన్నాయి. ఆ మామిడి చెట్ల చిటారు కొమ్మలపై కూర్చున్న రామచిలుకలు వీనుల విందుగా పలుకుతున్నాయి. అక్కడి తామరకొలను చుట్టూ దట్టంగా అల్లుకున్న పొదరిండ్లు గోచరించాయి.

1045 ఇంకా...

1046 ఆ ఉద్యావనం ప్రక్కనే స్ఫటిక స్తంభాలతో, పచ్చలు చెక్కిన గోడలతో, మేలుజాతి వజ్రాల గవాక్షాలతో, నిగనిగలాడే నీలకాంత మణి సోపానాలతో, పాలరాతి అరుగులతో, పగడాల గడపలతో, బంగారు తలుపులతో అలరారే సౌధం ఉంది. అందులో పాలనురుగు వంటి ఏనుగు దంతాలతో చేయబడిన పట్టెమంచాలపై తెల్లని పట్టుపరుపులు పరచి ఉన్నాయి. ఒక ప్రక్క ముత్త్యాల పల్లకీలు, మరొక ప్రక్క బంగారు పీఠాలు పడి ఉన్నాయి. అటువంటి వైభవోపేతమైన వస్తు సంపదనంతా (దేవహూతి పరిత్యజించింది).

1047 ఇంకా విచ్చిన తామరలు, కలువలు, సౌగంధిక పుష్పాలు సుగంధాలను వెదజల్లుతున్నాయి. పూచిన పద్మాలలో పొంగిపొరలే తియ్యని పూదేనెలు త్రాగి గండుతుమ్మెదలు ఝుంకారాలు చేస్తున్నాయి. అటువంటి అందాలతో నిండి శచీదేవికి ఆనందాన్ని అందించే కర్దముని ఆశ్రమాన్ని వదలిపెట్టి దేవహూతి తపోదీక్ష వహించింది. ఆమె నొక్కుల చిక్కని శిరోజాలు జడలు గట్టాయి. సరస్వతీ నదిలోని బిందు సరస్సులో

మూడుపూటలూ మంత్రపూర్వకం గా స్నానం చేయసాగింది. తపోనియమాల వల్ల ఆమె శరీరం కృశించిపోయింది. దేవహూతి కపిలుడనే పేరుతో తన కుమారుడుగా ప్రసన్నముఖంతో జన్మించిన నారాయణుని ఏకాగ్రచిత్తంతో అనేకవిధాలుగా ధ్యానం చేస్తూ, అఖండమైన ప్రవాహరూపాన్ని ధరించిన భక్తియోగంతో ఎదలో వైరాగ్యం కుదురుకొనగా పరిశుద్ధ మనస్కురాలై యోగ్యమైన అనుష్ఠానంతో బ్రహ్మజ్ఞానాన్ని పొంది...

1048 దేవహూతి అనుక్షణమూ ఆత్మలకు అధీశ్వరుడూ, సర్వాంతర్యామీ, అనంతుడూ, అద్వితీయుడూ, అజుడూ, లీలావినోదీ, విజ్ఞానదీపకాంతుల మహిమతో అజ్ఞాంధకారాన్ని పారద్రోలేవాడూ, అమేయుడూ, అఖిలేశ్వరుడూ అయిన పరబ్రహ్మమందు మనస్సు లగ్నం చేసింది. నిరంతరమైన నిష్ఠతో ఆమెకు నిర్మలమైన తత్త్వజ్ఞానం అలవడింది. జీవభావం తొలగింది. దైవభావం కలిగింది. పరబ్రహ్మతో సమాధి సిద్ధించింది. పునరావృత్తి లేనట్టి ప్రవృత్తి ఏర్పడింది.

1049 కలలో చూచిన వస్తువులను మేలుకొన్న తరువాత చూడలేని మానవునివలె దేవహూతి తన అస్తిత్వాన్ని మరచిపోయింది. పొగలేని అగ్నిలాగా ప్రకాశించింది.

1050 అఖండమైన యోగప్రభావం వల్ల ఆమె మనస్సు ఆకాశానికి ఎగసి పరమ కరుణామయుడైన పరవాసుదేవుని పాదపద్మాలలో విలీనమయింది.

కపిలమహాముని తపంబు

1051 ఈ విధంగా దేవహూతి కపిలుని ఉపదేశానుసారంగా విష్ణుదేవునిలో విలీనమైంది. ఆ సతీమతల్లి మోక్షాన్ని అందుకొన్న పవిత్ర క్షేత్రం 'సిద్ధిపదం' అనే పేరుతో ప్రసిద్ధమైంది. అక్కడ కపిలుడు కన్నతల్లి అనుజ్ఞ పొంది సిద్ధులు చారణులు గంధర్వులు అప్సరసలు మునులు చేసే వందనాలు అందుకుంటూ సముద్రతీరాన్ని చేరి సముద్రుడు సమర్పించిన కానుకలు, పూజలు గ్రహించి, సాంఖ్యాచారులచేత సంస్తూయమానమైన యోగమార్గాన్ని అవలంబించి, ముల్లోకాలకు శాంతిని ప్రసాదించడంకోసం తండ్రిగారి తపోవనాన్ని వదలి, నిశ్చల చిత్తంతో ఉత్తర దిక్కుగా ప్రయాణం చేసాడు." అని చెప్పి మైత్రేయుడు విదురునితో ఇలా అన్నాడు "నాయనా! ఈ ఉపాఖ్యానం నాకు తోచిన విధంగా నీకు చెప్పాను. ఈ 'కపిల దేవహూతి సంవాదం' అత్యంత పవిత్రమైంది. దీనినే కపిలప్రోక్తమైన యోగశాస్త్రం అంటారు. దీనిని భక్తితో పఠించిన, వినిన పుణ్యాత్ముల పాపాలు పటాపంచలౌతాయి. వారు గరుడధ్వజుడైన కమలాక్షుని శ్రీపాద కమలాలను చేరుకుంటారు." అని ఈ ప్రకారంగా మైత్రేయుడు విదురునకు వివరించిన విషయాన్ని శుకమహర్షి పరీక్షిత్తునకు విశదీకరించాడని సూతుడు శౌనకాది మునులకు వెల్లడించాడు. ఈ వృత్తాంతం విన్న శౌనకాది మునీంద్రులు మనస్సులో సంతృప్తి చెంది "మునివర్యా! నీ వాక్ప్రవాహరూపమైన

భగవత్కథా సుధారసం ఎంత త్రాగినా మా మనస్సులకు తృప్తి కలగటం లేదు. తనివి తీరేవిధంగా తరువాతి వృత్తాంతం వివరంగా వినిపించవలసిందిగా విన్నవించుకుంటున్నాము. అందుకు నీవే తగినవాడవు" అన్నారు.

పూర్ణి 1052

జనకసుతా మనో విమల సారస కోమల చంచరీక! చం
దన శరదిందు కుంద హర తార మరాళ పటీర చంద్రికా
వినుత యశోవిశాల! రఘువీర! దరస్మిత పద్మపత్ర లో
చన! నిటలాంబకప్రకటచాపవిఖండన! వంశమండనా!

జానకీదేవి యొక్క స్వచ్ఛమైన హృదయకమలంలో విహరించే భ్రమరమైనవాడా! చందనంవలె, శరచ్చంద్రునివలె, మొల్లపువ్వువలె, పరమశివునివలె, ముత్యంవలె, హంసవలె, గంధంవలె, వెన్నెలవలె తెల్లనై అంతటా వ్యాపించిన కీర్తి కలవాడా! చిరునవ్వు లొలికే కమల దళాలవంటి కన్నులు కలవాడా! శివుని ధనుస్సును విరిచినవాడా! సూర్యవంశాన్ని అలంకరించినవాడా!

పరమపావన! విశ్వభావన! బాంధవప్రకరావనా!
శరధిశోషణ! సత్యభాషణ! సత్కృపామయ భూషణా!
దురితతారణ! సృష్టికారణ! దుష్టలోక విదారణా!
ధరణిపాలన! ధర్మశీలన! దైత్యమర్దన ఖేలనా!

1053 పరమపవిత్రా! విశ్వభావనా! సముద్రశోషణా! సత్యభాషణా! అపార కృపాగుణ భూషణా! దురితాలనుండి గట్టెక్కించేవాడా! సకల లోకాలను సృష్టించేవాడా! దుండగులను చీల్చి చెండాడేవాడా! ధరిత్రిని పాలించేవాడా! ధర్మాన్ని లాలించేవాడా! దైత్యులను నిర్మూలించేవాడా!

దివిజగణశరణ్యా! దీపితానంతపుణ్యా!
ప్రవిమల గుణజాలా! భక్తలోకానుపాలా!
భవ తిమిర దినేశా! భానుకోటిప్రకాశా!
కువలయహితకారీ! ఘోరదైత్యప్రహారీ!

1054 దేవతలకు ఆశ్రయమైనవాడా! అనంత పుణ్యాలతో ప్రకాశించేవాడా! సుగుణాలు కలవాడా! భక్తులను కాపాడేవాడా! సంసారమనే అంధకారానికి సూర్యునివంటివాడా! కోటి సూర్యుల కాంతితో ప్రకాశించేవాడా!భూమికి మేలు చేకూర్చేవాడా! దుష్టులైన రాక్షసులను నాశనం చేసేవాడా!

1055 ఇది పరమేశ్వరుని కరుణచేత పొందిన కవితా వైచిత్ర్యం కలవాడూ, కేసనామాత్యుని పుత్రుడూ, సహజపాండిత్యుడూ అయిన పోతనామాత్యుడు రచించిన

శ్రీమహాభాగవతం అనే మహాపురాణంలో విదురనీతి, విదురుని తీర్థయాత్ర, ఉద్ధవ సందర్శనం, కౌరవ యాదవ శ్రీకృష్ణాదుల నిర్యాణం, గంగాద్వారంలో విదురుడు మైత్రేయ మహామునిని దర్శించడం, విదుర మైత్రేయుల సంవాదం, జగదుత్పత్తి లక్షణం, మహదాదుల సంభవ ప్రకారం, మహదాదులు నారాయణుని అభినందించడం, విరాడ్విగ్రహ ప్రకారం, శ్రీ మహాభాగవత భక్తి కారణమైన బ్రహ్మదేవుని జన్మప్రకారం, బ్రహ్మదేవుని తపస్సు, బ్రహ్మకు విష్ణుదేవుడు ప్రత్యక్షం కావడం, బ్రహ్మ చేసిన విష్ణుస్తోత్రం, బ్రహ్మదేవుని మానససర్గం, పరమాణువుల పుట్టుక, భూలోక భువర్లోక సువర్లోకాల విస్తారం, దిన మాస సంవత్సరాది కాల నిర్ణయం, ఆయువు యొక్క పరిమాణం, నాలుగు యుగాల పరిమాణం, బ్రహ్మదేవుని సృష్టిభేదనం, సనక సనందనాదుల జననం, స్వాయంభువ మనువు జననం, శ్రీహరి యొక్క వరాహావతారం, భూమిని ఉద్ధరించడం, వరాహరూపంలో ఉన్న హరిని బ్రహ్మ స్తుతించడం, దితి కశ్యపుల సంవాదం, కశ్యపుడు రుద్రుని ప్రశంసించడం, కశ్యపుని వలన దితి గర్భాన్ని ధరించడం, దాని ప్రభావానికి భయపడి దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి దితిగర్భప్రకారాన్ని విన్నవించడం, సనకాదులు వైకుంఠానికి వెళ్ళడం, అక్కడ జయవిజయులపై కోపించి శపించడం, శ్రీహరి దర్శనం, బ్రాహ్మణ ప్రశంస, సనకాదులు హరిని స్తుతించడం, హిరణ్యకశిపుని హిరణ్యాక్షుని జన్మప్రకారం, హిరణ్యాక్షుని దిగ్విజయం, యజ్ఞవరాహమూర్తికి హిరణ్యాక్షునకు యుద్ధం, బ్రహ్మ స్తవం, హిరణ్యాక్షుని వధ, దేవతలు శ్రీహరిని అభినందించడం, శ్రీహరి వరాహావతారాన్ని విసర్జించడం, దేవతలు తిర్యక్కులు మనుష్యుల పుట్టుక, కర్దమ మహాముని తపస్సుకు మెచ్చి శ్రీహరి ప్రత్యక్షం కావడం, కర్దముడు స్వాయంభువ మనువు కుమార్తెయైన దేవహూతిని పెండ్లాడడం, దేవహూతి సేవలకు సంతోషించిన కర్దముడు తన యోగబలంతో సృష్టించిన విమానంలో వేలకొలది దాసీజనంతో కూడిన దేవహూతితో కలిసి భారతం మొదలైన వర్షాలన్నీ తిరగడం, దేవహూతి కర్దముని వలన తొమ్మిదిమంది కుమార్తెలను కపిలుడనే కుమారుని కనడం, ఆ తొమ్మిదిమంది కన్యకల వివాహం, కర్దముని తపోయాత్ర, కపిలునికి దేవహూతికి జరిగిన సంవాదం, శబ్దం మొదలైన పంచతన్మాత్రల జన్మప్రకారం, బ్రహ్మాండం యొక్క పుట్టుక, విరాట్పురుషుని కర్మేంద్రియ పరమాత్మల స్వరూపం, ప్రకృతి పురుష వివేకం, నారాయణుని సర్వాంగ స్తోత్రం, సాంఖ్యయోగం, భక్తియోగం, జీవుని యొక్క గర్భసంభవ ప్రకారం, చంద్ర సూర్య మార్గం, పితృమార్గం, దేవహూతి నిర్యాణం, కపిల మహాముని తపస్సుకు వెళ్ళడం అనే కథలు కలిగిన తృతీయస్కంధం ఇది.